సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 220
మంగళవారం 31-10-2023
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'


అఫ్గాన్ తీన్‌మార్...
వరల్డ్‌కప్‌లో మూడో గెలుపు. శ్రీలంకపై ఏడు వికెట్లతో సంచలన విజయం. -18లో


గాన సరస్వతి
పువ్వు పాడితే ఎలా ఉంటుందో.. బాల సరస్వతి పాట వింటే తెలుస్తుంది. -17లో


'కోటా' ఆందోళన హింసాత్మకం
ప్రత్యేక కోటా డిమాండ్‌తో మరాఠాలు ఆందోళన చేపట్టారు. ఆందోళనకారులు ఎన్‌సీపీ ఎమ్మెల్యేల ఇళ్లకు నిప్పు పెట్టారు. - వివరాలు 6లో


ఆ హక్కు పౌరులకు లేదు..
పార్టీలు పొందిన విరాళాలు ఎక్కడి నుంచి వచ్చాయనేది తెలుసుకునే హక్కు పౌరులకు లేదని కేంద్రం సుప్రీంకోర్టులో వాదించింది. - వివరాలు 6లో


గాజాలో మరణ ఘోష
ఇజ్రాయెల్ సేనలు గాజాలోకి మరింత ముందుకు చొచ్చుకొస్తున్నాయి. 24 గంటల్లో 600 హమాస్ స్థావరాలపై దాడిచేశాయి. - వివరాలు 6లో

జంగ్ తెలంగాణ
మీ దూకుడూ.. సాటెవ్వరు..
గోండును రాజ్యాంగంలో చేర్చాలి
ఈసీ ఫేవరేట్ మహంతి..
ఎజెండాలో కపిరాజు ఎక్కడ?
- వివరాలు 11,12లో

న్యూస్‌రీల్

మళ్లీ 'చేయి' కలిపిన కోదండరాం




కోదండరాం మరోసారి కాంగ్రెస్ పార్టీ చేయిపట్టి నడవాలని నిర్ణయించుకున్నారు. 2018 ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌తో కలసి పనిచేసిన ఆయన.. ఈ ఎన్నికల్లో కూడా తెలంగాణ జనసమితి (టీజేఎస్) కాంగ్రెస్‌కు మద్దతిస్తుందని ప్రకటించారు.
- వివరాలు 10లో

కరెంటు ఇచ్చే మొనగాడు కేసీఆర్ ఒక్కరే..



వ్యవసాయ రంగానికి 24 గంటల కరెంటు నిరంతరంగా ఇవ్వగలిగే ఏకైక మొనగాడు సీఎం కేసీఆర్ మాత్రమేనని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలోని నాయకులతో ప్రచారం చేయలేక బయటి రాష్ట్రాల నుంచి వచ్చిన నేతలతో కాంగ్రెస్, బీజేపీ ప్రచారం చేస్తున్నాయని ఎద్దేవా చేశారు.
- వివరాలు 3లో

సిసోడియాకు బెయిల్ నిరాకరణ



ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో అవినీతి, మనీ లాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆప్ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు సుప్రీంకోర్టు బెయిల్ నిరాకరించింది. రూ.338 కోట్ల బదిలీకి సంబంధించి సందేహాలున్నందునే బెయిల్ నిరాకరిస్తున్నామని స్పష్టం చేసింది.
- వివరాలు 6లో

కామారెడ్డి జిల్లా బాన్సువాడలో జరిగిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం..



నమ్మితే ఉల్టా పల్టానే!

కాంగ్రెస్ వాళ్ల మాటలు వింటే నిండా మునుగుడే

బాన్సువాడ, జుక్కల్, నారాయణఖేడ్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

- తెలంగాణ త్వరగా ఇవ్వకుండా కాంగ్రెస్ ద్రోహం చేసింది
- నేను ఆమరణ దీక్ష చేపడితేనే దిగి వచ్చింది
- రైతుబంధు, 24 గంటల కరెంటు దుబారా అని కాంగ్రెస్ అంటోంది
- బీఆర్‌ఎస్ గెలిచాక రాష్ట్రాన్ని బాగు చేసుకుంటున్నాం
- 24 గంటల కరెంటు, ఇంటింటికీ నల్లా నీళ్లు ఇస్తున్నాం
- చెరువులు బాగు చేసుకున్నాం.. ప్రాజెక్టులు కట్టుకున్నాం
- రాష్ట్రం రాక ముందటి, ఇప్పటి పరిస్థితులు బేరీజు వేసుకోవాలని విజ్ఞప్తి

సాక్షి, కామారెడ్డి/ సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/ నారాయణఖేడ్: ఎన్నికలు అనగానే కొందరు ఏమేమో చెబుతూ వస్తుంటారని, వాళ్ల మాటలు విని ఆగమాగం కావొద్దని ప్రజలకు బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ వాళ్లను నమ్మితే అంతా ఉల్టాపల్టా అవుతుందని, వారికి అధికారమిస్తే నిండా ముంచుతారని ఆరోపించారు. ఆలోచనతో, విచక్షణతో ఓటు వేయాలన్నారు. రాష్ట్రం ఏర్పడక ముందు, ఇప్పటి పరిస్థితులను మిగతా 2వ పేజీలో ▶

అది కేసీఆర్‌పై దాడి అన్నట్టే..
- హత్యా రాజకీయాలు సిగ్గుచేటు
- ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి ఘటనను ఖండించిన సీఎం - 2లో


ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్


గాయపడిన ఎంపీ ప్రభాకర్‌రెడ్డిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి..

- దుబ్బాకలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్న ప్రభాకర్‌రెడ్డి
- సోమవారం సిద్దిపేట జిల్లా సూరంపల్లిలో ప్రచారం
- తిరిగొస్తూ వాహనం వైపు వెళ్తుండగా కడుపులో కత్తితో పొడిచిన దుండగుడు
- మొదట గజ్వేల్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్ యశోద ఆస్పత్రికి తరలింపు
- దగ్గరుండి ఎంపీని ఆస్పత్రికి తరలించిన మంత్రి హరీశ్‌రావు
- శస్త్రచికిత్స చేసిన వైద్యులు.. గాయమైన చోట చిన్నపేగు భాగం తొలగింపు
- ఆస్పత్రికి వెళ్లి పరామర్శించిన సీఎం కేసీఆర్, మంత్రులు
- ఘటన సమయంలో నిందితుడిని చితకబాదిన బీఆర్‌ఎస్ శ్రేణులు
- అతడికి తీవ్ర గాయాలవడంతో గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స
- రాజకీయ కుట్ర కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామన్న సిద్దిపేట సీపీ

- వివరాలు 2లో

టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ రాజీనామా

పోటీ చేయనప్పుడు పార్టీ ఎందుకు?

- ఎందుకు పోటీ చేయడం లేదో చెప్పకపోతే ఎలా?: కాసాని
- బాలకృష్ణ తెలంగాణలో నేనుంటా అన్నడు.. ఇప్పుడు ఏమైందో తెలియదు..
- లోకేశ్ చిన్న పిల్లవాడో, పెద్దవాడో అర్థంకాదు.. 20సార్లు ఫోన్ చేసినా ఎత్తలేదు
- ఆంధ్రాలో టీడీపీకి బీజేపీ కావాలట.. తెలంగాణలో వద్దట.. ఇదేం పద్ధతి..
- పార్టీలో చేరినప్పుడు రామ్మోహన్‌రావుకు రూ.11 లక్షలు ఇచ్చా..
- కాంగ్రెస్‌కు ఓటేయాలని పార్టీలోని కమ్మ వాళ్లు ప్రచారం చేస్తున్నారు
- త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకూడదని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. 'తెలంగాణలో ఫైట్ చేయాలని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు పోటీ చేయకూడదనే నిర్ణయానికి ఎందుకు వచ్చిండో అర్థం కావట్లేదు. బాలకృష్ణ చిటికలేసి చెప్పిండు. తెలంగాణలో నేనుంట అన్నడు. తెలంగాణ మొత్తం తిరుగుత అన్నడు. తడాఖా చూపిస్త అన్నడు. ఏమైందో తెలియదు'అని ఆయన వ్యాఖ్యానించారు. సోమవారం తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కాసాని మాట్లాడుతూ తాను టీడీపీని వదలిపెట్టడానికి గల కారణాలను వివరించారు. చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణ, ఇతర నాయకులు వ్యవహరించిన తీరును సోదాహరణంగా వివరించారు. 'లోకేశ్ చిన్న పిల్లవాడో, పెద్దవాడో అర్థం కాని పరిస్థితి. ఆయన ఎవరికీ అందుబాటులో ఉండడు. సూర్యచంద్రులకు కూడా దొరకడు. కలుద్దామని 20 సార్లు ఫోన్ చేసిన. కాని ఫోన్ లేపలేదు. హైదరాబాద్‌లో ఉన్నప్పుడైనా నన్ను పిలిచి మాట్లాడొచ్చు కదా? నాకు తెలంగాణతో సంబంధం లేదు. ఆంధ్రాకే పరిమితం అన్నట్లుగా ఉన్నడు'అని వ్యాఖ్యానించారు. 'నేను పార్టీ నుంచి నయా పైసా తీసుకోలేదు. నేనే పార్టీకి డబ్బులు ఇచ్చిన. ప్రతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడికి నెలకు రూ.50వేలు ఇస్తున్న. నేను పార్టీలోకి వచ్చిన కొత్తలో రూ.11 లక్షలు రామ్మోహన్ రావుకు ఇచ్చిన. అందులో పార్లమెంటు అధ్యక్షులకు రూ. 50 వేల చొప్పున, మిగతా అటెండర్ల కోసం ఇవ్వమని చెప్పిన. కానీ రూ.లక్ష మాత్రమే అటెండర్లకు ఇచ్చిండ్రు. మిగతా 10 లక్షలకు ఇప్పటికీ మిగతా 10వ పేజీలో ▶

ఏపీలో ఒకలా.. ఇక్కడ ఇంకోలా..

'టీడీపీ ఇక్కడ పోటీ చేయొద్దనడం వెనుక ఎవరున్నరో గానీ, మన చౌదరీలే కాంగ్రెస్‌కు ఓటేయమని క్లియర్‌గా చెబుతున్నరు. బాబును మొన్న కలిసినప్పుడు మన కమ్మ వాళ్లే పోటీ చేయడం లేదని ప్రచారం చేస్తున్నరని క్లియర్‌గా చెప్పిన. టీడీపీ వాళ్లే కాంగ్రెస్‌కు ఓటేయమని చెబితే ఎట్ల. వీళ్ల ప్రచారం చేసినా.. కొందరే కాంగ్రెస్ అంటున్నరు. మిగతా వాళ్లు బీఆర్‌ఎస్‌కు ఓటేయాలంటున్నరు. ఉప ఎన్నికల్లో పోటీ చేయకపోతే ఓ లెక్క. జనరల్ ఎన్నికల్లో చేయకపోతే ఎట్ల?'అని కాసాని ప్రశ్నించారు. 'ఆంధ్రాలోబీజేపీ, జనసేనతో టీడీపీ పోటీ చేస్తదట. తెలంగాణలో బీజేపీ వద్దట. ఇదేం పద్ధతి. ఆంధ్రాలో బీజేపీ, జనసేనతో పోటీ చేసినప్పుడు ఇక్కడ కూడా చేయాలి కదా'అని వ్యాఖ్యానించారు.

కేజ్రీవాల్‌కు ఈడీ నోటీసులు



➤ ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోమవారం నోటీసులిచ్చింది. నవంబర్ 2న విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఆయనకు నోటీసులు జారీ అయ్యాయి. కాగా, కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లపై ఆప్ మండిపడింది. తమ పార్టీని ఎలాగైనా అంతం చేయడమే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ సర్కారు కుట్రలు పన్నుతోందని ఆరోపించింది. - 6లో

ఇవండీ సంగతి



ఇక్కడే ఉంటున్నాం.. అప్పుడప్పుడు ఆంధ్రప్రదేశ్ వెళ్లొస్తున్నాము అయినా ఇక్కడే పోటీ వద్దంటే ఇక అక్కడేం పోటీ చేస్తాం!

రాష్ట్రంలో అధికారంపై కేటీఆర్ పగటి కలలు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఎద్దేవా



- గిన్నిస్ రికార్డును తలదన్నేలా బీఆర్‌ఎస్ పాలనలో ప్రశ్న పత్రాల లీకేజీలు
- ఓటమి భయంతోనే టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన అంటూ కొత్త నాటకం
- అన్ని వర్గాల ప్రజలను సీఎం కేసీఆర్ మోసం చేశారు
- బీఆర్‌ఎస్ సర్కారుపై యువతలో తీవ్ర వ్యతిరేకత
- మీ ఎత్తులు, జిత్తులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు
- బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదని వ్యాఖ్య -7లో

పరామర్శకైనా పనికిరామా?

టికెట్ ఆశించి భంగపాటుకు గురైన కమలనాథుల ఆవేదన -9లో


విష్ణును ఆలింగనం చేసుకుంటున్న హరీశ్‌రావు

కాంగ్రెస్ విష్ణును అవమానించింది

పీజేఆర్ కుమారుడిని బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించిన మంత్రి హరీశ్‌రావు
- వివరాలు 3లో

నేడే కాంగ్రెస్ అభ్యర్థుల తుది జాబితా



- ఇప్పటికే పలు దఫాలుగా రాష్ట్ర నేతలతో ఖర్గే చర్చలు
- మరోమారు చర్చల అనంతరం నేడు జాబితా ప్రకటన
- టికెట్లు ఆశిస్తున్న అభ్యర్థులంతా ఢిల్లీలోనే చక్కర్లు - 10లో

పథకాల అమలుపై వివరణ ఇవ్వండి

- కాంగ్రెస్ వినతి నేపథ్యంలో సంక్షేమ శాఖలను కోరిన ఎన్నికల సంఘం - 10లో
- పూర్తి సమాచారంతో నివేదిక సమర్పించాలని స్పష్టీకరణ

క్లుప్తంగా...

ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై దాడిపట్ల గవర్నర్ దిగ్భ్రాంతి

సాక్షి, హైదరాబాద్: మెదక్ ఎంపీ, బీఆర్‌ఎస్ దుబ్బాక నియోజకవర్గ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిపట్ల రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, ఇలాంటి సంఘటనలు ప్రజాస్వామ్యానికి ముప్పు అని పేర్కొన్నారు. ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల భద్రతకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని డీజీపీని ఆదేశించారు. స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణ కోసం శాంతియుత వాతావరణం ఎంతో అవసరమన్నారు. ప్రభాకర్‌రెడ్డి సత్వరంగా కోలుకోవాలని గవర్నర్ ఆకాంక్షించారు.

కరీంనగర్ కలెక్టర్‌గా పమేలా సత్పతి

పోలీసు కమిషనర్‌గా అభిషేక్ మహంతి




సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా పమేలా సత్పతి, పోలీసు కమిషనర్‌గా అభిషేక్ మహంతిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పురపాలక శాఖ డైరెక్టర్‌గా పమేలా సత్పతి, రాచకొండ ట్రాఫిక్–1 డీసీపీగా అభిషేక్ మహంతి పనిచేస్తుండగా, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వీరిద్దరినీ కరీంనగర్‌కు బదిలీ చేశారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ బి.గోపి, కరీంనగర్ పోలీసు కమిషనర్ ఎల్.సుబ్బారాయుడును గత శుక్రవారం కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ చేసిన విషయం తెలిసిందే. కొత్త కలెక్టర్, పోలీసు కమిషనర్ నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం సీనియారిటీ ప్రకారం చెరో ముగ్గురు అధికారుల పేర్లను ప్రతిపాదించగా, పమేలా సత్పతి, అభిషేక్ మహంతిల పేర్లను ఎన్నికల సంఘం ఎంపిక చేసింది.

ఏ పార్టీలోనూ చేరను: మందకృష్ణ



మహబూబ్‌నగర్ రూరల్: 'నేను ఏ పార్టీ కండువా కప్పుకోను.. ఏ పార్టీలోనూ చేరను. నా జీవిత ఆశయం ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ఒక్కటే'అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని పాత పాలమూరులో నిర్వహించిన మాదిగల విశ్వరూపసభ సన్నాహక సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తాను ఏదైనా పార్టీలో చేరితే రాజ్యసభ సీటో.. లోక్‌సభ టికెటో ఇస్తారని, కానీ, తనకు వర్గీకరణ సాధనే ముఖ్యమని, ఈ దిశగానే పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఎన్టీపీసీలో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

జ్యోతినగర్(రామగుండం): పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ రామగుండం తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని 800 మెగావాట్ల మొదటి యూనిట్‌లో సాంకేతిక లోపాలు తలెత్తాయి. దీంతో విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. సోమవారం 800 మెగావాట్ల యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ లీకేజీతోపాటు పలు సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది.

ఓడిపోతామనే భౌతిక దాడులు: కేటీఆర్

కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి దారుణమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిసే కాంగ్రెస్ పార్టీ గూండాలు బీఆర్‌ఎస్ నాయకులపై భౌతిక దాడులకు దిగి అంతమొందించాలని చూస్తున్నారని ఆరోపించారు. నేరస్తుడైన రేవంత్‌రెడ్డిని టీపీసీసీ అధ్యక్షుడిగా చేసినందుకే ఇలాంటి దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ ఘటనపై ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్టు చెప్పారు.



సోమవారం నారాయణఖేడ్‌లో జరిగిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు

నమ్మితే ఉల్టా పల్టానే!

▶ మొదటి పేజీ తరువాయి

బేరీజు వేసుకోవాలని సూచించారు. ఈసారి ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిచి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం కామారెడ్డి జిల్లా జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో, సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో జరిగిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. ఈ వివరాలు ఆయన మాటల్లోనే..

"2004లో తెలంగాణ రాష్ట్రం ఇచ్చి ఉంటే పదేండ్లు ముందుకు వెళ్లేవాళ్లం. కాంగ్రెస్ పార్టీ ద్రోహం వల్ల మరో పదేండ్లు కొట్లాడాల్సి వచ్చింది. 1969 లెక్కనే ఈసారి కూడా ఆగం జేయాలని చూశారు. అలాంటి సమయంలో కేసీఆర్ శవయాత్రనో, జైత్రయాత్రనో తేల్చుకుందామని ఆమరణ దీక్ష చేపడితే.. కేంద్రం దిగివచ్చింది.

రాష్ట్రాన్ని బాగు చేసుకుంటున్నాం

తెలంగాణ ఏర్పడక ముందు పరిస్థితులు, ఇప్పుడున్న పరిస్థితులను అంతా బేరీజు వేసుకోవాలి. అప్పుడు కరెంటు ఉండేది కాదు. నీళ్లు ఉండేవి కాదు. బోర్లు తవ్వి ఎంతో మంది బోర్లా పడ్డారు. నేను గూడా 27 బోర్లు వేసి నష్టపోయినోడినే. ఎన్నో బాధలు అనుభవించినం. మిషన్ కాకతీయతో చెరువులు బాగు చేసుకున్నం. 24 గంటలు కరెంటు ఇచ్చుకుంటున్నం. మిషన్ కాకతీయతో ఇంటింటికీ నల్లాల ద్వారా నీళ్లు అందిస్తున్నం. పదేళ్లలో దేశంలో అగ్రగామిగా నిలిచినం. అప్పట్లో నిజాంసాగర్ ప్రాజెక్టులో నీళ్లు లేకపోవడంతో సింగూరు నీళ్ల కోసం ఎన్నో కొట్లాటలు చేయాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితులు లేవు. జుక్కల్ ప్రాంతం కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణల మధ్యలో ఉంది. పొరుగు రాష్ట్రాల ప్రజలు ఎన్ని కష్టాలు పడుతున్నారో మీరు చూస్తూనే ఉన్నరు. అక్కడికి, ఇక్కడికి పరిస్థితులను బేరీజు వేసుకోవాలి.

ఎక్కడా లేనట్టుగా కరెంటు ఇస్తున్నాం

కర్ణాటక ఉప ముఖ్యమంత్రి ఇక్కడికి వచ్చి తమ రాష్ట్రంలో ఐదు గంటల కరెంటు ఇస్తున్నాం చూసి పొమ్మంటున్నారు. మనం ఇక్కడ 24 గంటలు కరెంటు ఇస్తుంటే.. వాళ్లు ఐదు గంటల గురించి చెబితే ఏమనాలి? దేనితో నవ్వాలి? మహారాష్ట్రలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అక్కడ అన్నీ బాగుంటే రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారో ఆలోచించాలి. ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్‌లో కూడా 24 గంటల కరెంటు ఇవ్వడం లేదు. పీసీసీ మాజీ అధ్యక్షుడు, పీసీసీ అధ్యక్షుడు రైతుబంధు దుబారా అంటున్నారు. రైతు బంధు ఇవ్వడం దుబారానా? రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వడం దుబారానా? ఆలోచించాలి. రెండు దఫాలుగా రూ.37 వేల కోట్ల రుణమాఫీ చేశాం. ఏమైనా మిగిలి ఉంటే ఎన్నికల తర్వాత పూర్తవుతాయి. కేసీఆర్ బతికున్నన్ని రోజులు తెలంగాణ రాష్ట్రం సెక్యులర్‌గా ఉంటుంది.

బసవేశ్వర ద్వారా 1.80 లక్షల ఎకరాలకు నీరు

కాంగ్రెస్ పాలనలోని నారాయణఖేడ్‌కు, ఇప్పటి బీఆర్‌ఎస్ పాలనలోని నారాయణఖేడ్‌కు దునియా ఆస్మాన్ తేడా ఉంది. గతంలో ఇక్కడ అన్నీ రేకు డబ్బాలే కనిపించేవి. ఇప్పుడన్నీ భవంతులు కనిపిస్తున్నాయి. గతంలో తాగేందుకు నీళ్లు కూడా లేక ప్రజలు ఇబ్బందులు పడేవారు. గిరిజన మహిళా చిమ్నిబాయి మేం ఓటెందుకు వేయాలని అప్పటి ప్రభుత్వాలను ప్రశ్నించిన విషయం అందరికీ తెలుసు. బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనులు పూర్తయితే 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టును సింగూరు జలాశయానికి లింకు చేసుకున్నాం. నర్సాపూర్ వరకు కాల్వ తవ్వకం పూర్తయింది. ఆ నీళ్లు వస్తే సింగూరు శాశ్వత జల వనరుగా తయారవుతుంది. నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు కింద రెండు పంటలు పండేలా ఎత్తిపోతల పథకం మంజూరు చేస్తా.." అని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఈ సభల్లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు హన్మంత్ సింధే, ఎం.భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అది కేసీఆర్‌పై దాడి అన్నట్టే..

ఎన్నికల్లో ప్రజా తీర్పును ఎదుర్కొనలేక భౌతిక దాడులు, హత్యా రాజకీయాలకు తెగబడటం సిగ్గుచేటని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని బాన్సువాడ, నారాయణఖేడ్ సభల్లో తీవ్రంగా ఖండించారు. "అది ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడి కాదు. కేసీఆర్ మీద జరిగిన దాడి చేసినట్టే. ప్రజాక్షేత్రంలో గెలవడం చేతగాని దద్దమ్మలు కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేశారు. చేతగాని కాంగ్రెస్ దద్దమ్మలు ఇదే హింస అనుకుంటున్నారు. మా సహనాన్ని పరీక్షించవద్దు. మాకు తిక్కరేగితే.. ఏం జరుగుతుందో ఊహించుకోవాలి. మొండి కత్తో, లండు కత్తో మాకూ దొరుకుతుంది. మేం కత్తులు పట్టుకుంటే రాష్ట్రం దుమ్ము దుమ్ము అవుతుంది. ఇన్నేళ్లలో ఎన్నో ఎలక్షన్లు జరిగాయి. బీఆర్‌ఎస్ ఎక్కడా ఇలాంటి ఘటనలకు పాల్పడలేదు. గత తొమ్మిదేళ్ల కర్ఫ్యూలు, కొట్లాటలు లేకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుంటూ వస్తే.. కాంగ్రెస్ నాయకులు కండ్లలో నిప్పులు పోసుకుంటున్నారు. ఇలాంటి వారికి తెలంగాణ సమాజం బుద్ధి చెప్పాలి.." అని కేసీఆర్ పేర్కొన్నారు.

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి

దుబ్బాకలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్న ప్రభాకర్‌రెడ్డి ● సోమవారం సిద్దిపేట జిల్లా సూరంపల్లిలో ప్రచారం



కొత్త ప్రభాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో మంత్రి హరీశ్‌రావు, మధుసూదనాచారి

దుబ్బాకటౌన్/దౌల్తాబాద్/రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి జరిగింది. ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయన దగ్గరికి వచ్చిన ఓ వ్యక్తి కత్తితో కడుపులో పొడిచాడు. అది గమనించి అడ్డుకున్న గన్‌మన్ చేతికి కూడా గాయమైంది. బీఆర్‌ఎస్ నేతలు ప్రభాకర్‌రెడ్డిని వెంటనే గజ్వేల్ ఆస్పత్రికి తీసుకెళ్లి, ప్రాథమిక చికిత్స అనంతరం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. అయనకు మూడు అంగుళాల లోపలి వరకు కత్తి దిగిందని, పలుచోట్ల చిన్నపేగు తెగడంతో.. శస్త్రచికిత్స చేశామని వైద్యులు ప్రకటించారు. ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని సీఎం కేసీఆర్, మంత్రులు, బీఆర్‌ఎస్ నేతలు ఖండించారు. సీఎం కేసీఆర్, మంత్రులు, నేతలు యశోద ఆస్పత్రికి చేరుకుని ఆయనను పరామర్శించారు.

నమస్తే సార్.. అంటూ వచ్చి..

సోమవారం కొత్త ప్రభాకర్‌రెడ్డి సూరంపల్లిలో ప్రచారం నిర్వహించారు. మరోచోటికి వెళ్లేందుకు తన వాహనం వద్దకు వెళ్తుండగా.. ఓ వ్యక్తి నమస్తే సార్ అంటూ దగ్గరికి వచ్చాడు. ఒక్కసారిగా కత్తి తీసి ప్రభాకర్‌రెడ్డి కడుపులో పొడిచాడు. అదిచూసిన గన్‌మన్ అడ్డుకుని కత్తిని లాక్కున్నాడు. ఈ క్రమంలో గన్‌మన్ చేతికి గాయమైంది. అది చూసిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు నిందితుడి పట్టుకుని చితకబాదారు. మరోవైపు నేతలు ప్రభాకర్‌రెడ్డిని వాహనంలోకి ఎక్కించి, గజ్వేల్ ఆస్పత్రికి బయలుదేరారు. పోలీసులు బీఆర్‌ఎస్ కార్యకర్తలను ఆపి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు దాడికి వాడిన కత్తిని, అతడి జేబులో ఓ యూట్యూబ్ చానల్ ఐడీకార్డును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిని ఇదే జిల్లాలోని మిరుదొడ్డి మండలం చెప్యాల గ్రామానికి చెందిన గటాని రాజుగా గుర్తించారు. నిందితుడు రాజు దాడికి పాల్పడిన సమయంలో మద్యం మత్తులో ఉన్నట్టు తెలిసింది. బీఆర్‌ఎస్ కార్యకర్తల దాడిలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో.. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎన్నికల సమయం కావడం, నిందితుడు గతంలో రాజకీయ నాయకులతో ఉన్న ఫొటోలు బయటికి రావడంతో.. దాడి వెనుక రాజకీయ కుట్రపైనా దర్యాప్తు చేస్తున్నట్టు సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత తెలిపారు.

సర్జరీ చేసి.. చిన్నపేగు ముక్క తొలగించి..

కొత్త ప్రభాకర్‌రెడ్డి సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిందితుడి దాడిలో కత్తి మూడు అంగుళాల మేర పొట్టలోకి దిగిందని.. దీనితో చిన్నపేగుకు నాలుగు చోట్ల గాయాలు అయ్యాయని ఆస్పత్రి హెడ్ డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. కడుపులో తీవ్రంగా రక్తస్రావమైందని వివరించారు.

దీనితో సుమారు మూడున్నర గంటల పాటు శస్త్రచికిత్స చేసి.. సుమారు 15 సెంటీమీటర్ల మేర చిన్నపేగును తొలగించామని, కడుపును శుభ్రం చేశామని తెలిపారు. పైకి గాయం చిన్నగా కనిపిస్తున్నా.. ఇన్‌ఫెక్షన్ల ముప్పు ఉందని చెప్పారు. నాలుగైదు రోజులు ప్రత్యేక పరిశీలన, చికిత్స అవసరమని.. ఆ తర్వాత ఆరోగ్య పరిస్థితిపై పూర్తి స్పష్టత వస్తుందని వివరించారు.

పరామర్శించిన సీఎం, మంత్రులు

దాడి విషయం తెలిసిన హరీశ్‌రావు గజ్వేల్ నుంచే కొత్త ప్రభాకర్‌రెడ్డి వెంట ఉన్నారు. యశోద ఆస్పత్రి చేర్పించి వైద్యులతో మాట్లాడారు. శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేయించారు. సీఎం కేసీఆర్ ఆస్పత్రికి చేరుకుని ప్రభాకర్‌రెడ్డిని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మంత్రులు మల్లారెడ్డి, తలసాని, జగదీశ్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, పార్టీ నేతలు కేకే, వంటేరు ప్రతాప్‌రెడ్డి, మధుసూదనచారి, బొంతు రామ్మోహన్ తదితరులు ఆస్పత్రికి వచ్చి ప్రభాకర్‌రెడ్డిని పరామర్శించారు. కాగా మెదక్, దుబ్బాకలకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు యశోద ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

రాజకీయంగా ఎదుర్కోవాలి.. దాడులు సరికాదు: హరీశ్‌రావు

కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడి దారుణమని, ఈ ఘటనను తమ పార్టీ తీవ్రంగా పరిగణిస్తోందని మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప ప్రత్యక్ష దాడులు సరికాదని పేర్కొన్నారు. యశోద ఆస్పత్రి వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. దాడి సమయంలో గన్‌మన్ అప్రమత్తమై నిందితుడిని వెనక్కి లాగాడని.. లేకుంటే పరిస్థితి ఇంకా తీవ్రంగా ఉండేదని చెప్పారు. దాడి జరగ్గానే ప్రభాకర్‌రెడ్డి తనకు ఫోన్ చేసి కాపాడాలంటూ ఆందోళన చెందాడని, వెంటనే తాను ఆయన దగ్గరికి వెళ్లానని తెలిపారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగానే ఉందని, దేవుడి దయ తో సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగొస్తారని పేర్కొన్నా రు. ఎంపీపై దాడి దుర్మార్గపు చర్య అని, ఎన్నికల కమిషన్ దీనిని సీరియస్‌గా తీసుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. తనకు కూడా కాంగ్రెస్ నేతల నుంచి ప్రాణభయం ఉందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. వారు తన అంతు చూస్తామని, కాలేజీలను మూసివేయిస్తామని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు.



నిందితుడు గటాని రాజును అదుపులోకి తీసుకున్న పోలీసులు



నేడు ఉమ్మడి నల్లగొండకు సీఎం కేసీఆర్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మంగళవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మూడు శాసన సభ నియోజకవర్గాల పరిధిలో ఆయన ప్రచారం చేయనున్నారు. ముందుగా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మధ్యాహ్నం ఒంటిగంటకు నిర్వహించే ప్రజా ఆశీర్వాదసభలో పాల్గొంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు మిర్యాలగూడ, సాయంత్రం 4 గంటలకు దేవరకొండలో జరిగే ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొంటారు. కేసీఆర్ పర్యటన నేపథ్యంలో అభ్యర్థులు, ఆయా నియోజకవర్గ బాధ్యులు, నాయకులు సభల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు.

ఓటమి భయంతోనే బద్నాం చేస్తున్నారు

బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి కాంగ్రెస్‌పై అసత్య ప్రచారం చేస్తున్నాయి: రేవంత్‌రెడ్డి



అంబర్‌పేట (హైదరాబాద్): పొడిచిన వ్యక్తి బీజేపీ.. కత్తిపోటుకు గురైన వ్యక్తి బీఆర్‌ఎస్ నేత అయితే సీఎం కేసీఆర్ మాత్రం కాంగ్రెస్‌ను బద్నాం చేయడం ఆయన ఓటమి భయానికి నిదర్శనమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం అంబర్‌పేట పార్టీ అభ్యర్థి రోహిన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన వి.హనుమంతరావుతో కలిసి మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీజేపీ కలిసి కాంగ్రెస్‌పై అసత్య ప్రచారాలతో కుట్ర చేస్తున్నాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరిన వ్యక్తి.. బీఆర్‌ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేస్తే ఇది కాంగ్రెస్ పని అని సీఎం కేసీఆర్ దివాలాకోరు ఆరోపణలు చేయడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ మహాత్మాగాంధీ సిద్ధాంతాలతో పని చేస్తుందని, శాంతియుత వాతావరణంలో తాము ఎన్నికల్లో కొట్లాడుతామని స్పష్టంచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అంబర్‌పేటను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామని రేవంత్ హామీఇచ్చారు. వీహెచ్ మాట్లాడుతూ తన హయాంలోనే అంబర్‌పేట చెప్పుకోదగ్గ అభివృద్ధి చెందిందని తెలిపారు. టికెట్ల విషయంలో పార్టీ నేతలకు జరిగిన అన్యాయాన్ని అధికారంలోకి వచ్చాక న్యాయం చేయాలని వీహెచ్ రేవంత్‌రెడ్డిని కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించి అంబర్‌పేటలో విజయం సాధిస్తామని రోహిన్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. పలువురు బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మీ కుటిల నీతి ప్రజలకు అర్థమైంది

దుబ్బాక ఘటనపై కేటీఆర్ ట్వీట్‌కు రేవంత్ కౌంటర్

సాక్షి, హైదరాబాద్: దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేసిన ఘటన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్, మంత్రి కేటీఆర్‌ల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదని, కానీ రేవంత్‌రెడ్డి లాంటి మూడో శ్రేణి నేరస్తుడిని పీసీసీ అధ్యక్షుడిని చేయడంతో కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు తమ పార్టీ నేతలను భౌతికంగా నిర్మూలించే ప్రయత్నాలకు తెరలేపిందంటూ రాష్ట్ర మంత్రి కేటీఆర్ సోమవారం ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు. ఈ ఘటనను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని కేటీఆర్ చెప్పారు. ఇందుకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్ కూడా ఘాటుగానే స్పందించారు. కేసీఆర్ అంటేనే గజకర్ణ, గోకర్ణ, టక్కుటమార విద్యలకు మారుపేరని తెలంగాణ సమాజానికి అర్థమైపోయిందని, ఒక ఎంపీపై దాడి జరిగితే దానిని చిల్లర రాజకీయ ప్రయోజనాలకు వాడుకునే కచరా ప్రయత్నం చూస్తుంటే బీఆర్‌ఎస్ ఓటమి ఖాయం అయినట్టేనని అర్థమవుతోందని ఆయన ఎక్స్ వేదికగానే రీట్వీట్ చేశారు. 'ఈ సరికొత్త మొండి కత్తి డ్రామాను మీరు, మీ తండ్రి కలిసి రక్తి కట్టిస్తున్న వైనాన్ని తెలంగాణ సమాజం గమనిస్తోంది. జరిగిన దుర్ఘటనను కాంగ్రెస్‌కు అంటగట్టే మీ కుటిల నీతి ప్రజలకు అర్థమైంది. ఏది ఏమైనా దాడిని ఖండిస్తున్నాం. అహింసనే ఆయుధంగా చేసుకుని దేశానికి స్వాతంత్య్రాన్ని సాధించిన కాంగ్రెస్‌కు మీ తండ్రి లాంటి మరుగుజ్జును ఓడించడం పెద్ద లెక్క కాదు' అని తన ట్వీట్‌లో రేవంత్ పేర్కొన్నారు.

ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడితో నాకు సంబంధం లేదు

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



పాలమూరు: దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడితో తనకు ఎలాంటి సంబంధం లేదని, ఈ విషయంలో తనపై బురదజల్లడం సరికాదని దుబ్బాక ఎమ్మెల్యే, బీజేపీ నేత రఘునందన్‌రావు అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభాకర్‌రెడ్డిపై దాడి జరగడం దురదృష్టకరమని, దీన్ని ఖండిస్తున్నానని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీ వారైనా ప్రచారం చేసుకోవచ్చన్నారు. ఈ ఘటనతో రఘునందన్‌రావుకు సంబంధం ఉందని ప్రచారం చేయడం సరికాదని పేర్కొన్నారు. 20 ఏళ్ల రాజకీయ జీవితంలో హింసకు ఎప్పుడూ పాల్పడలేదని, అలాంటి ఘటనలు ప్రోత్సహించే వ్యక్తిని తాను కాదన్నారు. దాడి చేసిన గటాని రాజు అనే వ్యక్తికి దళితబంధు రాలేదని ఉద్దేశంతోనే దాడి చేసినట్లు వార్తలు వస్తున్నాయని రఘునందన్‌రావు చెప్పారు. రాజు ఫేస్‌బుక్ ఖాతాను పరిశీలిస్తే అతను కాంగ్రెస్ నేతలతో ఉన్న ఫొటోలు, ఇతర వివరాలు లభ్యమవుతాయని, అతని దగ్గర ఓ చానల్ ఐడీ కార్డు కూడా దొరికిందని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండూ ఒక్కటేనని, ఎవరెంత బురద చల్లినా దుబ్బాకలో తన గెలుపు ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. సిద్దిపేట సీపీ కేసు పరిశీలించి, అతని ఇతర అకౌంట్లు పరిశీలించి మాట్లాడాలి కానీ, మీరే బీజేపీ సానుభూతిపరుడని అని చెప్పడం సరికాదన్నారు. సీపీ మాట్లాడిన మాటలతో బీజేపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని రఘునందన్‌రావు ఆందోళన చెందారు. పాలమూరు నుంచి నేరుగా ఆస్పత్రి దగ్గరకు వెళ్లి చికిత్స పొందుతున్న ప్రభాకర్‌రెడ్డిని పరామర్శిస్తానని చెప్పారు.

కేంద్రపాలిత ప్రాంతంగా హైదరాబాద్..!

- బీసీవై ఎన్నికల ప్రణాళికలో హామీ
- మేనిఫెస్టో విడుదల చేసిన అధినేత రామచంద్ర యాదవ్



సాక్షి, హైదరాబాద్: సామాన్యుడికి అధికారం, సామాజిక సమన్యాయం దిశగా తెలంగాణ ఎన్నికల్లో పోటీకి సిద్ధమైన భారత చైతన్య యువజన పార్టీ ఎన్నికల ప్రక్రియలో ముందుకెళ్తోంది. ఆ పార్టీ అధినేత రామచంద్రయాదవ్ గత నాలుగురోజులుగా అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలోనే సోమవారం 'ఎన్నికల మేనిఫెస్టో'ను విడుదల చేశారు. 18 కీలక అంశాలతో రూపొందిన ఈ మేనిఫెస్టోలో హైదరాబాద్‌పై సంచలన హామీ ఇచ్చారు. దీనిద్వారా ఈ పార్టీ రాజకీయాల్లో పెను సంచలనానికి తెరతీసింది. 'ప్రతీ మాటను అమలు చేసి నవ, యువ తెలంగాణ నిర్మాణానికి బాటలు వేస్తాం.. ప్రతిఒక్కరి ఆశలు నెరవేర్చి, ఆదర్శనీయంగా నిలుపుతాం..' అని రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేస్తామని, దేశానికి రెండో రాజధానిగా ప్రకటించేలా కృషి చేస్తామని బీసీవై ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నారు.

దాడికి కారణమేంటి?

నిందితుడు గటాని రాజుపై వివాదాస్పద ఆరోపణలు

- యూట్యూబ్ చానల్ ముసుగులో వసూళ్ల దందాలు
- దళితబంధు, ఇంటి స్థలం రాకపోవడంతో ఎంపీపై కక్షగట్టాడనే ప్రచారం



గటాని రాజు గుర్తింపు కార్డు

మిరుదొడ్డి (దుబ్బాక)/ సాక్షి, సిద్దిపేట: మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తి దాడికి కారణాలపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. మిరుదొడ్డి మండలం చెప్యాల కు చెందిన నిందితుడు గటాని రాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పలు యూట్యూబ్ చానళ్ల లో పనిచేసిన రాజు వైఖరి తొలి నుంచీ వివాదాస్పదమని.. విలేకరి ముసుగులో దందాలకు పాల్పడేవాడని స్థానికులు చెప్తున్నారు. కలప రవాణా వాహనాలను ఆపి వసూళ్లకు పాల్పడటం, కల్లు డిపో, దుకాణాల యజమానుల నుంచి చందాలు వసూలు చేయడం వంటివి చేసేవాడని.. ఈ ఆగడాలతో సహనం నశించిన వ్యాపారులు గతంలో రాజుపై దాడి చేసిన ఘటనలు కూడా ఉన్నాయని అంటున్నారు. 2018 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో చేరిన రాజు.. జిల్లా ముఖ్య నాయకులతో తిరిగేవాడని చెప్తున్నారు. అయితే ఎంపీపై దాడి చేసేంత పగ ఏమిటన్నది అంతుపట్టడం లేదని అంటున్నారు. అయితే.. దళితబంధు రాకపోవడం, ఇంటి స్థలం ఇవ్వకపోవడంతో ఎంపీపై కక్షగట్టి దాడి చేసి ఉంటాడని ప్రచారం జరుగుతోంది. అధికారులు ఇటీవల మిరుదొడ్డి మండల విలేకరులకు ఇక్కడి చెప్యాల క్రాస్‌రోడ్డులో ఇళ్ల స్థలాలు కేటాయించారు. అందులో తనకూ స్థలం కేటాయించాలని రాజు కోరగా.. ఎంపీతో చెప్పించాలని అధికారులు సూచించినట్టు తెలిసింది. రాజు పలుమార్లు ఈ విషయాన్ని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఎన్నికల కోడ్ ఉన్నందున ఇప్పుడు సాధ్యం కాదని చెప్పినట్టు సమాచారం. దీనికితోడు దళితబంధుకు ఎంపికైనవారి జాబితాలో తన పేరు లేకపోవడంతోనూ రాజు ఆగ్రహించాడని, ఇవన్నీ మనసులో పెట్టుకుని, దాడి చేసి ఉంటాడని స్థానికులు చర్చించుకోవడం కనిపించింది.

కాంగ్రెస్ విష్ణును అవమానించింది

- మంత్రి హరీశ్‌రావు
- పీజేఆర్ కుమారుడిని బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన మంత్రి

కవాడిగూడ (హైదరాబాద్): పీజేఆర్ కుమారుడు, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అవమానించిందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల రెండో లిస్టులో తన పేరు లేకపోవడంతో విష్ణువర్ధన్‌రెడ్డి తిరుగుబాటు చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో కలసి మంత్రి హరీశ్‌రావు దోమలగూడలోని విష్ణువర్ధన్‌రెడ్డి నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విష్ణును బీఆర్ఎస్ పార్టీలో చేరాలని ఆహ్వానించినట్లు తెలిపారు. పార్టీలో చేరేందుకు విష్ణువర్ధన్‌రెడ్డి సుముఖత వ్యక్తం చేశారని చెప్పారు. గతంలో విష్ణు వివిధ ఉద్యమాలలో తమతో పాటు కలసి పోరాడారని గుర్తుచేశారు. పట్టపగలు నోట్ల కట్టలతో దొరికిన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సీట్లను అమ్ముకున్నారని విమర్శించారు.

త్వరలో బీఆర్ఎస్‌లో చేరుతా: విష్ణువర్ధన్‌రెడ్డి

ఇటీవల కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన రెండో జాబితాలో జూబ్లీహిల్స్ టికెట్ తనకు కేటాయించకపోవడంతో తీవ్రంగా మనస్తాపానికి గురైనట్లు విష్ణు తెలిపారు. త్వరలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. 'మా నాన్న పీజేఆర్ మెడలో కాంగ్రెస్ జెండా ఉంటే అది మారక్తం అని అనుకునే వాళ్లం, కానీ ఇలాంటి పరిస్థితి వస్తుందని కలలోకూడా ఊహించలేదు'అని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీభవన్ అమ్ముడు పోతోందని ఆరోపించారు.

నా వల్లే విష్ణుకు టికెట్ దక్కలేదనడం సరికాదు: విజయా రెడ్డి



బంజారాహిల్స్ (హైదరాబాద్): 'నావల్లే విష్ణుకు జూబ్లీహిల్స్ కాంగ్రెస్ టికెట్ రాలేదంటూ కొంతమంది ప్రచారం చేస్తున్నారని, ఇది తనను అత్యంత బాధించే విషయమని ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయా రెడ్డి అన్నారు. సోమవారం ఖైరతాబాద్ వెంకటేశ్వర కాలనీ డివిజన్, బంజారాహిల్స్ డివిజన్ ముఖ్య నేత ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. ఒకపక్క తనకు టికెట్ వచ్చిందన్న ఆనందం ఉన్నప్పటికీ, తన సోదరుడు విష్ణుకు టికెట్ రాలేదన్న బాధ కూడా ఉందని చెప్పారు. తన తండ్రి చనిపోయినప్పుడు విష్ణు ఉపఎన్నికలో ఇంటింటికీ తిరుగుతున్న సమయంలో పీజేఆర్ అభిమానులు, నియోజకవర్గ ప్రజలు తమను వారి కుటుంబ సభ్యులుగానే భావించారని అన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి పోరాటాలు మాత్రమే ఉన్నాయని, పదవులు లేవని, తొలిసారిగా తనకు కాంగ్రెస్ పార్టీ నుంచి అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. అప్పటి పీజేఆర్ అభిమానులు ప్రతిఒక్కరూ తన వెన్నంటే ఉంటామని మాటిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నేత, ఉద్యమకారుడు జలాలుద్దీన్, ఉదయనగర్ సీనియర్ నేత నజీర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆమె పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

సైన్యం అమ్ములపొదిలో 'సీసీపీటీ'

- స్వదేశీ పరిజ్ఞానంతో యుద్ధ వాహనం తయారీ
- ఆయుధ కర్మాగారంలో జరిగిన కార్యక్రమంలో సైన్యాధికారులకు అప్పగింత
- మరో 42 వాహనాల తయారీకి ఆర్డర్లు: సీజీఎం సుధాకర్



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న సుధాకర్

కంది (సంగారెడ్డి): సైన్యం కోసం స్వదేశీ పరిజ్ఞానంతో అత్యంత ఆధునిక క్యారియర్ కమాండ్ పోస్ట్ ట్రాక్ట్ వెహికల్ (సీసీపీటీ) యుద్ధ వాహనాన్ని తయారు చేశామని మెదక్ ఆర్డనెన్స్ ఫ్యాక్టరీ (ఓడీఎఫ్) సీజీఎం సుధాకర్ తెలిపారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కంది మండలంలో ఉన్న ఎద్దుమైలారం ఆయుధ కర్మాగారంలో నూతనంగా తయారు చేసిన సీసీపీటీని సైన్యాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైన్యానికి అవసరమయ్యే యుద్ధ పరికరాలను తయారు చేయడంలో ఓడీఎఫ్ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. ఇప్పటికే ఎంబీటీ–72, అర్జున్ ట్యాంక్ తోపాటు పలు రకాల మైన్ ప్రూఫ్ వాహనాలను తయారు చేస్తున్నట్లు తెలిపారు. సైన్యం కోసం డీఆర్డీఓ, బీహెచ్ఈఎల్ సంస్థల సహకారంతో అధునాతన యుద్ధ వాహనమైన సీసీపీటీని ఓడీఎఫ్‌లో రూపొందించినట్లు వెల్లడించారు. ఈ వాహనంలో ఎయిర్ కండిషన్ సౌకర్యంతోపాటు 8 మంది సైనికులు కూర్చునే వీలుంటుందన్నారు. యుద్ధంలో అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లోనూ తట్టుకొనేలా దీన్ని తయారు చేసినట్లు సుధాకర్ చెప్పారు. మరో 42 వాహనాల తయారీ కోసం సైన్యం నుంచి ఆర్డర్లు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో జీఎం రాజేందర్, ప్రసాద్, సైంటిస్ట్ జయసుధ, సైన్యాధికారులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఏఐ చాప్టర్ హెడ్‌గా సంపత్ తుమ్మల



సాక్షి, హైదరాబాద్: 'నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా'(ఎన్ఆర్ఏఐ) హైదరాబాద్ చాప్టర్ హెడ్‌గా సంపత్ తుమ్మల (ది స్పైసీ వెన్యూ) ఎన్నికవగా, మరికొందర్ని వేర్వేరు హోదాల్లో, సభ్యులుగా నియమించారు. శంకర్ కృష్ణమూర్తి, కవితా మంథాలు ఎన్ఆర్ఏఐ జాతీయ మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు. జూబ్లీహిల్స్‌లోని ఓ కేఫ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ కొత్త కమిటీ వివరాలు, చేపట్టనున్న భవిష్యత్తు కార్యక్రమాలను వెల్లడించారు. కార్యక్రమానికి సినీ ప్రముఖులు అల్లరి నరేష్, అడివి శేష్, నందినీరెడ్డి, స్ట్రీట్ బైట్స్ నిర్వాహకులు రవితేజ రావూరి హాజరయ్యారు. ఈ సందర్భంగా రక్త దాన శిబిరం నిర్వహించారు.

కరెంటు ఇచ్చే మొనగాడు కేసీఆర్ ఒక్కరే

తెలంగాణలోనే ఉద్యోగాల భర్తీ ఎక్కువ: మంత్రి కేటీఆర్

కాళేశ్వరంపై విమర్శలతో విపక్ష నేతల పైశాచిక ఆనందం

కాంగ్రెస్, బీజేపీలు విద్యార్థి నేతలను వాడుకుని వదిలేశాయని ధ్వజం

బీఆర్ఎస్‌లోకి దరువు ఎల్లన్న, రమాదేవి

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ రంగానికి 24 గంటల కరెంటు నిరంతరంగా ఇవ్వగలిగే ఏకైక మొనగాడు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మాత్రమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు అన్నారు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇస్తున్న తెలంగాణకు వచ్చి తమ రాష్ట్రంలో ఐదు గంటల కరెంటు ఇస్తున్నామని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ప్రకటించడాన్ని ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో బీజేపీ నేతలు దరువు ఎల్లన్న, పడకంటి రమాదేవి సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని నాయకులతో ప్రచారం చేయలేక బయటి రాష్ట్రాల నుంచి నేతలతో కాంగ్రెస్, బీజేపీ ప్రచారం చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు కాంగ్రెస్ పదేళ్ల పాలనలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 24వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ జరగ్గా.. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక తొమ్మిదేళ్లలో లక్షా 30వేల ఉద్యోగాల భర్తీ జరిగిందని చెప్పారు. మరో 90వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వివిధ దశల్లో ఉందన్నారు. ఉద్యోగాల భర్తీని అడ్డుకునేందుకు కాంగ్రెస్ నేతలు కోర్టుకు వెళ్లారని, బీజేపీ నేతలు పేపర్ లీకేజీలకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఒకవైపు, కేంద్రంలో 16 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉండగా, మరోవైపు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ ప్రైవేటు పరం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోనే ఉద్యోగాల భర్తీ ఎక్కువ సంఖ్యలో జరిగిందని వివరించారు. దళితబంధు పథకం ద్వారా మరో పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి దళితులు చేరుతున్నారని, ఉపాధి కల్పనలో యువత కొత్తతరం ఆలోచనలు చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.



దరువు ఎల్లన్న, రమాదేవిలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

విపక్షాలది పైశాచిక ఆనందం

కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలతో విపక్ష నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారని, మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిన ఘటనపైనా విమర్శలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రాజెక్టు మరమ్మతు భారం ప్రజలపై పడకుండా సంబంధిత నిర్మాణ సంస్థ ద్వారానే చేయిస్తామన్నారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న మోసాలను గ్రహించిన నేతలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అనేక మంది విద్యార్థులు, కవులు, కళాకారులు, గాయకులు, ఉద్యోగ సంఘాల నేతలకు బీఆర్ఎస్ రాజకీయ అవకాశాలను కల్పించిందన్నారు. అనేక మంది ఉద్యమకారులు ప్రస్తుతం వివిధ పదవుల్లో ఉన్నారని, దరువు ఎల్లన్నకు కూడా పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ కోసం ఉద్యమించిన విద్యార్థి నేతలకు రాజకీయ అవకాశాలు ఇవ్వకుండా కాంగ్రెస్, బీజేపీ వాడుకుని వదిలేస్తున్నాయని దరువు ఎల్లన్న విమర్శించారు. చివరి నిషంలో పార్టీలోకి డబ్బు సంచులతో వచ్చిన వారికి పదవులు ఇస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో కార్పొరేషన్ల చైర్మన్లు రాజీవ్ సాగర్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థి నాయకుడు తుంగ బాలు, మిట్టపల్లి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీల బంధం ఈనాటిది కాదు

- నెహ్రూ హయాం నుంచే వారికి అనుబంధం
- ముస్లిం మైనార్టీల సమావేశంలో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్/ ఖైరతాబాద్: కాంగ్రెస్, బీజేపీల బంధం ఈనాటిది కాదని, బీఆర్ఎస్ బీజేపీకి బీ టీమ్ అని ఆరోపిస్తున్న కాంగ్రెస్సే 1952 నుంచీ బీజేపీతో కలిసి పనిచేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు అన్నారు. నెహ్రూ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ఆర్ఎస్ఎస్‌కు చెందిన శ్యామ్‌లాల్ ముఖర్జీ కేబినెట్ మంత్రిగా ఉన్నారని, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల హయాంలోనూ వారి బంధం కొనసాగిందన్నారు. సోమవారం ఇక్కడి జలవిహార్‌లో ముస్లిం కమ్యూనిటీ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్ ప్రసంగిస్తూ, గంగజమునా తెహజీబ్‌లా కలిసి ఉన్న తెలంగాణ ప్రజలను చెల్లాచెదురు చేసేందుకు బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం ఆరెస్సెస్, బీజేపీల ఏజెంట్ అయిన వ్యక్తిని తెచ్చి గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షునిగా కూర్చోబెట్టారన్నారు. గాంధీభవన్‌లో గాడ్సేను కూర్చోబెట్టిన పార్టీ ప్రజలకు ఏం సందేశం ఇస్తోందని ప్రశ్నించారు. దేశంలో బీఆర్ఎస్‌ను మించిన సెక్యులర్ పార్టీ లేదన్నారు. ఒక్కసారి మోకా ఇవ్వాలని కోరుతున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఎన్నోసార్లు మోకా ఇచ్చినా ధోకానే చేసిందని ఆయన దుయ్యబట్టారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ మైనార్టీ సెల్ చైర్మన్



ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన ఆ పార్టీ మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ అబ్దుల్లా సోహైల్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మాగంటి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



లండన్ విమానాశ్రయంలో కవితకు స్వాగతం పలుకుతున్న ఎన్ఆర్ఐలు

లండన్‌కు చేరుకున్న ఎమ్మెల్సీ కవిత

సాక్షి, హైదరాబాద్: ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఆహ్వానం మేరకు తెలంగాణ మోడల్‌పై కీలకోపన్యాసం చేయడానికి బయల్దేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం లండన్‌కు చేరుకున్నారు. లండన్ విమానాశ్రయంలో ఆమెకు ఎన్నారైలు, బీఆర్ఎస్ కార్యకర్తలు స్వాగతం పలికారు. భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 11.30 గంటలకు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో 'ఎక్స్‌ప్లోరింగ్ ఇన్‌క్లూసివ్ డెవలప్‌మెంట్: ద తెలంగాణ మోడల్'అనే అంశంపై కవిత ప్రసంగిస్తారు. కీలక రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన గణనీయమైన పురోగతిపై ప్రజెంటేషన్ ఇస్తారు. వ్యవసాయం, విద్యుత్, విద్య, వైద్యం, తాగునీరు తదితర అంశాలపై తెలంగాణ సాధించిన ప్రగతిని అంతర్జాతీయ వేదికపై కవిత ఆవిష్కరిస్తారని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.



"పది వేల సంవత్సరాలు బతకబోతున్నట్టుగా వ్యవహరించకండి. మృత్యువు మీ మెడ మీద వేలాడుతుంటుంది. బతికి ఉన్నప్పుడే, మీ చేతుల్లో ఉన్నప్పుడే మంచిగా ఉండండి.
– మార్కస్ అరీలియస్

సాక్షి
మంగళవారం, 31 అక్టోబర్ 2023

నడుస్తున్న చరిత్ర!

పాత చరిత్రను కొత్తగా లిఖించే మరోప్రయత్నం మొదలైంది. పిల్లల పాఠ్యపుస్తకాల్లో ప్రస్తుతం ఉన్న 'ప్రాచీన చరిత్ర' స్థానంలో 'సంప్రదాయ (క్లాసికల్) చరిత్ర'ను ప్రవేశపెట్టనున్నారు. అంటే, ప్రాచీన, మధ్య యుగ, ఆధునిక అంటూ బ్రిటీషు వారు చేసిన చరిత్ర విభజన ఇక చెరిగిపోనుంది. నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెయినింగ్ (ఎన్సీఈఆర్టీ) వేసిన ఉన్నత స్థాయి సంఘం చేసిన ఈ సిఫార్సు చర్చ రేపుతోంది. అలాగే, ఇకపై 'ఇండియా' స్థానంలో 'భారత్'ను తీసుకు రావాలని సైతం సదరు కమిటీ సిఫార్సు చేసిందన్న వార్త తేనెతుట్టెను కదిలించింది. భారతదేశపు గతానికి సంబంధించిన కథనాలను 'సరిచేసేందుకు' ఈ మార్పులు తీసుకు వస్తున్నామన్నది ఎన్సీఈఆర్టీ కమిటీ మాట. ఇండియా స్థానంలో భారత్ అనే సిఫార్సును అంగీకరించలేదని ఎన్సీఈఆర్టీ వివరణనిచ్చినా, కమిటీ చేసిన ఇతర ప్రతిపాదనలపైనా అనుమానాలు, చర్చోపచర్చలు ఇప్పుడప్పుడే ఆగేలా లేవు.

2020 నాటి జాతీయ విద్యా విధానంలో భాగంగా సాంఘిక శాస్త్రాల్లో మార్పులు చేర్పులు సూచించడం కోసం రిటైర్డ్ చరిత్ర ప్రొఫెసర్ అయిన సీఐ ఐజాక్ సారథ్యంలో ఓ ఉన్నత స్థాయి కమిటీని 2022లో ఎన్సీఈఆర్టీ నియమించింది. పాఠ్యప్రణాళికలో భాగంగా పిల్లలకు బోధించే అన్ని సబ్జెక్టుల్లోనూ 'భారతీయ విజ్ఞాన వ్యవస్థ' (ఐకేఎస్)ను ప్రవేశపెట్టాలని కూడా ఈ కమిటీ సిఫార్సు చేసింది. 'ప్రాచీన చరిత్ర' బదులు 'సంప్రదాయ చరిత్ర'ను పెట్టాలనే ప్రతిపాదనకు తనదైన సమర్థనను వినిపించింది. ప్రస్తుత పాఠ్యపుస్తకాల్లో మన వైఫల్యాలనే పేర్కొన్నారనీ, మొఘలులు, సుల్తానులపై మన విజయాలను చెప్పలేదనీ, కాబట్టి యుద్ధాలలో 'హిందూ విజయాల'పై దృష్టి పెడుతూ పాఠ్యపుస్తకాలు మార్చాలనీ ఐజాక్ బృందపు వాదన. చరిత్రను చరిత్రగా చెప్పాల్సిందే! అందులో లోటుపాట్లను సవరించడమూ తప్పు కాదు. కానీ, సాక్ష్యాధారాలతో సాగాల్సిన ఆ చరిత్ర రచనను మతప్రాతిపదికనో, మరో ప్రాతిపదికనో మార్చాలనుకోవడమే సమస్య.

'ఇండియా' అంటూ ప్రతిపక్ష కూటమి తమకు తాము నామకరణం చేసుకున్న తరువాత నుంచి ఈ 'ఇండియా' వర్సెస్ 'భారత్' రచ్చ నడుస్తూనే ఉంది. భారత రాజ్యాంగం 'ఇండియా... దటీజ్ భారత్' అని పేర్కొన్నప్పటికీ, ప్రభుత్వం కొన్నాళ్ళుగా ఈ 'భారత' నామంపై కొత్త ప్రేమ కనబరుస్తోంది. ఆ మధ్య జీ–20 వేళ రాష్ట్రపతి అధికారిక విందు ఆహ్వానంలో సైతం 'భారత్' అనే పదాన్నే వాడడం వివాదం రేపింది. అసలు 'ఇండియా' అనే పేరే వలసవాద ఆలోచనకు ప్రతీక అన్నది అధికార పక్షం వాదన. ఏడువేల ఏళ్ళ నాటి విష్ణుపురాణం తదితర ప్రాచీన గ్రంథాల్లో 'భారత్' అని ఉపయోగించినందున ఆ పేరును వాడాలనేది ఐజాక్ కమిటీ సూచన. అయితే, ఇన్నేళ్ళుగా 'ఇండియా', 'భారత్'లను పరస్పర పర్యాయపదాలుగానే వాడుతున్న దేశంలో 'ఇండియా' అని ఉన్నచోటల్లా పాఠ్యపుస్తకాల్లో 'భారత్' అని మార్చేయమని సిఫార్సు చేయడమే అర్థరహితం.

ప్రభుత్వం తమనేమీ ప్రభావితం చేయలేదని ప్రొఫెసర్ ఐజాక్ అంటున్నారు కానీ, హిందూత్వ భావజాలం వైపు ఆయన మొగ్గు జగమెరిగిన సత్యం. పాలక పక్షపు ప్రాపకం కోసం చేసే ఇలాంటి ప్రతిపాదనలు, సిఫార్సులు గాలిలో నుంచి వాటంతటవి ఊడిపడతాయని అనుకోలేం. అలా అనుకుంటే అమాయకత్వమే. ఆ మాటకొస్తే, 2018లోనే ప్రాచీన చరిత్రను తిరగరాసేందుకు తోడ్పడే నివేదికను సమర్పించాల్సిందిగా కేఎన్ దీక్షిత్ సారథ్యంలోని కమిటీని కోరారు. దీక్షిత్ సాక్షాత్తూ ఇండియన్ ఆర్కియలాజికల్ సొసైటీకి ఛైర్మన్, భారత పురావస్తు సర్వేక్షణ సంస్థకు మాజీ జాయింట్ డైరెక్టర్ జనరల్. తాజా సిఫార్సులు వచ్చే విద్యా సంవత్సరానికల్లా అమలులోకి రావచ్చట. పిల్లల పాఠ్యపుస్తకాల్లోనే కాక, విద్యావిషయక పరిశోధనలోనూ ఈ కమిటీ సిఫార్సులు చోటుచేసుకుంటాయని 2018లో సంస్కృతీశాఖ మంత్రిగా చేసిన మహేశ్శర్మ తదితరులు ఆశాభావంతో ఉన్నారు.

అసలింతకీ కొత్తగా చేర్చదలచిన ఈ 'సంప్రదాయ చరిత్ర' అంటే ఏమిటన్నది ఇంకా తెలియాల్సి ఉంది. దేశాన్ని పాలించిన రాజవంశాలన్నిటికీ పాఠ్యగ్రంథాల్లో సమాన ప్రాతినిధ్యం కల్పించాలని ఐజాక్ కమిటీ ప్రతిపాదించింది. ఈ సమప్రాతినిధ్యం ప్రాంతాల ప్రాతిపదికన, చరిత్రలో ఆ వంశాల ప్రాధాన్యం ప్రాతిపదికనైతే ఫరవాలేదు. అలా జరుగుతుందా అన్నది ప్రశ్న. సంగీతం, సాహిత్యం, కళలు, వాస్తుశిల్పం, వాణిజ్యం, భక్తి ఉద్యమాల్లో ఎంతో భాగమున్న దక్షిణాది రాజవంశాలను ఎన్సీఈఆర్టీ పెద్దగా పట్టించుకున్న పాపాన పోలేదు. ఇంతకాలం ఉత్తర భారత దృక్కోణంలోనే నడుస్తున్న వారి పుస్తకాల్లో దక్షిణ భారత రాజవంశాలకూ తగినంత చోటిస్తారా? అది ఓ బేతాళప్రశ్న. అయితే, దేశంలో నిత్యం జరిగే చారిత్రక, పురావస్తు అధ్యయనాల్లో కొత్తగా బయటపడుతున్న అంశాలను సైతం పాఠ్యప్రణాళికలో చేర్చాలన్న కమిటీ సిఫార్సును తప్పక స్వాగతించాలి.

చరిత్ర జడపదార్థం కాదు. దొరికిన సరికొత్త సాక్ష్యాధారాలతో ఎప్పటికప్పుడు కొత్తగా నేర్చుకోవాలి. సమకాలీన అంశాలనూ చేర్చుకోవాలి. కానీ, కొత్త మార్పుల పేరిట పాలకపక్ష భావజాలానికి అనుకూలంగానో, అన్నీ పురాణాల్లోనే ఉన్నాయిష అనో చరిత్రను మార్చాలని చూడడమే దుస్సహనీయం. అసలు సిసలు భారత్కు తామే ప్రతినిధులమని పిల్లలకు పాఠాలతో ఎక్కించి, రాజకీయ లబ్ధి పొందాలనుకుంటే అంత కన్నా ఘోరం లేదు. చంద్రయాన్–3, నారీ శక్తి వందన్, కోవిడ్ నిర్వహణ లాంటి అంశాలకూ చోటిచ్చేలా ఎన్సీఈఆర్టీ ప్రణాళికా రచన చేసినట్టు విద్యాశాఖ చెబుతోంది. నిజానికి, పరిశోధన చేసి, పిల్లల వయసుకు తగిన పాఠాలతో ముందుకు రావడం ఎన్సీఈఆర్టీ పని. ఆ బాధ్యత వదిలేసి, అధికార పార్టీ రాజకీయ ఆలోచనలకు తగ్గట్టు, లేదా ఒక పక్షం విజయాలనే కీర్తిస్తున్నట్టు పాఠ్యాంశాలనే మార్చాలనుకుంటే అది సమగ్ర చరిత్ర కాదు. సమర్థనీయం కానే కాదు!

స్త్రీశక్తి వినిమయంతోనే అభివృద్ధి!

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

ప్రపంచ వ్యాప్తంగా స్త్రీ కర్షకుల అసమానతల మీద పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది, పోరాటం కూడా జరుగుతోంది. నిజానికి అనాది కాలం నుంచి ప్రధానమైన అసంఘటిత శ్రామికులుగా స్త్రీలు ఉన్నారు. వారు కేవలం శ్రామికులే కాదు, ఉత్పత్తి శక్తులు కూడా! కానీ వారిని రానురాను పురుషాధిపత్యంతో అన్ని రంగాల్లోనూ తొక్కివేశారు. శ్రామిక స్త్రీ ప్రపంచానికి ఊపిరి. స్త్రీ శక్తిని సంపూర్ణంగా వినియోగించుకోకుండా మనం అభివృద్ధి పథంలో పయనించలేం. కుల, మత, లింగ బేధాలు లేకుండా ఆత్మ గౌరవంతో ముందుకు వెళ్ళవలసిన సందర్భం ఇది.

నిజానికి మానవాళి చరిత్రలో జరిగిన మార్పులన్నీ స్త్రీలు ఉత్పత్తికి దగ్గరయ్యే క్రమంతోనే ముడిపడి వున్నాయి. పురుషులతోనూ, తన పిల్లలతోనూ, తల్లిదండ్రులతోనూ స్త్రీకుండే సంబంధ బాంధవ్యాలే మానవాళి చరిత్ర. స్త్రీలకూ, పురుషులకూ మధ్య వ్యక్తమయ్యే ఐక్యత, ఘర్షణల్లో సామాజిక సంబంధాలు నిర్ణయమయ్యాయి. ఒకసారి మనం చరిత్ర పూర్వ యుగానికి వెళితే, ఉత్పత్తిలో తనకు సహకరించే పురుషుణ్ణి స్త్రీయే ఎన్నుకునేది. ఈ విధమైన పద్ధతి భారత సమాజంలో ఆర్యులు రాకపూర్వం వుండేది. ఆర్యులు వచ్చాక ఉత్పత్తి రంగం నుండి వారిని తప్పించి బానిసత్వంలోకి నెట్టారు. ఆదిమ సమాజం నుండి స్త్రీ గణనాయికగా, సామాజిక శ్రామిక శక్తిగా, పంపిణీదారుగా వేలాది సంవత్సరాల పాటు సమసమాజ భావనతో సమాజాన్ని నడిపించింది. హెన్రీ మోర్గాన్ తన 'ప్రాచీన సమాజం'లో ఈ సమాజ పరిణామ క్రమాన్ని విశ్లేషించారు.

2018–19 పరిస్థితులతో 2022–23 పరిస్థితులను పీఎల్ఎఫ్ఎస్ (పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే) నివేదికతో సరిపోల్చితే పనిపరంగా స్త్రీల ముఖచిత్రం ఎలా మారిందో అర్థమవుతుంది. స్వీయ ఉపాధిపై ఆధారపడే మహిళలు 53 శాతం నుంచి 65 శాతానికి పెరిగితే, రెగ్యులర్ మహిళా ఉద్యోగులు 22 శాతం నుంచి 16 శాతానికి తగ్గారు. క్యాజువల్ ఉద్యోగులు 25 శాతం నుంచి 19 శాతానికి తగ్గిపోయారు. యజమానులుగా వుండే మహిళలు 23 శాతం నుంచి 28 శాతానికి పెరిగితే, జీతాలు లేని పనివారి వాటా 31 శాతం నుంచి 38 శాతానికి చేరుకుంది. అదే పురుషులలో ఈ శాతాలు కాస్త భిన్నంగా ఉన్నాయి. స్వీయ ఉపాధి పొందే పురుషులు ఈ ఐదేళ్లలో 52 శాతం నుంచి 54 శాతానికి పెరగగా, యజమానులు 44 శాతం నుంచి 44.3 శాతానికి, జీతాల్లేని సహాయకులు 7.6 శాతం నుంచి 9.3 శాతానికి పెరిగారు. వ్యవసాయంపై ఆధారపడే కార్మికుల వాటా 41 శాతం నుంచి 43 శాతానికి, నిర్మాణరంగ పనులను నమ్ముకునే వారి వాటా 12 శాతం నుంచి 13 శాతానికి పెరిగింది. స్త్రీ, పురుషుల మధ్య ఉపాధి, ఆదాయాలలో వ్యత్యాసాలకు సంబంధించిన 200 సంవత్సరాల రికార్డులను విశ్లేషించి... నోబెల్ బహుమతి గ్రహీతలు ఎంతో ఆసక్తికర



విషయాలను బయట పెట్టారు.

ప్రపంచ వ్యాప్తంగా ఇంకా సుమారు 120 కోట్ల మంది పేదవారున్నారు. వీరిలో భారతదేశం, పాకిస్తాన్తో కూడిన దక్షిణాసియా ప్రాంతంలో అత్యధికంగా వున్నారని నివేదికలు చెబుతున్నాయి. ఆఫ్రికాలో 38 శాతం మంది పేదలు వున్నారు. అలాగే బహువిధ పేదరిక సూచీని నీతి ఆయోగ్ ఇటీవల వెలువరించింది. విద్య, వైద్యం, జీవన ప్రమాణాలు వంటి 12 అంశాల ఆధారంగా రూపొందే ఈ సూచీ ప్రకారం, 2015–16లో 25 శాతం వున్న బహువిధ పేదరికం 2019–21 నాటికి 15 శాతానికి తగ్గింది. ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశాలలో పేదరిక నిర్మూలనలో మంచి పురోగతి కనిపించింది. బిహార్లో 34 శాతం, జార్ఖండ్లో 28.8 శాతం, ఉత్తరప్రదేశ్లో 23 శాతం, మధ్యప్రదేశ్లో 21 శాతం, అస్సామ్లో 19 శాతం, ఛత్తీస్గఢ్లో 16 శాతం మేర బహువిధ పేదరికం తగ్గింది. అయినప్పటికీ, ఈ రాష్ట్రాల్లో పేదరికం జాతీయ సగటు కన్నా ఎక్కువే. ప్రపంచంలో పనిచేసే జనాభాలో మూడింట రెండొంతుల మంది అసంఘటిత రంగంలోనే వున్నారన్నది అంతర్జాతీయ కార్మిక సంఘం అంచనా. వీరు లాటిన్ అమెరికా, సహారా ఎడారి దిగువ దేశాలు, దక్షిణాసియా దేశాల్లోనే ఎక్కువగా ఉన్నారు. అసంఘటిత కార్మికుల్లో 58 శాతం మహిళలే. పురుషులతో పోలిస్తే వారి వేతనాలు తక్కువ.

డిజిటల్ వేదికల ద్వారా ఉపాధి పొందేవారిని ప్లాట్ఫామ్ కార్మికులని అంటారు. అసంఘటిత రంగంలో వీరిని కొత్త వర్గంగా పరిగణిస్తున్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వ్యవస్థలు వచ్చిన తర్వాత ఐటీ రంగంలో యువతులు ముమ్మరంగా ప్రవేశించారు. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, ఇంగ్లాండ్ దేశాల్లో ఈ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థలు ఎక్కువగా ఉన్నాయి. వీటికి అనుగుణంగా ఢిల్లీ, బాంబే, హైదరాబాద్, మంగుళూరు, కొచ్చిన్లలో భారతీయ యువతులు రాత్రివేళల్లో పని చేస్తున్నారు. దీంతో అనేకమంది ఇబ్బందులకు గురవుతున్నారు.

స్మార్ట్ఫోన్ విప్లవం ద్వారా ఇప్పుడు పరిమిత కాల పనులు వచ్చాయి. భారత్లో ఈ తరహా గిగ్ వర్కర్ల సంఖ్య 80 లక్షలు. యువజనులు, వలస వచ్చిన వారు ఈ ఉద్యోగాలను ఆశ్రయిస్తున్నారు. వీరి పని పరిస్థితులు మెరుగుపడాలనీ, వీరికి ఆరోగ్య బీమా, పింఛన్ సౌకర్యాలు అందించాలనీ ఆర్థికవేత్తలు సిఫార్సు చేస్తున్నారు. గిగ్ వర్కర్లలో కేవలం 12.2 శాతానికే ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా సౌకర్యం ఉంది. నాలుగు శాతం అటల్ పెన్షన్ పథకంలో చేరారు. సామాజిక భద్రత అంటే ఫించన్, ఆరోగ్య బీమా సదుపాయాలు రెండూ ఉండడం. దీన్ని ఎవరు కల్పించాలనేది ప్రశ్న. కేంద్ర ప్రభుత్వమా లేక డిజిటల్ ప్లాట్ఫామ్ కంపెనీలా? కంపెనీల నుంచి కొంత రుసుము వసూలు చేసి ప్రభుత్వ సంక్షేమ నిధిలో జమ చేయాలి. గిగ్ వర్కర్ల నైపుణ్య శిక్షణకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి ప్లాట్ఫామ్ కంపెనీలు జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థతో కలసి సాగాలి.

ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యాధిపత్యం, పెట్టుబడిదారీ వ్యవస్థ, భూస్వామ్య వ్యవస్థలు స్త్రీని ఇంకా బలహీనమైనదిగా చూస్తున్నాయి. ఈ ధోరణి అంతం కావాలంటే డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, మహాత్మా పూలే ఆలోచనలతో ముందుకు సాగాలి. రాజ్యాంగ స్ఫూర్తిని అందుకోవాలి. కుల, మత, లింగ భేదాలు లేకుండా ఆత్మ గౌరవంతో ముందుకు వెళ్ళవలసిన సందర్భం ఇది. సంకెళ్ళు తెంచుకోవాల్సింది స్త్రీలే, ఎవరో కాదు. స్త్రీలు ఆత్మగౌరవ పోరాట పతాకాన్ని ఎగరవేయాలి. శ్రామిక స్త్రీ ప్రపంచానికి ఊపిరి!

వ్యాసకర్త దళితోద్యమనేత । 98497 41695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్సైట్లు ఫేస్బుక్, ట్విట్టర్లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

నివాళి



ఏ సమయంలోనైనా ప్రపంచంలో ఎవరో ఒకరు 'ఫ్రెండ్స్' ఎపిసోడ్స్ చూస్తూ వుంటారు. (అమెరికన్ సిట్కామ్ 'ఫ్రెండ్స్' నటుడు మాథ్యూ పెర్రీ 54 ఏళ్ల వయసులో చనిపోయారు.)

– సుజయ్ ఘోష్, దర్శకుడు

ఎవరి ఆలోచన?



హరియాణాలో వివాహాల రిజిస్ట్రేషన్ను ఇప్పుడు 'విపత్తు నిర్వహణ శాఖ' కిందికి మార్చారట. ఇది నిజమే అయితే, హరియాణా ప్రభుత్వానికి బ్రహ్మాండమైన సెన్సాఫ్ హ్యూమర్ ఉన్నట్టు!

– అభిషేక్ సింఘ్వీ, ఎంపీ

వాస్తవిక పరిష్కారం



ఇజ్రాయిల్ – పాలస్తీనా సమస్య మీద మీ అభిప్రాయాన్ని ఏర్పరుచుకునేటప్పుడు మిమ్మల్ని మీరు ఇలా ప్రశ్నించుకోండి: నాకు న్యాయం కావాలా? శాంతి కావాలా? సంపూర్ణ న్యాయం కోరుకుంటే నువ్వెప్పటికీ శాంతిని సాధించలేవు. కానీ నువ్వు శాంతిని కోరుకుంటే, కనీసం కొంత న్యాయం దక్కుతుంది.

– అలీ ఎ. రిజ్వీ, రచయిత

సింపుల్ సూత్రం



మార్కెట్ వ్యవహారాల యాంకర్గా నాకున్న సుదీర్ఘ అనుభవంతో ప్రతిరోజూ ఆర్థికాంశాల సలహాలు ఇవ్వాలని అనుకుంటున్నాను. ప్రస్తుతానికి అది ఉచితం. మొదటి పాఠం – మీ ఆదాయాన్ని ఎలా పెంచుకోవాలి? 1. స్నేహితుడి దగ్గర 20 వేలు అప్పు తీసుకోండి. 2. వాళ్లను మీ ఫోన్లో, సోషల్ మీడియా అంతటా బ్లాక్ చేయండి.

– అనింద్యో చక్రవర్తి, జర్నలిస్ట్

నమ్మవద్దు!



'ఐసీసీ' లేదా ఇంకో క్రికెట్ శాఖకు ఏ క్రికెట్ సభ్యుడికి జరిమానా విధించడం గురించో, ప్రతిఫలం ఇవ్వడం గురించో నేను సూచనలు ఇవ్వలేదు. నాకు ఏ రకంగానూ క్రికెట్తో సంబంధం లేదు. నా అధికారిక వేదిక నుంచి వచ్చినవి తప్ప, అలాంటి వాట్సాప్ ఫార్వర్డ్లు, వీడియోలు నమ్మకండి.

– రతన్ టాటా, పారిశ్రామికవేత్త

మాట్లాడాల్సిన అంశం



పదిహేడు లక్షల మంది అఫ్గాన్ శరణార్థులను పాకిస్తాన్ ప్రభుత్వం వెనక్కి పంపుతుండటం మానవత్వపు, మానవ హక్కుల సంక్షోభాన్ని రేపుతుంది. అది దారుణం, అమానవీయం, హ్రస్వదృష్టితో కూడినది. మానవత్వపు అంశ ఏ మాత్రం ఉన్నవాళ్లయినా దీనికి వ్యతిరేకంగా గళమెత్తాలి.

– నిదా కిర్మాణీ, ఫెమినిస్ట్ సోషియాలజిస్ట్

థాంక్యూ!



2022–23 సంవత్సరానికి భారత సాఫ్ట్వేర్ ఎగుమతులు: 320 బిలియన్ డాలర్లు. 2022–23 సంవత్సరానికి భారత ముడి చమురు దిగుమతుల విలువ: 158 బిలియన్ డాలర్లు. బెంగళూరు, హైదరాబాద్, పుణె, నోయిడా, చెన్నై, గురుగ్రామ్ లాంటి నగరాల్లోని సుమారు యాభై లక్షల మంది సాఫ్ట్వేర్ ఇంజినీర్లు ఇండియా ముడిచమురు మీద పెట్టే ఖర్చుకంటే రెట్టింపు సంపాదిస్తున్నారు. వారికి కృతజ్ఞతగా ఉండండి.

– కిరణ్ కుమార్ ఎస్., వ్యాఖ్యాత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

మేలిమి గుణాల కలయిక!

సందర్భం



డా॥ నాగసూరి వేణుగోపాల్

ఒక వైపు హాకీ వంటి ఆధునిక క్రీడలో నైపుణ్యం, మరో వైపు చదువులో చురుకుదనం, ఇంకోవైపు స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పోరాటం! ఇటువంటి అపురూపమైన మేలిమి గుణాల కలయిక ఎమ్వీ పాపన్న గుప్త మదనపల్లెలో 1905 జూన్ 12వ తేదీన జన్మించారు. బాల్యం నుంచే అనిబిసెంట్ సతి ప్రసంగాలు చాలా బాగా పనిచేయడంతో బ్రిటిష్ ప్రభుత్వం నడిపే కళాశాలలో చేరిన పాపన్న దాని నుండి వైదొలగి బిసెంట్ థియోసాఫికల్ వారి కళాశాలలో చేరారు. 1918లో ప్రిన్స్ ఆఫ్ వేల్స్ రావడాన్ని వ్యతిరేకిస్తూ మద్రాసులో జరిగిన నిరసన ఉద్యమంలో పాపన్న 'బాలభటోద్యమం' మిత్రులతో కలిసి పాల్గొన్నారు.

బిహార్ భూకంపం సమయంలో రాయలసీమ ప్రాంతాల్లో తిరిగి నిధులు సేకరించడం, అలాగే గుంతకల్లు పట్టణంలో 'ఇండియా ఇన్ చైన్స్' అనే పుస్తకాన్ని రక్షించేందుకు ప్రాణాలకు తెగించి ఎత్తైన మేడ నుంచి దూకి, దాన్ని మైసూర్కు విజయవంతంగా తరలించడం, రెండో ప్రపంచ యుద్ధం సమయంలో యుద్ధ సహాయ కార్యక్రమాలకు వ్యతిరేకంగా పోరాడటం, 1942లో జైలు పాలు కావడం వంటివి ఆయన సాహసిక జీవితంలో కొన్ని సంఘటనలు మాత్రమే. ఖద్దరు ప్రచారం, హిందీ వ్యాప్తి, గ్రంథాలయ ఉద్యమం వంటి కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. అంతకుమించి ఆయన ఆ ప్రాంతంలో 'పాల సేకరణ కేంద్రాలు' మొదలుపెట్టి ఎంతో ప్రగతి సాధించి చిత్తూరు జిల్లాలో పాడి పరిశ్రమకు పునాదులు వేశారు. అలాగే సహకార బ్యాంకులు కూడా ఆ జిల్లా ప్రాంతంలో రావడానికి చేసిన కృషి చేశారు. మదనపల్లెలో 'గంగ జాతర్ల'లో జంతుబలిని నిరసిస్తూ కార్యక్రమాలు చేసినప్పుడు వీరిని రాళ్లతో కొట్టారు. ఒక్క మదనపల్లె కాకుండా అనంతపురం జిల్లా ఉరవకొండలో కూడా ఇదే కృషి చేశారు.

వితంతు వివాహాలు జరిపిస్తున్నందుకు ఒకసారి సేలంలో వీరిని బంధించారు కూడా! రాయలసీమ ప్రాంతం వెనకబడినదనే ప్రచారాన్ని తిప్పికొడుతూ ప్రచారం చేశారు. ఒక దశలో భోగరాజు పట్టాభి సీతారామయ్యను సభాముఖంగా తన వాదనతో మెప్పించడం అనేది తర్వాత దశలో 'శ్రీబాగ్ ఒడంబడిక'కు పునాదిగా మారింది. పాపన్న 'ఆంధ్ర మహాసభ' సహాయ కార్యదర్శిగా కూడా సేవలు అందించారు. అలాగే హిందీ ప్రచార సభ'కు సంబంధించి కూడా చాలా బాధ్యతలు నిర్వహించారు.

పాపన్న చిరుప్రాయంలోనే సాహిత్యం అంటే ఎంతో మక్కువ కలిగి, చిలకమర్తి లక్ష్మీనరసింహం 'కర్పూర మంజరి' అసంపూర్ణ నవలను పూర్తి చేసి మంచి మన్ననలను పొందారు. అలాగే పద్యాలు, కథలు, వ్యాసాలు రాసిన వీరు సృజించిన సాంఘిక నవల 'భానుమతి' 1930లో అచ్చయింది. ఇది రాయలసీమ ప్రాంతపు తొలి నవలల్లో ఒకటి. ఇంతటి బహుముఖ ప్రజ్ఞాశాలి 1986 నవంబర్ 1వ తేదీన కన్ను మూశారు.

వ్యాసకర్త ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి । 94407 32392

(నవంబర్ 1న ఎమ్.వి. పాపన్న వర్ధంతి)

ఎక్కువ పనిగంటలు ప్రమాదకరం!

యువత వారానికి 70 గంటలు పనిచేయాలని ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి అన్న మాటలపై ఇప్పుడు దేశ వ్యాప్తంగా చర్చోప చర్చలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అసలు భారత కార్మిక చట్టం, ఫ్యాక్టరీ చట్టం వంటివి ఏం చెబుతున్నాయి, రోజుకి 8 గంటలు పైబడి పని చేస్తే పర్యవసానాలు ఏమిటి వంటి అనేక విషయాలు చర్చించవలసిన అవసరం ఉంది.

ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో 49 పని గంటల విధానం అమల్లో ఉంది. మన దేశంలో రోజువారి విశ్రాంతి సమయం, వార్షిక సెలవులు కలిపి వారానికి 48 పనిగంటలు మించకుండా ఉండేలా చట్టాలు ఉన్నాయి. మనిషికీ మనిషికీ పని గంటల్లో తేడా; అలాగే డబ్బు, ప్రాంతం, సంస్కృతి, జీవన విధానం వంటి అనేక అంశాలతో పాటు ముఖ్యంగా జీతాలు, లాభాలు ఆధారంగా కూడా ఈ పని గంటలు మారుతూ ఉంటాయి. ప్రైవేటు, ప్రభుత్వ సంస్థల్లో వారి వారి అంగీకారాన్ని బట్టి కూడా పని గంటలు నిర్దిష్టంగా ఉంటాయి.

ప్రపంచవ్యాప్తంగా నియమిత పని గంటలు వారానికి 40 నుంచి 44గా అమలులో ఉన్నాయి. తాత్కాలిక, బదిలీ ఉద్యోగులకు ఒకలాగా; పర్మినెంట్ ఉద్యోగులకు ఒకలాగా, అలాగే రోజుకి ఇన్ని గంటలని వారానికి మొత్తంగా 48 గంటలు మించకుండా పనిగంటలు ఉండాలని అంతర్జాతీయ కార్మిక సంస్థ చెబుతుంది. ప్రపంచ వ్యాప్తంగా తక్కువ పని గంటలు వున్న దేశం జర్మనీ. ఇక్కడ సంవత్సరానికి 1340 గంటలు పని గంటలుగా ఉంటాయి. మెక్సికో, కొలంబియా, కోస్టారికాలలో ఎక్కువ పనిగంటలు (1886) ఉన్నాయి.

భారతదేశం బ్రిటిష్ పాలనలో ఉన్నప్పుడు అప్పటి వైస్రాయ్ కౌన్సిల్లో లేబర్ మెంబర్గా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కార్మికులకూ, ఉద్యోగులకూ రోజుకు 8 పని గంటలు ఉండాలని 1942లో మొదటిసారి డిమాండ్ చేశారు. అనేక వాదోపవాదాలూ, తర్జనభర్జనల మధ్య వైస్రాయ్ కౌన్సిల్ 9 పనిగంటలు ఉండాలనీ, దీనిలో 30 నిమిషాలు రెండు దఫాలుగా విశ్రాంతి ఉండాలనీ నిర్ణయించారు. '1948 ఫ్యాక్టరీ చట్టం' సెక్షన్ 54 ప్రకారం ఈ తొమ్మిది గంటల పని, విశ్రాంతి సమయాన్ని అంబేడ్కర్ కార్మికుల పక్షాన పోరాడి సాధించారు.



ఇటీవల మన దేశంలో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం 'కర్ణాటక ఫ్యాక్టరీస్ అమెండ్మెంట్ యాక్ట్ బిల్లు – 2023'ను ఆమోదించడం ద్వారా రోజుకు 12 పని గంటలు ఉండాలని నిర్ణయించింది (వారానికి 48 గంటలు మించకుండా). అలాగే భారత కార్మిక మంత్రిత్వ శాఖ రోజుకు12 పనిగంటలు ఉండాలని పార్లమెంట్లో చట్టం చేసినప్పటికీ... 'ఇండియన్ ఫ్యాక్టరీస్ యాక్ట్ –1948' ఓవర్ టైంతో కలిపి 50 నుంచి 60 పని గంటలు దాటకూడదనే నిబంధన కచ్చితంగా పాటించాలని చెప్పింది.

2016లో ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ కార్మిక సంస్థ అధ్యయనం, అంచనాల ప్రకారం ఎవరైతే వారానికి 55 గంటలు దాటి పని చేస్తారో వారిలో ప్రతి పది మందిలో ఒక కార్మికుడు గుండె పోటుతో మరణిస్తున్నట్లు తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా 745,000 మంది కార్మికులు గుండెపోటుతో మరణించినట్లు నివేదిక తెలిపింది. దీనికి కారణం ఎక్కువ పని చేయడమేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ కార్మిక సంస్థల సంయుక్త నివేదిక చెబుతున్నటువంటి సత్యం.

పైన ఉదాహరించిన ఎక్కువ గంటలు పని చేయడం వల్ల జరిగిన మరణాలను పరిశీలిస్తే, యువత వారానికి 70 గంటలు పని చేస్తే జరిగే నష్టం అంచనా వేయొచ్చు. స్వతంత్ర భారత దేశంలో ఎవరి అభిప్రాయాలు వారు స్వేచ్ఛగా చెప్పవచ్చు. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి ఆయన రంగంలో ఆయన ఆదర్శప్రాయులు. వయస్సు రీత్యా కూడా పెద్దవారు. ఇప్పటికే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో యువత అనేక ఆరోగ్య, మానసిక, కుటుంబ సమస్యలు ఎదుర్కొంటున్నట్లు అనేక వార్తలు నిత్యం చూస్తూనే ఉన్నాం. ఆయన తన అభిప్రాయాలు మెజారిటీ మనోభావాలు దెబ్బతినే విధంగానూ, అశాస్త్రీయంగానూ వ్యక్తపరిస్తే ఆ ప్రభావం సమాజం మీద కచ్చితంగా ఉంటుంది. యువత మానసిక స్థితి మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక దారుఢ్యం, కుటుంబ నేపథ్యం, పెరిగిన వాతావరణం వంటివాటిని బట్టి ఉంటుంది. కాబట్టి విధాన నేర్ణేతలు వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాలి.

– డా॥ గుబ్బల రాంబాబు, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు, ఏపీ

నిమిత్తమాత్రులం

ఇంద్రభోగాలూ, స్వర్గ సుఖాలూ అంటాం. కానీ, మన పురాణ కథలలో, ఇంద్రుడికి ఎప్పుడూ పదవీచ్యుతి భయమే. వరాలూ, బల పరాక్రమాలూ ఉన్న రాక్షసులందరికీ ఆయన సింహాసనం మీదే కన్ను.

ఒకసారి ఒక రాక్షసుడు తన మీదికి యుద్ధానికి వస్తున్నాడని ఇంద్రుడికి తెలిసింది. వెంటనే బృహస్పతిని పిలిపించాడు. 'గురుదేవా! రాబోయే యుద్ధంలో నేను గెలిచే ఉపాయం చెప్పండి' అని ప్రార్థించాడు.

'నీ శక్తి వంచన లేకుండా యుద్ధం చెయ్యి. అదే ఉపాయం.'

'అలా చేస్తే గెలవడం ఖాయమా?'



'కాదు! జయాపజయాలు దైవాధీనాలు. శరీరధారి అంటేనే దైవాధీనుడు, అస్వతంత్రుడు. కనక అతని ప్రయత్నాల సాఫల్యత కూడా దైవాధీనమే.'

'కానీ జయాపజయాల వల్ల కలిగే సుఖ దుఃఖాలు అనుభవించేది నేనే కదా? ఏం చేసేట్టు?'

'దేవేంద్రా! సుఖదుఃఖాలు మనసు ద్వారా అనుభవించేవి. కానీ ఆ మనసును సుఖ దుఃఖాలకు సమర్పించుకొని, వాటికి స్వాధీనం చేయకూడదు. నీ మనసు నీ సుఖ దుఃఖాలకు బానిసగా మారిపోతే, నీకు సంతోషం దూరమౌతుంది. సంతో షాత్ అపరం నాస్తి సుఖ స్థానం, శచీపతే!– శచీంద్రా! సంతోషాన్ని మించిన సుఖ స్థానం మరొకటి లేదు (దేవీ భాగవతం, 5–4–38).

'మనసు సుఖదుఃఖాల వశం కాకుండా ఉంచడం ఎలా?'

'దుఃఖే దుఃఖాదికాన్ పశ్యేత్ – దుఃఖం కలిగినప్పుడు, నీ కంటే ఎక్కువ దుఃఖంలో ఉన్నవాళ్ళను చూడాలి. అప్పుడు, లోకంలో ఇలాంటి దుఃఖం సామాన్యమేనని నీ మనసు గ్రహిస్తుంది కనక దుఃఖానికి వశమైపోకుండా సంయమనంతో ఉంటుంది. అలాగే, సుఖే పశ్యేత్ సుఖాధికాన్ – సుఖం కలిగినప్పుడు నీ కంటే సుఖంగా ఉన్న వాళ్ళను గమనించాలి. వాళ్ళను చూస్తే సుఖం వల్ల కలిగే ఉబ్బూ, తబ్బిబ్బూ, అహంకారం శమించి, నీ మనసు వాటి వశమైపోకుండా నీ వశంలోనే ఉంటుంది. మనసు సంయమనంతో ఉంటే, సంతోషం నిన్ను వీడదు' అన్నాడు బృహస్పతి. ఇంకొక్క మాట కూడా అన్నాడు: 'మమతా పరమం దుఃఖం, నిర్మమత్వం పరం సుఖమ్ – మనకు సంభవించిన సాఫల్య వైఫల్యాలూ, జయాపజయాలూ నావి, నేను సాధించినవి అన్న 'మమ'త్వభావన అన్నిటికంటే దుఃఖదాయకం. జయాపజయాలు రెండూ నావి కావు. నేను నిమిత్తమాత్రుడిని అని పనులు చేస్తే ఆ నిర్మమత్వమే పరమ సుఖదాయకం.'

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.తదియ రా.10.54 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** కృత్తిక ఉ.6.01 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** రా.10.03 నుండి 11.42 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.19 నుండి 9.04 వరకు, తదుపరి రా.10.29 నుండి 11.18 వరకు, రా.2.54 నుండి 4.30 వరకు, అట్లతదియ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.01, **సూర్యాస్తమయం:** 5.27.

మిర్చి : రూ.25 వేలు


ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన మిర్చి

ఖమ్మం వ్యవసాయం: మిర్చి ధరకు రెక్కలొచ్చాయి. సోమవారం ఖమ్మం మార్కెట్‌లో తేజా రకం మిర్చికి రికార్డు ధర పలికింది. జెండాపాట ధర రూ.25 వేలు పలికింది. శుక్రవారం రూ. 24,600గా ఉన్న ధర రెండురోజుల్లోనే రూ.400 పెరిగింది. ఈ ఏడాది మార్చి 20న రూ.25,550 పలికి ఆల్‌టైం రికార్డు సృష్టించగా, ఆ తర్వాత హెచ్చుతగ్గులకు గురవుతూ వచ్చింది. ఇప్పుడు తిరిగి రూ.25 వేలకు చేరింది. ప్రస్తుతం దేశీయ విక్రయాలు కొనసాగుతుండగా, అరకొరగా విదేశీ విక్రయాలు కూడా సాగుతున్నాయి. అయితే విదేశీ ఎగుమతులు చేసే వ్యాపారులు దృష్టి సారిస్తే ధర మరికొంత పుంజుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఉల్లి కిలో రూ. 90

- క్వింటాల్ రూ.3 వేల నుంచి రూ.6వేలకు
- నెల రోజులు ఇదే పరిస్థితి



చాదర్‌ఘాట్: రాష్ట్రంలో ఉల్లి ధర వారం రోజుల నుంచి ఆకాశాన్నంటుతోంది. నెల రోజుల క్రితం క్వింటాల్ రూ.3000–3500 ఉండగా, ఒక్కసారిగా రూ. 6000 నుంచి 7500 వరకు పెరిగింది. మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌కు వివిధ రాష్ట్రాల నుంచి రోజుకు 30 వేల బస్తాలు దిగుమతి అవుతుండగా, ఇప్పుడు రోజుకు 8వేల బస్తాలు మాత్రమే దిగుమతి అవుతోంది. మహారాష్ట్రలో వర్షపాతం తక్కువగా ఉండటంతో పంట వేయలేదని, అందుకే దిగుమతి తక్కువగా ఉంటోందని అధికారులు చెప్పారు. వర్షాల కారణంగా ఏపీలో రైతులు ఉల్లికి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేయడంతో ఆంధ్రా నుంచి ఉల్లి దిగుమతి తక్కువైందన్నారు. విదేశాలకు ఎగుమతి చేసేందుకు అనుమతి ఇవ్వడం కూడా ఉల్లి ధర పెరుగుదలకు కారణమని వ్యాపారులు తెలిపారు.

అక్రమార్కులపై నిఘా: రవీందర్‌రెడ్డి, గ్రేడ్–3 కార్యదర్శి

కొత్తపంట వచ్చే వరకు ఉల్లి క్వింటాల్‌కు రూ. 6,000 నుంచి 8,000 వరకు ధర ఉంటుంది. నెల రోజులపాటు ఉల్లి ధర కిలో రూ.60 నుంచి 90 మధ్య ఉంటుంది. అక్రమ వ్యాపారులపై నిఘా పెట్టాం.

సామాన్యులను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారు?

- ఎన్నికలతో సంబంధం లేని డబ్బు స్వాధీనంపై ఈసీ అసంతృప్తి
- సత్వరంగా సామాన్యులకు వారి డబ్బు ఇచ్చేయండి
- సమీక్షలో ఈసీ ఆదేశం


నితీష్‌కుమార్ వ్యాస్

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన తనిఖీల్లో పెద్ద మొత్తంలో ఎన్నికలతో సంబంధం లేని నగదును పట్టుకోవడం పట్ల కేంద్ర ఎన్నికల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. నగదును తీసుకెళ్లడానికి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అసంతృప్తి వ్యక్తం చేసింది. జిల్లా గ్రివెన్స్ కమిటీ నుంచి అనుమతి పొంది సత్వరంగా సామాన్య ప్రజల డబ్బులను వారికి తిరిగి అప్పగించాలని ఆదేశించింది. శాసనసభ ఎన్నికల ఏర్పాట్లపై కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) కార్యాలయం అధికారులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహించింది. నామినేషన్ల ప్రక్రియ సమీపించిందని, ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎన్నికల సంఘం డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్‌కుమార్ వ్యాస్, డైరెక్టర్(ఎన్నికల వ్యయం) పంకజ్ శ్రీవాత్సవ ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల వ్యయ పరిశీలన నోడల్ అధికారి మహేష్ భగవత్, పోలీసు నోడల్ అధికారి సంజయ్‌కుమార్ జైన్, అదనపు సీఈఓ లోకేష్‌కుమార్, జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహమద్, డిప్యూటీ సీఈఓ సత్యవాణి సమీక్షలో పాల్గొన్నారు. సమీక్షలో ఈ కింది నిర్ణయాలు తీసుకున్నారు.

13 స్థానాల్లో గంట ముందే పోలింగ్ ముగింపు..

వామపక్ష తీవ్రవాద ప్రభావిత 13 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక గంట ముందే పోలింగ్ ప్రక్రియను ముగించాలని ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. సిర్పూర్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లందు, కొత్తగూడెం, అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. మిగిలిన 106 నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

బీఎల్‌ఓల ఆధ్వర్యంలో ఏఎస్డీ ఓటర్ల జాబితా..

ఓటర్లకు ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పుల పంపిణీ ప్రక్రియ పూర్తైన తర్వాత .. అందుబాటులో లేని, నివాసం మారిన, చనిపోయిన ఓటర్ల పేరుతో ఏఎస్డీ(అబ్సెంటీస్, షిఫ్టెడ్ అండ్ డెడ్) జాబితాలను బూత్ స్థాయి అధికారులు(బీఎల్‌ఓ)లు రూపొందించనున్నారు. అసలు ఓటర్ల జాబితాతో పాటు ఏఎస్డీ జాబితాను సంబంధిత పోలింగ్ కేంద్రాల ప్రిసైడింగ్ అధికారులకు అందజేయనున్నారు. ఏఎస్డీ జాబితాలోని ఓటర్ల పేరిట ఎవరైనా ఓటేసేందుకు వస్తే వారి గుర్తింపును పకడ్బందీగా నిర్ధారించనున్నారు.

10లక్షల ఫారం–7 దరఖాస్తుల పరిష్కారం...

ఈ నెల 9న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే నాటికి అందిన 10.6లక్షల ఫారం–7 దరఖాస్తుల్లో దాదాపు 10వేలు మినహా మిగిలిన అన్ని దరఖాస్తులను పరిష్కరించారు. మిగిలిన వాటిని రెండు రోజుల్లో పరిష్కరించనున్నారు. ఓటర్ల జాబితాలో అనర్హుల పేర్లను చేర్చడంపై అభ్యంతరం తెలపడం లేదా ఓటర్ల పేరు తొలగింపు కోసం విజ్ఞప్తి చేస్తూ ఫారం–7 దరఖాస్తు చేస్తారు. అక్టోబర్ 9 తర్వాత వచ్చిన ఫారం–7 దరఖాస్తులను ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత పరిష్కరించనున్నారు.

ఉచితంగా ఓటర్ల జాబితా..

కొత్త ఓటర్ల నమోదుకు వచ్చిన దరఖాస్తులను నవంబర్ 10 నాటికి పరిష్కరించనున్నారు. అనంతరం ఎన్నికల్లో వినియోగించనున్న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు ఒక ప్రతి ఓటర్ల జాబితాను ఉచితంగా అందజేస్తారు. డబ్బులు చెల్లించి ఎన్ని కాపీలైనా పొందవచ్చు. డబ్బులు చెల్లిస్తే ఓటర్ల జాబితా సాఫ్ట్ కాపీని సైతం అందిస్తారు. వయోజనులు, దివ్యాంగ ఓటర్ల కోసం 18వేల వీల్ చైర్లను సమీకరిస్తున్నారు.

బాణాసంచాకు బోలెడు కష్టాలు!

- ఎన్నికల వేళ పెరిగిన నిఘా..!
- నగదు లావాదేవీలకు సమస్యలు.. చెక్‌పోస్టులు దాటి వెళ్లలేని పరిస్థితి
- డిజిటల్ లావాదేవీలకు శివకాశి వ్యాపారులు ససేమిరా..
- నేతల హడావుడితో అమ్మకాలు పెరిగే అవకాశం
- ఫలితాల తర్వాత వేడుకలకూ స్టాక్ అవసరం..
- దొడ్డిదారి మార్గాలపై వ్యాపారుల దృష్టి
- ధరలు 50 శాతం పెరగొచ్చని అంచనా



సాక్షి, హైదరాబాద్: దీపావళి బాణాసంచాపై ఈసారి ఎన్నికల ప్రభావం స్పష్టంగా కన్పిస్తోంది. ఎన్నికలు కూడా కలిసి రావడంతో అమ్మకాలు ఎక్కువగా ఉన్నాయని, అయితే అడుగడుగునా నిఘా నేపథ్యంలో వాటిని తీసుకురావడమూ కష్టంగానే ఉందని దుకాణాల యజమానులు అంటున్నారు. నగదు లావాదేవీలకు అడ్డంకులతో వ్యాపారులు ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరిస్తున్నారు. ఈ సంవత్సరం బాణాసంచా ధరలు పెరగడానికి ఇది కూడా కారణమయ్యే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అంటున్నాయి. దసరాకు ముందు నుంచే వ్యాపారులు బాణాసంచాను తమిళనాడులోని శివకాశి నుంచి భారీగా తెచ్చి, నిల్వ చేస్తుంటారు. దీపావళికి కొద్ది రోజుల ముందు నుంచి అమ్మకాలు మొదలు పెడతారు. పండుగకు నాలుగు రోజుల ముందు అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. ఒక్క హైదరాబాద్ నగరంలోనే ఏటా రూ. 250–360 కోట్ల వ్యాపారం నడుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 500–700 కోట్ల వ్యాపారం ఉంటుందని అంచనా. ఇందులో పన్నులు చెల్లించకుండా జరిగే వ్యాపారమే ఎక్కువగా ఉంటుందని అంచనా.

ఈ ఏడాది టపాసుల జోరు..

రాష్ట్రంలో ఎన్నికల కోలాహలం నెలకొంది. పోటీ చేసే అభ్యర్థులు వివిధ వర్గాలతో కలిసి వేడుకల్లోనూ పాల్గొంటారు. పార్టీలన్నీ మండల, నియోజకవర్గ స్థాయిలో ఆఫీసులను తెరుస్తాయి. దీంతో కార్యకర్తలు పోటీపోటీగా బాణాసంచా కాల్చడం రివాజు. డిసెంబర్ మొదటి వారంలో ఫలితాలు వెల్లడిస్తారు. విజయం సాధించిన అభ్యర్థులు బాణాసంచాతో పెద్ద ఎత్తున వేడుకలు చేసుకుంటారు. దీపావళికి ఎన్నికలు కూడా తోడవ్వడంతో ఈసారి బాణాసంచా అమ్మకాలు జోరుగానే ఉంటాయని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు.

దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కువ మొత్తంలో శివకాశిలో ఆర్డర్లు కూడా ఇచ్చినట్టు హైదరాబాద్ మలక్‌పేటకు చెందిన ఓ బాణాసంచా వ్యాపారి ఖండేవాల్ తెలిపారు. బాణాసంచాలో దాదాపు 50 శాతానికి పైగా లాభాలుంటాయి. అధికారిక లెక్కల్లో చూపించే వాటికే ప్రభుత్వ నిబంధనల ప్రకారం పన్నులు కడతారు. అంతకు రెండు రెట్లు ఎలాంటి పన్నులు కట్టకుండా తేవడం సాధారణంగా జరుగుతున్న వ్యవహారమే.

నగదుతో చిక్కు..

వ్యాపారులు ప్రతి ఏటా ఆన్‌లైన్ లావాదేవీలకన్నా, ప్రత్యక్షంగా నగదు ఇచ్చి బాణాసంచా కొనుగోలు చేస్తుంటారు. ఎన్నికల నేపథ్యంలో సరిహద్దులు దాటి నగదు తీసుకెళ్లడం కష్టంగానే ఉందని హైదరాబాద్ బాణాసంచా వ్యాపారి సంజయ్ తెలిపారు. రూ. 50 వేలకు మించి నగదు పట్టుబడితే స్వాధీనం చేసుకుంటున్నారు. ఇదే సమస్యగా మారిందని ఆయన చెప్పారు. ఆన్‌లైన్ లావాదేవీలపైనా నిఘా ఉందనేది వ్యాపారులను వణికిస్తోంది. ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక బృందాలు సరిహద్దుల్లోనే కాకుండా, అన్ని ప్రాంతాల్లో ఉండటం వల్ల పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొందని వ్యాపారులు చెబుతున్నారు. శివకాశిలోని వ్యాపారులకు ఫోన్‌పే, గూగుల్ పే వంటి డిజిటల్ చెల్లింపులను తెలిసిన వాళ్ల ద్వారా చేయాల్సి వస్తోందని వారు తెలిపారు. అయితే, అక్కడా సమస్యలు తప్పడం లేదంటున్నారు. డిజిటల్ లావాదేవీల వల్ల పన్నులు అధికంగా చెల్లించాల్సి వస్తోందన్న నెపంతో శివకాశిలోని వ్యాపారులు అభ్యంతరాలు తెలుపుతున్నారని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క, పట్టణ ప్రాంతాల్లో వ్యాపారులు నిఘాలేని పలు మార్గాలను ఎంచుకుంటున్నారు. కొన్ని చోట్ల తెలిసిన అధికారులను పట్టుకుని నగదు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవానికి ఈ ఏడాది బాణాసంచా ధరలు 30 శాతం మేర పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. నిఘా కారణంగా అయ్యే ప్రత్యేక ఖర్చు వల్ల ఈ సంవత్సరం స్థానికంగా ధరలు 50 శాతం పెరగవచ్చనేది వారు అంచనా వేస్తున్నారు.

క్లుప్తంగా...

రాజకీయ పొత్తులను నియంత్రించలేం: ఈసీ

న్యూఢిల్లీ: రాజకీయ పొత్తులను నియంత్రించేందుకు చట్టపరంగా తమకు ఎలాంటి అధికారమూ లేదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. విపక్ష కూటమికి ఇండియా అని పేరు పెట్టడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరుపుతున్న ఢిల్లీ హైకోర్టుకు ఈసీ సోమవారం ఈ మేరకు తన స్పందన తెలియజేసింది. ''మాకు పార్టీల నమోదుకు, ఎన్నికల నిర్వహణకు మాత్రమే అధికారముంది. అంతే తప్ప రాజ్యాంగంలోని ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం రాజకీయ పొత్తులకు నియంత్రిత కూటములుగా గుర్తింపునిచ్చే అధికారం కూడా లేదు. పైగా కేరళ హైకోర్టు గత తీర్పు మేరకు ఈ కూటములను చట్టబద్ధమైన సంస్థలుగా కూడా పరిగణించలేం'' అని వివరించింది. విపక్ష కూటమికి ఇండియా అని పేరు పెట్టుకోవడం తాలూకు చట్టబద్ధత తమ పరిధిలోని అంశం కాదని వివరించింది. విపక్ష కూటమికి ఇండియాగా పేరు పెట్టడాన్ని సవాలు చేస్తూ గిరీశ్‌భరద్వాజ్ అనే వ్యక్తి ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

సమాచార కమిషన్‌లలో ఖాళీలు భర్తీచేయండి

న్యూఢిల్లీ: కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ), రాష్ట్ర సమాచార కమిషన్(ఎస్ఐసీ)లలో పోస్టులను భర్తీచేయకపోవడంపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తంచేసింది. తెలంగాణ, త్రిపుర, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో సేవలు అందించడానికి ఎలాంటి సమాచార కమిషనర్లు అందుబాటులో లేరంటూ సమాచారహక్కు(ఆర్టీఐ)చట్టం కార్యకర్త అంజలీ భరద్వాజ్ వేసిన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ' పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయండి. లేదంటే ఆర్టీఐ చట్టం నిర్వీర్యమైపోతుంది' అంటూ కేంద్రప్రభుత్వం, రాష్ట్రాలను ఆదేశించింది. ' రాష్ట్ర సమాచార కమిషన్‌లలో అనుమతించిన పోస్టులు ఎన్ని? ఖాళీలెన్ని? పెండింగ్‌లో ఉన్న కేసులెన్ని? అనే వివరాలను నివేదించండి' అని సిబ్బంది, శిక్షణ శాఖను ఆదేశించింది.

ఓటింగ్‌కు దూరం సరికాదు

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్–హమాస్ పోరుపై ఐక్యరాజ్యసమితి తీర్మానానికి భారత్ దూరంగా ఉండటాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని ఆ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ చెప్పారు. ''హమాస్ దాడులను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోంది. కానీ ప్రతీకారం పేరుతో నిస్సహాయులైన ప్రజలపై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులు వినాశనానికే దారి తీస్తున్నాయి. పాలస్తీనా ఒక స్వతంత్ర దేశంగా శాంతియుతంగా సహజీవనం చేసేలా నేరుగా ద్వైపాక్షిక చర్చలు జరగాలన్నదే ఈ సమస్యపై కాంగ్రెస్ వైఖరి అని సోనియా గుర్తు చేశారు. సోమవారం ఓ ఆంగ్ల పత్రికకు రాసిన వ్యాసంలో ఆమె ఈ మేరకు పేర్కొన్నారు. గాజాను అన్నివైపుల నుంచీ ఇజ్రాయెల్ చెరబట్టిన తీరు ఆ ప్రాంతాన్ని ఓపెన్ జైలుగా మార్చేసిందని ఆవేదన వెలిబుచ్చారు.

నేవీ మాజీ అధికారుల విడుదలకు కృషి: జైశంకర్

న్యూఢిల్లీ: ఖతార్ కోర్టు మరణ శిక్ష విధించిన భారత నేవీ మాజీ అధికారులను జైలు నుంచి విడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వెల్లడించారు. 'ఖతార్‌లో నిర్బంధంలో ఉన్న 8 మంది బాధితుల కుటుంబాలను ఉదయం కలుసుకున్నాను. ఈ కేసును భారత ప్రభుత్వం అత్యంత ముఖ్యమైందిగా భావిస్తోందని, ఆవేదన చెందుతోందని వారికి తెలిపాను'అని ఆయన పేర్కొన్నారు. వారికి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నాలను కొనసాగిస్తుందని చెప్పారు. ఈ విషయంలో పురోగతిని ఎప్పటికప్పుడు బాధిత కుటుంబాలతో చర్చిస్తామని వెల్లడించారు.

ఉగ్ర కాల్పుల్లో యూపీ వలస కార్మికుడు మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఆదివారం క్రికెట్ ఆడుతున్న పోలీసు అధికారిపై కాల్పులకు తెగబడిన ఉగ్రమూకలు సోమవారం మరోసారి రెచ్చిపోయారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముకేశ్ అనే నేత కార్మికుడిని కాల్చి చంపారు. పుల్వామాలోని తుమ్చి నౌపారలో ముకేశ్ కూరగాయల మార్కెట్‌కు రాగా ఈ ఘటన చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. ఆదివారం ముష్కరుల కాల్పుల్లో గాయపడిన ఇన్‌స్పెక్టర్ మస్రూర్ అహ్మద్ వనీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

'ఇండియా' కూటమిలో లుకలుకలు నిజమే: ఒమర్

శ్రీనగర్: ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలో పరిస్థితి ఏమీ బాగా లేదని, లుకలుకలు మొదలయ్యాయని జమ్మూకశ్మీర్ నేత, నేషనల్ కాన్ఫరెన్స్ సీనియర్ నాయకుడు ఒమర్ అబ్దుల్లా చెప్పారు. ఆయన సోమవారం కుప్వారాలో మాట్లాడారు. కూటమిలో కీలక కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ మధ్య కీచులాటలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న కొన్ని రాష్ట్రాల్లో ఆ రెండు పార్టీలు పరస్పర పోటీకి దిగుతున్నాయన్నారు.

కేజ్రీవాల్‌కు ఈడీ నోటీసులు

- నవంబర్ 2న విచారణకు పిలుపు
- ఢిల్లీ మద్యం విధానం కేసులో కీలక మలుపు
- మోదీ సర్కారు కక్షసాధింపు: ఆప్

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ (55)కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోమవారం నోటీసులిచ్చింది. నవంబర్ 2న ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఆయనకు నోటీసులు జారీ అయ్యాయి. ఇదే కేసులో అరెస్టై జైల్లో ఉన్న ఆప్ నేత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా బెయిల్ పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టేసిన కొద్ది గంటలకే ఈ పరిణామం చెటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి దాఖలు చేసిన చార్జిషీట్లలో కేజ్రీవాల్ పేరును ఈడీ ఇప్పటికే పలుసార్లు పేర్కొనడం తెలిసిందే. ఈ కేసు నిందితులంతా ఢిల్లీ మద్యం విధానం 2021–22 తయారీ, అమలుకు సంబంధించిన అన్ని అంశాల్లోనూ కేజ్రీవాల్‌తో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉన్నట్టు అందులో చెప్పుకొచ్చింది. నవంబర్ 2న కేజ్రీవాల్ స్టేట్‌మెంట్‌ను ఈడీ నమోదు చేయనుందని సమాచారం. మద్యం కుంభకోణానికి సంబంధించి అవినీతి, నేరపూరిత కుట్ర అభియోగాల్లో కేజ్రీవాల్‌ను సీబీఐ ఏప్రిల్ 16న కూడా 9 గంటలపాటు ప్రశ్నించింది.

మండిపడ్డ ఆప్

కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లపై ఆప్ మండిపడింది. తమ పార్టీని ఎలాగైనా అంతం చేయడమే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ సర్కారు కుట్రలు పన్నుతోందని ఆరోపించింది. అందులో భాగంగానే ఈ తప్పుడు కేసులో తమ అధినేతను ఎలాగైనా ఇరికించేందుకు నరేంద్ర మోదీ సర్కారు ఎప్పట్నుంచో ప్రయత్నిస్తోందని ఆప్ నేత, మంత్రి సౌరభ్ భరద్వాజ్ ఆరోపించారు. మరోవైపు, ఈ కేసులో సిసోడియా అవినీతికి సంబంధించి చాలినన్ని రుజువులున్నాయని సుప్రీం బెయిల్ నిరాకరణతో తేలిపోయిందని బీజేపీ పేర్కొంది. కనుక నైతిక బాధ్యత వహిస్తూ కేజ్రీవాల్ తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ఈ కేసులో అవినీతి జరిగినట్టు ఎలాంటి రుజువులూ లేవని కేజ్రీవాల్‌తో పాటు ఆప్ నేతలంతా ఇప్పటిదాకా చెప్తూ వచ్చిందంతా పచ్చి అబద్ధమని రుజువైందని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ అన్నారు.



ఆది నుంచీ వివాదాలే

ఢిల్లీ మద్యం విధానాన్ని 2021లో కేజ్రీవాల్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. మద్యం లైసెన్సుదారులకు నిబంధనలకు విరుద్ధంగా అనేక విధాలుగా కేజ్రీవాల్ సర్కారు లబ్ధి చేకూర్చిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. దాంతో దీనిపై విచారణ జరపాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని నాటి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశించారు. మద్యం విధానం తప్పుల తడక అని, ఎక్సైజ్ మంత్రిగా సిసోడియా తీసుకున్న నిర్ణయాల వల్ల ఖజానాకు కనీసం భారీ నష్టం జరిగిందని, ఆప్ నేతలు తదితరులు లైసెన్సుదారుల నుంచి పలు మార్గాల్లో లబ్ధి పొందారని సీఎస్ నివేదించారు. ఈ వివాదాలు, ఆరోపణల నేపథ్యంలో చివరికి 2022 జూలై 31న నూతన మద్యం విధానాన్ని కేజ్రీవాల్ సర్కారు రద్దు చేసింది. ఇందులో తీవ్ర అవకతవకలు జరిగాయంటూ 2022 ఆగస్టు 17న సీబీఐ కేసు నమోదు చేసింది. సిసోడియాతో పాటు 15 మందిని నిందితులుగా చేర్చింది.

సిసోడియాకు సుప్రీంకోర్టు బెయిల్ నిరాకరణ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో అవినీతి, మనీ ల్యాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆప్ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు సుప్రీంకోర్టు బెయిల్ నిరాకరించింది. రూ.338 కోట్ల బదిలీకి సంబంధించి సందేహాలున్నందునే బెయిల్ నిరాకరిస్తున్నామని స్పష్టం చేసింది. ఈ లావాదేవీలపై ఈడీ కొన్ని ఆధారాలు సమర్పించిందని, ఇప్పటికే విచారణ మొదలైనందున బెయిలివ్వడం సాధ్యం కాదని పేర్కొంది. మనీశ్ సిసోడియా బెయిల్ దరఖాస్తును విచారించి జూలైలో రిజర్వు చేసిన తీర్పును జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిల ధర్మాసనం సోమవారం వెలువరించింది. విచారణలో భాగంగా ట్రయల్ ఆలస్యం అవుతున్న విషయాన్ని గుర్తించామని వేగవంతం చేయాలని దర్యాప్తు సంస్థ ఈడీని ఆదేశించింది. ఆరు నుంచి ఎనిమిది నెలల్లో దర్యాప్తు పూర్తి చేయాలని నిర్దేశించింది. దర్యాప్తు మందకొడిగా సాగితే మూడు నెలల్లో బెయిల్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని ధర్మాసనం సిసోడియాకు సూచించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులపై రివ్యూ పిటిషన్ వేస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలిపింది.



ఇజ్రాయెల్ దాడులతో భీతిల్లి సోమవారం గాజా నగరం వదిలి వలస వెళ్లిపోతున్న పాలస్తీనియన్లు

గాజాలో మరణ మృదంగం

దాడులు మరింత ఉధృతం చేసిన ఇజ్రాయెల్ సైన్యం

- గత 24 గంటల్లో 304 మంది మృత్యువాత
- గాజాలో 8,306కి చేరిన మృతుల సంఖ్య

ఖాన్ యూనిస్/జెరూసలేం: హమాస్ మిలిటెంట్ల సొరంగాలు, రహస్య స్థావరాలను నేలమట్టం చేయడమే ధ్యేయంగా ఇజ్రాయెల్ సైన్యం భూతల, వైమానిక దాడులు ఉధృతం చేస్తుండడం గాజాలో సాధారణ పాలస్తీనియన్లకు ప్రాణసంకటంగా మారింది. సోమవారం మరిన్ని దళాలు ఇజ్రాయెల్ భూభాగం నుంచి గాజాలోకి అడుగుపెట్టాయి. ఇజ్రాయెల్ సేనలు గాజాలోకి మరింత ముందుకు చొచ్చుకొస్తున్నాయి. గాజాలో 24 గంటల్లో 600 హమాస్ స్థావరాలపై దాడులు చేశామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. మిలిటెంట్ల ఆచూకీ కోసం అణువణువూ గాలిస్తున్నాయి. గాజాలో క్యాన్సర్ బాధితులకు చికిత్స అందిస్తున్న ఏకైక ఆసుపత్రి అయిన 'టర్కిష్ ఫ్రెండ్‌షిప్ హాస్పిటల్' సమీపంలోనే ఇజ్రాయెల్ సైన్యం ఆదివారం రాత్రి వైమానిక దాడులు చేసింది. ఈ ఘటనలో ఆసుపత్రి స్వల్పంగా ధ్వంసమయ్యింది. ఉత్తర, దక్షిణ గాజాను అనుసంధానించే ప్రధాన జాతీయ రహదారిని ఇజ్రాయెల్ యుద్ధట్యాంకులు, బుల్డోజర్లు దిగ్బంధించాయి. ఈ రహదారిపై వాహనాల రాకపోకలను ఇజ్రాయెల్ సైన్యం అడ్డుకుంటోంది. ఇందుకు కారణం ఏమిటన్నది బయటపెట్టడం లేదు. ఉత్తర గాజా నుంచి జనం దక్షిణ గాజాకు వెళ్లలేకపోతున్నారు. ఉత్తర గాజాలకు భూతల దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ సైన్యాన్ని గట్టిగా ప్రతిఘటిస్తున్నామని హమాస్ వెల్లడించింది. గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో గత 24 గంటల్లో 304 మంది మృతిచెందారని గాజా ఆరోగ్య శాఖ సోమవారం ప్రకటించింది. ఇప్పటిదాకా 8,306 మంది పాలస్తీనియన్లు మరణించారని, 21,048 మంది గాయపడ్డారు. ఇంకా 1,950 మంది శిథిలాల కింద చిక్కుకుపోయారని వివరించింది. ఇజ్రాయెల్‌లో 1,400మందికిపైగా మృత్యువాత పడ్డారు.

అరకొర సాయమే

ప్రపంచ దేశాలు, స్వచ్ఛంద సంస్థలు అందజేస్తున్న మానవతా సాయం ఇప్పుడిప్పుడే గాజాకు చేరుకుంటోంది. ఆహారం, నిత్యావసరాలు, ఔషధాలు, దుస్తులు, నీటి శుద్ధి యంత్రాలు వంటివి అందుతున్నాయి. 75 వాహనాలతో కూడిన భారీ కాన్వాయ్ తాజాగా ఈజిప్టు నుంచి దక్షిణ గాజాలోకి అడుగు పెట్టింది. ఈ వాహనాలు టన్నుల కొద్దీ ఆహారం, తాగు నీరు, పలు రకాల కీలక ఔషధాలను చేరవేశాయి. గాజాలోని 23 లక్షల జనాభాకు ఈ సాయం ఏమాత్రం చాలదని అక్కడి స్వచ్ఛంద సంస్థలు చెబుతున్నాయి. దక్షిణ గాజాలో రెండు నీటి సరఫరా పైపులైన్లను పునరుద్ధరించామని ఇజ్రాయెల్ ప్రకటించింది.

యూదుల కోసం విమానంలో గాలింపు

ఇజ్రాయెల్ నుంచి వచ్చిన విమానంలో యూదుల కోసం రష్యాలోని ముస్లింలు గాలించడం సంచలనాత్మకంగా మారింది. ఆదివారం టెల్ అవీవ్ నుంచి విమానం రష్యాలో ముస్లిం ప్రాబల్య ప్రాంతమైన మాఖాచ్‌కలాలోని దగెస్తాన్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. ఈ విమానంలో యూదులు ఉన్నారన్న అనుమానంతో వందలాది మంది ముస్లింలు ఎయిర్‌పోర్టును దిగ్బంధించారు. పాలస్తీనా జెండాలను చేబూని, ఎయిర్‌పోర్టులోకి లోపలికి ప్రవేశించి అలజడి సృష్టించారు. యూదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారిని చంపేయాలంటూ నినదించారు. కొందరు రన్‌వే పైకి దూసుకెళ్లారు. ఇజ్రాయెల్ విమానాన్ని చుట్టుముట్టారు. గాజాపై ఇజ్రాయెల్ దాడుల పట్ల వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యూదులపై దాడి చేయడానికే ఎయిర్‌పోర్టుకు వచ్చినట్లు తెలుస్తోంది. అడ్డుకొనేందుకు ప్రయత్నించిన భద్రతా సిబ్బందిపైనా తిరగబడ్డారు. ఇరు వర్గాల మధ్య ఘర్షణలో పలువురు పోలీసులు సహా 20 మంది గాయపడ్డారు. పోలీసులు ఎట్టకేలకు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. దాదాపు 60 మందిని అరెస్టు చేశారు. ఎయిర్‌పోర్టును తాత్కాలికంగా మూసివేశారు.

అపహరించిన షానీ లౌక్‌ను హత్య చేశారు



23 ఏళ్ల యువతి షానీ లౌక్ ఈ నెల 7న ఇజ్రాయెల్‌లోని కిబుట్జ్‌లో ఓ సంగీత వేడుకలో ఉండగా హమాస్ మిలిటెంట్లు హఠాత్తుగా దాడి చేశారు. కొందరిని కాల్చిచంపారు. షానీ లౌక్‌తో పాటు మరికొందరిని అపహరించారు. బందీలుగా బలవంతంగా గాజాకు లాక్కెళ్లారు. అయితే, మిలిటెంట్ల చెరలో షానీ లౌక్ క్షేమంగా ఉండొచ్చని ఆమె తల్లి, సోదరి భావించారు. త్వరలోనే ప్రాణాలతో తిరిగివస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇంతలోనే దుర్వార్త తెలిసింది. గాజాలో మిలిటెంట్లు ఓ యువతి మృతదేహాన్ని వాహనంలో ఉంచి, 'అల్లాహో అక్బర్' అని అరుస్తూ గాజా వీధుల్లో ఊరేగిస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. శవంగా మారిన ఆ యువతి షానీ లౌక్ అని తల్లి రికార్డా లౌక్, సోదరి అడీ లౌక్ గుర్తించారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఇజ్రాయెలీ–జర్మన్ జాతీయురాలైన షానీ లౌక్‌ను మిలిటెంట్లు హత్య చేయడం దారుణమని, ఈ ఘటన తమను కలచివేసిందని ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ పేర్కొంది.

పార్టీల విరాళాల వివరాలు.. తెల్సుకునే హక్కు పౌరులకు లేదు

సుప్రీంకోర్టులో వాదించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలు పొందిన విరాళాలు ఎక్కడి నుంచి వచ్చాయి అనే వివరాలను తెల్సుకునే హక్కు దేశ పౌరులకు లేదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదించింది. ఈ మేరకు అఫిడవిట్ సమర్పించింది. 'సహేతుకమైన కారణాలు లేకుండా ఏదంటే అది, ప్రతీదీ తెల్సుకునే హక్కు సాధారణ ప్రజానీకానికి లేదు' అని కేంద్రం తరఫున లిఖితపూర్వక అఫిడవిట్ సమర్పించిన సందర్భంగా అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి వాదించారు. రాజకీయ పార్టీలకు విరాళాలు అందించేందుకు ఉద్దేశించిన ఎలక్టోరల్ బాండ్ల పథకం చట్టబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను నేటి నుంచి ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం వాదనలు ఆలకించనున్న నేపథ్యంలో కేంద్రం అఫిడవిట్ సమర్పించింది. ఈ సందర్భంగా ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని అటార్నీ సమర్థించారు. ' పార్టీలు స్వచ్ఛమైన నగదును విరాళంగా పొందేందుకు మోదీ సర్కార్ ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని తెచ్చింది. దాత సంబంధిత వివరాల గోప్యత కీలకం. ఎలక్టోరల్ బాండ్ల పథకం..పన్ను చెల్లింపులకు లోబడే ఉంది. రాజకీయ పార్టీలకు విరాళం అనేది ప్రజాస్వామ్యయుతమే. దీనిపై రాజకీయ చర్చ అభిలషణీయమూ. ఎలాంటి ప్రభావాలకు లోనుకాని ప్రభుత్వ జవాబుదారీతనాన్ని కోరుకోవడం మంచిదే. అంతమాత్రాన ఇలాంటి అంశాల్లో రాజ్యాంగాన్ని అతిక్రమిస్తూ న్యాయసమీక్షకు కోర్టులు ప్రయత్నించకూడదు. పౌరుల హక్కుల ఉల్లంఘన జరిగినపుడే న్యాయసమీక్ష జరగాలి. ప్రభుత్వ నిర్ణయాలను స్కాన్ చేసేందుకు కోర్టులు తమ న్యాయసమీక్ష అధికారాన్ని వినియోగించకూడదు. వివరాలు అడిగే హక్కు పౌరులకు లేదు' అని అటార్నీ అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో ని ఈ బెంచ్‌లో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ గవాయ్, జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా సభ్యులుగా ఉన్నారు.

డిసెంబర్ 31కల్లా నిర్ణయం చెప్పండి

షిండే, శివసేన ఉద్ధవ్ వర్గ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: శివసేనలో చీలిక వర్గం ఏక్‌నాథ్ షిండే, ఉద్ధవ్ ఠాక్రే వర్గాలు స్పీకర్‌కు సమర్పించిన అనర్హత పిటిషన్ల అంశం మరోసారి సర్వోన్నత న్యాయస్థానం ముందుకొచ్చింది. ఈ అనర్హత పిటిషన్ల అంశంలో డిసెంబర్ 31వ తేదీలోగా మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్ తుది నిర్ణయం తీసుకోవాలని సోమవారం సర్వోన్నత న్యాయస్థానం ఆయనను ఆదేశించింది. తుది నిర్ణయాన్ని మరింత ఆలస్యం చేసే వైఖరిని అనుమతించేది లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోవైపు పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా మహారాష్ట్ర ప్రభుత్వంలో చేరిన అజిత్‌పవార్ వర్గ తొమ్మిది మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ ఎన్సీపీ దాఖలుచేసిన అనర్హత పిటిషన్‌పై వచ్చే ఏడాది జనవరి 31కల్లా తుది నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సూచించింది. ' రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ గౌరవాన్ని మనందరం కాపాడాల్సిందే. లేదంటే ఆ షెడ్యూల్‌లోని నిబంధనలను గాలికొదిలేసినట్లే అవుతుంది' అని కోర్టు ఆందోళన వెలిబుచ్చింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా సభ్యులుగా ఉన్నారు.

బెంగళూరు బస్ గ్యారేజ్‌లో మంటలు

బనశంకరి: బెంగళూరులోని వీరభద్రనగరలో ఓ బస్ బాడీ బిల్డింగ్ గ్యారేజ్‌లో సోమవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. మరమ్మతుల కోసం నిలిపి ఉంచిన 18 ప్రైవేట్ బస్సులు పూర్తిగాను, మరో 10 బస్సులు పాక్షికంగా దహనమయ్యాయి. పెద్ద సంఖ్యలో ఫైరింజన్లు చేరుకుని మంటలను ఆర్పివేశాయి. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఘటనతో దాదాపు రూ.20 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు గ్యారేజ్ యజమాని తెలిపారు.

పంజాబ్‌లో ట్రాక్టర్లతో విన్యాసాలపై నిషేధం

చండీగఢ్: ట్రాక్టర్‌తో విన్యాసాలు చేయిస్తూ 29 ఏళ్ల వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించిన ఘటనను పంజాబ్ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఇకపై ఇలాంటి ట్రాక్టర్లతో చేసే విన్యాసాలను నిషేధిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సోమవారం ప్రకటించారు. రాష్ట్రంలోని గుర్‌దాస్‌పూర్ జిల్లాలో గ్రామీణ క్రీడా కార్యక్రమాల్లో 29 ఏళ్ల స్టంట్‌మ్యాన్ సుఖ్‌మన్‌దీప్ సింగ్ మరణించిన విషయం తెల్సిందే. శనివారం సర్చూర్ గ్రామంలో జరిగిన క్రీడల్లో ట్రాక్టర్ ముందు చక్రాలు గాల్లోకి లేచేలా చేసి వెనక చక్రాల మీదుగా ట్రాక్టర్ సీటుపై కూర్చునేందుకు సుఖ్‌మన్‌దీప్ ప్రయత్నించాడు. అనుకోకుండా కాలు బురదలో ఇరుక్కుని ట్రాక్టర్ వెనక చక్రాల కింద సుఖ్‌మన్‌దీప్ నలిగిపోయిన ఉదంతం చర్చనీయాంశమవడంతో ఆప్ సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది.

లోక్‌సభ ఎన్నికల కోసమే 'ఇండియా' కూటమి

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

న్యూఢిల్లీ: 2024లో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా, కలిసికట్టుగా పోటీ చేయడానికి విపక్షాలతో 'ఇండియా' కూటమి ఏర్పాటైందని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సోమవారం చెప్పారు. ప్రస్తుత ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో కూటమి పక్షాలు పరస్పరం అవగాహనతో పని చేయాలని సూచించారు. రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో తమ పార్టీ అభ్యర్థుల జాబితాకు కేంద్ర కమిటీ సమావేశంలో ఆమోదం తెలిపామని, తెలంగాణ విషయంలో చర్చలు కొనసాగుతున్నాయన్నారు. జాతీయ స్థాయిలోనే కాదు, రాష్ట్రాల స్థాయిలోనూ ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు కలిసి పనిచేయాలని అభిప్రాయపడ్డారు.

మరాఠాల ఆందోళన హింసాత్మకం

- ఎన్సీపీ ఎమ్మెల్యేల ఇళ్లపై నిరసనకారుల దాడి
- బీజేపీ ఎమ్మెల్యే ఆఫీస్‌లో విధ్వంసం

ముంబై: మహారాష్ట్రలో ప్రత్యేక కోటా డిమాండ్‌తో మరాఠాలు చేపట్టిన ఆందోళన మళ్లీ హింసాత్మక రూపం దాల్చింది. ఆందోళనకారులు సోమవారం బీడ్ జిల్లా మజల్‌గావ్‌లోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) ఎమ్మెల్యేలు ప్రకాశ్ సోలంకె, సందీప్ క్షీరసాగర్ ఇళ్లకు నిప్పు పెట్టారు. మజల్‌గావ్ మున్సిపల్ కౌన్సిల్ భవనంలోని మొదటి అంతస్తులో ఫర్నిచర్‌కు నిప్పుపెట్టి, విధ్వంసం సృష్టించారు. ఛత్రపతి శంభాజీ జిల్లా గంగాపూర్‌లో నిరసనకారులు బీజేపీ ఎమ్మెల్యే ప్రశాంత్ బంబ్ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. కిటికీలు, ఫర్నిచర్ పగులగొట్టారు. పలు చోట్ల రహదారులపై బైటాయించారు. మరాఠాలకు ప్రత్యేక కోటా డిమాండ్‌కు మద్దతుగా సీఎం ఏక్‌నాథ్ షిండే వర్గానికి చెందిన నాశిక్, హింగోలి ఎంపీలు హేమంత్ గాడ్సే, హేమంత్ పాటిల్‌లు తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 'మరాఠాలకు రిజర్వేషన్లు అక్టోబర్ 24 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి 40 రోజుల డెడ్‌లైన్ పెట్టిన వారు ఈ వ్యవహారం చిన్న పిల్లల ఆట అనుకుంటున్నారు'అంటూ ఎమ్మెల్యే సోలంకె చేసిన వ్యాఖ్యల ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. మరాఠాలకు రిజర్వేషన్ల డిమాండ్‌తో మనోజ్ జరంగె అనే వ్యక్తి అక్టోబర్ 25 నుంచి జల్నా జిల్లాలోని అంతర్వలి సరటి గ్రామంలో నిరశన దీక్షకు సాగిస్తున్నారు. దీనిపై ఎమ్మెల్యే సోలంకె..కనీసం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూడా పోటీ చేయని వ్యక్తి, ఇప్పుడు నాయకుడా..అంటూ వ్యాఖ్యానిస్తున్నట్లుగా ఆ ఆడియోలో ఉంది. దీంతో మరాఠా సంఘాలు భగ్గుమన్నాయి. సోమవారం స్థానికంగా బంద్‌కు పిలుపునిచ్చాయి. కొందరు ఆందోళనకారులు సోమవారం మధ్యాహ్నం మజల్‌గావ్‌లోని ఎమ్మెల్యే ఇంటిని చుట్టుముట్టారు. ఆయన నివాసానికి, కారుకు నిప్పుపెట్టారు, రాళ్లు రువ్వారు. ఘటన సమయంలో ఆ ఇంట్లోనే ఉన్నట్లు ఎమ్మెల్యే సోలంకె ఆ తర్వాత తెలిపారు. బీడ్ నగరంలో మరో ఎన్సీపీ ఎమ్మెల్యే సందీప్ క్షీరసాగర్ నివాసం, ఆఫీసుకు కూడా నిప్పు పెట్టారు. పోలీసులు అక్కడికి చేరుకున్న గుంపును చెదరగొట్టారు. బీడ్‌లోని ఒక హోటల్‌కు మరాఠా నిరసనకారులు అగ్నికి ఆహుతి చేశారు. జల్నా వద్ద ముంబైకి వెళ్లే సమృద్ధి ఎక్స్‌ప్రెస్ వేపై బైటాయించారు. షోలాపూర్–అక్కల్‌కోట్ హైవేపై మండుతున్న టైర్లను వేసి వాహనాలను అడ్డుకున్నారు. కొందరు నిరసనకారులు కర్రలు పట్టుకుని గంగాపూర్‌లోని ఎమ్మెల్యే ప్రశాంత్ కార్యాలయంపై దాడి చేశారు. యావత్మాల్‌లో తనను ఆందోళనకారులు అడ్డగించి, రిజర్వేషన్ అంశంపై నిలదీశారని హింగోలి ఎంపీ హేమంత్ పాటిల్ తెలిపారు. దీంతో, రాజీనామా పత్రం రాశానన్నారు. తన రాజీనామా లేఖ అందినట్లు లోక్‌సభ సెక్రటేరియట్ నుంచి రసీదు వచ్చిందని చెప్పారు. రిజర్వేషన్లపై వైఖరి తెలపాలంటూ నాశిక్ ఎంపీ గాడ్సేను కొందరు నిలదీయడంతో ఆయన రాజీనామా చేసి లేఖను సీఎంకు పంపించారు.




ఎమ్మెల్యే సోలంకె ఇంటికి నిప్పుపెట్టిన దృశ్యం

సుస్థిర ప్రభుత్వం వల్లే

దేశ ప్రగతి, ప్రపంచ కితాబు: మోదీ

మెహసానా: దేశమంతటా ప్రస్తుతం కనిపిస్తున్న శరవేగమైన ప్రగతి, ప్రపంచవ్యాప్తంగా కురుస్తున్న ప్రశంసలకు కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం ఉండటమే కారణమని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. సోమవారం గుజరాత్‌లోని మెహసానా జిల్లా ఖేరాలు వద్ద రూ.5,950 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం భారీ జన సమూహాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. అంతకుముందు ఓపెన్ టాప్‌కార్‌లో రోడ్ షో చేశారు. తర్వాత మాట్లాడారు. సుదీర్ఘ కాలం పాటు ఒకే పార్టీ అధికారంలో ఉంటే ఎన్నెన్ని అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టవచ్చో, ఎంతటి ప్రగతి సాధించవచ్చో చెప్పేందుకు గుజరాతే ఉదాహరణ అన్నారు. ''మీ నరేంద్ర బాయ్ ఎలాంటివారో మీకు బాగా తెలుసు. మీరు నన్ను ప్రధానిగా కాకుండా మీ సొంత నరేంద్ర బాయ్‌గా చూస్తారు. నేనేదైనా వాగ్దానం చేస్తే దాన్ని నెరవేర్చి తీరతానని కూడా మీకు తెలుసు'' అన్నారు.

నిత్యాన్నదానానికి రూ. 2 లక్షల విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు సోమవారం రూ. 2 లక్షల విరాళాన్ని అందచేశారు. హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన నందిగం రాజా శ్రీనివాస్, నందిగం ప్రణవ్ పేరిట కుటుంబ సభ్యులు ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.2 లక్ష విరాళాన్ని ఇచ్చారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారి ప్రతాప్ దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు,శేషవస్త్రాలను అందచేశారు.

అధికారంపై కేటీఆర్ పగటి కలలు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఎద్దేవా

- గిన్నిస్ రికార్డును తలదన్నేలా బీఆర్‌ఎస్ పాలనలో ప్రశ్న పత్రాల లీకేజీలు
- ఓటమి భయంతోనే టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన అంటూ కొత్త నాటకం
- అన్ని వర్గాల ప్రజలను సీఎం కేసీఆర్ మోసం చేశారు
- బీఆర్‌ఎస్ సర్కారుపై యువతలో తీవ్ర వ్యతిరేకత
- మీ ఎత్తులు, జిత్తులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు
- అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదు



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కుంభకోణంపై మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు దొంగలు పడిన ఆరునెలలకు ఎఫ్‌ఐఆర్ వేసిన చందంగా ఉన్నాయని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గిన్నిస్ రికార్డును తలదన్నేలా.. బీఆర్‌ఎస్ పాలనలో ప్రశ్నపత్రాల లీకేజీ వల్ల 17 సార్లు పరీక్షల్ని వాయిదా వేసి కొత్త చరిత్రను సృష్టించారన్నారు. 'టీఎస్‌పీఎస్సీ స్కామ్ బయటపడిన తర్వాత నిర్వహించిన గ్రూప్‌–1 పరీక్షకు కూడా బయోమెట్రిక్ అటెండెన్స్ సక్రమంగా లేదు. ఇందులోనూ నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ చివరికి న్యాయస్థానం ఆ పరీక్షను కూడా రద్దు చేసేంత స్థాయిలో ఘనమైన చరిత్ర మీది' అని విమర్శించారు. గత మార్చి 12న ఈ స్కామ్ వెలుగు చూస్తే.. ఎన్నికల సందర్భంగా ప్రజల్లో మరీ ముఖ్యంగా యువతలో ప్రభుత్వంపై వ్యక్తమవుతున్న వ్యతిరేకతకు భయపడి డిసెంబర్ 3 తర్వాత టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన అంటూ కేటీఆర్ పేర్కొనడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ ప్రకటనతో కేటీఆర్ యువతను, నిరుద్యోగులను మళ్లీ మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సోమవారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, హాస్టళ్లలోని వాస్తవ పరిస్థితులపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, యువత, నిరుద్యోగులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలను సీఎం కేసీఆర్ మోసం చేశారని ఆరోపించారు. యూనివర్సిటీల పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైందన్నారు. యూపీఎస్సీ తరహాలో ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం, ఇంటికొక ఉద్యోగమిస్తాం.. అని హామీలు గుప్పించిన కేసీఆర్ సర్కార్ గత పదేళ్లలో ఒక గ్రూప్‌–1 పోస్టును కూడా భర్తీ చేయలేదని, ఒక్క డీఎస్సీని నిర్వహించలేదని ధ్వజమెత్తారు. తెలంగాణలో ఉద్యోగ నియామకాలు ఎంత నిర్లక్ష్యానికి గురయ్యాయో ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు.

కేటీఆర్‌వి పగటి కలలు..

రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్న కేటీఆర్‌ను, ఆయన కుటుంబాన్ని ప్రజలు ఫామ్ హౌస్‌కి పరిమితం చేయబోతున్నారన్నారని కిషన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ సర్కార్‌పై, బీఆర్‌ఎస్‌పై యువత, విద్యార్థుల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో వారు తమ సత్తా చాటి బీజేపీని గెలిపించబోతున్నారని చెప్పారు. డిసెంబర్ 3న వెలువడే ఫలితాల్లో బీఆర్‌ఎస్ ఘోరంగా ఓటమి చవిచూడబోతోందన్నారు. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన మంత్రి కేటీఆర్.. నష్ట నివారణలో భాగంగానే టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన అంటూ కొత్త నాటకం మొదలు పెట్టారని విమర్శించారు. 'కేటీఆర్.. మీ ఎత్తులు, జిత్తులను నిరుద్యోగులు నమ్మే పరిస్థితుల్లో లేరు. ఏరు దాటాక తెప్ప తగలేసే మీ వైఖరి గురించి తెలంగాణలో ఎవరిని అడిగినా చెప్తారు. ఇంకా మీకు ఓట్లు వేసి గెలిపిస్తారనుకుంటే, అది మీ మూర్ఖత్వమే అవుతుంది' అని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'మీ వైఫల్యం వల్లే 30 లక్షల మంది యువత కుటుంబాలు నిరాశలో కూరుకుపోయాయి. గ్రూప్స్ అభ్యర్థుల ఆత్మహత్యలకు ముమ్మాటికీ మీరే కారణం. రాజధాని నగరం నడిబొడ్డున గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్న అమ్మాయి ప్రవల్లిక ఆత్మహత్య చేసుకోవడం మీ పాపం కాదా? ఈ మధ్య మెట్‌పల్లికి చెందిన మరో యువకుడు రెహమత్ కూడా గ్రూప్ 1, 2 పరీక్షలు వాయిదా పడ్డాయని ఆత్మహత్య చేసుకుంటే, మీ అధికారాన్ని ఉపయోగించి దానిని తొక్కిపెట్టడం వాస్తవం కాదా?' అని ప్రశ్నించారు. 'తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి ప్రభుత్వ ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేస్తాం' అని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

1న మూడో జాబితాపై కసరత్తు

నవంబర్ 1వ తేదీన బీజేపీ అసెంబ్లీ అభ్యర్థుల మూడో జాబితాపై కసరత్తు ఉంటుందని కిషన్‌రెడ్డి చెప్పారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డా ఆధ్వర్యంలో జరిగే కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశంలో ఈ జాబితాపై చర్చించాక అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నాయని ఆయన ఒక ప్రశ్నకు బదులిచ్చారు. అందరి అభిప్రాయాలను స్వీకరించాకే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ సాగుతోందన్నారు. ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న జనసేనతో పొత్తుపై చర్చ జరుగుతోందని, దానిపై అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. అభ్యర్థుల మూడో జాబితాతో పాటు ఎన్నికల మేనిఫెస్టోను కూడా విడుదల చేస్తామని, ప్రస్తుతం ఎన్నికల ప్రణాళికపై కసరత్తు సాగుతోందని వెల్లడించారు. మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని కిషన్‌రెడ్డి ఖండించారు. ప్రజాస్వామ్యంలో దాడులకు చోటు లేదని స్పష్టం చేశారు.

ఉద్యమ బిడ్డ గొంతునొక్కాలని చూశారు..

చాలెంజ్‌ను అమలు చేయడంలో భాగంగానే గజ్వేల్‌లో పోటీ: ఈటల

హుజూరాబాద్: 'ఉప ఎన్నిక సమయంలో కేసీఆర్, ఆయన మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజాస్వామ్యాన్ని నలిపివేయాలని, ఉద్యమ బిడ్డ అయిన ఈటల గొంతు నొక్కివేయాలని రూ.వందల కోట్లు ఖర్చు పెట్టిండ్రు. అప్పుడు 'శిఖండి మీద పోట్లాడను.. మీ నియోజకవర్గంలో నిలబడి కొట్లాడతాను' అని చాలెంజ్ చేసిన. ఆ చాలెంజ్‌ను అమలు చేయడంలో భాగంగానే హుజూరాబాద్‌లో పోటీ చేస్తూనే గజ్వేల్‌లో కూడా పోటీ చేస్తున్నా' అని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు.



సోమవారం హుజూరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తన రాకను గజ్వేల్ ప్రజలు కూడా స్వాగతిస్తున్నారని, గెలిపించే బాధ్యత తమదని అంటున్నారని తెలిపారు. తాను కొద్దికాలంగా హుజూరాబాద్‌కు వస్తలేనని ప్రజలు అనుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడగొట్టి బీజేపీని గెలిపించే సంకల్పం తనపై ఉంది కాబట్టే ముందులా ఇక్కడకు రాలేకపోతున్నానని చెప్పారు. ఏనాడూ లిక్కర్ బాటిల్ పంచకుండా.. పైసా ఇవ్వకుండా గెలిచిన బిడ్డనని, ఈసారి కూడా ప్రజలు తనను ఆశీర్వదిస్తారన్న విశ్వాసం ఉందన్నారు. తన సతీమణి జమున ఇక్కడే ఉండి ఊరూరా తిరిగి ప్రచారం చేస్తారని వెల్లడించారు.

హుజూరాబాద్, గజ్వేల్‌లో గెలిస్తే సీఎంను కాను


కమలాపూర్: హుజూరాబాద్, గజ్వేల్‌లో గెలిస్తే నేను ముఖ్యమంత్రిని కాను.. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలంటే 119 నియోజకవర్గాల్లో కనీసం 65 నుంచి 70 సీట్లు గెలవాలని ఈటల అన్నారు. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచార రోడ్ షోలో ఆయన మాట్లాడారు. అభిమానులు, కార్యకర్తలు పదేపదే 'సీఎం ఈటల, సీఎం ఈటల' అంటూ నినాదాలు చేయడంతో ఆయన ఇలా స్పందించారు.

బీజేపీ అధికార ప్రతినిధిగా మాజీ ఐపీఎస్ టి.కృష్ణప్రసాద్

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులుగా మాజీ డీజీపీ టి.కృష్ణప్రసాద్, అమర్‌నాథ్ సారంగుల, కల్యాణ్‌నాయక్, సోలంకి శ్రీనివాస్‌నాయక్, గడ్డం విజయ సునీత, జి.వెంకటరెడ్డి నియమితులయ్యారు. మీడియా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు సినీనటి కస్తూరి, విజిత్‌కుమార్, సుంకర మౌనిక, రాణాప్రతాప్‌లను నియమించారు. సోమవారం ఈమేరకు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి వారిని నియమించారు.

ఘోర వైఫల్యాలను తెలంగాణ మోడల్ అని చెబుతారా?

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌ఛుగ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్థాయిలోనే కేసీఆర్ సర్కార్ అన్నిరంగాల్లో ఘోరాతి ఘోరంగా వైఫల్యం చెందితే.. అభివృద్ధికి తెలంగాణ మోడల్ అంటూ అంతర్జాతీయ వేదికపై ప్రచారం చేస్తారా? అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌ఛుగ్ ఎద్దేవా చేశారు. లండన్‌లో తెలంగాణ అభివృద్ధి మోడల్‌పై ప్రసంగించేందుకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత వెళ్లడం పట్ల ఆయన ఒక ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణకు సంబంధించిన విషయాలపై మాట్లాడేందుకు ప్రతిపక్ష నేతలను ఆహ్వానించి ఉంటే బావుండేదన్నారు. తెలంగాణ మోడల్ పరిపాలనతో రాష్ట్రం ఆర్థికంగా, ఇతరత్రా రూపాల్లో పతనం అంచుకు చేరుకుందని తరుణ్‌ఛుగ్ విమర్శించారు. ఇది ఏ రూపంలోనూ ఒక నమూనాగా లేదా ఓ కేస్‌స్టడీ కాబోదన్నారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై, తప్పుడు పద్ధతుల్లో లిక్కర్ పాలసీని రూపొందించాయని, టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీల ద్వారా నిరుద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు. టీచర్లు లేకుండానే స్కూళ్లు నిర్వహిస్తున్న తీరును, ఒకనాడు అత్యుత్తమ విశ్వవిద్యాలయం కాస్తా కేసీఆర్ పాలనలో పూర్తిగా దిగజారిపోయిన తీరును కవిత వివరిస్తారా? అని నిలదీశారు.



జస్టిస్ గుహనాథన్ నరేందర్‌తో ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ నరేందర్ ప్రమాణం

- నరేందర్ నియామకంతో 30కి చేరిన హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య
- నాలుగో స్థానంలో కొనసాగనున్న జస్టిస్ నరేందర్

సాక్షి, అమరావతి: ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా గుహనాథన్ నరేందర్ సోమవారం ప్రమాణం చేశారు. ఆయన చేత రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు. ప్రమాణం అనంతరం జస్టిస్ నరేందర్‌ను గవర్నర్ అభినందించారు. అంతకు ముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఈ కార్యక్రమ ప్రొసీడింగ్స్‌ను నిర్వహించారు. అనంతరం జస్టిస్ నరేందర్ నియామకానికి సంబంధించి రాష్ట్రపతి జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు చదివి వినిపించారు. కాగా.. రాజ్‌భవన్‌లో జస్టిస్ నరేందర్‌ను అటు గవర్నర్, ఇటు ముఖ్యమంత్రికి జస్టిస్ ధీరజ్ సింగ్ పరిచయం చేశారు. కార్యక్రమ అనంతరం రాజ్‌భవన్ ఏర్పాటు చేసిన తేనీటి విందులో అందరూ పాల్గొన్నారు.

30కి చేరిన న్యాయమూర్తుల సంఖ్య

జస్టిస్ నరేందర్ నియామకంతో హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది. జస్టిస్ నరేందర్ హైకోర్టులో నాలుగో స్థానంలో కొనసాగుతారు. మంగళవారం ఆయన జస్టిస్ దుర్గాప్రసాదరావుతో కలిసి కేసులను విచారిస్తారు. వాస్తవానికి ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనాల్సి ఉంది. ఇందుకు సంబంధించి షెడ్యూల్ కూడా ఖరారైంది. అయితే.. విజయనగరంలో జరిగిన రైలు ప్రమాద బాధితులను పరామర్శించేందుకు వెళ్లడం, తిరిగి రావడంలో జాప్యం జరగడంతో జస్టిస్ నరేందర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాల్గొనలేకపోయారు.

ఉన్నత విద్యలో నవశకం

- విశ్వవిద్యాలయాల్లో 3,220 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన ఏపీ ప్రభుత్వం
- నేటినుంచి ఉమ్మడి పోర్టల్‌లో దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వం ఉన్నత విద్యలో నవశకానికి నాంది పలికింది. విశ్వవిద్యాలయాల్లో దశాబ్దాలుగా భర్తీకి నోచుకోని అధ్యాపక, అధ్యాపకేతర పోస్టుల్లో నియామకాలకు శ్రీకారం చుట్టింది. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 18 యూనివర్సిటీల్లో ఏకంగా 3,220 పోస్టుల భర్తీకి సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో 418 ప్రొఫెసర్, 801 అసోసియేట్ ప్రొఫెసర్, 2,001 అసిస్టెంట్ ప్రొఫెసర్ (రాజీవ్ గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) 220 లెక్చరర్ పోస్టులతో కలిపి) పోస్టుల నియామకాలను చేపడుతోంది. ఉన్నత విద్యా మండలి 'ఉమ్మడి పోర్టల్'ద్వారా మంగళవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించ నుంది. అభ్యర్థులపై ఆర్థిక భారం తగ్గించేందుకు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు మాత్రం ఒకే దరఖాస్తు ఫీజుతో అన్ని యూనివర్సిటీలకు దరఖాస్తు చేసుకునే సౌలభ్యాన్ని కల్పించింది. గతంలో అయితే ప్రతి వర్సిటీకి ఒక్కో దరఖాస్తు పెట్టుకోవాల్సి వచ్చేది. వీటికే అభ్యర్థులు రూ.వేలు చెల్లించాల్సి వచ్చేది. భవిష్యత్ తరాలకు సైతం యూనివర్సిటీల్లో అత్యుత్తమ బోధన సామర్థ్యాలు అందించేందుకు వీలుగా ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తోంది. ముఖ్యంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (ఏపీపీఎస్సీ) ద్వారా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి పారదర్శకంగా ఎంపికలు చేపట్టనుంది.

దరఖాస్తు రుసుము ఇలా..: అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు ఓపెన్ కేటగిరీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.2,500, ఎస్సీ, ఎస్టీ, పీబీడీలు (పర్సన్ బెంచ్ మార్క్ విత్ డిజేబిలిటీ) రూ.2 వేలు, ప్రవాస భారతీయులైతే 50 డాలర్లు/రూ.4.200 ఆన్‌లైన్‌లో దరఖాస్తుతో పాటు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇక్కడ ఒకటి కంటే ఎక్కువ విభాగాల్లో టెస్టులు రాయాలనుకుంటే మాత్రం విడివిడిగా ఫీజులు చెల్లించాలి. ఇక ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు అన్ని కేటగిరీల అభ్యర్థులు రూ.3 వేలు, ప్రవాస భారతీయులైతే ప్రొఫెసర్ పోస్టుకు రూ.150 డాలర్లు/రూ.12,600, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు 100 డాలర్లు/రూ.8,400 దరఖాస్తు రుసుము చెల్లించాలి. అభ్యర్థుల దరఖాస్తు కోసం http://recruitments.universities.ap.gov.in వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచింది. వర్సిటీల వారీగా అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్లను అందుబాటులోకి తీసుకురానుంది. ఆయా పోస్టులకు స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ తేదీలను దరఖాస్తు పరిశీలన అనంతరం వెల్లడించనుంది.

దరఖాస్తులకు గడువు ఇలా..

- ఆన్‌లైన్‌లో దరఖాస్తు, ఫీజు చెల్లింపునకు తుది గడువు: 20.11.2023
- పోస్టు ద్వారా దరఖాస్తు కాపీ, ఇతర పత్రాల సమర్పణ గడువు: 27.11.2023
- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్‌కు అర్హులు, అనర్హుల ప్రాథమిక జాబితా ప్రదర్శన: 30.11.2023
- అభ్యంతరాల స్వీకరణ: 07.12.2023
- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్ట్ స్క్రీనింగ్ టెస్టుకు ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రదర్శన: 08.12.2023

గిరిజనుల గుండె చప్పుడు | సీఎం వైఎస్ జగన్

నిరంతరం వారి అభ్యున్నతి కోసమే పాటు పడుతున్నారు

- పాడేరు సామాజిక సాధికార సభలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాక్షి, విశాఖపట్నం: నిరంతరం గిరిజనుల కోసం ఆలోచిస్తూ.. వారి అభ్యున్నతికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల గుండె చప్పుడని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర చెప్పారు. సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో స్థానిక ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా సతకంపట్టు సెంటర్లో బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో గిరిజన ప్రాంతాలకు ఎవరు మేలు చేశారో బేరీజు వేసుకోవాలని రాజన్నదొర కోరారు. గిరిజన జాతిని అంతమొందించాలని, బాక్సైట్ ఖనిజాన్ని దోచుకోవాలన్న ఎత్తుగడతో గత చంద్రబాబు ప్రభుత్వంలో అక్రమంగా బాక్సైట్ తవ్వకాలు చేపట్టారని తెలిపారు. ఈ కుట్రను గమనించిన అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఈ తవ్వకాల జీవో రద్దు చేస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన వెంటనే మాట నిలబెట్టుకొన్నారని చెప్పారు. ఆ జీవో రద్దు ద్వారా గిరిజనులను కాపాడారని, అంతేకాకుండా ఈ ప్రాంతం, గిరిజనుల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. గిరిజనులకు ఉచిత విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. అనారోగ్యం పాలైన గిరిజనులను డోలీలో మోసుకొని వెళ్లాల్సిన దుస్థితి లేకుండా గిరిజన ప్రాంతంలోనే మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తున్నారన్నారు. అంబేడ్కర్ ఆశయాలను సీఎం వైఎస్ జగన్ ఆచరణలో చూపిస్తున్నారని తెలిపారు.



అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో నిర్వహించిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

నారా వారి లిక్కరు స్కాం

టీడీపీ అడ్డగోలు మద్యం వ్యవహారాలపై మరో కేసు

- తన హయాంలో కావాల్సిన కంపెనీలకు దోచిపెట్టిన చంద్రబాబు
- క్విడ్‌ప్రోకోలో భాగంగా ఎక్సైజ్ పాలసీనే మార్చేసిన నాటి ప్రభుత్వం
- రెండు బేవరేజ్‌లు, మూడు డిస్టలరీలకు లబ్ధి చేకూర్చేలా నిర్ణయాలు
- ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.1,300 కోట్ల నష్టం
- ఏసీబీ కోర్టులో సీఐడీ పిటిషన్.. అనుమతించిన న్యాయస్థానం
- ఏ-1గా ఐఎస్ నరేష్, ఏ-2గా కొల్లు రవీంద్ర, ఏ-3గా చంద్రబాబు



సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడిపై ఏపీ సీఐడీ కేసులు వెంటాడుతున్నాయి. తాజాగా ఆయనపై సీఐడీ మరో కేసు నమోదు చేసింది. గత ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న మద్యం కుంభకోణానికి సంబంధించి నమోదైన ఈ ఎఫ్‌ఐఆర్‌లో ఏ-3గా చంద్రబాబు పేరును చేర్చింది. అంతటితో ఆగక ఏసీబీ కోర్టులో పిటిషన్‌ను కూడా వేసింది. దీంతో న్యాయస్థానం విచారణకు సైతం అనుమతించింది. ఐపీసీ, ప్రివెన్షన్ ఆఫ్ కరెప్షన్ (పీసీ) యాక్ట్-1988ల ప్రకారం 166, 167, 409, 120 (బి), రెడ్‌విత్ 34, 13(1)(డి), రెడ్ విత్ 13(2) సెక్షన్లతో సీఐడీ ఆయనపై ఈ కేసు నమోదు చేసింది. ఇందులో ఏ-1గా అప్పటి ఎక్సైజ్ కమిషనర్ ఐఎస్ శ్రీనరేష్, ఏ-2గా నాటి ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రపై కూడా ఎఫ్‌ఐఆర్ నమోదైంది. డిస్టిలరీస్, బేవరేజెస్ కమిషనర్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డి. వాసుదేవ రెడ్డి ఫిర్యాదు మేరకు వీరిపై కేసు నమోదైంది.

అయినవారి కోసం అడ్డదారులు..

నంద్యాల మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డికి చెందిన ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌కి, మాజీమంత్రి అయ్యన్నపాత్రుడుకి చెందిన విశాఖ డిస్టలరీకి, మాజీమంత్రి యనమల రామకృష్ణుడు వియ్యంకుడు పుట్టా సుధాకర్ యాదవ్‌కి చెందిన పీఎంకే డిస్టిలరీకి అప్పట్లో అడ్డగోలుగా మేలు చేకూర్చడానికి చంద్రబాబు ప్రభుత్వం అడ్డదారులు తొక్కింది. ఇందుకోసం ఏకంగా 2012 ఎక్సైజ్ పాలసీని మార్చేసింది. 2012 నుంచి 2015 వరకు ప్రభుత్వానికి రూ.2,984 కోట్లు పన్నులు రాగా, 2015లో కొత్త పాలసీ తీసుకువచ్చి ప్రభుత్వానికి ఈ పన్నులు రాకుండా చేసింది. టర్నోవర్‌పై 8 శాతం వ్యాట్‌తో పాటు అదనంగా 6 శాతం పన్నులను తీసేసింది. 6 నుంచి 10 శాతానికి పన్నులు పెంచాలని త్రిసభ్య కమిటీ చేసిన సిఫార్సులనూ బేఖాతరు చేసింది. ఈ విధంగా రెండు బేవరేజ్‌లు, మూడు డిస్టిలరీలకు లబ్ధిచేకూర్చడానికి చంద్రబాబు ప్రభుత్వం క్విడ్ ప్రో కోకి పాల్పడినట్లు సీఐడీ తన ఎఫ్‌ఐఆర్‌లో వెల్లడించింది. టీడీపీ ప్రభుత్వంలో జరిగిన ఈ కుంభకోణం ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.1,300 కోట్ల నష్టం వాటిల్లుతోందని వివరించింది.

కొన్ని డిస్టిలరీలకు అనుకూలంగా నిర్ణయాలు..

నిజానికి.. ఎక్సైజ్ పాలసీ సమస్యలు, ఆదాయ వివరాలను ప్రభుత్వానికి సూచించడానికి గత ఫైళ్లను తిరగేయడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. రాష్ట్రానికి ఆదాయాన్ని తగ్గించి, లైసెన్సులకు ప్రయోజనం చేకూర్చేలా క్విడ్ ప్రో కో జరిగినట్లు అధికారులు గుర్తించారు. అంతటితో ఆగక.. అందుకు సంబంధించిన వాస్తవాలపై లోతుగా అధ్యయనం చేశారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా, ఎల్‌ఓఐ ఇవ్వడం ద్వారా కొన్ని డిస్టిలరీలకు అనుకూలంగా వ్యవహరించినట్లు గుర్తించారు. డీటీ నోటిఫికేషన్ తర్వాత కొత్త బ్రాండ్లను అనుమతించారని అధికారులు తెలుసుకున్నారు. సరఫరాదారులు కుట్రపూరితంగా, లైసెన్స్‌లతో కుమ్మక్కై, కొన్ని ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ లేకపోయినా కృత్రిమంగా డిమాండ్ పెంచారు. తద్వారా కార్పొరేషన్‌కు తప్పుడు అంచనాలు ఇచ్చారు. అలాగే, 2015-2019 కాలానికి సంబంధించిన వాస్తవ డిమాండ్, సరఫరాల డేటా, పరిమాణాల వెరిఫికేషన్ కోసం ఎలాంటి యంత్రాంగం లేదు. 2019 ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత కొన్ని కంపెనీలకు ప్రాధాన్యత ఇస్తూ, వారి ఉత్పత్తులకు, వారి మార్కెట్ వాటాకు అనుకూలంగా హడావిడిగా ఆర్డర్లు ఇచ్చేశారు. అంతేకాక.. అవసరానికి మించి లిక్కర్ కంపెనీలకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చి కొందరి నుంచే 70 శాతం బ్రాండ్లు కొనుగోలు చేశారు. పక్కా ప్లాన్‌తో, కొందరు అధికారుల సహకారంలో కొన్ని సంస్థలకు చట్టవిరుద్ధంగా ఆర్థిక ప్రయోజన చేకూర్చినట్లు స్పష్టమైంది. అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) ఉల్లంఘన ఫలితంగా ఖజానాకు నష్టం వాటిల్లిందనే విషయం తేటతెల్లమైంది. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐడీ వివరించింది.

కేబినెట్ ఆమోదం లేకుండా నచ్చినట్లు పాలసీ..

2015-2017 ఎక్సైజ్ సంవత్సరాలకు సంబంధించి నిర్ణయం తీసుకోవడానికి ముందు, కొనుగోళ్ల వార్షిక లైసెన్సు రుసుం కంటే పది రెట్లు మించి ఉంటే మాత్రమే ప్రివిలేజ్ రుసుం విధించే థ్రెషోల్డ్ టెండర్ పరిమితిని పెంచాలని మొదట ప్రతిపాదించారు. కానీ, అది అమల్లోకి రాలేదు. తెలంగాణలో అమలులో ఉన్న ఈ ఫీజులు ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం తొలగించింది. షాపుల కోసం పాలసీని కూడా తమకు నచ్చినట్లు ఎటువంటి చర్చలు లేకుండా, ఆర్థిక చిక్కుల గురించి ఆలోచించకుండా కేబినెట్ ఆమోదం కూడా లేకుండా ఖరారు చేసేశారు.

ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌కు అనుకూలంగా నిర్ణయాలు..

ఇక ఎస్పీవై రెడ్డికి చెందిన ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌కు చంద్రబాబు ప్రభుత్వం భారీగా లబ్ధిచేకూర్చింది. వాయిదా పద్ధతిలో లైసెన్స్ ఫీజు చెల్లించడానికి అనుమతించింది. ఈ ఫీజులో బకాయిలపై వడ్డీని కేవలం 18 శాతం (రూ.15 కోట్లు) మాత్రమే వసూలుచేయడానికి అనుమతించింది. హైకోర్టు తీర్పునకు విరుద్ధంగా, లైసెన్స్ ఫీజు బకాయిలపై అంతకుముందు కాలానికి చెల్లించాల్సిన వడ్డీని కూడా సడలించింది. నిజానికి ఇలా వడ్డీని వదిలేయడానికి, పరోక్షంగా మాఫీ చేయడానికి, తర్వాత చెల్లించేలా అనుమతించడానికి నిబంధనలు అంగీకరించవు.

డిస్టిలరీ మంజూరుకు అనుమతి..

ఇక 2014 నవంబర్‌లో జీఓ నెంబర్ 993 ప్రకారం.. రెవెన్యూ (ఎక్సైజ్-2) డిపార్ట్‌మెంట్ ఏర్పాటుచేసిన కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా, కమిటీ సూచించిన వాటి కంటే ఎక్కువ డిస్టిలరీల స్థాపనకు టీడీపీ ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. పీఎంకే డిస్టిలరీస్, విశాఖ డిస్టిలరీస్, మరో మూడు ప్రైవేటు డిస్టిలరీస్‌కు ఆర్థిక ప్రయోజనం చేకూర్చడానికే ఈ నిర్ణయం తీసుకుంది.

కొంతమంది సరఫరాదారులు.. డిస్టిలరీలపై ప్రేమ..

కుట్రలో భాగంగా కొంతమంది సరఫరాదారులు, డిస్టిలరీలపై టీడీపీ ప్రభుత్వం అప్పట్లో అమితమైన ప్రేమ కనబర్చింది. వారితో కుమ్మక్కై కొన్ని ఉత్పత్తులకు కృత్రిమ డిమాండ్‌ను సృష్టించింది. వాటికి మార్కెట్ డిమాండ్ లేకపోయినా ఉన్నట్లుగా చూపించింది. వాస్తవ డిమాండ్, సరఫరాల డేటా ధృవీకరణకు ఎలాంటి యంత్రాంగం కూడా లేదు. దీనివల్ల 2015-2019 మధ్య ఇలా నాలుగైదు కంపెనీలకు భారీగా లబ్ధి చేకూరింది. వీరి నుంచే 70 శాతం కొనుగోళ్లు జరిగాయి.

బ్రాండ్లకు అడ్డగోలు అనుమతులు..

మరోవైపు.. 2019లో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం హడావుడిగా, ఎలాంటి ప్రజా ప్రయోజనం లేకపోయినా సరే అనేక బ్రాండ్లకు ఆమోదం తెలిపి తద్వారా వాటి సరఫరాదారులకు ఎక్కడలేని ప్రయోజనం చేకూర్చింది. వ్యక్తులు, సంస్థలకు ప్రయోజనాలను అందించడంవల్ల రాష్ట్ర ఖజానాకు పెద్దఎత్తున నష్టం వాటిల్లింది.

లోతుగా విచారణ జరపాలి : సీఐడీ

ఈ నేపథ్యంలో.. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు నష్టం, లైసెన్సీలకు చట్టవిరుద్ధంగా ఆర్థిక లాభం చేకూర్చడంపై విచారణ జరగాల్సి ఉందని సీఐడీ ఏసీబీ కోర్టుకు తెలిపింది. ఈ మేరకు ఎఫ్‌ఐఆర్ కాపీని న్యాయస్థానానికి సమర్పించింది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ కుంభకోణంపై లోతుగా విచారణ జరపాలని, బాధ్యులైన వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని న్యాయస్థానాన్ని సీఐడీ కోరింది.

చంద్రబాబు మధ్యంతర బెయిల్‌పై ముగిసిన వాదనలు

ఆరోగ్య సమస్యల దృష్ట్యా బెయిల్ ఇవ్వాలన్న బాబు తరఫు న్యాయవాదులు

- బెయిల్ కోసమే ఆరోగ్య సమస్యల్ని సాకుగా చూపుతున్నారన్న సీఐడీ తరఫు న్యాయవాదులు
- చంద్రబాబు బరువు తగ్గారన్న వాదనలో వాస్తవం లేదని.. కేజీన్నర బరువు పెరిగారని స్పష్టీకరణ
- ఇప్పటికిప్పుడు కంటి శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం లేదని వెల్లడి
- ఆయనకు ఎలాంటి పరీక్షలు నిర్వహించేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న న్యాయవాదులు
- చంద్రబాబు ఆరోగ్య స్థితిపై వైద్యులిచ్చిన నివేదికలు కోర్టుకు సమర్పణ
- నేడు నిర్ణయం వెలువరించనున్న జస్టిస్ మల్లికార్జునరావు



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి సంబంధించి రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ అనుభవిస్తున్న చంద్రబాబు దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో సోమవారం వాదనలు ముగిశాయి. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు తన నిర్ణయాన్ని మంగళవారానికి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మధ్యంతర బెయిల్‌పై నిర్ణయం ఆధారంగా ప్రధాన బెయిల్ పిటిషన్‌పై విచారణ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కంటి శస్త్ర చికిత్సను కారణంగా చూపుతూ తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలంటూ చంద్రబాబు హైకోర్టులో ఓ అనుబంధ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై సోమవారం జస్టిస్ మల్లికార్జునరావు విచారణ జరిపారు.

'ఆరోగ్య సమస్యల దృష్ట్యా బెయిలివ్వండి'

సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. చంద్రబాబు పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని.. అందువల్ల మధ్యంతర బెయిల్ ఇవ్వాలని న్యాయమూర్తిని అభ్యర్థించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు. అందుకు ఆయనపై పెడుతున్న వరుస కేసులే నిదర్శనమని తెలిపారు. గత 52 రోజులుగా చంద్రబాబు జైల్లో ఉన్నారని వివరించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కుట్రపూరితంగా అరెస్ట్ చేశారన్నారు. స్కిల్ కేసులో చంద్రబాబును సీఐడీ ప్రశ్నించడం పూర్తయిందని, అందువల్ల అతనిని జైలులో ఉంచాల్సిన అవసరం ఎంత మాత్రం లేదన్నారు. సీఐడీ రిమాండ్ రిపోర్టులో చంద్రబాబుపై నిర్దిష్ట ఆరోపణలేవీ లేవన్నారు. జైలులో చంద్రబాబు 5 కేజీల బరువు తగ్గారన్నారు. పలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని వివరించారు. కుడి కన్నుకు అత్యవసరంగా శస్త్ర చికిత్స చేయించుకోవాల్సిన అవసరం ఉందని, ఇదే విషయాన్ని వైద్యులు సైతం ధ్రువీకరించారని పేర్కొన్నారు. నచ్చిన వైద్యునితో చికిత్స చేయించుకునే ప్రాథమిక హక్కు పిటిషనర్‌కు ఉందన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

'ఆరోగ్య సమస్యల్ని సాకుగా చూపుతున్నారు'

సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, స్పెషల్ పీపీ యడవల్లి నాగవివేకానంద, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. చంద్రబాబు జైలు నుంచి బయటకొచ్చేందుకు అరోగ్య సమస్యలను కారణంగా చూపుతున్నారని స్పష్టం చేశారు. ప్రధాన బెయిల్ పిటిషన్‌లో వాదనలు వినిపించేందుకు గడువు కావాలని సుధాకర్‌రెడ్డి కోర్టును కోరగా.. గడువు ఇచ్చేందుకు అభ్యంతరం లేదని, ముందు మధ్యంతర బెయిల్‌పై వాదనలు వినిపించాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. చంద్రబాబు బరువు తగ్గారన్న వాదనలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ఒకటిన్నర కేజీ బరువు పెరిగారని సుధాకర్‌రెడ్డి తెలిపారు. చంద్రబాబు ఆరోగ్య స్థితిపై వైద్యుల నివేదికలను ఆయన కోర్టు ముందుంచారు. చంద్రబాబుకు జైల్లోనే అన్ని రకాల పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కంటి శస్త్రచికిత్స అత్యవసరం ఎంతమాత్రం కాదన్నారు. వైద్యులు సైతం ఇదే చెప్పారన్నారు. చంద్రబాబుకున్న అనారోగ్య సమస్యలు వయోభారంతో బాధపడే వారికి ఉండేవేనన్నారు. అవేమీ అసాధారణ సమస్యలు కాదన్నారు. జైలు నుంచి బయటకు వచ్చేందుకు ఆరోగ్య సమస్యలను కారణంగా మాత్రమే చూపుతున్నారని తెలిపారు. ఎట్టిపరిస్థితుల్లో మధ్యంతర బెయిల్ ఇవ్వడానికి వీల్లేదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు మధ్యంతర బెయిల్‌పై మంగళవారం నిర్ణయాన్ని వెల్లడిస్తానని స్పష్టం చేశారు.

పెట్టుబడుల వరద

- రూ.19,037 కోట్ల విలువైన 10 ప్రాజెక్టులకు ఏపీ సర్కారు గ్రీన్ సిగ్నల్
- వీటి ద్వారా 69,565 మందికి ఉద్యోగావకాశాలు
- సీఎం అధ్యక్షతన సమావేశమైన ఎస్ఐపీబీ ఈ ప్రతిపాదనలకు ఆమోదం

సాక్షి, అమరావతి: స్థానిక యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో పరిశ్రమల ఏర్పాటును పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్న ఏపీ ప్రభుత్వం తాజాగా మరో రూ.19,037 కోట్ల విలువైన 10 పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఇందులో ఏడు కొత్త ప్రాజెక్టుల ప్రతిపాదనలు కాగా.. మూడు విస్తరణ కార్యక్రమాలకు చెందినవి ఉన్నాయి. వీటి ద్వారా మొత్తం 69,565 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామికరంగంలో సాంకేతికంగా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. వీటన్నింటినీ అధికారులు తెలుసుకుంటూ ప్రపంచ పారిశ్రామిక రంగం పోకడలను అర్థంచేసుకోవడం ద్వారా ఎప్పటికప్పుడు పారిశ్రామిక విధానాల్లో మార్పులు, చేర్పులు చేయాలని సూచించారు. అత్యంత పారదర్శక విధానాల ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక సానుకూల వాతావరణాన్ని తీసుకొచ్చామని.. ఈ క్రమంలోనే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్స్‌లో దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచామని ముఖ్యమంత్రి జగన్ గుర్తుచేశారు. పరిశ్రమలపట్ల సానుకూల క్రియాశీలతను మరింత బలోపేతం చేయడం ద్వారా ఈ ప్రయాణం మరింతగా ముందుకు సాగించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఇచ్చే అనుమతులు, తదితర అంశాల్లో ప్రభుత్వం వేగంగా స్పందిస్తోందని, ఏ సమస్య ఉన్నా ఒక్క ఫోన్‌కాల్ దూరంలో ఉన్నామన్న భరోసాను వారికి కల్పిస్తున్నామన్నారు. కానీ, అనుమతులు, క్లియరెన్స్ విషయంలో ఇప్పుడున్న వేగాన్ని మరింతగా పెంచాల్సిన అవసరం ఉందని, పారిశ్రామిక వర్గాల నుంచి వచ్చే ప్రతిపాదనలపట్ల చురుగ్గా వ్యవహరించడంతో పాటు, వాటికి త్వరగా అనుమతులు మంజూరు చేసే ప్రక్రియ వేగాన్ని ఇంకా పెంచాల్సిందిగా అధికారులను సీఎం జగన్ ఆదేశించారు.

జీఐఎస్ ఒప్పందాల అమలును వేగవంతం చేయండి..

ఇక విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాల అమలు విషయంలో మరింత వేగం పెంచాలని ముఖ్యమంత్రి కోరారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాల విషయంలో గత ప్రభుత్వంలో కన్నా ఈ ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున మేలు చేకూర్చామని, ముఖ్యంగా ఎంఎస్ఎంఈల రంగానికి పునరుజ్జీవం కల్పించిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఇస్తూ వారికి చేదోడుగా నిలవడం ద్వారా ఎంఎస్ఎంఈల పట్ల ఈ ప్రభుత్వం సానుకూలతతో ముందుకు సాగుతోందన్నారు. ఈ రంగంపై ఎక్కువమంది ఆధారపడి బతుకుతున్నారు కాబట్టి.. వీటిని కాపాడుకోవడం ప్రభుత్వ బాధ్యతన్నారు.

రేపు 'వైఎస్సార్' పురస్కారాల ప్రదానం

27 మంది విశిష్ట సేవకులు, సంస్థలకు సత్కారం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ జీవిత సాఫల్య, వైఎస్సార్ సాఫల్య పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్టు సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు విజయవాడలోని ఏ1 కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, విశిష్ట అతిథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతారన్నారు. వరుసగా మూడో ఏడాది వివిధ రంగాల్లో సామాజిక అభ్యున్నతి కోసం అసామాన్య కృషి చేసిన 27 మంది విశిష్ట వ్యక్తులు, సంస్థలను అవార్డులతో సత్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయం, కళలు-సంస్కృతి, తెలుగు భాష-సాహిత్యం, క్రీడలు, వైద్యం, మీడియా, సమాజసేవ వంటి 7 విభాగాల్లో 23 వైఎస్సార్ జీవిత సాఫల్య, 4 వైఎస్సార్ సాఫల్య పురస్కారాలను అందజేయనున్నట్లు వివరించారు. వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారం కింద రూ.10 లక్షల నగదు, సాఫల్య పురస్కారం కింద రూ.5 లక్షల నగదుతో పాటు మెమెంటో, మెడల్, ప్రశంసాపత్రం బహూకరిస్తారన్నారు.

3వ తేదీకి కేబినెట్ భేటీ వాయిదా

సాక్షి, అమరావతి: ఏపీ కేబినెట్ సమావేశం నవంబర్ 3వ తేదీకి వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం మంగళవారం ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరగాల్సి ఉంది. అయితే విజయనగరం జిల్లా రైలు ప్రమాద సహాయక చర్యల్లో కొందరు మంత్రులు నిమగ్నమై ఉన్నందున కేబినెట్ సమావేశాన్ని నవంబర్ 3వ తేదీకి ప్రభుత్వం వాయిదా వేసింది. 3వ తేదీ ఉదయం 11 గంటలకు సచివాలయం మొదటి బ్లాక్ కేబినెట్ సమావేశ మందిరంలో సమావేశం జరుగనుంది.

7,168 లైసెన్స్‌డ్ ఆయుధాల జప్తు

- 46,146 మంది బైండోవర్.. పోలీసుల తనిఖీలు ముమ్మరం
- 303 కోట్ల విలువైన మద్యం, బంగారం, నగదు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 7,168 లైసెన్స్‌డ్ ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 15,683 బైండోవర్ కేసులు నమోదు చేశారు. 46,146 మందిని బైండోవర్ చేసినట్టు డీజీపీ కార్యాలయ ఉన్నతాధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనానియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. మద్యం, నగదు, బంగారం, ఇతర వస్తువుల అక్రమరవాణాపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక పోలీసులకుతోడు కేంద్ర పారామిలిటరీ బలగాలు సైతం ఈ సోదాల్లో పాల్గొంటున్నాయి. రాష్ట్ర సరిహద్దులు, కీలకప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. వీరికి అదనంగా మరో 373 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 374 స్టాటిస్టికల్ సర్వేలైన్స్ బృందాలు సైతం ఈ తనిఖీల్లో పాల్గొంటున్నాయి. కాగా, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 9 నుంచి సోమవారం ఉదయం వరకు మొత్తం రూ.303 కోట్ల 23 లక్షల విలువైన నగదు, బంగారం, మద్యం, మత్తుపదార్థాలు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనానియమావళి ఉల్లంఘించిన 594 మందిపై 252 కేసులు నమోదు చేశారు. రాజకీయ సంబంధ హింసాత్మక ఘటనలు 19 వరకు నమోదైనట్టు అధికారులు పేర్కొన్నారు.

జస్టిస్ ఎం.లక్ష్మణ్, జస్టిస్ అనుపమ చక్రవర్తికి ఘనంగా హైకోర్టు వీడ్కోలు



బదిలీపై వెళ్తున్న జస్టిస్ ఎం.లక్ష్మణ్, జస్టిస్ అనుపమ చక్రవర్తి సన్మాన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే. చిత్రంలో హెచ్‌సీఏఏ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ప్రదీప్, దేవేందర్, కృష్ణకుమార్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు నుంచి ఇతర హైకోర్టులకు బదిలీపై వెళ్తున్న జస్టిస్ ఎం.లక్ష్మణ్, జస్టిస్ అనుపమ చక్రవర్తికి హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. సోమవారం మొదటి కోర్టు హాల్‌లో సమావేశమైన ఫుల్ కోర్టు వారి సేవలను కొనియాడింది. ఇక్కడ పనిచేసిన కాలంలో ఇరువురూ పలు ఉత్తమ తీర్పులు ఇచ్చారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ప్రశంసించారు. విధి నిర్వహణలో సహకరించిన ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఇతర సిబ్బందికి జస్టిస్ ఎం.లక్ష్మణ్, జస్టిస్ అనుపమ చక్ర వర్తి కృతజ్ఞతలు తెలిపారు. కార్య క్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, న్యా యవాదులు, హైకోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం హైకోర్టు బార్ అసోసి యేషన్ కూడా ఇద్దరు న్యాయమూర్తులను ఘనంగా సన్మానించింది.

తొలగించిన సిబ్బందిని వెంటనే విధుల్లోకి తీసుకోండి

- హైదరాబాద్ వర్సిటీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తొలగించిన సిబ్బందిని తిరిగి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని హైదరాబాద్ వర్సిటీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యూజీసీ) పథకం కొనసాగినంత కాలం వారి ఉద్యోగాలు తొలగించకుండా, కొనసాగించాలని స్పష్టం చేసింది. '2012లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) హైదరాబాద్ యూనివర్సిటీ అభివృద్ధి కోసం నిధులు విడుదల చేస్తూ కొత్త పథకం ప్రారంభించింది. ఈ పథకం అమలు కోసం వర్సిటీ 2013లో డాటా ఎంట్రీ ఆపరేటర్లను, ఆఫీస్ అటెండెన్స్‌ల నియామకం చేపట్టింది. 2016లో ఉద్యోగాలు చేపట్టిన మేమంతా నాటి నుంచి ఎలాంటి ఫిర్యాదు లేకుండా అక్కడే పనిచేస్తున్నాం. ఈ క్రమంలో 2023, మార్చి 31 తర్వాత మమ్మల్ని విధుల నుంచి తొలగిస్తున్నట్లు 2022, డిసెంబర్ 7న వర్సిటీ నోటీసులు జారీ చేసింది. యూజీసీ పథకాన్ని కొనసాగించేందుకు సిద్ధంగా లేదని, అందుకే తొలగిస్తున్నట్లు పేర్కొంది. కానీ యూజీసీ తమ పథకాన్ని మరో సంవత్సరం పొడిగిస్తున్నట్లు లేఖ రాసింది. దీన్ని పరిగణనలోకి తీసుకోకుండా మమల్ని విధుల నుంచి తొలగించారు. మమల్ని విధుల్లోకి తీసుకునేలా వర్సిటీ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలి' అని కోరుతూ రంగారెడ్డి జిల్లాకు చెందిన దాసరి కోటయ్యతో పాటు మరొకొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ పి.మాధవి దేవి ఇటీవల తీర్పు వెలువరించారు. యూజీసీ పథకం కొనసాగినంత వరకు పిటిషనర్ల ఉద్యోగాలను కొనసాగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

37 ప్రశ్నల అభ్యంతరాలపై వివరణ ఇవ్వండి

- జేఎల్ పరీక్షపై టీఎస్‌పీఎస్సీకి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: జూనియర్ లెక్చరర్ నియామకాల నిమిత్తం ఇటీవల నిర్వహించిన ఇంగ్లిష్ రెండో పేపర్‌లో 37 ప్రశ్నలపై వివరణ ఇవ్వాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను (టీఎస్‌పీఎస్సీ) హైకోర్టు ఆదేశించింది. జూనియర్ లెక్చరర్ పోస్టులకు నిర్వహించిన పరీక్షలకు ఇచ్చిన ప్రశ్న పత్రంలో 37 ప్రశ్నల్లో పలు తప్పులు వచ్చినా టీఎస్‌పీఎస్సీ పట్టించుకోవడం లేదని పేర్కొంటూ టి. ప్రణీత్ రెడ్డి, తదితరులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పి.మాధవీదేవి సోమవారం విచారణ చేపట్టారు. 37 ప్రశ్నలకు సంబంధించి అస్పష్టతతో పాటు సమాధానాలు, ఐచ్ఛికాల్లో తప్పులు దొర్లాయని, దీనిపై ఫిర్యాదు చేసినా టీఎస్‌పీఎస్సీ పట్టించుకోలేదని.. దీంతో కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని పిటిషనర్ల న్యాయవాది బి.రమేశ్ వాదించారు. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా తుది కీ కూడా విడుదల చేసిందన్నారు. వెబ్‌సైట్ ద్వారా పిటిషనర్లు అభ్యంతరాలు చెప్పినా ఫలితం లేదన్నారు. 37 ప్రశ్నలు తప్పుగా వచ్చినందున పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని టీఎస్‌పీఎస్సీ న్యాయవాది కోరడంతో.. న్యాయమూర్తి విచారణను నవంబర్ 3కి వాయిదా వేశారు.

పరామర్శకైనా పనికిరామా?

- టికెట్ ఆశించి భంగపాటుకు గురైన కమలనాథుల ఆవేదన
- పార్టీ పెద్దలు తమను పిలిపించి మాట్లాడకపోవడంపై ఆవేదన
- భవిష్యత్‌లో గుర్తింపు లభిస్తుందని భరోసా కల్పించకపోవడంపై మండిపాటు
- అలాంటప్పుడు ఆశావహుల నుంచి దరఖాస్తులు ఎందుకు కోరారని నిలదీత

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంటున్న క్రమంలో బీజేపీలో టికెట్ల చిచ్చు రగులుతోంది. రెండు జాబితాల్లో కలిపి 53 సీట్లకు అభ్యర్థులను ప్రకటించాక, నవంబర్ 1న మూడో జాబితా వెలువడనున్న నేపథ్యంలో బీజేపీ టికెట్లు ఆశించి భంగపడిన పలువురిలో అసంతృప్తి వ్యక్తమౌతోంది. మొత్తం 119 అసెంబ్లీ సీట్లలో కనీసం 60–70 చోట్లయినా సీరియస్‌గా టికెట్ ఆశిస్తున్న వారు ఇద్దరు, ముగ్గురున్నప్పుడు అభ్యర్థిత్వం ఖరారుకాని వారిని పిలిచి మాట్లాడే పరిస్థితి పార్టీలో లేకపోవడాన్ని తప్పుబడు తున్నారు. గతంలో టికెట్ రాని వారికి నచ్చజెప్పి పార్టీ కోసం పని చేసేలా ఒప్పించిన పరిస్థితులుండగా ఇప్పుడు జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు పట్టించుకోక పోవడం సరికాదని మండిపడుతున్నారు. కనీసం బుజ్జగింపులు, నచ్చజెప్ప డాలు వంటి వాటికి కూడా తాము నోచుకోలేదని పలువురు బీజేపీ నేతలు వాపోతున్నారు. పరామర్శకైనా తాము పని కిరామా అని ఆవేదన చెందుతున్నారు. అందరూ కలిసి పనిచేస్తేనే పార్టీ విజయం సాధ్యమనే విషయాన్ని నాయకులు విస్మరించారని అంటున్నారు.



గుర్తింపుపై భరోసా ఏదీ?

ఇప్పుడు వివిధ సమీకరణల మధ్య టికెట్ ఇవ్వలేక పోయామని, భవిష్యత్‌లో గుర్తింపు లభిస్తుందని భరోసా కల్పించకపోవడంపైనా పలువురు కమలనాథులు రుసరుసలాడుతున్నారు. పార్టీ అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ లేదా నామినేటెడ్ పోస్టులు ఇస్తామనే హామీ కూడా ఇవ్వకపోవడం దేనికి సంకేతమని అంటున్నారు. అలాంటప్పుడు ఆశావహుల నుంచి దరఖాస్తులు కోరాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల్లో పోటీకి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని నాయకత్వం కోరడంతో రికార్డు స్థాయిలో 6,003 దరఖాస్తులు వచ్చాయి. వారిలో తొలి జాబితాలో టికెట్లు దక్కని వారిని పార్టీపరంగా అనునయించే ప్రయత్నమేదైనా జరిగిందా అని నిలదీస్తున్నారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి వెంటనే అవకాశం కల్పించి, ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన వారిని విస్మరిస్తున్నారంటూ అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

రాజీనామా చేస్తానని ప్రకటించినా...

ముథోల్ నుంచి టికెట్ ఆశించి భంగపడిన పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి రాజీనామా చేస్తానని ప్రకటించాక కూడా ఎవరూ సర్దిచెప్పే ప్రయత్నం చేయలేదనే చర్చ పార్టీ వర్గాల్లో సాగు తోంది. తొలిజాబితాలో తనకు ఆందోల్ టికెట్‌ను ప్రకటించకపోవడంపై మాజీ మంత్రి బాబూ మోహన్ ఇప్పటికే ఆందోళన వ్యక్తంచేశారు. ఏదైనా భరోసా దొరుకుతుందేమోనని ముఖ్యనేతలకు ఫోన్ చేసినా వారి నుంచి స్పందన కరువైందని ఆయన వాపోయారు. వరంగల్(పశ్చిమ) నుంచి రావు పద్మకు టికెట్ కేటాయించడంతో... టికెట్ ఆశించి భంగపడిన అధికార ప్రతినిధి ఏనుగుల రాకేశ్ రెడ్డి రెబెల్‌గా పోటీచేస్తానని ప్రకటించారు. అయినా ఆయనను నచ్చజెప్పేందుకు ఏ ఒక్కరూ ప్రయత్నించకపోవడం చర్చనీయాంశమైంది. ఇదే తరహా పరిస్థితులు మరికొన్ని నియోజకవర్గాల్లోనూ ఉన్నాయి. తదుపరి జాబితా ప్రకటించే సమయంలోనైనా టికెట్లు ఆశిస్తున్న ముఖ్యనేతలతో పార్టీ పెద్దలు మాట్లాడాలని ఓ ముఖ్యనేత సాక్షితో చెప్పారు.

క్లుప్తంగా...

గెలిచే సీట్లనే సీపీఎం తీసుకోవాలి: కోమటిరెడ్డి



నల్లగొండ: 'పొత్తులో భాగంగా గెలిచే సీట్లను మాత్రమే సీపీఎం నాయకులు తీసుకోవాలని.. గెలవని సీట్లను తీసుకుంటే కాంగ్రెస్ సీట్లను కోల్పోవాల్సి వస్తుందని నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సీపీఎంకు రెండు ఎమ్మెల్సీ సీట్లతో పాటు కేబినెట్‌లోకి తీసుకొని మంత్రి పదవి కూడా ఇస్తామని ఆయన చెప్పారు. సోమవారం నల్లగొండలో ఇంటింటా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, ప్రతి సీటు మనం గెలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కాబట్టి గెలిచే స్థానాలు తీసుకుంటే మనమే రాష్ట్రంలో 80 స్థానాల్లో విజయం సాధించే అవకాశం ఉంటుందన్నారు. దీనికి సీపీఎం నాయకులు సహకరించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మేడిగడ్డ బ్యారేజీపై విచారణ చేయిస్తామని, బాధ్యులను జైలుకు పంపిస్తామని చెప్పారు. కొల్లాపూర్‌లో మంగళవారం జరగనున్న బహిరంగ సభలో ప్రియాంకా గాంధీ పాల్గొంటారని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు పాల్గొన్నారు.

'మేడిగడ్డ కుంగడం మీ అవినీతికి పరాకాష్ట'



హుజూర్‌నగర్: 'మీరు కట్టిన మేడిగడ్డ బ్యారేజీ కొన్ని సంవత్సరాలకే కుంగిపోవడం.. అది మీ అవినీతికి పరాకాష్ట'అని కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో పలువురు స్థానిక నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా తన క్యాంప్ కార్యాలయంలో ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ ప్రాజెక్టును సరిగా కట్టలేని వారు నాగార్జునసాగర్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ హయాంలో 50, 60 ఏళ్ల క్రితం కట్టిన సాగర్ ఇప్పటికీ పటిష్టంగా ఉందని, కొన్ని లక్షల ఎకరాలకు నీరు పారుతోందని ఆయన అన్నారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగితే దాని కింద ఇసుక కదిలిందని చెబుతున్నారని, దాని కింద ఇసుక ఉంటుంది.. అది కదిలితే ప్రమాదం అని తెలియదా వీరికి అని ప్రశ్నించారు. సాగర్‌లో నీరు ఉన్నా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పొలాలకు ప్రభుత్వం సాగునీరు ఇవ్వడం లేదని ఆయన మండిపడ్డారు.

తెలంగాణలో 26 స్థానాల్లో పోటీ: ఆర్పీఐ



ఆర్పీఐ జాతీయ అధ్యక్షుడు రాజేంద్ర గవాయితో తెలంగాణ నాయకులు

లిబర్టీ (హైదరాబాద్): రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) జాతీయ అధ్యక్షుడు రాజేంద్రగవాయితో తెలంగాణ రాష్ట్ర నాయకత్వం సమావేశమైంది. ఈ సందర్భంగా ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సి.హెచ్.బాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌బాబు తెలంగాణలో వివిధ రాజకీయ పార్టీల పరిస్థితి, రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు తెలిపారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ ఆర్పీఐ రాష్ట్ర శాఖ పక్షాన 26 స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను చట్ట సభల్లోకి పంపితే దళిత బహుజన సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. అంబేడ్కర్ ఆలోచన విధానమే దేశానికి శరణ్యమని స్పష్టంచేశారు. త్వరలోనే ఎన్నికల ప్రణాళికను విడుదల చేస్తామని, అభ్యర్థుల ఎంపిక పూర్తి చేసి ప్రకటిస్తామన్నారు.

51 మందితో జై స్వరాజ్ పార్టీ రెండో జాబితా



పంజగుట్ట (హైదరాబాద్): జై స్వరాజ్ పార్టీ రెండో జాబితాను విడుదల చేసింది. ఇప్పటికే మొదటి జాబితాలో 11 మంది అభ్యర్థులను ప్రకటించిన పార్టీ జాతీయ అధ్యక్షుడు కాసాని శ్రీనివాస్‌రావు గౌడ్ సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రెండో జాబితాలో 51 మంది అభ్యర్థుల వివరాలు ప్రకటించారు. మరో రెండు, మూడ్రోజుల్లో పూర్తిగా 119 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి తమ మేనిఫెస్టో విడుదల చేస్తామని శ్రీనివాస్‌రావు తెలిపారు. పేదరికం లేని సమాజం రూపొందించడమే తమ పార్టీ ముఖ్య ఉద్దేశమని, తెలంగాణలో ఎంతో సంపద ఉంది కానీ, పేదవాడికి అందడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. జై స్వరాజ్ పార్టీ తప్పకుండా ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందని ధీమా వ్యక్తంచేశారు. సమావేశంలో పార్టీ నాయకులు పరశురాములు గౌడ్, గంగిరెడ్డి, రాజలింగం, మల్లారెడ్డి, శ్రీనివాస్ బాబు, రాజ్‌కిరణ్, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ 'చేయి' కలిపిన కోదండరాం

- ఈసారి ఎన్నికల్లోనూ టీజేఎస్ మద్దతు కాంగ్రెస్‌కేనని ప్రకటన
- టీజేఎస్ కార్యాలయానికి వెళ్లి మద్దతు కోరిన రేవంత్, ఠాక్రే
- కేసీఆర్ నిరంకుశ పాలనకు తెరదించేందుకు కాంగ్రెస్‌కు మద్దతిస్తామన్న కోదండరాం
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తమ 6 డిమాండ్లు నెరవేర్చాలని షరతు
- సమన్వయ కమిటీ ఏర్పాటు చేసుకొని ముందుకెళతామన్న రేవంత్



టీజేఎస్ కార్యాలయంలో అభివాదం చేస్తున్న మాణిక్‌రావ్ ఠాక్రే, కోదండరాం, రేవంత్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: కోదండరాం మరోమారు కాంగ్రెస్ పార్టీ చేయిపట్టి నడవాలని నిర్ణయించుకున్నారు. 2018 ఎన్నికల సందర్భంగా మహాకూటమిలో భాగంగా కాంగ్రెస్‌తో కలసి పనిచేసిన ఆయన ఈసారి ఎన్నికల్లోనూ ఆ పార్టీ పక్షానే నిలబడ్డారు. తెలంగాణ జనసమితి (టీజేఎస్) ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతిస్తుందని ప్రకటించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి లేని నేపథ్యంలో తమ పార్టీ శ్రేణులు కాంగ్రెస్ విజయానికి కృషి చేస్తాయని, కేసీఆర్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకే కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నామని ఆయన ప్రకటించారు. టీజేఎస్ మద్దతిచ్చేందుకు ఆరు డిమాండ్లను కాంగ్రెస్ ముందుంచారు. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ విధాన రూపకల్పనలో ఈ అంశాలకు తగిన ప్రాధాన్యతనివ్వాలని కోరారు.

రేవంత్, ఠాక్రేతో చర్చలు..

ఇప్పటికే పలుమార్లు కాంగ్రెస్ పెద్దలు, రాష్ట్ర నాయకత్వంతో చర్చించిన కోదండరాం ఎన్నికల వేళ మళ్లీ కాంగ్రెస్ నేతలతో భేటీ అయ్యారు. సోమవారం టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే తదితరులు నాంపల్లిలోని టీజేఎస్ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాంతోపాటు ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వరరావు, ధర్మార్జున్ తదితరులతో గంటకుపైగా చర్చించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై గత పదేళ్లుగా టీజేఎస్, కోదండరాం పోరాడుతున్నందున తెలంగాణకు పట్టిన చీడ, పీడ వదలాలంటే వారి సహకారం అవసరమని రేవంత్ కోరారు. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో టీజేఎస్‌కు కీలక బాధ్యతలు అప్పగిస్తామని, ఎన్నికల క్షేత్రంలో ఇరు పార్టీల శ్రేణులు కలసి పనిచేసేందుకు అంగీకరించాలని విజ్ఞప్తి చేశారు. రేవంత్ విజ్ఞప్తిపట్ల సానుకూలంగా స్పందించిన కోదండరాం కాంగ్రెస్‌తో కలసి పనిచేసేందుకు అంగీకరించారు. చర్చల్లో భాగంగా టీజేఎస్ ఎక్కడెక్కడ పోటీ చేయాలన్న దానిపై కూడా చర్చించారు. సీట్లు కేటాయించాలంటే ఇప్పుడు మళ్లీ అధిష్టానంతో మాట్లాడాల్సి ఉంటుందని, ఈసారికి పోటీ లేకుండానే మద్దతివ్వాలని రేవంత్ తదితరులు కోదండరాం, టీజేఎస్ నేతలను కోరారు. వీలునుబట్టి ఇప్పటికైనా అవకాశం ఉన్న చోట పోటీకి అంగీకరించాలని, లేకపోయినా తమ మద్దతు ఇస్తామని టీజేఎస్ పక్షాన స్పష్టం చేశారు.

అండగా ఉంటామన్నారు: రేవంత్

ఇరు పార్టీల చర్చల అనంతరం రేవంత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు టీజేఎస్‌తో కలసి ముందుకెళతామన్నారు. టీజేఎస్ డిమాండ్లన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటామని, వాటిని నెరవేర్చడం కోసం సమన్వయ కమిటీని నియమించుకుంటామని చెప్పారు. టీజేఎస్ నుంచి ప్రభుత్వంలో భాగస్వామ్యం అయ్యేలా కమిటీ ఉంటుందని వెల్లడించారు. ప్రజలకు కోదండరాంపై విశ్వాసం ఉందని, కాంగ్రెస్ అధిష్టానం సూచన మేరకు ఆయన్ను కలసి మద్దతివ్వాలని కోరినట్లు వివరించారు. లక్ష్యాన్ని ముద్దాడే వరకు అండగా ఉంటామని కోదండరాం హామీ ఇచ్చారని, సీట్లు ఓట్లు కంటే ఒక గొప్ప లక్ష్యం కోసం కలిసి పనిచేస్తున్నామని రేవంత్ వ్యాఖ్యానించారు.

మా ఫోన్లు హ్యాక్ చేస్తున్నారు

రాష్ట్రంలో కేసీఆర్ ప్రైవేటు సైన్యంపై తాము అధికారంలోకి వచ్చాక చర్యలు తీసుకుంటామని రేవంత్ చెప్పారు. తమ ఫోన్ల ట్యాపింగ్‌తో పాటు హ్యాక్ చేస్తున్నారని, కాంగ్రెస్‌ను నియంత్రించాలన్న ఆలోచనలతోనే ఇలాంటి చర్యలు చేస్తున్నారన్నారు. తమకు సహకరించాలనుకుంటున్న వారిని బెదిరిస్తున్నారని, తాము ప్రైవేటుగా మాట్లాడిన మాటలను వింటున్నారని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చాక కేసీఆర్ సైన్యంలో పనిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకుండా ఎంఐఎం, బీఆర్ఎస్ కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు.

టీజేఎస్ 6 డిమాండ్లు ఇవే..

- అందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించాలి.
- ఉపాధి, ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ఆర్థిక విధానాల రూపకల్పన జరగాలి. ఏ సంవత్సరం ఏర్పడిన ఉద్యోగ ఖాళీలను ఆ సంవత్సరమే భర్తీ చేయాలి. ప్రైవేటు పరిశ్రమల్లో స్థానికులకు అవకాశాలు కల్పించాలి.
- సంప్రదాయ వృత్తులపై ఆధారపడి బతుకుతున్న వారికి ఆదాయ భద్రత కల్పించాలి. చిన్న, సూక్ష్మ, కుటీర పరిశ్రమల ఎదుగుదలకు చర్యలు తీసుకోవాలి.
- వాస్తవ వ్యవసాయ సాగుదారులను గుర్తించాలి. చిన్న, సన్న, కౌలు రైతుల ఆదాయ భద్రత సాధించాలి. భూమి హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి.
- ప్రజాస్వామిక పాలన నెలకొల్పాలి. కేసీఆర్ అవినీతిపై విచారణ జరిపించాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా, మైనారిటీ, పేదలకు పాలనలో, అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించాలి.
- ఉద్యమకారుల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేయాలి. అమరుల కుటుంబాలకు సమగ్ర సాయం అందించాలి.

నిరంకుశ పాలన రాజ్యాంగ స్ఫూర్తికి దెబ్బ

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశ పాలన, మతవాదం, నకిలీ జాతీయవాదం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర 2వ మహాసభల ప్రతినిధుల సభ సోమవారం ఇక్కడి తేరాపంత్ భవన్‌లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కూనంనేని మాట్లాడుతూ, ప్రధాని మోదీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హక్కు, జీవనోపాధి సమస్యల కోసం యువత పోరాడవలసిన దుస్థితి ఏర్పడిందన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుకోవటానికి ఏఐవైఎఫ్ ఒక శక్తిమంతమైన యువజన ఉద్యమాన్ని నిర్మించాలని కూనంనేని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ నాయకుడు ఆర్. తిరుమలై మాట్లాడుతూ.. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణతో దేశంలో ఉద్యోగాల పరిస్థితి పూర్తిగా దిగజారిందని, ఇటీవలి సంవత్సరాలలో ఉపాధి పొందిన వ్యక్తుల సంఖ్య పడిపోయిందని అన్నారు. ఈ సభలో సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లహ్ ఖాద్రి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న కూనంనేని

రజాకార్ చిత్రాన్ని బ్యాన్ చేయాలనడం సరికాదు

- సీఈవోకు సినిమా నిర్మాత గూడూరు విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: రజాకార్ సినిమాను నిషేధించాలని పలువురు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో)కి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆ సినిమా నిర్మాత గూడూరు నారాయణరెడ్డి సీఈవోను కలిశారు. జరిగిన చరిత్రను, వందకు పైగా పుస్తకాల ఆధారంగా చిత్రం నిర్మించామని తెలిపారు. ఒక్క నిమిషం 40 సెకన్ల వీడియో చూసి చిత్రాన్ని బ్యాన్ చేయాలనడం సరైంది కాదన్నారు. రజాకార్ ప్రత్యేకంగా ఒక మతాన్ని ఉద్దేశించి తీసిన సినిమా కాదని, 1947 నుంచి 1948 వరకు జరిగిన మారణహోమం గురించి సినిమాలో చూపిస్తున్నామని వివరించారు. సినిమాను బ్యాన్ చేసేది ఎలక్షన్ రూల్ బుక్‌లో లేదని సీఈవో వికాస్ రాజ్ తెలిపారు. అనంతరం గూడూరు మాట్లాడుతూ సినిమా గురించి పూర్తిగా సీఈవోకు తెలియజేశామని, సినిమా గురించి అందరూ నిజాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.

సర్పంచ్ పదవికి వేలం!

- రూ.9.35 లక్షలకు ఖరారు

మొగుళ్లపల్లి: గుడి నిర్మాణం కోసం నిధుల్లేక సర్పంచ్ పదవికి వేలం పాట నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం అంకుశాపురంలో సోమవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. అంకుశాపురంలో గ్రామస్తులు పోచమ్మ తల్లి ఆలయాన్ని నిర్మించుకుంటున్నారు. ఇందుకు అవసరమైన నిధులు లేకపోవడంతో రాబోయే సర్పంచ్ పదవికి స్థానిక హనుమాన్ ఆలయం ముందు వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ముగ్గురు పోటీ పడగా.. రూ.9.35 లక్షలకు ఓ వ్యక్తి పదవిని వేలంలో దక్కించుకున్నట్లు తెలిసింది. సర్పంచ్ ఎన్నికలకు ఇంకా నాలుగు నెలల సమయం ఉన్నా.. ముందుగానే ఇలా వేలం వేయడం గమనార్హం. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున ఈ విషయం బయటకు పొక్కకుండా గ్రామస్తులు జాగ్రత్త పడినట్లు సమాచారం.

ఓట్ల కోసమే బీజేపీ బీసీ సీఎం డ్రామా: వీహెచ్

సాక్షి, హైదరాబాద్: ఓట్ల కోసమే బీజేపీ బీసీ సీఎం డ్రామా నడిపిస్తోందని కాంగ్రెస్ మాజీ ఎంపీ వి.హన్మంతరావు వ్యాఖ్యానించారు. బీసీ వర్గాలకు చెందిన ప్రధానినని చెప్పుకునే నరేంద్ర మోదీ కనీసం బీసీ క్రీమీలేయర్‌ను ఎత్తివేయలేదని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయలేదని, రిజర్వేషన్లు పెంచలేదని, బీసీ కులగణన చేయలేదని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీ నేతను దించేసి అగ్రకుల నేతను నియమించిందని గుర్తుచేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీలను మోసం చేసి ఓట్లు దండుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోందని చెప్పారు.

పోటీ చేయనప్పుడు పార్టీ ఎందుకు?

▶ మొదటి పేజీ తరువాయి

లెక్కలేదు'అని కాసాని చెప్పారు.

గంగలో పోసిన పన్నీరు

తెలంగాణలో టీడీపీని బలోపేతం చేసేందుకు పడిన కష్టమంతా గంగలో పోసిన పన్నీరుగా మారిందని కాసాని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేసేందుకు చంద్రబాబు ఆసక్తి చూపలేదని ఆరోపించారు. గత కొద్ది రోజులుగా బాబు, లోకేశ్‌ని సంప్రదించినా ఎటువంటి సమాధానం రాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. తెలంగాణలో టీడీపీ ఉనికి కోసం బాబు ఆహ్వానించడంతోనే తాను ఆ పార్టీలోకి వెళ్లానని, తనకు పూర్తి స్వేచ్ఛ ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. తెలంగాణలో టీడీపీని కాపాడాలని బాబు కోరారన్నారు. బాబు ఆదేశాల మేరకు ఖమ్మంలో భారీ బహిరంగసభ పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో గ్రామాల్లోకి వెళ్లి జెండా ఎగరవేశామని, ఇంటింటికి టీడీపీ కార్యక్రమం పేరుతో ప్రజల వద్దకు వెళ్లినట్లు వివరించారు. 17 పార్లమెంటు స్థానాల్లో కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు.

బీసీలకు హామీలు ఇచ్చాం

బీసీలకు అధిక సీట్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లాలని భావించినప్పటికీ, అటువైపు అడుగులు వేయలేదని కాసాని చెప్పారు. బీసీలకు 50 శాతం సీట్లు ఇస్తామని హామీ ఇచ్చామని, నాయీ బ్రాహ్మణులు, రజకులకు తొలి టికెట్ చంద్రబాబే ప్రకటించారని గుర్తు చేశారు. ఇప్పుడు వారంతా ఎదురు చూస్తుంటే పోటీ చేయబోమని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఏపీలో బీజేపీ, జనసేనతో కలిసి పోటీ చేయాలని నిర్ణయించడం, తెలంగాణలో పోటీకి దూరంగా ఉండటంతో కొంతమంది నేతలు కాంగ్రెస్‌కు ఓట్లు వేయాలని చెప్పడంతో దూరం పెరిగిందని భావిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ ఎన్నికల కోసం బాలకృష్ణ, లోకేశ్‌ను సంప్రదించినా స్పందించలేదని, ఇప్పటికే పోటీ కోసం 30 మందిని ఫైనల్ చేసినా వారికీ బీ-ఫారం ఇవ్వలేదని అన్నారు. కేడర్‌కు అన్యాయం చేయడం తనను కలచివేసిందన్నారు.

పోటీ చేయకపోతే పార్టీ ఎందుకు?

ఈ శాసనసభ ఎన్నికల్లో సొంతంగా డబ్బులు ఖర్చు పెట్టుకుని పోటీ చేయాలనుకునే 67 మంది అభ్యర్థులను ఆయా నియోజకవర్గాల కోసం ప్రాథమికంగా ఎంపిక చేసినట్లు కాసాని చెప్పారు. ఎన్నికల కోసం ఐదేళ్లుగా ఎదురుచూసిన పార్టీ నేతలకు అన్యాయం జరిగిందన్నారు. చంద్రబాబును శుక్రవారం రాజమహేంద్రవరం జైల్లో కలిసి టీటీడీపీ తరపున పోటీ చేసే అంశం గురించి మాట్లాడితే 'మనం పోటీ చేయడం లేదు'అని చెప్పారని, దాంతో తనకేం మాట్లాడాలో అర్థం కాలేదన్నారు. చంద్రబాబు వ్యాఖ్యల నేపథ్యంలో ఆదివారం పార్టీ కార్యాలయంలో మీటింగ్ పెడితే పార్టీ తెలంగాణ నాయకులు, కార్యకర్తలంతా పోటీ చేయాల్సిందేనని పట్టుబట్టారని అన్నారు. మీటింగ్‌కు పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ హాజరుకాలేదని, ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదన్నారు. కార్యకర్తలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేక పోతున్నందున ఇక టీడీపీలో కొనసాగలేనని, అందుకే రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. చిన్న పార్టీలు కూడా ఎన్నికల్లో పోటీ చేసి సత్తా చూపాలని తాపత్రయపడుతున్నాయని, రాజకీయ పార్టీ అంతిమ లక్ష్యం ఎన్నికల్లో పోటీ చే యడమేనని వివరించారు. ఎన్నికల్లో పోటీ చేయొద్దంటే పార్టీ ఎందుకని ప్రశ్నించారు. పోటీ చేయనప్పుడు ఎందుకు పోటీ చేయడం లేదనే విషయాన్ని అయినా చెప్పాలి కదా అని ప్రశ్నించారు. తన కేడర్ తో మాట్లాడాక భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తా నన్న అయన.. కుత్బుల్లాపూర్ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తితో ఉన్నట్లు చెప్పారు. గతంలోనే బీఆర్ఎస్ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు సంప్రదించారని తెలిపారు.

నేడే కాంగ్రెస్ అభ్యర్థుల తుది జాబితా!

- ఇప్పటికే పలు దఫాలుగా రాష్ట్ర నేతలతో ఖర్గే చర్చలు
- మరోమారు చర్చల అనంతరం జాబితా ప్రకటన

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఇంకా ప్రకటించని 19 స్థానాల అభ్యర్థుల ఎంపికకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ కసరత్తు తుది దశకు చేరుకుంది. ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక బాధ్యత ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి కట్టబెట్టిన నేపథ్యంలో ఆయన దీనిపై దృష్టి సారించారు. ఆదివారం తెలంగాణ పర్యటన సందర్భంగానే ఆయా స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై రాష్ట్ర నేతల అభిప్రాయాలు తీసుకున్న ఖర్గే సోమవారం కూడా కొందరు నేతలతో చర్చించారు. పటాన్‌చెరు, నారాయణఖేడ్, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాలకు సంబంధించి సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర రాజనర్సింహతో మాట్లాడిన ఖర్గే, కమ్యూనిస్టులతో పొత్తులు, వారికి సంబంధించిన సీట్లపై పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతో చర్చించారు. నల్లగొండ జిల్లాకు సంబంధించిన స్థానాలపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అభిప్రాయాలు తెలుసుకున్నట్లు తెలుస్తోంది.

కమ్యూనిస్టులకు ఇచ్చే ఆ నాలుగు మినహా

కమ్యూనిస్టులకు ఇవ్వాలని భావిస్తున్న నాలుగు నియోజకవర్గాలు మినహా, మిగతా 15 స్థానాలకు అభ్యర్థులను సోమవారం సాయంత్రానికే ఫైనల్ చేస్తారని భావించారు. అయితే రాజస్తాన్ అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన కసరత్తులో అధిష్టాన పెద్దలు బిజీగా ఉండటంతో ఆ ప్రక్రియను మంగళవారం పూర్తి చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మంగళవారం రాత్రికి లేదా బుధవారం ఉదయానికి జాబితా ప్రకటించే అవకాశం ఉంటుందని ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఆయా నియోజకవర్గాల నుంచి టికెట్ ఆశిస్తున్న నేతలంతా ఢిల్లీలోనే తిష్టవేసి అధిష్టాన పెద్దలను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

పథకాల అమలుపై వివరణ ఇవ్వండి

- కాంగ్రెస్ వినతి నేపథ్యంలో సంక్షేమ శాఖలను కోరిన ఎన్నికల సంఘం
- పూర్తి సమాచారంతో నివేదిక సమర్పించాలని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను లబ్ధిదారులకు అందిస్తున్న తీరుపై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నప్పుడు పథకాల పంపిణీ ఎలా ఉండాలి? నిబంధనల అమలు ఎలా ఉంది? అనే కోణంలో పరిశీలన మొదలుపెట్టింది. దళితబంధు, రైతుబంధు, బీసీ బంధులాంటి పథకాలకు సంబంధించి ప్రస్తుత సమయంలో లబ్ధిదారులకు సాయం అందించే అంశంపై కాంగ్రెస్ పార్టీ ఇటీవల ఎన్నికల సంఘం దృష్టికి తీసుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ పథకాల కింద ఎంపిక చేసిన లబ్ధిదారులకు నోటిఫికేషన్ వచ్చే నాటికి లబ్ధి చేకూర్చాలని, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత పంపిణీ చేస్తే ఓటర్లు ప్రభావితమయ్యే అవకాశం ఉంటుందని టీపీసీసీ ఎన్నికల సంఘానికి వివరించింది. దీంతో స్పందించిన ఎన్నికల సంఘం.. సంబంధిత శాఖలను వివరణ కోరింది. తక్షణమే స్పందించి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించింది.

నివేదికలు సిద్ధం

సంక్షేమ పథకాల అమలుపై ఎన్నికల సంఘం నివేదిక కోరడంతో సంబంధిత శాఖలు వివరణ ఇచ్చేందుకు ఉపక్రమించాయి. పథకాల వారీగా శాఖలు ఇప్పటికే సమాచారాన్ని సిద్ధం చేసుకున్నాయి. దళితబంధు పథకం నియోజకవర్గం యూనిట్‌గా అమలు చేస్తున్న క్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గం మినహా మిగతా 118 నియోజకవర్గాల్లో లబ్ధిదారుల ఎంపిక జాబితాలు, నిర్వహించిన అవగాహన కార్యక్రమాలపై పూర్తిస్థాయి సమాచారంతో ఎస్సీ కార్పొరేషన్ సిద్ధమైంది. కాగా, రెండోవిడత దళితబంధు పథకం కింద నియోజకవర్గానికి ఐదు వందల మంది లబ్ధిదారులకు సాయం ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌కు అనుమతి ఇచ్చింది. దీంతో క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేల ద్వారా పలు సిఫార్సులు రావడంతో వాటిని పరిశీలించి అర్హులను ఎంపిక చేసినట్లు తెలిసింది. ఈ పథకం కింద మొదటి విడతలో కూడా ఎంతమందికి లబ్ధి చేకూర్చారన్నది కూడా ఎన్నికల సంఘానికి వివరించనుంది. అదేవిధంగా రైతుబంధు పథకం కింద గత ఐదేళ్లుగా పంపిణీ చేసిన మొత్తంతో పాటు ప్రస్తుతం ఉన్న లబ్ధిదారులు, వారికి ఇవ్వాల్సిన నిధులు తదితర సమాచారాన్ని సైతం వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. దీంతోపాటు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అమలు చేస్తున్న బీసీబంధు పథకం కింద అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలను సమర్పించేందుకు సిద్ధమైంది. ఈ పథకం కింద ఎంతమందికి ఆర్థిక సాయం అందించారనే అంశాలను కూడా నివేదిక రూపంలో తయారుచేసి పెట్టుకుంది. సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఈ వివరాలను ఒకటి రెండు రోజుల్లో ఎన్నికల సంఘానికి సమర్పించనున్నట్లు సమాచారం.

ట్రాన్స్‌జెండర్‌కు బీఎస్పీ టికెట్

- వరంగల్ తూర్పు స్థానం చిత్రపు పుష్ప తలయకు కేటాయింపు
- 43 మంది అభ్యర్థులతో బీఎస్పీ రెండో జాబితా విడుదల



సాక్షి, హైదరాబాద్: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నుంచి పోటీ చేసే అభ్యర్థుల రెండో జాబితాను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో 43 మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాలో 26 మంది బీసీలతోపాటు ఆరుగురు ఎస్సీలు, ఏడుగురు ఎస్టీలు, ముగ్గురు అగ్రవర్ణాలు, ఇద్దరు మైనారిటీలకు చోటు కల్పించారు. వరంగల్ తూర్పు నుంచి చిత్రపు పుష్ప తలయ అనే ట్రాన్స్‌జెండర్‌ను బరిలోకి దింపడం గమనార్హం. ఈ నెల 3న 20 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించగా 43 మందితో కూడిన రెండో విడత జాబితాతో ఇప్పటివరకు ప్రకటించిన అభ్యర్థుల సంఖ్య 63కు చేరింది.

ఆ పార్టీలవి మాయమాటలు: ఆర్ఎస్ ప్రవీణ్..

ఎన్నికల్లో ఓట్ల కోసమే ఇతర రాజకీయ పార్టీలు మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నాయని ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. మాయమాటలతో వంచించే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీని నమ్మొద్దని ప్రజలను కోరారు. తెలంగాణలో బీసీని ముఖ్యమంత్రి చేస్తానన్న అమిత్ షా వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. బీసీ కులాలకు చెందిన బండి సంజయ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉంటే ఓర్వలేని ఆ పార్టీ... బీసీని సీఎం చేస్తామనడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. దేశంలో బీసీ ప్రధానిగా ఉన్నా బీసీ కులగణన ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. బీఎస్పీ జనబలం ముందు కేసీఆర్ ధనబలం పనికిరాదన్నారు. ఎన్నికల్లో డబ్బులు పంచే, ప్రలోభాలకు గురిచేసే పార్టీలకు ఓట్లను అమ్ముకోవద్దని ప్రజలకు సూచించారు. జనాభాలో 99 శాతం పేదలకు అధికారం దక్కాలన్నదే బీఎస్పీ లక్ష్యమన్నారు.

అసెంబ్లీ టికెట్లను అమ్ముకుంటున్న రేవంత్

- కాంగ్రెస్ బహిష్కృత నేత విజయ్‌కుమార్

కవాడిగూడ (హైదరాబాద్): తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు ప్రకటించిన వంద సీట్లలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి 50కి పైచిలుకు అసెంబ్లీ టికెట్లను పారాచూట్ లీడర్లకు అమ్ముకున్నారని కాంగ్రెస్ బహిష్కృత నేత టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కురువ విజయ్‌కుమార్ ఆరోపించారు. దీనికి స్పష్టమైన ఆధారాలతో తాము పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లామని వెల్లడించారు. సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద 'నాడు ఓటుకు కోట్లు-నేడు ఎమ్మెల్యే టికెట్లకు పోట్లు'.. 'పారాచూట్ ఎమ్మెల్యే అభ్యర్థులను ఓడగొడదాం.. మన అస్తిత్వాన్ని కాపాడుకుందాం'అంటూ పెద్దఎత్తున నిరసన తెలిపారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా రేవంత్‌రెడ్డి అక్రమ టికెట్ల అమ్మకాన్ని నిరసిస్తూ 'రేవంత్‌రెడ్డి హటావో.. కాంగ్రెస్‌కు బచావో' .. పేరుతో ఉన్న వాల్‌పోస్టర్‌ను విజయ్‌కుమార్ పలువురు నాయకులతో కలిసి ఆవిష్కరించారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విజయ్‌కుమార్, ఆయన అనుచరులు

ఎలాంటి సంజాయిషీ లేకుండా తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. 65 కాంగ్రెస్ అసెంబ్లీ టికెట్లను రూ. 800 కోట్లకు అమ్ముకున్నారని ఆయన ఆరోపించారు. అన్ని గ్రామాల్లో పర్యటించి రేవంత్ కుట్రలను బయటపెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాబా ఖలీమొద్దీన్, తిమ్మయ్య పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ కాంగ్రెస్ కార్యాలయంలో రభస


- ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చాలని కార్యకర్తల బీభత్సం

స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం రసాభాస చోటుచేసుకుంది. ముందుగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. 30 ఏళ్ల నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న తనను అధిష్టానం గుర్తించకపోవడంపై ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌లో బీసీలకు చోటు లేదా అని, వచ్చేనెల 3 వరకు దేవరకద్ర కాంగ్రెస్ అభ్యర్థిని మార్చకపోతే నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల అభీష్టం మేరకు స్వతంత్రంగా బరిలో ఉంటానని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌గౌడ్ విలేకరుల సమావేశం అనంతరం బయటకు వస్తున్న సమయంలో దేవరకద్ర నియోజకవర్గ కార్యకర్తలు ఒక్కసారిగా హంగామా చేశారు. కార్యాలయంలోని కుర్చీలు పగులగొట్టి ఫ్లెక్సీలను చించేసి బీభత్సం సృష్టించారు. దీంతో స్థానిక నాయకులు, దేవరకద్ర నియోజకవర్గ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.



డీసీసీ కార్యాలయంలో కార్యకర్త వీరంగం

మీ దూకుడూ.. ..సాటెవ్వరు



రాత్రికి రాత్రే పార్టీలు మారుతున్న అసంతృప్త నేతలు

టికెట్లు ఆశించి భంగపాటుతో గతంలో తిట్టిన పార్టీల్లోకే వెళ్తున్న వైనం

పార్టీలో ఉన్నప్పుడు ఒకలా.. పార్టీ మారగానే మరోలా విమర్శనాస్త్రాలు

తాజాగా పోటీకి అధినేత నిరాకరించడంతో టీటీడీపీ అధ్యక్ష పదవికి కాసాని రాజీనామా

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాన రాజకీయ పార్టీల నుంచి వలసలు ఊపందుకున్నాయి. టికెట్లు ఆశించి భంగపడ్డ నేతలంతా రాత్రికి రాత్రే పార్టీలు మారిపోతున్నారు. నిన్నటిదాకా తిట్టిపోసిన పార్టీల్లోనే దర్జాగా చేరుతూ తమను అక్కున చేర్చుకున్న పార్టీలను ఆకాశానికెత్తేస్తున్నారు. అదే సమయంలో నిన్నటిదాకా తమకు రాజకీయ భిక్ష పెట్టిన పార్టీలను దుమ్మెత్తిపోస్తున్నారు. అధికార బీఆర్ఎస్‌తోపాటు విపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలోనూ ఇదే ట్రెండ్ కనిపిస్తోంది.

రేఖా నాయక్, మైనంపల్లితో మొదలు...

బీఆర్ఎస్ దాదాపు రెండున్నర నెలల కిందటే అభ్యర్థుల జాబితాను ప్రకటించగా అప్పట్లో ఒకరిద్దరు నేతలు మినహా మరెవరూ ఆ పార్టీని వీడలేదు. ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్‌కు కేసీఆర్ టికెట్ నిరాకరించడంతో ఆమె అధికార పార్టీపై దుమ్మెత్తి పోశారు. ఎస్టీ మహిళనైన తనను పార్టీ బలిపశువు చేసిందని , మహిళలను గౌరవించని పార్టీలో కొనసాగలేనంటూ ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ తాజా జాబితాలో రేఖానాయక్ భర్త శ్యాం నాయక్‌కు టికెట్ కేటాయించింది. మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు రెండు టికెట్లు ఆశించి భంగపడటంతో ఏకంగా మంత్రి హరీశ్‌రావుపై తీవ్ర ఆరోపణలు చేశారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరడమే కాకుండా తనకు, తన కుమారునికి టికెట్లు ఖాయం చేసుకున్నారు.

రాజగోపాల్‌రెడ్డి యూటర్న్...: 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎన్నికైన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి 2022లో ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఆ సందర్భంలో ఆయన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ఓడించే పార్టీ బీజేపీయేనని... అందుకే ఆ పార్టీలోకి చేరినట్లు ప్రకటించారు. మునుగోడు ఉపఎన్నిక తరుణంలో రేవంత్‌రెడ్డి కూడా రాజగోపాల్‌రెడ్డిని దూషించారు. అదే రాజగోపాల్ రెడ్డి ఇప్పుడు తన అభిమానులు, కార్యకర్తలంతా కలసి బీఆర్ఎస్‌ను ఓడించడం ప్రస్తుత తరుణంలో కాంగ్రెస్‌కే సాధ్యమవుతుందని పేర్కొంటూ బీజేపీకి రాజీనామా చేసి తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. కాంగ్రెస్‌లో చేరిన కొన్ని గంటల వ్యవధిలోనే తిరిగి మునుగోడు టికెట్ తెచ్చుకున్నారు.

ఆల్ పార్టీ నేత నాగం...: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత నాగం జనార్దన్‌రెడ్డి ఒక్కప్పుడు టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసి ఆ తర్వాత వరుసగా పార్టీలు మారుతూ వస్తున్నారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో 2011లో టీడీపీకి రాజీనామా చేశాక సొంత పార్టీ పెట్టిన ఆయన 2013లో బీజేపీలో చేరిపోయారు. 2018లో ఆ పార్టీ నుంచి బయట కొచ్చి కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా కాంగ్రెస్ ఆయనకు నాగర్‌కర్నూల్ టికెట్ నిరాకరించడంతో ఆ పార్టీని దుర్భాషలాడుతూ అధికార బీఆర్ఎస్‌లో చేరిపోయారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో సీఎం కేసీఆర్ అవినీతికి పాల్పడ్డారంటూ గతంలో ఏకంగా కోర్టుకెక్కిన నాగం... తాజాగా అదే కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.



మరికొందరిదీ అదే దారి...

- ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేతలు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అధికార పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన వెంటనే టికెట్లు పొందారు. మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తనకు టికెట్ లభించే అవకాశం ఉన్న బీజేపీలో జాయిన్ అయ్యారు. జీహెచ్ఎంసీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా నామినేట్ అయిన కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, ఆయన సతీమణి బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరగా ఆ వెంటనే ఆయనకు శేరిలింగంపల్లి టికెట్ లభించింది.
- రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకునిగా ఉన్న మనోహర్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరిన వెంటనే ఆయనకు తాండూరు టికెట్ లభించింది.
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి జంప్ కాగానే ఆయనకు కల్వకుర్తి సీటు ఖరారైంది.
- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వీరేశం కూడా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ చేరగానే ఆయనకు టికెట్ కేటాయించిందా పార్టీ.
- నేరేడుచర్ల మున్సిపల్ వైస్-చైర్‌పర్సన్ శ్రీలతారెడ్డి బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. ఆమెకు హుజూర్‌నగర్ టికెట్ దక్కే అవకాశం ఉంది.

కొందరికి భవిష్యత్‌పై హామీలు...

కాంగ్రెస్, బీజేపీలో టికెట్ల రగడతో బీఆర్ఎస్‌లోకి సైతం భారీగానే మాజీ ఎమ్మెల్యేలు చేరుతున్నారు. అయితే వారికి ఇప్పటికిప్పుడు సీట్లు కేటాయించే అవకాశం లేకపోవడంతో భవిష్యత్తులో మంచి స్థానం కల్పిస్తామని అధికార పార్టీ హామీలు ఇస్తోంది. ఇలా చేరిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు/మంత్రులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎ.చంద్రశేఖర్, ఎర్ర శేఖర్, గద్వాల డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, మెదక్ డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్, రాగిడి లక్ష్మారెడ్డి, నిర్మల్ బీజేపీ అధ్యక్షురాలు రమాదేవి, పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, కొత్తగూడెం బీజేపీ అధ్యక్షుడు కోనేరు చిన్ని తదితరులు ఉన్నారు. తెలంగాణ ఎన్నికల్లో పోటీకి టీడీపీ అధినేత చంద్రబాబు నిరాకరించడంతో టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ తాజాగా పదవికి రాజీనామా చేశారు. ఆయన బీఆర్ఎస్‌లో చేరడానికి రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.

జంగ్ తెలంగాణ

ఓట్ దిస్ పాయింట్

ఎన్నికల అఫిడవిట్ అంటే ఏమిటి? అందులో ఎలాంటి సమాచారం ఉంటుంది?

శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలతో అఫిడవిట్ (ప్రమాణ పత్రాన్ని)ను తప్పనిసరిగా రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. తమ విద్యార్హతలు, నేర చరిత్ర, తనతో పాటు తన జీవిత భాగస్వామి, పిల్లల ఆస్తులు, అప్పుల వివరాలను నిర్దేశిత నమూనాలో నోటరీ ద్వారా ప్రమాణం చేసి అఫిడవిట్ రూపంలో సమర్పించాల్సి ఉంటుంది. అసంపూర్తిగా ఉన్న అఫిడవిట్‌లను సమర్పిస్తే రిటర్నింగ్ అధికారులు సదరు అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించవచ్చు. అఫిడవిట్‌లో తప్పుడు వివరాలు ఇచ్చినా, వాస్తవాలను దాచినా సదరు అభ్యర్థి ఎన్నికను సవాలు చేస్తూ ప్రజాప్రాతినిధ్య చట్టం కింద హైకోర్టులో కేసు వేయవచ్చు.

గోండు భాషను రాజ్యాంగంలో చేర్చాలి

ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలి

ఏజెన్సీల్లో వలసవాదులకు చెక్‌పెట్టాలి

నిర్వీర్యమైన ఐటీడీఏలను పునర్వ్యవస్థీకరించాలి

గిరిజన నిరుద్యోగుల కోసం స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలి

పీపుల్స్ మేనిఫెస్టో 'సాక్షి' చర్చావేదిక

సాక్షి, ఆదిలాబాద్: ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడే పాలకులను ఆదరిస్తామని ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు చెప్పారు. ఐటీడీఏలు ఉండీ లేనట్టుగా తయారయ్యాయని, నిర్వీర్యమైన వాటిని పునర్వ్యవస్థీకరించి పూర్తిస్థాయి అధికారులను నియమించి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి అనే అంశంపై సోమవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని రాంజీగోండ్ భవనంలో నిర్వహించిన 'సాక్షి' చర్చావేదికలో రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విశ్వంరావు, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుడ్మెత తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావు, జై ఆదివాసీ యువశక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ హన్మంతరావు, ఆంద్ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ముకాడే విష్ణు, రాంజీగోండ్ ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షుడు మర్సుకోల తిరుపతి, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయికె విష్ణు, తొడసం రాధాబాయి పాల్గొన్నారు.

ఆదివాసీ క్షేత్రాల అభివృద్ధికి నిధులు

గోండు భాషను రాజ్యాంగంలో చేర్చాలని ఆదివాసీలు డిమాండ్ చేశారు. పవిత్ర ఆదివాసీ క్షేత్రాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలన్నారు. గోండు రాజుల కోటలను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. గోండు భాష అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేయాలని కోరారు. ఆదివాసీ తెగలైన తోటి, పర్ధాన్ కళల రక్షణ, నాయక్‌పోడ్, గోండు కళలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ జిల్లాలో 50 ఎకరాల స్థలంలో గోండువన గోటుల్ ఏర్పాటు చేయాలని కోరారు.

ఇవీ డిమాండ్లు..

- ఏజెన్సీల్లోకి లంబాడీలు 1977 తర్వాత వచ్చారు. వలస వాదులను నివారించి ఆదివాసీ గిరిజనుల అభివృద్ధిపై దృష్టి సారించాలి.
- గిరిజన గ్రామాలకు రోడ్డు కనెక్టివిటి లేదు. అటవీ శాఖ అనుమతులు ఇవ్వని కారణంగా అనేక రోడ్ల నిర్మాణాలు ఆగిపోయాయి. వీటిని పరిష్కరించాలి.
- ఏజెన్సీ ప్రాంతాలున్న జిల్లాల్లో జాతీయస్థాయి ఆస్పత్రులు, యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలి.
- సైనిక్, నవోదయ పాఠశాలల్లో ఆదివాసీ విద్యార్థులకు ప్రత్యేక సీట్లు కేటాయించాలి. ఆశ్రమ పాఠశాలల్లో పౌష్టికాహారం అందించాలి.
- పరిశ్రమల ఏర్పాటు ద్వారా గిరిజన ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యను నివారించాలి.
- ఏజెన్సీల్లో ప్రతీ చేనుకు బోర్‌వెల్ ఏర్పాటు చేయాలి. చెరువుల అభివృద్ధి చేపట్టాలి.
- సింగరేణిలో ఆదివాసీ భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలి.
- ఏజెన్సీ చట్టాలు 1/70, పేసా వంటి వాటిని పకడ్బందీగా అమలు చేయాలి.
- ఏజెన్సీ ప్రాంతాల్లో సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి చేయాలి.
- ఆదివాసీలను అడవుల నుంచి దూరం చేసే చట్టాలను ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలి.
- అటవీ వస్తువులను ఐటీడీఏ ద్వారా కొనుగోలు చేయాలి.
- గిరిజన యూనివర్సిటీని ఉట్నూర్‌లో ఏర్పాటు చేయాలి.
- మినీ పారిశ్రామిక కేంద్రాలు ఏర్పాటు చేయాలి.



ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ రాంజీగోండ్ భవన్‌లో 'సాక్షి' చర్చావేదికలో పాల్గొన్న ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు

ఆ కారులో రూ.99 లక్షలు..

హఫీజ్‌పేట్ : చందానగర్ ప్రధాన రోడ్డులోని జాకీ షోరూం వద్ద సరైన పత్రాలు లేకుండా వాహనంలో తరలిస్తున్న రూ.99 లక్షల మొత్తాన్ని ఎస్ఓటీ, చందానగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ డబ్బుకు సంబంధించి సరైన పత్రాలు చూపించకపోవడంతో సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అప్పగిస్తున్నట్టు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. హఫీజ్‌పేట్ మార్తాండనగర్‌కు చెందిన వైదల నాగరాజు వాహనంలో ఈ మొత్తం పట్టుబడిందన్నారు.



పార్టీ ఏదైతేనేమీ.. పని దొరికితే చాలు!





పార్టీ ఏదైతేనేమి... కుటుంబం గడవడానికి రోజు పని దొరికితే చాలు.. అని ఓ దివ్యాంగురాలు వివిధ పార్టీల తరఫున అసెంబ్లీ ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటోంది. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం పజ్జూరుకు చెందిన పద్మ తన భర్త నాగిరెడ్డితో కలిసి నల్లగొండ పట్టణంలో ఉంటోంది. భర్త కూడా దివ్యాంగుడే. దివ్యాంగుల పెన్షన్‌తోనే జీవనం సాగిస్తున్నారు. ఈ దంపతులకు ఓ కుమారుడు కూడా ఉన్నాడు. పద్మ ఏమీ చదువుకోలేదు. ఎంఏ, బీఈడీ చేసిన నాగిరెడ్డి డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నాడు. పద్మ మాత్రం రోజు ఏదో ఒక పార్టీ ప్రచారానికి వెళ్తూ రూ.200 నుంచి రూ.300 సంపాదిస్తోంది. అందుకే తన కుమారుడితో కలిసి ట్రైసైకిల్‌పై కూర్చొని ఇలా ప్రచారానికి వెళ్తున్నట్లు పద్మ "సాక్షి"తో మాట్లాడుతూ చెప్పింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

అందరూ అధ్యక్షా అనాలనే!

ఎంపీ, ఎమ్మెల్సీ పదవుల్లో ఉన్నా కూడా అసెంబ్లీకే జై!



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఎంపీలుగా గెలిచినా, రాజ్యసభకు వెళ్లినా..ఎమ్మెల్సీలుగా ఎన్నికైనా ప్రస్తుత రాజకీయాల్లో అందరికీ శాసనసభలో అడుగుపెట్టి అధ్యక్షా అనాలనే ఉత్సుకత..ఆసక్తే ఎక్కువగా కనిపిస్తోంది. ఎంపీ, ఎమ్మెల్సీ కంటే ఎమ్మెల్యే గారూ అంటేనే వచ్చే కిక్కు వేరే లెవెల్ అన్నదే ఇప్పుడు రాజకీయనేతల మనసుల్లో నాటుకు పోయింది. ఆ క్రమంలో జిల్లాలో ఎమ్మెల్సీలు, ఎంపీలు ఎవరెవరు ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే బరిలో దిగారని ఒక్కసారి చూస్తే...

ఇద్దరు ఎమ్మెల్సీలు..!



ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో హుజురాబాద్ అసెంబ్లీ స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌తో ఎమ్మెల్సీ పాడికౌశిక్‌రెడ్డి పోటీ పడుతున్నారు. ఈయన 2021లో ఎమ్మెల్యే కోటా కింద ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తే.. తన స్థానానికి రాజీనామా చేయాల్సి వస్తుంది. దీంతో ఆ స్థానానిక ఉప ఎన్నిక జరుగుతుంది. ఇక ఈటల రాజేందర్ హుజురాబాద్‌తోపాటు గజ్వేల్‌లోనూ పోటీ చేస్తున్నారు. ఒకవేళ రెండుచోట్ల రాజేందర్ విజయం సాధిస్తే.. ఏదో ఒక అసెంబ్లీ స్థానానికి ఉపఎన్నిక తథ్యం.)



- మరో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి కూడా జగిత్యాల అసెంబ్లీ బరిలో ఉన్నారు. సీనియర్ కాంగ్రెస్ నేత అయిన జీవన్‌రెడ్డి 2019లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఒకవేళ అసెంబ్లీపోరులో ఈయన గెలిస్తే.. 2025 వరకు అంటే దాదాపు ఏడాదిన్నర సమయం ఉంది. దీంతో ఈయన స్థానానికి ఉపఎన్నిక అనివార్యమవుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఇద్దరు ఎంపీలు సైతం!



ఇద్దరు ఎంపీలు అసెంబ్లీకి పోటీ పడుతున్నారు. కోరుట్ల నుంచి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, కరీంనగర్ నుంచి బండి సంజయ్ అసెంబ్లీ బరిలో ఉన్నారు. వీరిద్దరూ విజయం సాధించినా.. ఆరునెలలు మాత్రమే వీరి పదవీకాలం మిగిలి ఉండటంతో ఉపఎన్నిక రాకపోవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఒకవేళ గెలవకపోయినా.. వీరి పదవులకు వచ్చిన ఢోకా ఏమీ ఉండదు.



మంత్రి అయినా సరే..

పువ్వాడ అజయ్ వాహనాన్ని తనిఖీ చేసిన పోలీసులు

రఘునాథపాలెం: సామాన్య వ్యక్తి అయినా, మంత్రి అయినా ఎన్నికల నిబంధనల మేరకు పోలీసులు పక్కాగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం కోయచలక గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వాహనాన్ని పోలీసులు, ఎన్నికల అధికారులు సోమవారం తనిఖీ చేశారు. వాహనాల్లో ఉన్న మంత్రి, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఇతర ప్రజాప్రతినిధులు పోలీసులకు పూర్తిగా సహకరించారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున అధికారులు తనిఖీ చేయడం సహజమని, తాను ఎప్పుడైనా సహకరిస్తానని మంత్రి పువ్వాడ అన్నారు. వారం రోజుల క్రితం పుట్టకోట క్రాస్ రోడ్డు వద్ద ఖమ్మం అర్బన్ పోలీసులు, కలెక్టర్ గౌతమ్ వాహనాన్ని సైతం తనిఖీ చేశారు.



కోయచలక క్రాస్ రోడ్డు వద్ద మంత్రి పువ్వాడ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

తెలంగాణ.. మిర్యాలగూడ.. అనాథ

గాసిప్ టైమ్

కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా గుర్తింపు పొందిన నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గం ఇప్పుడు అనాథగా మారిందనే చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌కు అక్కడ నాయకుడు లేకుండా పోయాడని, ఇందుకు కారణం పార్టీ అధినాయకత్వం వైఖరేనని అక్కడి శ్రేణులు కుమిలిపోతున్నాయి. రాష్ట్రం ఏర్పాటయ్యాక జరిగిన తొలి ఎన్నికల్లో అక్కడ కాంగ్రెస్ పార్టీనే గెలిచింది. కానీ, గెలిచిన ఎమ్మెల్యే పార్టీ ఫిరాయించడంతో అక్కడ చాలాకాలం పాటు కేడర్‌ను నడిపించే నాయకుడు లేకుండా పోయాడు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో చివరి క్షణంలో బీసీ పేరుతో హైదరాబాద్ నుంచి ఇంకో నాయకుడిని తెచ్చి కేడర్ నెత్తిన పెట్టారు. ఎన్నికలు అయ్యాక ఆయన పత్తా లేడు. ఇక, ఇప్పుడు పార్టీని కాపాడుకుంటూ, కేడర్‌ను సమన్వయం చేసుకుంటూ ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో పొత్తు పేరుతో కామ్రేడ్లు తమ నెత్తిన కూర్చుంటున్నారని అక్కడి కాంగ్రెస్ కేడర్ ఆవేదన వ్యక్తం చేస్తోంది. కామ్రేడ్లకు సీట్లు ఇచ్చే విషయంలో ఇతర జిల్లాలకు చెందిన నేతలు తమఏరియాలో సీట్లు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటుంటే నల్లగొండ జిల్లాకు చెందిన బడా నాయకులు మాత్రం తమకేమీ పట్టనట్టు మిర్యాలగూడను అనాథగా వదిలేశారని, కనీసం ఆ స్థానాన్ని కాంగ్రెస్‌కు కేటాయించాల్సిందేనని పట్టుపట్టే నాయకుడే లేకుండా పోయాడని కేడర్ ఆవేదన వ్యక్తం చేసింది. అదే జరిగితే, కామ్రేడ్లతో పొత్తు కుదిరితే మళ్లీ ఐదేళ్ల పాటు తాము అనాథలుగానే మిగిలిపోవాల్సి వస్తుందని నిట్టూరుస్తున్నారు. ఏం చేయగలరు... 'ఇండియా' కూటమి కోసం త్యాగం చేయడం తప్ప...!



ఎజెండాలో కపిరాజు ఎక్కడ?

కోతుల సమస్యను పట్టించుకోని పార్టీలు

సీరియస్ ఇష్యూ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎన్నికల నేపథ్యంలో ప్రజలను ఆకట్టుకునేందుకు రాజకీయపార్టీలు మేనిఫెస్టోలు ప్రకటించాయి. కానీ పల్లె, పట్నం, పేద, ధనిక అన్న తేడా లేకుండా అన్నిచోట్లా ఇబ్బందులకు కారణమవుతున్న కోతుల సమస్యను పూర్తిగా పక్కన పెట్టేశాయి. ఏ పార్టీ కూడా ఈ సమస్యపై ఇప్పటివరకు మాట్లాడలేదు.

జనావాసాలపై దాడులు..

అడవుల్లో ఉండాల్సిన కోతులు అక్కడ ఆహారం దొరక్క 20 ఏళ్లుగా ఊర్ల బాట పట్టాయి. మొదట్లో అడవుల గుండా వెళ్లే హైవేల పక్కన అడ్డా ఏర్పాటు చేసుకున్నాయి. వచ్చిపోయేవారు ఇచ్చే ఆహారం కోసం ఎదురుచూశాయి. ఇక అక్కడి నుంచి ఊర్లలోకి వచ్చిన తర్వాత పంట పొలాలు మొదలు ఇంట్లోని కిచెన్ వరకు ప్రతీ చోట కోతుల దాడి పెరిగింది.

కోతులు అడవులకు వెళ్లాలి

తెలంగాణ వచ్చిన కొత్తలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారం చేపట్టింది. 'వనాలు పెరగాలి – కోతులు అడవులకు పోవాలి' అనేది హరితహారం నినాదం. పదేళ్లు గడిచే సరికి తెలంగాణలో స్థూలంగా అడవుల విస్తీర్ణం పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. కానీ హరితహారం నినాదానికి తగ్గట్టుగా కోతులు అడవులకు పోలే దు సరికదా మరింతగా దాడులు చేస్తున్నాయి. ఈ దాడుల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. రైతులకు పంట నష్టం జరుగుతోంది.

కనిపించని ఫుడ్‌కోర్టులు

రాష్ట్ర వ్యాప్తంగా అనేక మండలాల్లో కోతుల కోసం ప్రత్యేకంగా మంకీ ఫుడ్ కోర్టులంటూ పండ్ల మొక్కలను ఎంపిక చేసిన స్థలాల్లో నాటారు. కానీ సరైన ఆలనా పాలన లేకపోవడంతో ఇవి నామరూపాల్లేకుండా పోయాయి.

అసెంబ్లీలో సైతం చర్చ

తెలంగాణ తొలి శాసనసభలో సీఎం కేసీఆర్ స్వయంగా కోతుల కారణంగా గ్రామాల్లో తలెత్తుతున్న ఇబ్బందులను ప్రస్తావించారు. నల్లగొండ జిల్లా తుంగతుర్తి లాంటి ప్రాంతాల్లో కోతుల కారణంగా కూరగాయల సాగుకు రైతులు దూరమయ్యారని చెప్పారు. కోతులు బాధ భయంకరంగా మారిందన్నారు. అడవుల్లో ఫలాలు ఇచ్చే వృక్షాలను పెంచడం తప్ప మరో మార్గం లేదన్నారు.

పరిహారం మాటేమిటి?

కోతుల కారణంగా జరుగుతున్న పంట నష్టానికి పరిహారం చెల్లించాలంటూ 2017లో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో నాటి కొత్తగూడెం ఎమ్మెల్యే జలగం వెంకట్రావు డిమాండ్ చేశారు. అప్పటి అటవీశాఖ మంత్రి జోగురామన్న కోతుల వల్ల ఇబ్బందులేమీ లేవని చెప్పే ప్రయత్నం చేయగా వరంగల్‌కు చెందిన ఎర్రబెల్లి దయాకర్‌రావు, అప్పటి స్పీకర్ మధుసూదనాచారి కోతుల సమస్య తీవ్రంగా ఉందంటూ చర్చలో తమ అభిప్రాయాలు తెలిపారు. ఆఖరికి కోతులను బెదరగొట్టేందుకు కొండెంగలు (కొండముచ్చులు) అద్దెకు తీసుకురావాలని అప్పటి శాసన సభ్యులు కోరారు. కోతుల నియంత్రణ కోసం రూ. 2.2 కోట్లతో నిర్మల్‌లో ప్రత్యేక సెంటర్ అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. అయితే ఆచరణ అంతంతగానే ఉంది. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రజలే స్వచ్ఛందంగా చందాలు వేసుకుని కోతులను పట్టుకునేందుకు ఇతర రాష్ట్రాల నుంచి నిపుణులను రప్పించుకున్నారు.

'శ్రీమంతుడు'.. సవాళ్లు!

ఇటీవలే బీజేపీ కీలకనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సూర్యాపేటలో మాట్లాడిన మాటలూ, విసిరిన సవాళ్లూ అచ్చం శ్రీమంతుడు సినిమాల్లోని డైలాగుల్లా అనిపించాయి. అంతే..ఇరుపార్టీల్లోనూ 'శ్రీమంతుడు' హీరోల్లాంటి ఆ జనధీరుల పెను సవాళ్లు ఎలా ఉంటాయోననిపించింది ఓ సగటు ఓటరుకు. ఆ డైలాగులివి...

....

మహేశ్‌బాబు సైకిలెక్కి పల్లెటూరు దేవరకోట..అందునా మారుమూల మామిడితోటకు వచ్చిన స్టైల్లోనే..ఢిల్లీ నుంచి ఆల్ వే సూర్యాపేట సభకు వచ్చారు అమిత్‌షా. దర్జాగా సభావేదిక ఎక్కి, కేసీఆర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ..కొన్ని హెచ్చరికలు చేశారు. అవి కూడా అచ్చం హీరోగారిలాగే...

- దళితులకు మూడెకరాల స్థలం ఇస్తామన్నారు.. ఇచ్చేయాలి.
- ఇళ్లు లేని అందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అన్నారు.. ఇచ్చేయాలి.
- దళితుల సంక్షేమంకోసం రూ.50 వేల కోట్లు ఇస్తామన్నారు..ఇచ్చేయాలి.
- బీసీ సంక్షేమంకోసం రూ.10 వేల కోట్లతో స్పెషల్‌బడ్జెట్ అన్నారు.. ఏది?
- అప్పట్లో దళితుని సీఎం చేస్తామన్నారు..చేశారా? లేదే.

మేం గనుక తెలంగాణలో పవర్‌లోకి వస్తే తప్పకుండా బీసీని సీఎం చేస్తాం. అంటూ చెప్పి వెళ్లిపోయారు.

....

అరెరె..కేసీఆర్‌తోనా డైలాగులు

అందునా కారు పార్టీ అధినేతతోనా జోకులు?

ముల్లును ముల్లుతోనే తీయాలి.

వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి.

అందుకే కేసీఆర్ కూడా అచ్చం మహేశ్‌బాబు లానే సైకిల్ తొక్కుతూ సభకు వచ్చారు.

మారుమూల మామిడితోటలో మంచాన్ని గిర్రున తిప్పి, సర్రున లాగినట్టుగా

సభలో మైకును తనవైపునకు చటుక్కున తిప్పుకున్నారు.

''ఇగో భాజపా నేతలూ..ఇగ ఇనండి మీ భాగోతాలు.

ఎవరికి తెల్వవు మీ ఏశాలు?

ఇప్పుడు నేనుకూడ అచ్చం మహేశ్‌బాబు లెక్కనే అడుగుతున్న.

జవాబు ఇయ్యుర్రి'' అనుకుంట ఈ సవాళ్ల ఇసిరిండు.

- ప్రతి ఒక్కడి అకౌంట్లకు పదిహేను లక్షలు ఏస్త అన్నరు. ఏసిన్రా?..ఏసెయ్యాలె.
- దేశంల ఏడాదికి రెండుకోట్ల మందికి ఉద్యోగాలు ఇప్పిస్త అన్నరు. ఇచ్చేయాలె.
- దేశంల ఉన్న రైతులందరి ఆదాయం డబుల్ చేస్త అన్నరు..చేసిన్రా? ఢిల్లీల వాహనాలతోని రైతులకు టక్కర్లిచ్చిన్రు. కార్ల టైర్లకింద తొక్కిచ్చిన్రు. ఎవడన్న చేస్తడా ఇట్ల? మీరన్నట్టే రైతుల ఇన్‌కమ్ డబుల్ చెయ్యాలె.
- 2022 నాటికి గంగానదిని పూర్తిగా పొల్యూషన్ నుంచి విముక్తి చేస్తనన్నరు?..ఇప్పటిదాంక చెయ్యలే..ఇప్పుడన్న చెయ్యాలె.
- 2022 నాటికి దేశంల ఉన్న ప్రతి ఒక్కడికి పక్కా ఇల్లు ఉంటదన్నరు? ఇయ్యాలె.
- అంతర్జాతీయంగ ధరలు తగ్గినా..పెట్రోలు, గ్యాసుల మీద ట్యాక్సులు పెంచుకుంటపొయ్యి..దాదాపు ఎన్నో లక్షల కోట్లు గుంజిన్రు. ఇంకా పన్నులేస్తూ, వసూలు జేసినయ్ జనాలకియ్యకపోతే ఇంకా లావైపోతరు..ఇచ్చేయ్యాలె.
- ఇగ మేం దళితుణ్ణి సీఎం చెయ్యలే గని..మీరు బీసీని సీఎం జేస్తరా? దానికే వస్తున్న. ఇగ మీరు అంతగనం సొక్కమైనోళ్లే అయితే..అంతగనం బీసీలను సీఎం చేసేటోళ్లయితే..ఇప్పటికే మీరు పాలించే యూపీల ఆ లుంగీ కట్టుకునేటాయన ఒకాయన రెండోసారి సీఎం కదా. ఆయన్ని దించి చెయ్యరాదుర్రి ఎవరైనా బీసీని సీఎమ్ముగా!!

ఈ మాట గీడ ఎందుకు చెబుతున్నరో మాకు తెల్వదా?

గెలిసేదీ, పెట్టేది లేదు..ఈడ అధికారంలకు ఎలాగూ రారు కాబట్టి...

అన్నింటికంటే ముఖ్యంగా..'గాలికి పొయ్యే పేలపిండి... కృష్ణార్పణం' కాబట్టి.



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

ఈసీ ఫేవరేట్ మహంతి

తాజాగా కరీంనగర్ సీపీగా నియామకం



ఫ్యామిలీ పిక్ : అవినాష్ , ఏకేమహంతి, రాజశ్రీ, అభిషేక్‌మహంతి (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: రాచకొండ కమిషనరేట్‌లో ట్రాఫిక్ డీసీపీ–1గా పనిచేస్తున్న 2011 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అభిషేక్ మహంతిని కరీంనగర్ పోలీసు కమిషనర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అక్కడ పని చేస్తున్న సుబ్బారాయుడిపై ఎన్నికల సంఘం బదిలీ వేటు వేసింది. ఆ పోస్టులో నియమించే అధికారులకు సంబంధించి వచ్చిన జాబితాను పరిశీలించిన ఈసీ అభిషేక్ మహంతి పేరును ఖరారు చేసింది. ఎన్నికల సమయంలో, ఇలాంటి పరిస్థితుల్లో పోస్టింగ్ ఇవ్వాలంటే ఈసీ ఆయా అధికారులకు సంబంధించిన అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది. వారి సమర్థతతో పాటు నిజాయతీ తదితరాలను చూసిన తర్వాతే ఖరారు చేస్తుంది. గత ఏడాదే తెలంగాణ కేడర్‌కు వచ్చిన అభిషేక్ మహంతి 2019లో ఆంధ్రప్రదేశ్ కేడర్‌లో ఉన్నారు. 2019 నాటి ఏపీ ఎన్నికల సమయంలో ఈయన తిరుపతి అర్బన్ ఎస్పీగా పనిచేస్తున్నారు. అప్పట్లో ఏపీలో పనిచేసిన ఎస్పీలపై ఈసీకి అనేక ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో వివిధ జిల్లాల వారిని బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్న ఎన్నికల సంఘం కడప ఎస్పీగా అభిషేక్ మహంతిని నియమించింది.

ఆ కుటుంబంలో ఎన్నో 'ఎన్నికల పోస్టింగ్స్'

అభిషేక్ మహంతితో పాటు ఆయన కుటుంబంలో కూడా 'ఎన్నికల పోస్టింగ్స్' సాధారణ అంశంగా మారడం గమనార్హం. అభిషేక్ తండ్రి అజిత్ కుమార్ మహంతి (ఏకే మహంతి) 1975 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఈయన హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గానూ పని చేశారు. 2009 ఎన్నికల సమయంలో అప్పటి డీజీపీ ఎస్ఎస్‌పీ యాదవ్ విచక్షణారహితంగా వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఆయనపై వేటు వేసిన ఈసీ ఆ స్థానంలో ఏకే మహంతిని నియమించింది. ఇక అభిషేక్ మహంతి సోదరుడు అవినాష్ మహంతి కూడా 2005 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఈయన ప్రస్తుతం సైబరాబాద్‌లో పరిపాలన విభాగం సంయుక్త పోలీసు కమిషనర్‌గా ఉన్నా రు. అవినాష్ మహంతికి కూడా గతంలో ఇదేవిధంగా ఎన్నికల పోస్టింగ్ వచ్చింది. 2018లో జరిగి న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొడంగల్‌లోని రేవంత్ ఇంటిపై పోలీసులు చేసిన దాడి తీవ్ర వివాదాస్పదమైంది. దీన్ని సీరియస్‌గా తీసుకున్న ఎన్నికల సంఘం వికారాబాద్ ఎస్పీ అన్నపూర్ణపై బదిలీ వేటు వేసింది. ఆ స్థానంలో నగర నేర పరిశోధన విభాగంలో (సీసీఎస్) డీసీపీగా పనిచేస్తున్న అవినాష్ మహంతిని నియమించింది. ఎన్నికల క్రతువును విజయవంతంగా పూర్తి చేసిన ఆయన సీసీఎస్‌కే తిరిగి వచ్చారు.

మహంతి ఫ్యామిలీలో ఎందరో ఐపీఎస్‌లు

ఏకే మహంతి మామ (భార్య తండ్రి) దామోదర్ చోట్రాయ్ తొలి సివిల్ సర్వీసెస్ బ్యాచ్ అయిన 1948 బ్యాచ్ ఒడిషా కేడర్ అధికారి. డీజీపీగా పదవీ విరమణ చేశారు. ఏకే మహంతి బావమరిది పీకే సేనాపతి 1967 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఒడిషా కేడర్‌లోనే డీజీపీగా రిటైర్ అయ్యారు.

జంగ్ తెలంగాణ పంచతంత్రం

మేమొస్తే రూ.500కే గ్యాస్ సిలిండర్

- 200 యూనిట్ల ఉచిత కరెంట్
- స్వయంసహాయక బృందాలకు రుణ మాఫీ
- ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రచారసభలో ప్రియాంకా గాంధీ హామీ



జల్‌బంధా: ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కొత్తగా మహతారీ న్యాయ్ యోజన పథకం ప్రారంభించి మహిళలకు రూ.500కే వంటగ్యాస్ అందిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంకా గాంధీ వాద్రా హామీ ఇచ్చారు. సోమవారం ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా జల్‌బంధాలో ఆమె ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు. ' మేం మళ్లీ అధికారంలోకి వస్తే దాదాపు 6,000 ప్రభుత్వ ఉన్నత మాధ్యమిక, ఉన్నత పాఠశాలలను స్వామి ఆత్మానంద్ ఇంగ్లిష్, హిందీ మీడియం స్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేస్తాం. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తాం. స్వయం సహాయక బృందాలు, సాక్ష్యమ్ యోజన కింద రుణాల పొందిన వారి రుణాలను మాఫీ చేస్తాం. కొత్తగా 700 గ్రామీణ పారిశ్రామిక పార్కులను నెలకొల్పుతాం. దీంతో వీటి సంఖ్య ఏకంగా 1,000కి చేరుతుంది. తివారా రకం పప్పు ధాన్యాన్ని రైతుల నుంచి కనీస మద్దతు ధరకే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలుచేయనుంది' అని ప్రియాంక పలు హామీ ప్రకటించారు. ' 2018 ఏడాది వరకు రాష్ట్రంలోని రవాణా రంగంతో సంబంధం ఉన్న 6,600 మందికిపైగా వాహన యజమానుల వాహన పన్నును మాఫీ చేస్తాం' అని ప్రకటించారు. వంట గ్యాస్‌పై మహిళలకు ఇచ్చే రూ.500 సబ్సిడీని నేరుగా వారి బ్యాంక్ ఖాతాలోనే జమచేస్తామని ర్యాలీ తర్వాత ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ పోస్ట్‌చేశారు.

మహిళలను తెలివితక్కువ వాళ్లుగా లెక్కగట్టారు

ర్యాలీ సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రభుత్వంపైనా ప్రియాంక నిప్పులు చెరిగారు. ' మధ్యప్రదేశ్‌లో 18 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉంది. అయినా అక్కడ మహిళలకు దక్కిన హక్కులు, రక్షణ శూన్యం. హింస పెరిగింది. ఆ రాష్ట్రంలో రోజూ సగటున 17 అత్యాచారాలు నమోదవడం సిగ్గుచేటు. ఇన్నాళ్లూ మహిళలను గాలికొదిలేసిన చౌహాన్ సర్కార్ రెండు నెలల క్రితం లాడ్లీ బెహనా పథకం మొదలుపెట్టి మహిళల ఖాతాలోకి కొంత మొత్తం జమచేయడం షురూ చేసింది. ప్రభుత్వం అకస్మాత్తుగా మహిళలపై ప్రేమ ఒలకబోస్తోంది. ఎన్నికల వేళ ఆమాత్రం తెలుసుకోలేనంత తెలివితక్కువ వారిగా మహిళలను లెక్కగట్టింది' అని ప్రియాంక ఆరోపించారు.

మిజోరంలో జెడ్‌పీఎం జోరు!

కాంగ్రెస్, ఎంఎన్‌ఎఫ్‌లకు గుబులు • ఆసక్తికరంగా మారిన ఎన్నికల పోరు

ప్రత్యేక రాష్ట్రం కోసం ఎంఎన్‌ఎఫ్ చేసిన పోరాటం ఫలించి 1987లో మిజోరం రాష్ట్రంగా ఏర్పడి నాటి నుంచి ఎంఎన్‌ఎఫ్, కాంగ్రెస్ మధ్యే అధికారం చేతులు మారుతూ వస్తోంది. ఈసారి పాలక ఎంఎన్‌ఎఫ్‌కే మొగ్గుందని భావిస్తున్నా కొత్తగా తెరపైకి వచ్చిన జెడ్‌పీఎం కాంగ్రెస్‌ను తోసిరాజని రెండో ప్రధాన పక్షంగా ఆవిర్భవించే దిశగా దూసుకెళ్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు పలు పార్టీల కూటమిగా తెరపైకి వచ్చిన జెడ్‌పీఎం ఇప్పుడు ఒకే పార్టీగా రూపుదిద్దుకుంది. పార్టీగా ఈసీ గుర్తింపు రాకపోవడంతో స్వతంత్రులుగా బరిలోకి దిగి ఏకంగా ఆరు స్థానాలు నెగ్గి కాంగ్రెస్‌ను మూడో స్థానంలోకి నెట్టేసింది! ఈ ఐదేళ్లలో పట్టణ ప్రాంతాల్లో పట్టు సాధించడమే గాక యువతను బాగా ఆకట్టుకుంటోంది. పార్టీ అధ్యక్షుడైన మాజీ ఐపీఎస్ అధికారి లాల్‌డుహోమా (73)కు రాష్ట్రవ్యాప్తంగా అభిమానులున్నారు. మణిపూర్ హింసాకాండలో బాధితులుగా మారి రాష్ట్రం వీడిన కుకీ గిరిజనులకు ఆశ్రయం కల్పించడం తనకు బాగా కలిసొస్తుందని ఎంఎన్‌ఎఫ్ చీఫ్, సీఎం జోరాం తంగా లెక్కలేసుకుంటున్నారు. కానీ ఇదొక్కటే ఆ పార్టీని గట్టెక్కిస్తుందని చెప్పలేమంటున్నారు పరిశీలకులు. ఆయన హయాంలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందన్న అసంతృప్తి ప్రజల్లో బాగా ఉంది. అంతేగాక ఉపాధి కల్పన, చెప్పుకోదగ్గ సంక్షేమ పథకాల వంటివేవీ లేకపోవడం కూడా బాగా మైనస్‌గా మారుతోంది. ఈ క్రమంలో ప్రజలు జెడ్‌పీఎం వైపు చూస్తున్నట్టు కన్పిస్తోంది.

ఈశాన్యాన బుల్లి రాష్ట్రం మిజోరంలో అసెంబ్లీ ఎన్నికల పోరు ఈసారి ఆసక్తికరంగా మారింది. ప్రతి రెండు ఎన్నికలకు ఓసారి అధికార పార్టీని సాగనంపడం ఇక్కడి ప్రజలకు అలవాటు. అలా కాంగ్రెస్, మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్‌ఎఫ్) వంతులవారీగా అధికారంలోకి వస్తూ ఉన్నాయి. కానీ ఈసారి జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం) జోరుతో పోరు ఆసక్తికరంగా మారింది. దానికి తోడు గత రెండు దశాబ్దాలుగా ఇద్దరిని మాత్రమే సీఎంలుగా చూసిన రాష్ట్రానికి ఈసారి కొత్త ముఖాన్ని ఆ పాత్రలో చూసే అవకాశం దక్కుతుందా అన్నది కూడా ఆసక్తికరమే...

కాంగ్రెస్ పొత్తు వ్యూహం

జెడ్‌పీఎం ముప్పును గమనించిన కాంగ్రెస్ కాస్త వ్యూహం మార్చింది. పీపుల్స్ కాన్ఫరెన్స్, జోరాం నేషనలిస్ట్ పార్టీలతో ఈసారి జట్టు కట్టింది. ఓటర్ల మనోగతాన్ని మలచడంలో కీలక పాత్ర వహించే చర్చి, మిజోరం పీపుల్స్ ఫోరం మద్దతు కోసం పార్టీలన్నీ ప్రయత్నాల్లో మునిగి తేలుతున్నాయి. మూడు పార్టీలూ మొత్తం 40 స్థానాల్లోనూ బరిలో దిగాయి.

మహిళలకు మొండిచేయి

మిజోరం జనాభాలో క్రైస్తవులే మెజారిటీ. రాష్ట్రంలో పురుషుల కంటే స్త్రీల జనాభా ఎక్కువ కావడం మరో విశేషం! కానీ టికెట్ల కేటాయింపులో మాత్రం మహిళలకు మొండిచేయే ఎదురవుతూ వస్తోంది. మూడు పార్టీలూ కలిపి కూడా ఈసారి కేవలం ఆరుగురు మహిళలే బరిలో ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



పార్టీ	2018	2013
ఎంఎన్‌ఎఫ్	26	5
కాంగ్రెస్	5	34
జెడ్‌పీఎం	8	-
బీజేపీ	1	0
ఇతరులు	0	1

- సాక్షి, నేషనల్ డెస్క్

50 ఎకరాలున్నా దారిద్య్ర రేఖ దిగువనే!

- చౌహాన్ సర్కార్ లంచాల ఫలితమిది
- కమల్‌నాథ్ ఆరోపణ

ఇండోర్: మధ్యప్రదేశ్‌లో శివరాజ్ సింగ్ చౌహాన్ సర్కార్ లంచాలకు బాగా అలవాటు పడిందని ఆ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు కమల్‌నాథ్ ఆరోపించారు. ఇండోర్ జిల్లాలో పార్టీ అభ్యర్థుల నామినేషన్ల పర్వంలో పాల్గొన్న సందర్భంగా కమల్‌నాథ్ ఇండోర్ జిల్లాలో సోమవారం మాట్లాడారు. ' సీఎం చౌహాన్ మోసగాళ్లలో మేటి. 18 ఏళ్లుగా రాష్ట్ర ప్రజల్ని మోసంచేస్తున్నారు. రాష్ట్రంలో ఒక అవినీతి విధానాన్ని సృష్టించారు. డబ్బులివ్వండి.. పని చేయించుకోండి. నిన్న రాయ్‌సేన్, విదిష ప్రాంతాల్లో సందర్శించి స్థానికుల సమస్యల్ని ఆలకించా. 50 ఎకరాల భూమి ఉన్న వ్యక్తులు సైతం అధికారులకు లంచమిచ్చి తమ పేరును దారిద్య్రరేఖకు దిగువ(బీపీఎల్) జాబితాలో చేర్పించుకునేంతగా లంచాల బాగోతం నడుస్తోందని అక్కడి స్థానికులు నాతో చెప్పారు. ఇది రాష్ట్రంలో లంచాల పరిస్థితికి దర్పణం పడుతోంది. రాష్ట్రాన్ని బీజేపీ నాశనం చేస్తోంది. విద్య, ఆరోగ్యం , పెట్టుబడులు.. ఒకటేమిటి ప్రతీ రంగాన్ని బీజేపీ రాష్ట్ర ప్రభుత్వం భ్రష్టుపట్టిస్తోంది. దీంతో రాష్ట్రంలో ఒక కోటి మంది నిరుద్యోగ యువత సమస్య తలెత్తింది' అని కమల్‌నాథ్ ఆరోపించారు.

రాజస్తాన్‌లో నామినేషన్లకు నోటిఫికేషన్ జారీ

జైపూర్: రాజస్తాన్ అసెంబ్లీకి నవంబర్ 25వ తేదీన జరిగే ఎన్నికలకు సోమవారం నామినేషన్ల ప్రక్రియ అధికారికంగా మొదలైంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. నామినేషన్ల దాఖలుకు నవంబర్ 6 ఆఖరు తేదీ. నవంబర్ 7 తేదీ కల్లా నామినేషన్ల పరిశీలన పూర్తవుతుంది. ఉపసంహరణకు నవంబర్ 9 చివరి తేదీ. రాష్ట్ర అసెంబ్లీలోని మొత్తం 200 సీట్లకు నవంబర్ 25వ తేదీన ఈవీఎంల ద్వారా ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఓట్ల లెక్కింపు డిసెంబర్ 3వ తేదీన చేపడతారు. ప్రజాప్రాతినిధ్య చట్టం–1951 ప్రకారం జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.10 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అదే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5 వేలు డిపాజిట్ చేస్తే సరిపోతుంది. నామినేషన్ వేసేటప్పుడు రిటర్నింగ్ అధికారి గదిలోకి అభ్యర్థి వెంట నలుగురు కంటే ఎక్కువ మంది వెళ్లరాదు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం 100 మీటర్ల పరిధిలో అభ్యర్థి కాన్వాయ్‌లో మూడు వాహనాలకు మించి ఉండరాదు. నామినేషన్ పత్రాలను ఉదయం 11 గంటలు–మధ్యాహ్నం 3 గంటలకు మధ్యలో స్వీకరిస్తారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలను తు.చ తప్పక అమలు చేయాలని సీఈవో ప్రవీణ్ గుప్తా రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయ్యే వరకు రిటర్నింగ్ అధికారులు సంబంధిత కార్యాలయాల్లోనే ఉండాలని, ప్రక్రియను సరిగ్గా వీడియోగ్రాఫ్ చేయాలని సూచించారు. ఏ అభ్యర్థి అయినా ఒకే నియోజకవర్గంలో నాలుగు నామినేషన్లు దాఖలు చేయవచ్చు, గరిష్టంగా రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేయవచ్చు.



సొంతూళ్లో సీఎం చౌహాన్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

బుధ్నిలో నామినేషన్ వేసిన సీఎం చౌహాన్

భోపాల్: బీజేపీ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సోమవారం తన సొంత నియోజకవర్గం బుధ్నిలో నామినేషన్ వేశారు. ఆయన అంతకుముందు భార్య సాధనతో కలిసి సొంతూరు జయిట్‌లోని సల్కన్‌పూర్ దేవి ఆలయంలో పూజలు చేశారు. నామినేషన్ దాఖలు సందర్భంగా బుధ్నిలో భారీ ర్యాలీలో పాల్గొన్నారు. తన ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను చూసి గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. 'ఇది నా పుట్టిన ఊరు, పవిత్ర భూమి, మాతృభూమి..'అంటూ ఆయన ఉద్విగ్నంగా ప్రసంగించారు. నియోజకవర్గం ప్రజలు, పెద్దల ఆశీర్వాదంతోనే నామినేషన్ వేస్తున్నట్లు తెలిపారు. బుధ్నిలో చౌహాన్ ప్రత్యర్థిగా కాంగ్రెస్‌కు చెందిన విక్రమ్ మస్తల్ బరిలో ఉన్నారు. ఈయన 2008లో తీసిన రామాయణ్ టీవీ సీరియల్‌లో హనుమాన్ పాత్ర పోషించారు. సీఎం చౌహాన్ బుధ్ని నుంచి గతంలో 1990, 2005, 2008, 2013, 2018 ఎన్నికల్లో గెలుపొందారు. ఈయన ఎంపీగా ఎన్నికైన విదిశా పార్లమెంట్ స్థానం పరిధిలోనిదే బుధ్ని నియోజకవర్గం. కాగా, నామినేషన్ల దాఖలుకు సోమవారంతో గడువు ముగియగా, ఉపసంహరణకు నవంబర్ 6 చివరి తేదీ.

సాక్షి
హైదరాబాద్
మంగళవారం ♦ 31 ♦ అక్టోబర్ ♦ 2023



ఓట్ ఫ్రమ్ హోం

దివ్యాంగులు, వయోధికులు ఇంటి నుంచే ఓటు వేసేందుకు ఎలక్షన్ కమిషన్ అవకాశం కల్పించింది. ఇందుకు అధికారులు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. వీరి సంఖ్యకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. -14లో

నేడు ఓయూకు గవర్నర్ రాక



రాష్ట్ర గవర్నర్, ఓయూ చాన్స్‌లర్ తమిళిసై మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీకి రానున్నారు. మధ్యాహ్నం జరిగే 83వ స్నాతకోత్సవానికి ఆమె అధ్యక్షత వహించనున్నారు. -14లో

క్వారీ గుంతలో పడి బాలుడి మృతి



క్వారీ గుంతలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ బాలుడు అందులో పడి మృతి చెందాడు. ఈ సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫతుల్లగూడ వద్ద సోమవారం చోటు చేసుకుంది. -14లో

న్యూస్‌రీల్

ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి

- తనిఖీల్లో జాగ్రత్తగా ఉండాలి
- ఎంసీసీ నోడల్ ఆఫీసర్ ప్రకాశ్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల సందర్భంగా నగదు, నగలు తదితరమైన వాటికి సంబంధించి నిర్వహించే తనిఖీల సందర్భంగా స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్ (ఎస్ఎస్‌టీ) ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని ఎంసీసీ నోడల్ ఆఫీసర్ ప్రకాశ్‌రెడ్డి సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఎస్ఎస్‌టీలోని వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నామినేషన్లు ప్రారంభం కానున్న నవంబర్ 3వ తేదీ నుంచి ఎస్ఎస్‌టీలు విధులు నిర్వహించాలన్నారు. తనిఖీలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ఉండాలన్నారు. ఎస్ఎస్‌టీ వాహనాలకు సీసీ కెమెరాలు, జీపీఎస్ ఏర్పాట్లు ఉంటాయన్నారు. పట్టుబడ్డ నగదుకు తప్పనిసరిగా రసీదు అందజేయాలని, లేని పక్షంలో అలాంటి వారిపై ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్ మాట్లాడుతూ, ఎవరి ఇంట్లోనైనా నగదు ఉన్నట్టు సమాచారం అందితే ఆ సమాచారాన్ని ఐటీ అధికారులకు తెలియజేయాలే కానీ నేరుగా ఇంట్లోకి ప్రవేశించకూడదని తెలిపారు. నోడల్ ఆఫీసర్ అకౌంట్ శరత్ చంద్ర మాట్లాడుతూ, ఎస్ఎస్‌టీ సీజ్ చేసిన వాటిని తప్పనిసరిగా రికార్డు చేయాలన్నారు.

ఎన్నికల నిర్వహణకు రెడీ

కేంద్ర ఎన్నికల సంఘం అధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో రొనాల్డ్ రాస్



సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ తెలిపారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ కుమార్ వ్యాస్, డైరెక్టర్ (ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్) పంకజ్ శ్రీవాస్తవ న్యూఢిల్లీ నుంచి తెలంగాణ సీఈఓతో పాటు అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లాలో చేసిన ఏర్పాట్లపై రొనాల్డ్ రాస్ మాట్లాడుతూ, నగదు, ఆభరణాలు, మద్యం, గంజాయి, మత్తు పదార్థాలను పట్టుకునేందుకు నియోజకవర్గానికి మూడు బృందాల చొప్పున 24 గంటల పాటు నిఘా ఉండేందుకు 105 బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారికి తగిన శిక్షణ ఇచ్చామన్నారు. బృందాల్లో కేంద్రబలగాలను కూడా నియమించినట్లు చెప్పారు. ఎన్నికలకు సంబంధం లేని నగదు, ఆభరణాలు జిల్లా ఫిర్యాదుల కమిటీ ద్వారా విచారణ జరిపి బాధిత వ్యక్తులకు అందజేస్తున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు 128 కేసులకు గాను 99 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. రూ.10 లక్షలు కంటే ఎక్కువ నగదు సీజ్ చేసిన 12 కేసులను ఐటీకి నివేదించామని చెప్పారు. ఆర్‌ఓల కార్యాలయాల్లో సీసీటీవీ, వీడియోగ్రఫీ, వాల్‌క్లాక్‌ల ఏర్పాట్లు మంగళవారంలోగా చేస్తామని చెప్పారు. ఈవీఎంలను పోలీసు భద్రతతో స్ట్రాంగ్‌రూమ్‌లలో ఉంచినట్లు చెప్పారు. పోలింగ్ శాతం పెరిగేందుకు ఇంటింటికీ స్టిక్కర్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన విధంగా ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ సీపీ సందీప్‌శాండిల్య, అదనపు సీపీ విక్రమ్‌సింగ్ మాన్, డిప్యూటీ ఎన్నికల అధికారి అనుదీప్, అడిషనల్ కమిషనర్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.







అదరగొట్టిన చిన్నారులు

స్పోర్ట్స్ ఫర్ ఆల్(ఎస్ఎఫ్ఏ) సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో సోమవారం 'ఎస్ఎఫ్ఏ చాంపియన్ షిప్–5' పోటీలు ప్రారంభమయ్యాయి. అండర్–7 నుంచి అండర్–19 వరకు చిన్నారులు ఈ గేమ్స్‌లో పాల్గొన్నారు. ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడల్లో చిన్నారులు అద్భుత ప్రతిభచూపి అదరగొట్టారు. ఈ పోటీలు మంగళవారం కూడా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. – మాదాపూర్

కుర్రాళ్లోయ్.. కుర్రాళ్లు!

బండి ఉంటే 'పార్టీ' టైమ్ జాబ్



- ఎన్నికల ప్రచారంలో బైక్ ర్యాలీలకు యూత్‌ఫుల్ డిమాండ్
- కాలేజీ విద్యార్థులు, నిరుద్యోగ యువతను తరలిస్తున్న పార్టీలు
- కండువాలు వేసుకొని జోరుగా ప్రచారం

సాక్షి, సిటీబ్యూరో: యూత్‌లో ఎన్నికల జోష్ వచ్చేసింది. బండి చేతిలో ఉంటే చాలు 'జెండా' ఎత్తుకుంటున్నారు. కండువాలు కప్పేసుకుంటున్నారు. జైకొట్టి హోరెత్తిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో యువత ముందంజలో ఉంది. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల పక్షాన ప్రచారం చేసిపెట్టేందుకు యువకులకు భారీ డిమాండ్ వచ్చింది. సాధారణంగా ఎన్నికలు రాగానే ఆయా పార్టీలకు చెందిన నాయకులకు, కార్యకర్తలకు చేతినిండా పని ఉంటుంది. రాత్రింబవళ్లు వ్యూహ ప్రతి వ్యూహాల్లో, ప్రచార ఎత్తుగడల్లో తలమునకలై ఉంటారు. మరోవైపు ప్రచారంలో తమ ఆధిక్యతను ప్రదర్శించేందుకు ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహిస్తారు. సంఖ్యాబలాన్ని చాటుకొనేందుకు ప్రయత్నిస్తారు. ఈ క్రమంలో ఎన్నికల ప్రచారానికి సహకరించే యువతకు అనూహ్యమైన డిమాండ్ వచ్చేసింది. గల్లీలు, బస్తీల్లో ఉండే యువకులే కాకుండా డిగ్రీ, పీజీ స్థాయి విద్యార్థులను కూడా రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రచారానికి తరలిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వీలైన సమయంలో అప్పటికప్పుడు పార్టీల కండువాలు ధరించి బైక్ ర్యాలీలతో హడలెత్తించేందుకు కుర్రకారు సైతం ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల్లో ఈ ట్రెండ్ బలంగా కొనసాగుతోంది. మెజారిటీని ప్రదర్శించేందుకు దీన్ని ఒక అవకాశంగా భావిస్తున్నారు.

ఇదో 'పార్టీ'టైమ్ జాబ్ ...

సాధారణంగా డిగ్రీలు పూర్తి చేసి ఉద్యోగాల కోసం వెతుక్కుంటున్న కుర్రాళ్లకు ఇప్పుడు రాజకీయ పార్టీలు ఇచ్చే ఆఫర్‌లు పార్ట్‌టైమ్ జాబ్‌గా మారాయి. ప్రతి రోజు ప్రచారానికి వచ్చే వారికి రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు చెల్లిస్తున్నారు. ఇక మధ్యాహ్నం బిర్యానీ, వీలైతే సాయంత్రం బీరు సంగతి సరేసరి. గల్లీబాయ్స్ మాత్రమే కాదు. ప్రైవేట్ హాస్టళ్లలో ఉండే బ్యాచిలర్స్, నిరుద్యోగయువతకు ఇదో ఉపాధిగా మారింది. 'ఇప్పట్లో నోటిఫికేషన్‌లు వచ్చే అవకాశం లేదు. ఖాళీగా ఉంటే ఖర్చులు తప్పవు కదా. అందుకే ప్రచారానికి వెళ్తున్నాను' అని దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన శ్రీకాంత్ చెప్పాడు. ఇంటి కిరాయి, రోజువారి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని, సదరు పార్టీ వాళ్లు ఇచ్చే డబ్బులతో కొంత ఊరట లభిస్తుందని పేర్కొన్నాడు. సాధారణంగా ఎన్నికలు రాగానే కళాకారులకు, సోషల్‌మీడియా సైనికులకు డిమాండ్ ఉంటుంది. ఎన్నికల ప్రచారంలో అడ్డాకూలీల సేవలను కూడా రాజకీయ పార్టీలు వినియోగించుకుంటున్నాయి. ఈ క్రమంలో బైక్ ర్యాలీలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా యువకులకు ఎక్కువ డిమాండ్ ఉంది. 'రాత్రింబవళ్లు జెండాలు పట్టుకొని తిరగవలసిన అవసరం లేదు కదా. ఉదయం, సాయంత్రం రెండు, మూడు గంటలు ర్యాలీలకు వెళితే చాలు. సరదాగా ఉంటుంది. పైగా ఖర్చులకు డబ్బులొచ్చేస్తాయి.' అని సికింద్రాబాద్‌కు చెందిన యువకుడు అభిప్రాయపడ్డారు. మరోవైపు పార్టీల ప్రచారానికి తరలి వచ్చే యువకులతో పెట్రోల్ బంకులకు, హోటళ్లకు సైతం గిరాకీ పెరిగింది. అందరూ ఇప్పుడు రెండు చేతులా ఆర్జిస్తున్నారు.

బైక్ ట్యాక్సీ వాలాలకూ ఆఫర్...

ఓలా, ఉబెర్ వంటి సంస్థల్లో పని చేసే ట్యాక్సీ బైక్ డ్రైవర్లు, యాప్ ఆధారిత సేవలను అందజేసే డెలివరీబాయ్స్ కూడా 'జస్ట్ ఫర్ ఛేంజ్'ను కోరుకుంటున్నట్లు ఒక పార్టీకి చెందిన నాయకుడొకరు చెప్పారు. ఒకవైపు ఆయా సంస్థల్లో పని చేస్తూనే వీలైన వేళల్లో ర్యాలీలకు, ప్రదర్శనలకు వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. రొటీన్ విధులకు భిన్నంగా పార్టీ ప్రచారానికి వస్తున్నట్లు పేర్కొన్నారు.

ఊగిసలాట!

మజ్లిస్‌లో 'జూబ్లీహిల్స్'పై తర్జనభర్జన

- ఈసారి కూడా బరికి దూరంగానే ఉండే చాన్స్
- కాంగ్రెస్ నుంచి క్రికెట్ దిగ్గజం
- బీఆర్ఎస్‌కు మద్దతు అనుమానమే
- అజహరుద్దీన్‌కు సహకారమా? తటస్థ వైఖరా?



సాక్షి, సిటీబ్యూరో: తామే ముస్లింలకు అసలైన గళం అంటూ ప్రకటించుకునే మజ్లిస్ పార్టీ ఈసారి జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో 'మద్దతు' అంశంపై ఎటూ తేల్చుకోలేకపోతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ పోటీ చేయని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతు కొనసాగించాలా..? లేక కాంగ్రెస్ పక్షాన బరిలో దిగుతున్న ముస్లిం సామాజిక వర్గానికి చెందిన భారత క్రికెట్ మాజీ దిగ్గజం అజహరుద్దీన్‌కు సహకరించాలా అన్న ఊగిసలాటలో ఆ పార్టీ అగ్రనేతలు ఉన్నట్లు తెలుస్తోంది. మరోమారు కేసీఆర్ సీఎం కావాలన్న లక్ష్యంతో తాము పోటీ చేయని స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని మజ్లిస్ పార్టీ నిర్ణయించిన విషయం విదితమే. అయితే గత పర్యాయం మాదిరిగా ఈసారి కూడా ముస్లిం మైనారిటీ ఓట్లు చీలకుండా ఉండేందుకు జూబ్లీహిల్స్‌లో పోటీ చేయవద్దని ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో గతంలో మాదిరిగానే బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు మజ్లిస్ మద్దతు కొనసాగుతుందని అందరు భావించారు. అయితే ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిగా అజహరుద్దీన్ బరిలో దిగుతుండటంతో మజ్లిస్‌కు సంకట స్థితి ఎదురైంది. మిత్రపక్షమైన బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తే ముస్లిం సామాజిక వర్గానికి చెందిన దిగ్గజానికి సహకరించలేదన్న అపవాదు మూట కట్టుకోవాల్సి వస్తుందని మజ్లిస్ భావిస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థికి సహకరిస్తే బీఆర్ఎస్ దోస్తీకి విరుద్ధం అవుతుందన్న యోచనలో పడింది. పార్టీ విధాన రాజకీయ ప్రక్రియలో భాగంగా మజ్లిస్ అభ్యర్థిని బరిలోకి దింపితే గత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఎందుకున్నారన్న ప్రశ్న తలెత్తే అవకాశం లేకపోలేదని భావిస్తోంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా తప్పుడు సంకేతాలు వెళ్లొచ్చని ఆందోళన చెందుతోంది. మొత్తం మీద జూబ్లీహిల్స్‌లో తటస్థంగా వ్యవహరించడమే బెటర్ అని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

గతంలో ఇలా...

అత్యంత సంపన్నులున్న ప్రాంతంగా పేరొందిన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మజ్లిస్ గతంలో పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైంది. 2014 ఎన్నికల్లో మజ్లిస్ అభ్యర్థిగా పోటీ చేసిన నవీన్‌యాదవ్ అప్పటి టీడీపీ అభ్యర్థి మాగంటికి గట్టి పోటీ ఇచ్చారు. టీడీపీ 50,898 ఓట్లతో గెలవగా..మజ్లిస్ 41,656 ఓట్లతో రెండో స్థానంలో నిలిచింది. టీడీపీ నుంచి గెలిచిన మాగంటి ఆ తర్వాత టీఆర్ఎస్‌లో చేరారు. ఇక గత ఎన్నికల్లో మజ్లిస్ పోటీ చేయకుండా టీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతు ప్రకటించింది. మజ్లిస్ పార్టీకి చెందిన నవీన్‌యాదవ్ మాత్రం ఇండిపెండెంట్‌గా బరిలో దిగి గట్టి పోటీ ఇచ్చి మూడో స్థానానికి పడిపోయారు. ఇక్కడ ముస్లిం మైనారిటీ ఓట్లు అధికంగా ఉన్నాయి. అయితే నవీన్‌యాదవ్ తిరిగి పోటీ చేసేందుకు ఇటీవల మజ్లిస్ అధిష్టానాన్ని సంప్రదించగా అక్కడ పోటీ చేసే యోచన లేదని స్పష్టం చేసినట్లు సమాచారం.

ఇక ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్ల వంతు?

- భారీ బదిలీలకు ఎన్నికల సంఘం నిర్ణయం
- జాబితాలో మొత్తం 39 మంది అధికారులు
- రెండు రోజుల్లో ఉత్తర్వుల జారీకి అవకాశం
- పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని చర్యలు



సాక్షి, సిటీబ్యూరో: ఇప్పటికే నలుగురు పోలీసు కమిషనర్ల సహా పలువురు పోలీసు అధికారులపై బదిలీ వేటు వేసిన ఎన్నికల సంఘం (ఈసీ)..మరోసారి ఈ అంశంపై దృష్టి పెట్టింది. ఈసారి ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను ట్రాన్స్‌ఫర్ చేయాలని నిర్ణయించింది. సిఫార్సులు, విధేయత ఆధారంగా పోస్టులు పొందిన వారితో పాటు వారిపై ఉన్న ఆరోపణల్ని పరిగణనలోకి తీసుకుని జాబితా రూపొందించినట్లు సమాచారం. నలుగురు ఏసీపీలు, 35 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీలకు సంబంధించి రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో ఎన్నికలు పూర్తి పారదర్శకంగా నిర్వహించడానికి కసరత్తు చేస్తున్న ఈసీ దాని కోసం పలు చర్యలు తీసుకుంటోంది. గత ఎన్నికలు, ఉప ఎన్నికల సందర్భంలో చోటు చేసుకున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని అడుగులు వేస్తోంది. దీంతో ఎన్నికల నిర్వహణలో కీలకంగా వ్యవహరించే పోలీసు, రెవెన్యూ విభాగాల అధికారుల పూర్వాపరాలు నిశితంగా గమనిస్తోంది. ఈ నేపథ్యంలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసు విభాగంలో అనేక మందిపై ఉన్నతాధికారులపై బదిలీ వేటు వేసింది. కమిషనరేట్లు, జిల్లాలకు నేతృత్వం వహించే కమిషనర్లు, ఎస్పీల స్క్రూటినీ దాదాపు పూర్తి చేసిన ఎన్నికల ఇప్పుడు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే ఫోకల్ పోస్టులపై దృష్టి పెట్టింది.

ఫిర్యాదులే ఫిర్యాదులు..

ఈసీ మార్గదర్శకాల మేరకు నిర్ణీత కాలానికి మించి ఓ పోస్టులో పని చేస్తున్న అధికారులను షెడ్యూల్‌కు ముందే ప్రభుత్వం, పోలీసు విభాగం బదిలీ చేశాయి. అయితే ఈ ట్రాన్స్‌ఫర్స్‌లో అనేక అవకతవకలు జరిగాయని ఎన్నికల సంఘానికి వరుస ఫిర్యాదులు అందుతున్నాయి. ఆయా పార్టీలకు సాన్నిహిత్యం, ఎమ్మెల్యేలతో పాటు నాయకులు, నేతలతో అధికారులకు ఉన్న సంబంధాలు, పైరవీల ఆధారంగా పోస్టుల్లోకి వచ్చిన వారిపై విపక్షాలు వరుస ఫిర్యాదు చేస్తున్నాయి. వీటితో పాటు ఈసీ మార్గదర్శకాల పేరు చెప్పి బదిలీలో జరిగిన లోపాలు అనేక ఉన్నాయి. ఈ అంశాలను పరిగణలోకి తీసుకున్న ఎన్నికల సంఘం వివిధ మార్గాల్లో లోతుగా ఆరా తీస్తోంది. తమ పరిశీలనలో వెలుగులోకి వచ్చిన వివరాల ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ డివిజన్లలో పని చేస్తున్న డీఎస్పీలు, అదే హోదా పోస్టు అయిన ఏసీపీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తున్న ఇన్‌స్పెక్టర్ల జాబితాను ఈసీ తయారు చేసినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో విధుల నిర్వహణ, నిబంధనల అమలులో వీళ్లే కీలకం కావడంతో ఈ అధికారుల పైనే ఈసీ దృష్టి పెట్టింది. ప్రాథమికంగా నలుగురు డీఎస్పీ/ఏసీపీ, 35 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీకి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికలకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆపై నామినేషన్లు, విత్ డ్రా తదితర ఎలక్షన్ ప్రక్రియలు పూర్తి స్థాయిలో ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి లోపు బదిలీ ఉత్తర్వులు జారీ చేయడం, కొత్త పోస్టుల్లో ఆయా అధికారులు చేరిపోవడం వంటి ప్రక్రియలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఈసీ నిర్ణయించింది. ఈ మేరకు పోలీసు విభాగానికి ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఎన్నికల సంఘం నుంచి బదిలీ అయ్యే, ఆ పోస్టుల్లోకి కొత్తగా వచ్చే వారి జాబితా అందిన వెంటనే ఉత్తర్వుల జారీ చేయడానికి ఉన్నతాధికారులు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.

ఎన్నికల ప్రచారంలో వారిదే 'షో'



ఓ నేత పార్టీలో చేరే కార్యక్రమంలో డప్పు నృత్యాలతో ఆకట్టుకుంటున్న కళాకారులు (ఫైల్)

గ్రామీణ కళాకారులకు చేతినిండా పని

బంజారాహిల్స్: ఎన్నికలు వచ్చాయంటే రకరకాల వృత్తుల వారికి చేతి నిండా పని దొరుకుతుంది. ఇన్నాళ్లూ పనులకు దూరమైన కొంత మందికి ఎన్నికల వేళ ఏదో రకంగా పని దొరుకుతూనే ఉంటుంది. ముఖ్యంగా ప్రచార పాదయాత్రల్లో, నామినేషన్ల వేళ, పార్టీలో చేరికల వేళ డప్పు నృత్యాలదే హైలెట్ అని చెప్పొచ్చు. ఇందుకోసం వివిధ గ్రామాల నుంచి డప్పు బృందాలు హైదరాబాద్‌కు వచ్చి ఈ నెలన్నర రోజుల పాటు మకాం వేస్తున్నాయి. వీరికి ప్రతిరోజూ ఏదో ఒక పార్టీ నుంచి ఆహ్వానం అందుతున్నది. ఏ పార్టీ పిలిస్తే ఆ పార్టీ కార్యక్రమాలకు వెళ్ళి డప్పులు వాయిస్తూ నృత్యాలు చేస్తూ ఆట, పాటలతో ఆ కార్యక్రమాన్ని రక్తి కట్టిస్తుంటారని కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజక వర్గం తిమ్మాపూర్‌కు చెందిన చెన్నకేశవ స్వామి టెంపుల్ బృందం యజమాని నరేష్ తెలిపారు. ఒక్కో బృందంలో 20 మంది వరకు ఉంటారని..ఇందులో ఐదుగురు పురుషులు, 15 మంది మహిళలు ఉండే విధంగా బృందాన్ని తీర్చిదిద్దుతామన్నారు. ఎవరైనా ఎక్కువ మంది కావాలని అడిగితే ఆ మేరకు బృందాలను పంపిస్తామన్నారు. ఒక్కొక్కరికి రూ.2 వేల వరకు చార్జి చేస్తామని, రవాణా చార్జీలు సదరు నేతలే భరించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటి వరకు కరీంనగర్‌తో పాటు వరంగల్, మెదక్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల నుంచి వచ్చిన డప్పు వాయిద్య బృందాలు నగరంలో తిష్టవేశాయి. ఇప్పటికే అన్ని పార్టీలు ప్రచారం ముమ్మరం చేయగా..వీరందరికీ రోజూ పని దొరుకుతున్నది. ఈ నెల రోజుల పాటు ఏదో ఒక పార్టీ నుంచి పని దొరుకుతుందని జ్యోతి అనే డప్పు బృందం సభ్యురాలు తెలిపారు.



దానం స్టెప్పేస్తే...

బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్ బస్తీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ కొద్దిసేపు డ్యాన్స్ చేసి సందడి చేశారు. ప్రచారంలో పాల్గొన్న లంబాడీ మహిళలు 'దానం సారూ.. మీరూ స్టెప్పెయ్యాల్సిందే..' అని గట్టిగా పట్టుబట్టడంతో ఆయన తప్పేది లేక వారితో రెండు స్టెప్పులేసి ముందుకు సాగారు. కార్యకర్తలంతా దానంతో కలిసి కొద్దిసేపు స్టెప్పులేశారు.

– బంజారాహిల్స్

పాతబస్తీలో హ్యాట్రిక్ వీరుడు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ పాతబస్తీ అంటే మజ్లిస్‌కు అడ్డా. ఇక్కడ రాజకీయాలను శాసించే స్థాయి మజ్లిస్‌ది మాత్రమే. పాతబస్తీలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ముస్లిం అభ్యర్థి తప్ప మరెవరూ గెలవలేరని ఒక నానుడి కూడా ఉంది. కానీ ఒక్క కార్వాన్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో మాత్రం భారతీయ జనతాపార్టీ హ్యాట్రిక్ కొట్టి రికార్డు సృష్టించింది. కార్వాన్ టైగర్‌గా పేరొందిన బద్దం బాల్‌రెడ్డి ఇక్కడి నుంచి మూడుసార్లు గెలిచారు. రెండు దశాబ్దాల పాటు బీజేపీకి ఇక్కడ ఎదురే లేదు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత జరిగిన ఎన్నికల్లో కార్వాన్ స్థానం నుంచి మజ్లిస్ పక్షాన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన బాకర్ ఆగా గెలిచారు. ఆ తర్వాత 1985, 1989, 1994లలో వరుసగా బీజేపీ నుంచి పోటీ చేసిన బద్దం బాల్‌రెడ్డి మజ్లిస్‌పై విజయం సాధిస్తూ వచ్చారు. ఆ తర్వాత హైదరాబాద్ లోక్‌సభ స్థానానికి 1991, 1998, 1999లో బీజేపీ తరఫున బరిలో దిగి మజ్లిస్‌కు గట్టి పోటీ ఇచ్చి రెండో స్థానానికి పరిమితమయ్యారు. కాగా, కార్వాన్ అసెంబ్లీ స్థానానికి 1999లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ పక్షాన బరిలో దిగిన కిషన్‌రెడ్డి ఓటమి పాలయ్యారు. అప్పట్లో మజ్లిస్ నుంచి ఎన్నికైన సయ్యద్ సజ్జాద్ మృతి చెందడంతో 2003 ఉప ఎన్నికతోపాటు 2004, 2014 ఎన్నికల్లో మరోసారి బద్దం బాల్‌రెడ్డి బరిలో దిగినప్పటికీ పరాజయం తప్పలేదు. చివరిసారిగా 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున రాజేంద్రనగర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2019లో ఆయన మృతి చెందారు.



అవ్వతో ముచ్చట..

ఖైరతాబాద్ డివిజన్‌లో సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి... ఓ కాలనీలో అరుగుపై కూర్చున్న ఓ 85 ఏళ్ల అవ్వతో ముచ్చటించారు. 'అవ్వ.. ఇగో ఈ కరపత్రం తీసుకో..అని ఇవ్వగానే..నాకు సదువురాదు బిడ్డా.. అంటూ ఆమె బదులిచ్చారు. వచ్చే ఎన్నికల్లో కమలానికి ఓటేయాలంటూ ఆయన చెప్తూ ముందుకెళ్లారు.

– బంజారాహిల్స్

నేడు ఓయూకు గవర్నర్ రాక



గవర్నర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఓయూ వీసీ


ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర గవర్నర్, ఓయూ చాన్స్‌లర్ తమిళి సై మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీకి రానున్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో మధ్యాహ్నం జరిగే 83వ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించనున్నారు. అనంతరం విద్యార్థులకు బంగారు పతకాలు, పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ పట్టాలు, ముఖ్యఅతిథి అడోబీ సీఈవో పద్మశ్రీ శంతన్‌నారాయణ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ఇతర అధికారులు గవర్నర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

వన్‌టైం చాన్స్ పీజీ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో జూన్ నెలలో జరిగిన వన్‌టైం చాన్స్ పీజీ కోర్సుల పరీక్ష ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఎగ్జామినేషన్ బ్రాంచ్ పీజీ విభాగం నుంచి మార్కుల జాబితాను పొందవచ్చని కంట్రోలర్ ప్రొ.రాములు తెలిపారు.

ఓట్ ఫ్రమ్ హోమ్

- దివ్యాంగులు, వయోధికులకు ప్రత్యేక సదుపాయాలు
- ఇంటి నుంచే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం
- ఆర్‌ఓల ద్వారా పోస్టల్ బ్యాలెట్ల పంపిణీ
- పోలింగ్ కేంద్రాల్లో మూడు చక్రాల బండ్లు, సహాయకుల ఏర్పాటు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి దివ్యాంగులు, వయోధికుల కోసం ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించింది. జిల్లాకు సంబంధించి ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న దివ్యాంగ, వయోధికులకు ఆర్‌ఓల ద్వారా ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్లను సరఫరా చేసింది. నేరుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటుహక్కును వినియోగించుకునే వారి కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించింది. ర్యాంపులతో పాటు మూడుచక్రాల బండ్లను సిద్ధం చేసింది. వారికి సహాయకులను కూడా నియమించింది. ఆదర్శ పోలింగ్ కేంద్రాల్లో భాగంగా నియోజకవర్గానికి ఒక పోలింగ్ కేంద్రాన్ని కూడా ఎంపిక చేసింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 80 ఏళ్ల పైబడిన వారు 43,541 మంది ఉండగా, వీరిలో 20,989 మంది పురుషులు, 22,548 మంది మహిళలు, నలుగురు థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. ఇక వివిధ రకాల వైకల్యంతో బాధపడుతున్న ఓటర్లు 48,603 మంది ఉండగా, వీరిలో 26,516 మంది పురుషులు ఉండగా, 22,085 మంది మహిళలు ఉన్నారు. మరో ఇద్దరు థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు.

జిల్లాలోని వయోవృద్ధుల (80ఏళ్లు పైబడిన) వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్లు
ఇబ్రహీంపట్నం	1,556	2,099	0
ఎల్బీనగర్	4,515	3,902	2
మహేశ్వరం	3,407	3,585	0
రాజేంద్రనగర్	2,504	2,516	0
శేర్‌లింగంపల్లి	4,500	3,560	2
చేవెళ్ల	1,674	2,487	0
కల్వకుర్తి	1,432	2,345	0
షాద్‌నగర్	1,401	2,054	0

జిల్లాలోని దివ్యాంగ ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	అంధులు	లోకోమోటర్స్	మూగ, చెవిటి	ఇతర వైకల్యం
ఇబ్రహీంపట్నం	1,040	1,976	3,69	4,270
ఎల్బీనగర్	527	4,563	296	1,055
మహేశ్వరం	881	6,351	704	721
రాజేంద్రనగర్	621	2,172	284	1,924
శేర్‌లింగంపల్లి	880	1,113	459	3,565
చేవెళ్ల	469	2,825	407	650
కల్వకుర్తి	581	1,596	370	1,371
షాద్‌నగర్	450	2,272	586	3,255

హోటల్ భవనంపై నుంచి పడి బాలుడికి తీవ్ర గాయాలు



ఆందోళన చేస్తున్న బాలుడి కుటుంబ సభ్యులు

హఫీజ్‌పేట్ : హోటల్ భవనంపై నుంచి కింద పడి ఓ బాలుడు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం తెల్లవారుజామున మియాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా, ముస్త్యాల్ గ్రామానికి చెందిన కమలాకర్, రేణుకల కుటుంబ మియాపూర్‌లోని టీఎస్ నగర్‌లో నివాసముంటున్నారు. వీరి కుమారుడు బట్టు అఖిల్ (14) సెయింట్ రిటా స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో సితార హోటల్‌లో క్యాటరింగ్ బాయ్‌గా పని చేసేందుకు వెళ్లాడు. పనులు ముగించుకుని మెట్ల మాదుగా కిందికి వస్తుండగా ఒక్కసారి జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని శ్రీకర్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న బాలుడి కుటుంబ సభ్యులు సితార హోటల్ వద్ద ఆందోళన చేపట్టారు. సమాచారం అందడంతో మియాపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. హోటల్ యాజమాన్యంతో చర్చించి బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి పంపించారు.

ఓటింగ్ పెంచేందుకు కృషి



మొబైల్ వ్యాన్లను ప్రారంభిస్తున్న కలెక్టర్ హోళికేరి

- కలెక్టర్ భారతి హోళీకేరి
- కలెక్టరేట్‌లో సంచార రథాలు ప్రారంభం

ఇబ్రహీంపట్నం రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు కలిసికట్టుగా పని చేయాలని కలెక్టర్ భారతి హోళీకేరి తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఓటింగ్ ఆవశ్యకత, పోలింగ్‌పై అవగాహన కల్పించేందుకు జిల్లాలో నియోజకవర్గాలవారీగా ఏర్పాటు చేసిన సంచార రథాల (మొబైల్ వాహనాల)ను సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించేందుకు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఈవీఎం డెమోన్‌స్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎం, వీవీప్యాట్ వినియోగంపై ఎలాంటి సందేహాలున్నా ఈ కేంద్రాల్లో నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్, జిల్లా పరిషత్ సీఈఓ దిలీప్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నోడల్ అధికారి ప్రభాకర్, ఆర్డీఓలు, అధికారులు పాల్గొన్నారు .

రోజువారీ నివేదకలివ్వండి..

ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు బాధ్యతాయుతంగా నడుచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నోడల్ అధికారులతో సోమవారం కలెక్టర్ సమావేశమయ్యారు. చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీలు పకడ్బందీగా జరిగేలా చూడాలని తెలిపారు. సామాన్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తనిఖీలు ఉండాలన్నారు. తనిఖీ బృందాలు రోజువారీ నివేదికలను అందించాలని తెలిపారు. నోడల్ అధికారులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

రైల్లో బంగారు ఆభరణాలు చోరీ

కాచిగూడ: రైల్లో ఓ ప్రయాణికురాలి బంగారు ఆభరణాలు చోరీకి గురైన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన అనూష విశాఖపట్నం – మహబూబ్‌నగర్ స్పెషల్ రైల్‌లో కాచిగూడకు వస్తుండగా భువనగిరి – బీబీనగర్ రైల్వే స్టేషన్ల మధ్య ఆమె బ్యాగులో ఉన్న 25 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. దీంతో ఆమె సోమవారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం నల్గొండ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు.

ఓవెన్ పేలి ఇద్దరికి గాయాలు

మైలార్‌దేవ్‌పల్లి: ఓవెన్ పేలడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాములు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..తాడ్‌బండ్ ప్రాంతానికి చెందిన వాసీమ్, ఎజాజ్ వట్టేపల్లి రైల్వే గేట్ వద్ద జామ్‌జామ్ బేకరీ నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి బిస్కెట్లు తయారు చేసే ఓవెన్ ఒక్కసారిగా పేలిపోవడంతో వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితులను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పై నుంచి పడి కూలీ మృతి

మణికొండ: ప్రమాదవశాత్తు భవనం పై నుంచి పడి కూలీ మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేటలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన తాడెల కృష్ణారావు(40) కుటుంబంతో సహా నగరానికి వలస వచ్చి కోకాపేటలో నిర్మాణంలో ఉన్న గ్రీన్‌స్పేస్ భవనంలో కూలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం పనిచేసి కిందకు దిగుతుండగా ప్రమాదవశాత్తు 10 అంతస్తు నుంచి జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించేందుకు 108కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది అతడిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని భార్య కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రూ.34.50 లక్షల నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు

రాంగోపాల్‌పేట్: హవాలా మార్గంలో తరలిస్తున్న రూ.34.50లక్షల నగదును సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ నితికా పంత్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శివరాంపల్లికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి శివన్న రాయ్, నల్లగుట్టకు చెందిన వ్యాపారి భవేష్ కుమార్ జైన్ హవాలా లావాదేవీలు నిర్వహిస్తుంటారు. వీరు తమ కస్టమర్ల నుంచి పెద్ద మొత్తంలో వసూలు చేసిన నగదును మరో కస్టమర్‌కు అందించేందుకు డ్రైవర్ మన్సూర్‌తో కలిసి ఆదివారం రాత్రి జీపులో సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి వెనుక నిరీక్షిస్తున్నారు. దీనిపై సమాచారం అందడంతో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బీ రాజు నాయక్, ఎస్సైలు సాయికిరణ్, నవీన్ కుమార్ దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో వారిని అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి రూ.34.50 లక్షల నగదు, థార్ జీపు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసికున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను రాంగోపాల్‌పేట్ పోలీసులకు అప్పగించారు.

లాడ్జిలో యువకుడి దారుణ హత్య



నవీన్ మృతదేహం

భాగ్యనగర్‌కాలనీ: లాడ్జిలో ఓ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కేపీహెచ్‌బీ ధర్మారెడ్డి కాలనీలో ఎస్ఎస్ రెసిడెన్సీ లాడ్జిలో ఆదివారం ఉదయం బళ్లారికి చెందిన నవీన్ (26), ఏలూరుకు చెందిన ప్రవీణ్ రెండో ఫ్లోర్‌లోని 211 గదిని అద్దెకు తీసుకున్నారు. ఆ రూమ్‌లో ఏసీ సరిగ్గా రాకపోవటంతో వారు మూడో ఫ్లోర్‌లోని 303కు మారారు. ఇద్దరు కలిసి రాత్రి మద్యం తాగారు. మద్యం మత్తులో వారి మధ్య ఘర్షణ జరగడంతో ప్రవీణ్ నవీన్‌ను కత్తితో మెడపై పొడవటంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు.

- సోమవారం ఉదయం గది ఖాళీ చేయాలని చెప్పేందుకు వచ్చిన లాడ్జి సిబ్బంది తలుపు తట్టగా నవీన్ బెడ్‌పై రక్తపు మడుగులో కనిపించాడు. దీంతో వారు కేపీహెచ్‌బీ పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీంతో కలిసి ఆధారాలను సేకరించారు.

నవీన్ మృతదేహం పక్కన పడి ఉన్న మద్యం బాటిళ్లు, కత్తి స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు నిందితుడు ప్రవీణ్ కోసం గాలింపు చేపట్టారు. హత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు పేర్కొన్నారు.

గౌడ కులస్తులకు జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలి



అభివాదం చేస్తున్న 'గోపా' నాయకులు

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో అత్యధిక శాతం ఓటు బ్యాంకు కలిగి ఉన్న గౌడ సామాజికవర్గానికి జనాభా ప్రాతిపదికన అన్ని పార్టీలు సీట్లు కేటాయించాలని గౌడ్ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) రాష్ట్ర కమిటీ అధ్యక్షులు మద్దెల రమేష్ బాబు గౌడ్ అన్నారు. ఈ మేరకు సోమవారం బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 30 నియోజకవర్గాల్లో గౌడ కులస్తులు 50 నుండి 75 వేల మధ్య ఉన్నట్లు తెలిపారు. మిగతా నియోజకవర్గాల్లో దాదాపు 25 నుండి 40 వేల వరకు గౌడ సామాజిక ఓటర్లు ఉన్నప్పటికీ ప్రధాన పార్టీలు వారికి తగిన ప్రాధాన్యం కల్పించకపోవడం దారుణమన్నారు. గౌడలు గెలిచే స్థానాల్లో కూడా వారికి కాకుండా ఇతర వర్గాల వారికి సీట్లు కేటాయించడం దారుణమన్నారు. పార్టీలకు అతీతంగా గౌడ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. గౌడ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా 'గోపా' కార్యాచరణ చేపడుతుందన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి డా.బండి సాయన్న, కోశాధికారి మొగిలి రఘునాథ్ గౌడ్, ముంజ వెంకట్ రాజన్, వీరయ్య గౌడ్, ప్రసాద్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి గుర్తుతెలియని మహిళ మృతి

మేడ్చల్‌రూరల్: చెరువులో పడి గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన మేడ్చల్ పట్టణంలో చోటు సోమవారం చేసుకుంది. ఎస్‌ఐ నవీన్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక పెద్ద చెరువులో సోమవారం ఉదయం మృతదేహాన్ని(40) గుర్తించిన స్థానికులు మేడ్చల్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతురాలి వివరాలు తెలియక పోవడంతో గుర్తు తెలియని మహిళగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్వారీ గుంతలో పడి బాలుడి మృతి



మనీష్(ఫైల్)



మనీష్ మృతదేహాన్ని వెలికి తీస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది

నాగోలు: క్వారీ గుంతలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ బాలుడు అందులో పడి మృతి చెందిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, గోరఖ్‌పూర్ కు చెందిన నిషాద్ సురేష్ కుటుంబంతో సహా నగరానికి వలసవచ్చి నాగోలు బైండ్ల కాలనీలో నివాసం ఉంటూ పెయింటర్‌గా పని చేస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సురేష్ రెండో కుమారుడు మనీష్(12) నాగోలులోని ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం మనీష్ ఇంట్లో గోధుమ పిండి తీసుకుని స్నేహితులతో కలిసి చేపలు పట్టేందుకు ఫతుల్లాగూడలోని సర్వేనెంబర్ 9లో ఉన్న క్వారీ వద్దకు వెళ్లాడు. చేపలు పడుతుండగా మనీష్ ప్రమాదవశాత్తు గుంతలో పడిపోయాడు. దీంతో భయపడిన అతడి స్నేహితులు ఈ విషయం ఎవరికీ చెప్పలేదు. రాత్రి మనీష్ ఇంటికి తిరిగి రాకపోవడంతో అతడి తండ్రి సురేష్, కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. అయినా అతడి ఆచూకీ తెలియక పోవటంతో అతని తండ్రి నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా ఆదివారం మధ్యాహ్నం మనీష్ స్నేహితులతో కలిసి వెళుతున్న దృశ్యాలను గుర్తించారు. అతడి స్నేహితులను పిలిపించి ప్రశ్నించగా వారు అసలు విషయం చెప్పారు. దీంతో పోలీసులు సోమవారం ఉదయం క్వారీ వద్దకు వెళ్లి చూడగా మనీష్ మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. డీఆర్‌ఎఫ్ బృందం సహాయంతో మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. మనీష్ ప్రమాదవశాత్తు గుంతలో పడిపోయాడా.. ఎవరైనా నీటిలో తోశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమెదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాహన తనిఖీలు ముమ్మరం



కేన్సర్ ఆస్పత్రి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న కేంద్ర బలగాలు

ఎక్కడికక్కడ తనిఖీలు
- అనుమానాస్పదంగా కన్పిస్తే క్షుణ్ణంగా పరిశీలన
- పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పట్టుబడుతున్న నగదు
- తనిఖీలను వీడియో చిత్రీకరిస్తున్న పోలీసులు

బంజారాహిల్స్: ఉదయం నుంచి సాయంత్రం దాకా ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు... రాత్రి 11 నుంచి 12.30 గంటల వరకు లా అండ్ ఆర్డర్ పోలీసుల తనిఖీలు... ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్‌తో కలిసి కేంద్ర బలగాల ఆకస్మిక తనిఖీలు... ఎన్నికల వేళ ఎక్కడికక్కడ వాహనాల తనిఖీలతో పోలీసులు రహదారులను దిగ్బంధనం చేస్తున్నారు. ప్రధాన, అంతర్గత రహదారులతో పాటు గల్లీల్లోనూ వాలిపోతూ అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మూడు రోజుల నుంచి టాస్క్‌ఫోర్స్ బృందాలు భారీగా నగదును పట్టుకుంటుండటంతో ఇటు ట్రాఫిక్ పోలీసులు, అటు లా అండ్ ఆర్డర్ పోలీసులతో పాటు కేంద్ర బలగాలతో ఫ్లయింగ్ స్క్వాడ ఆకస్మిక తనిఖీలను నిర్వహిస్తున్నారు.

- అనుమానిత వాహనాలను ఆపి సోదాలు చేస్తున్నారు. అర్ధరాత్రి వెస్ట్ జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గంటన్నర పాటు వాహనాల తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేస్తున్నారు. అలాగే ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా తిరుగుతున్న వాహనాలను కూడా ఎక్కడికక్కడ సీజ్ చేస్తున్నారు. ఇలా తనిఖీలతో అర్ధరాత్రి అనుమానస్పదంగా తిరుగుతున్న వారందరికీ దడపుట్టిస్తున్నారు. ఈ వాహనాలను కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.
- దొంగతనంగా తిరుగుతున్న వాహనాలను పసిగట్టడం కూడా ఈ తనిఖీల్లో ఒక భాగంగా పెట్టుకున్నారు. గత అయిదు రోజుల నుంచి జూబ్లీహిల్స్ పోలీసులు 70 వరకు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.
- అన్ని ధ్రువపత్రాలు చూసి నిర్ధారించిన తర్వాతనే వాటిని వాహన యజమానికి అప్పగిస్తున్నారు. డబ్బు రవాణాను అరికట్టేందుకు కేంద్ర బలగాలతో కలిసి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేస్తుండగా సంబంధిత సిబ్బంది ఆ దృశ్యాలను వీడియోలో భద్రపరుస్తున్నారు.

రూ. 5.83 లక్షలు స్వాధీనం

వెంగళరావునగర్: రసీదు లేకుండా నగదును తరలిస్తున్న ముగ్గురిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ మధురానగర్ పీఎస్ పరిధిలో విస్తృతంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. సోమవారం మధురానగర్ పోలీసులకు ముగ్గురు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. అనుమానించిన పోలీసులు వారి ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద ఎలాంటి ధ్రువపత్రాలు లేని దాదాపు రూ. 5.83 లక్షలు దొరికింది. కేసు దర్యాప్తులో ఉంది.

రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో...

రహమత్‌నగర్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. కార్మిక నగర్, ఎస్పీఆర్ హిల్స్, బోరబండలోని పలు ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో తనిఖీలను చేపట్టారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మోతీనగర్, శ్రీరాంనగర్ తదితర ప్రాంతాల్లో పోలీసులు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు.

ఎన్నికల కార్యాలయాన్ని పరిశీలించిన డీసీపీ

బంజారాహిల్స్: ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఖైరతాబాద్ నియోజకవర్గం ఎన్నికల కార్యాలయాన్ని సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు, స్థానిక ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. నవంబర్ 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నామినేషన్ దాఖలు ఇక్కడే కావడంతో రిటర్నింగ్ అధికారి వెంకటేష్‌తో కలిసి ఏర్పాట్లు బందోబస్తుపై చర్చించారు. ఎంత బందోబస్తు కావాలి, ఎక్కడెక్కడ బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలనే వాటిపై సమీక్షించారు.



ఎమ్మెల్యే దానం ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్: అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో రూపుదిద్దుకుందని ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలోని హిమాయత్‌నగర్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ డివిజన్లలోని పలు బస్తీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మేనిఫెస్టోలోని పథకాలను వివరించారు. సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించేందుకు ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌కు అండగా నిలబడాలని అన్నారు.

దానంకు అండగా నిలవండి: కార్పొరేటర్ వెల్దండ

ఫిలింనగర్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్ బస్తీలో ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు వందలాదిగా తరలి వచ్చి ఆయనతో పాటు ప్రచారంలో పాల్గొన్నారు. ఇందిరానగర్‌లో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్లు వేయించిన ఘనత బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందని అన్నారు. ఈ ఎన్నికల్లో ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు బస్తీవాసులంతా అండగా నిలబడి మరోసారి ఆయనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్, బీజేపీ మాయమాటలకు మోసపోవద్దు: దానం

హిమాయత్‌నగర్: దుష్ట శక్తులను, అభివృద్ధి నిరోధకులను, ఆరు గ్యారంటీలంటూ మాయమాటలు చెప్పే కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలు రెండో స్థానం కోసం పోటీ పడుతున్నాయని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎద్దేవాచేశారు. హిమాయత్‌నగర్ డివిజన్‌లో పలు కాలనీలలో దానం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి హిమాయత్‌నగర్‌లోని టీటీడీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. డివిజన్‌లోని స్ట్రీట్ నంబర్-1, 2, 3లలోని పలు కాలనీలు, బస్తీలలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందని, కాంగ్రెస్ నాయకులు ఎన్ని గ్యారంటీలు ఇచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రాష్ట్రానికి మూడవ సారి ముఖ్యమంత్రిగా విజయం సాధించాలని కలియుగ దైవం వేంకటేశ్వర స్వామిని కోరుకున్నానని చెప్పారు. మహిళలు మంగళహారతులు ఇస్తూ, పూలు జల్లుతూ దానంకు స్వాగతం పలికారు. హిమాయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు యాదగిరి, రాజేందర్ కుమార్, యతిరాజ్, అశోక్, ప్రభాకర్ గౌడ్, నందు, రాజేంద్రప్రసాద్, రమేష్ యాదవ్, సంతోష్ గుప్తా, మాధవి, యాస్మిన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుల అందజేత

వెంకటేశ్వరకాలనీ: ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందుకు సంబంధించి ఎన్నికల శిక్షణకు హాజరవుతున్న ఉద్యోగులకు అధికారులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు దరఖాస్తులను అందజేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములయ్యే అధికారులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈ విధానం అమలవుతున్నది. గతంలో పోస్టల్ బ్యాలెట్లను ఎన్నికల విధులకు హాజరయ్యే సమయంలో వినియోగించుకోవాల్సి ఉండేది. దీంతో ప్రతి నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో వెనుకబాటు కనిపిస్తూ వస్తున్నది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈసారి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ముందుగానే ఓటు వేసే వెసులుబాటు కల్పించారు.



శిక్షణలో ఉన్న ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తును అందిస్తున్న అధికారులు

క్లుప్తంగా...

అవగాహనతో స్ట్రోక్‌లను నివారించవచ్చు



కార్యక్రమంలో విరించి ఆస్పత్రి వైద్యులు

బంజారాహిల్స్: ప్రతి సంవత్సరం అక్టోబర్ 29న ప్రపంచ వ్యాప్తంగా వరల్డ్ స్ట్రోక్‌డేను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని విరించి ఆస్పత్రిలో బ్రెయిన్ స్ట్రోక్ దానికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ మహ్మద్ అతీక్ అర్ అహ్మద్, డాక్టర్ సాయి రవిశంకర్, వైస్ చైర్మన్ వేదుల సత్యనారాయణ పాల్గొన్నారు. స్ట్రోక్ వచ్చిన పేషెంట్‌ను వెంటనే గుర్తించి వైద్య భాషలో పేర్కొన్నట్లు గోల్డన్ అవర్ గంటలోపు ఆస్పత్రికి చేరిస్తే ప్రాణాలు కాపాడవచ్చునని అన్నారు. మాంసంకన్నా శాకాహారం తీసుకోవడం ద్వారా స్ట్రోక్‌లను నివారించవచ్చని చీఫ్ డైటీషియన్ అపర్ణ తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



శ్రీనగర్‌కాలనీ: విద్యార్థులు డ్రాయింగ్, పెయింటింగ్, కార్టూనింగ్ తదితర కళల్లో రాణించాలని ప్రభుత్వ పాఠ్య పుస్తక ముద్రణాలయము సంచాలకులు ఎస్.శ్రీనివాసాచారి అన్నారు. భారత్‌కాన్సెప్ట్ స్కూల్ ప్రాంగణంలో పొలిటికల్ కార్టూనిస్ట్, ప్రెస్ కరెస్పాండెంట్ డాక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో 15 రోజులుగా నిర్వహిస్తున్న కార్టూనింగ్ వర్క్‌షాప్ ముగింపు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు సంచాలకులు ఎస్. శ్రీనివాసాచారి హాజరై ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమొటోలతో సత్కరించారు. ఈ సమావేశానికి భాషా సాంస్కృతిక శాఖ స్పాన్సర్ చేసినందుకు డాక్టర్ మామిడి హరికృష్ణకు కృతజ్ఞతలను డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. కళలను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని, చిన్నతనం నుండే కళలను నేర్చుకోవాలని సూచించారు.

సత్కారం



గంట మల్లేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీనగర్‌కాలనీ: అరుంధతీయ బంధు సేవమండలి ఎర్రగడ్డకు చెందిన దళితరత్న అవార్డు గ్రహీత, దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు గంట మల్లేషని ఘనంగా సత్కరించి మెమొటోని అందజేశారు. దళిత హక్కుల పరిరక్షణ, సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు అరుంధతీయ బంధు సేవామండలి అధ్యక్షుడు కేపీ నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి జి.బి.సత్యేంద్‌కృష్ణ ఆయనను సత్కరించారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు బి.నర్సింగరావు, కార్యదర్శి పవన్‌కుమార్, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని కలిసిన ఆలపాటి



శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకులు ఆలపాటి లక్ష్మీనారాయణ సోమవారం బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నేతలు సూరిబాబు, నాగమణి, రాంబాబు, నవీన్, ఏడుకొండలు, నరేంద్ర, అనీష్‌రామ్ పాల్గొన్నారు.

యువతకు పెద్దపీట

శ్రీనగర్‌కాలనీ: ఇండియన్ ప్రజాకాంగ్రెస్ యువత, మహిళలకు పెద్దపీట వేస్తుందని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి అన్నారు. సోమవారం ఎర్రగడ్డలోని పార్టీ కార్యాలయంలో విద్యావేత్త, సామాజిక కార్యకర్త ప్రభాకర్ చాగంటికి జనగామ నియోజకవర్గం నుంచి బి-ఫారం అందజేశారు. పార్టీ జనరల్ సెక్రటరీ కేహెచ్ఎస్ శర్మ, మహిళా విభాగం ఇంచార్జ్ శోభారెడ్డి, యూత్ అధ్యక్షుడు జి.మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



'నిమ్స్ పల్స్' భేష్

సంచాలకులు ప్రొఫెసర్ నగరి బీరప్ప



పత్రికను విడుదల చేస్తున్న డైరెక్టర్ నగరి బీరప్ప తదితరులు

లక్డీకాపూల్: నిజాం వైద్య విజ్ఞాన సంస్థ(నిమ్స్) పల్స్ భేషుగ్గా ఉందని సంచాలకులు ప్రొఫెసర్ నగరి బీరప్ప పేర్కొన్నారు. సోమవారం ఆయన నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'నిమ్స్ పల్స్' శీర్షికన త్రైమాసిక పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ... 54 పేజీలతో కూడిన ఈ ప్రతికలో ఆస్పత్రిలోని వివిధ విభాగాలలో రోగులకు అందిస్తున్న అధునాతన సేవలపై సమగ్ర సమాచారాన్ని పొందుపర్చామన్నారు. నిమ్స్‌లో జరుగుతున్న పరిశోధనలు, కాన్ఫరెన్స్‌లు, సీఎంఈలు, పబ్లికేషన్స్, అభివృద్ధి కార్యక్రమాలు, క్రీడా సాంస్కృతిక అంశాలను సైతం నిమ్స్ పల్స్ పత్రికలో వివరించామన్నారు. నిమ్స్ డైరెక్టర్ చీఫ్ ఎడిటర్‌గా వ్యవహరించే ఈ పత్రిక రూపకల్పనలో డీన్ ప్రొఫెసర్ లిజ రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ, జీవన్‌దాన్ కోఆర్డినేటర్, నిమ్స్ నెఫ్రాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ స్వర్ణలతతో పాటుగా మరో మంది వైద్యనిపుణులు ఎడిటర్లుగా వ్యవహరిస్తున్నట్టు తెలిపారు.

ఎల్ఐసీ ఏజెంట్లపై కేటీఆర్ వ్యాఖ్యలు బాధాకరం

పంజగుట్ట: ఎల్ఐసీ ఏజెంట్లను కించపరిచేలా మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ ఎస్.బి.శ్రీనివాసాచారి అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉపాధ్యక్షుడు ఎమ్.ఎస్.మూర్తి, కోశాధికారి బి.శ్రీరామ్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ... కరీంనగర్ సభలో మంత్రి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్నారు. వెంటనే ఏజెంట్లకు నష్టం వాటిల్లకుండా ఏదైనా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. మాజీ అధ్యక్షుడు బి.ఎస్.చారి, సింగారపు శ్రీనివాస్, సూరి సీతారాం, ఉదయ భాను, కట్ట వెంకట్‌రెడ్డి, యాదగిరి రెడ్డి, వెంకయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. మధురానగర్ పోలీసుల సమాచారం మేరకు... వెంగళరావునగర్ కాలనీలో నివాసం ఉండే సర్ఫ్‌రాజ్ ఎల్లారెడ్డిగూడలోని చికెన్‌షాపులో విధులు నిర్వహిస్తుంటాడు. యథావిధిగా శనివారం రాత్రి తన విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనం యాక్టివా పై ఇంటికి వచ్చాడు. ఇంటి ముందు బండి పార్క్ చేసి ఆదివారం ఉదయం బయటకు వచ్చి చూడగా కనిపించలేదు. దీంతో ఆయన మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చంపుతానని ఆయుర్వేద వైద్యుడికి బెదిరింపు

వెంగళరావునగర్: ప్రైవేట్ క్లినిక్‌లో దొంగతనం చేయడమే కాకుండా ఆయుర్వేద వైద్యుడిని చంపుతానని బెదిరించిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... బోరబండ డివిజన్ పరిధిలోని ఎస్ఆర్ఆర్ పురం సైట్-3 హైటెక్ హోటల్ వద్ద నివాసం ఉండే గోగులమూడి రాజు కొంతకాలంగా అమీర్‌పేట సమీపంలోని అంబేద్కర్ నగర్‌లో ఆయుర్వేద క్లినిక్ నిర్వహిస్తున్నారు. బోరబండలో రాజు ఇంటి పక్కన నివాసం ఉండే కొమ్ము సుధాకర్ అనే వ్యక్తి వివిధ కేసుల్లో పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. రోజూ మద్యం, గంజాయి సేవించి అందరితో గొడవపడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో గతంలో అనేక మార్లు రాజు క్లినిక్‌లో దొంగతనం చేశాడు. దాంతో అతని కుటుంబ సభ్యులకు తెలియజేయగా అతనిని క్షమించాలని వారు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఆదివారం సుధాకర్ అంబేద్కర్‌నగర్‌లోని రాజుకు చెందిన క్లినిక్ తాళాలు పగలగొట్టి టేబుల్ డ్రాలో దాచిన రూ. 45 వేలు దొంగిలించాడు. రాజు అతని కోసం వెదకినా ఫలితం లేకపోయింది. సోమవారం అతని కుటుంబ సభ్యులకు తెలియజేయగా మీరు ఏం చేయాలనుకుంటే అది చేయండని వారు తెలియజేశారు. సుధాకర్ కూడా తనను చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడని రాజు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



స్పష్టమైన హామీ ఇచ్చిన అభ్యర్థికే మద్దతు

తెలంగాణ వడ్డెర ఐక్య వేదిక నాయకుల ప్రకటన



మాట్లాడుతున్న వేముల యాదయ్య

రహమత్‌నగర్: తమ కుల సమస్యలు పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చే అభ్యర్థులకు తమ సంఘం పూర్తి మద్దతు ప్రకటిస్తుందని తెలంగాణ వడ్డెర ఐక్య వేదిక నాయకులు ప్రకటించారు. ఈ మేరకు ఎస్పీఆర్‌హిల్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల యాదయ్య మాట్లాడుతూ... రహమత్‌నగర్ క్వారీ స్థలంలో వడ్డెర కమ్యూనిటీ హాల్ నిర్మాణం, వడ్డెరలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, బ్యాంకు రుణాలు లాంటివి చేపడ్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చే అభ్యర్థి గెలుపు కోసం తామంత శ్రమిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే ఆ అభ్యర్థితో కలిసి సంఘం నాయకులు ప్రచారం చేస్తామని ఆయన తెలిపారు. ఏ పార్టీ అభ్యర్థి అయినా తామకు అభ్యంతరం లేదని చెప్పారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తమ కులసంఘం ఓట్లు దాదాపు 25 వేల వరకు ఉన్నాయని తెలిపారు. త్వరలోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గం వ్యాప్తంగా తమ కులస్తులతో సమావేశం ఏర్పాటు చేసి తమ నిర్ణయం ప్రకటిస్తామని ఆయన వివరించారు. నగర అధ్యక్షుడు ముద్దంగుల శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొలుసుల ఎల్లయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్ కార్యదర్శి కారు ధ్వంసం

బంజారాహిల్స్: అర్ధరాత్రి తన ఇంటి వద్దకు వచ్చి రాళ్లతో కారు అద్దాలను ధ్వంసం చేయడమే కాకుండా తనకు హెచ్చరికలు జారీ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్ సెక్రటరీ కాట్రగడ్డ సుధాకర్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని కమలాపురి కాలనీలో నివసించే కాట్రగడ్డ సుధాకర్ ఇంటికి అదే యూనియన్‌లో గతంలో ఉపాధ్యక్షుడిగా పని చేసిన ఆర్టిస్టల మేనేజర్ జి.హరినాథ్ అర్ధరాత్రి ఒంటి గంటకు వచ్చాడు. ఆ సమయంలో సుధాకర్ నిద్రపోతున్నాడు. మద్యం మత్తులో తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్న హరినాథ్ అక్కడే ఒక సెల్ఫీ వీడియో తీసుకొని సుధాకర్‌కు హెచ్చరికలు జారీ చేశాడు. అంతు చూస్తానని బెదిరించాడు. దమ్ముంటే రా అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. అంతే కాకుండా అక్కడే ఉన్న రెండు రాళ్లు తీసుకొని సుధాకర్ కారు అద్దాలను ధ్వంసం చేశాడు. ఇటీవల ఎన్నికల్లో తనపై పోటీ చేసి ఓడిపోయినప్పటి నుంచి కక్షపెంచుకున్నాడని ఆయన నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ సుధాకర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గేమింగ్ హౌస్‌పై టాస్క్‌ఫోర్స్ దాడి

నిర్వాహకుడి సహా ఆరుగురి అరెస్టు

హిమాయత్‌నగర్: నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెం.11 లోని గేమింగ్ హౌస్‌పై సెంట్రల్ జోన్ పోలీసులు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి నిర్వాహకుడు గౌతం జైన్‌తో పాటు మరో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు... పేకాట ఆడే వ్యసనం ఉన్న స్నేహితులతో కలిసి నిందితుడు ఈ గేమింగ్ హౌస్ నిర్వహిస్తున్నాడు. అతని స్నేహితుల ద్వారా పేకాట ఆడేవాళ్లను ఇంటికి పిలిపించి, ఒక్కొక్కరి నుంచి రూ. 1000 తీసుకొని ఆడేందుకు అనుమతించే వాడు. సమాచారం తెలుసుకున్న సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గౌతమ్ జైన్ నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి, పేకాట ఆడుతున్న మహేష్ కుమార్ ధూత్, సునీల్ కుమార్, వినోద్ కుమార్ పటక్, దీపక్ కుమార్ బహేతి, జైస్వాల్ సుదీప్, మొగిలి సూర్య ప్రకాష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 1.05 లక్షలు, రెండు ప్లేయింగ్ కార్డ్స్ సెట్లను సీజ్ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం నిందుతులను నారాయణగూడ పోలీసులకు అప్పగించారు.

పేద బ్రాహ్మణులను ఆదుకోండి

రహమత్‌నగర్: ఆదాయం లేని దేవాలయాల్లో అర్చకులుగా పనిచేస్తున్న వారికి ప్రభుత్వం నెలకు రూ. 20 వేల జీతం చెల్లించాలని తెలంగాణ బ్రాహ్మణ అర్చక సేవా సంఘం నాయకుడు నిఖిల్ కులకర్ణి డిమాండ్ చేశారు. రహమత్‌నగర్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ... పేదలైన బ్రాహ్మణులు ఆదాయం లేని ఆలయాల్లో అర్చకులుగా పనిచేస్తు దుర్భర జీవితం అనుభవిస్తున్నారని వాపోయారు.

అందరి సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం: మాగంటి గోపీనాథ్

శ్రీనగర్‌కాలనీ: బడుగు బలహీనవర్గాల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ పార్టీ పథకాలను అందించిందని, ఆ సంక్షేమ పథకాలే భారీ విజయాన్ని అందిస్తాయని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, ఆ పార్టీ అభ్యర్థి మాగంటి గోపీపాథ్ అన్నారు. సోమవారం ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు బస్తీల్లో ప్రచారాన్ని నిర్వహించారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు డి.సంజీవ, నేతలు షరీఫ్ ఖురేషి, పల్లవియాదవ్ పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాగంటి

బీఆర్ఎస్ పాలనలోనే సంక్షేమం

- జూబ్లీహిల్స్ మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ

ఫిలింనగర్: కుల, మత ప్రాంతాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తున్నదని ఈ ఎన్నికల్లో కూడా ఖైరతాబాద్ నియోజకవర్గంలో దానం నాగేందర్‌కు ప్రజలంతా అండగా నిలబడి గెలిపించాలని జూబ్లీహిల్స్ మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ కోరారు. దానం నాగేందర్‌కు మద్దతుగా సోమవారం ఆయన డివిజన్‌లోని బస్తీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ నేతృత్వంలోనే బడుగు, బలహీన వర్గాలు, కాలనీలు, బస్తీలు అభివృద్ధి చెందుతాయన్నారు.



బాధితులకు భరోసా

విజయనగరం జిల్లా రైలు ప్రమాద బాధితులకు సీఎం వైఎస్ జగన్ ఓదార్పు

- క్షతగాత్రుల్లో అవసరమైన ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం కల్పిస్తాం
- మృతుల కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ
- మృతుల కుటుంబీకుల కంటనీరు తుడిచిన ముఖ్యమంత్రి
- విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 22 మంది క్షతగాత్రులు... ప్రతిఒక్కరికీ పరామర్శ
- వైకల్యం కారణంగా ఉపాధి పొందలేని వారికి రూ.5 లక్షలు..
- శాశ్వత వైకల్యం కలిగిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా
- పరిహారం విషయంలో సీఎం ఉదారత
- ప్రమాద స్థలంపై సీఎం ఏరియల్ సర్వే


బాధితురాలిని ఓదారుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, విజయనగరం/విజయనగరం ఫోర్ట్: విజయనగరం జిల్లాలో ఆదివారం రాత్రి సంభవించిన ఘోర రైలు ప్రమాదంలో బాధితులు, వారి కుటుంబ సభ్యులకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారు. విధి వంచనతో పుట్టెడు దుఃఖంతో కుమిలిపోతున్న వారికి పెద్ద కొడుకులా అండగా నిలిచి వారి కన్నీరు తుడిచి ఓదార్చారు. తాను అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు పూర్తిగా కోలుకునే వరకూ వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని ధైర్యం చెప్పారు. అలాగే, అనూహ్య దుర్ఘటనతో భయాందోళనలకు గురైన క్షతగాత్రులు తాము పూర్తిగా కోలుకున్నామన్న నమ్మకం వచ్చేంత వరకూ ఆస్పత్రిలో ఉంచాలని ఆయన సోమవారం బాధితులను పరామర్శిస్తూ అధికారులకు స్పష్టంగా చెప్పారు. వారికి ఎక్స్‌గ్రేషియా విషయంలో కూడా సీఎం ఎంతో ఉదారంగా వ్యవహరించారు.

విజయనగరం జిల్లా అలమండ రైల్వేస్టేషన్ సమీపంలో కంటకాపల్లి వద్ద ఆదివారం రాత్రి రెండు పాసింజర్ రైళ్లు ఢీకొన్న విషయం తెలిసిందే. విశాఖపట్నం నుంచి బయల్దేరిన విశాఖ–పలాస పాసింజర్ రైలును అదే మార్గంలో కొద్ది నిమిషాల వ్యవధిలో బయల్దేరిన విశాఖ–రాయగడ పాసింజర్ రైలు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు రైల్వే సిబ్బంది సహా 13 మంది దుర్మరణం పాలయ్యారు. 50 మంది క్షతగాత్రులయ్యారు. వారిలో 34 మందిని విజయనగరం సర్వజన ఆస్పత్రిలోను, మిగిలిన వారిని ప్రైవేట్ ఆస్పత్రుల్లో హుటాహుటిన చేర్చారు. ఆదివారం అర్ధరాత్రి విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చేరిన వారిలో స్వల్ప గాయాలైన వారు చికిత్స అనంతరం సోమవారం డిశ్చార్జి అయ్యారు. మిగిలిన 22 మంది బాధితులకు రెండు వార్డుల్లో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. వారిని స్వయంగా పరామర్శించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం విజయనగరం జిల్లాకు బయల్దేరి వెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 22 మంది క్షతగాత్రులను వారి వారి బెడ్ వద్దకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా వెళ్లి ప్రతీ ఒక్కరినీ పరామర్శించారు. వారికి వైద్యసేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఒకవేళ ఎవరికైనా అవసరమైతే ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించాలని చెప్పారు. ఒక్కపైసా కూడా వారిపై భారం పడకూడదని, పూర్తి ఉచితంగా వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులకు స్పష్టంగా చెప్పారు. మరోవైపు.. ఈ దుర్ఘటనతో భయాందోళనకు గురైన క్షతగాత్రుల్లో కొంతమంది ఇంకా షాక్‌లో ఉన్నట్లు గుర్తించిన ముఖ్యమంత్రి.. వారికీ ధైర్యం చెప్పారు.

ఉదారంగా ఎక్స్‌గ్రేషియా..

ఇక కంటకాపల్లి రైలు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు. క్షతగాత్రుల విషయంలోనూ ఆయన ఎంతో ఉదారంగా వ్యవహరించారు. స్వల్ప గాయాలైన ప్రతి ఒక్కరికీ రూ.2 లక్షల చొప్పున సాయం ప్రకటించారు. నెలరోజుల కన్నా ఎక్కువ రోజులపాటు ఆస్పత్రిలో చికిత్స అవసరమైన వారికి.. వైకల్యం కారణంగా ఉపాధి పొందలేని వారికి రూ.5 లక్షల చొప్పున, శాశ్వత వైకల్యం కలిగిన వారికి రూ.10 లక్షల వరకూ ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కూడా సీఎం ఆదేశించారు. దీంతో.. క్షతగాత్రుల్లో ఎవరెవరికి ఎంత ఎక్స్‌గ్రేషియా చెల్లించాలో నిర్ణయించేందుకు డాక్టర్లతో కమిటీ వేసినట్లు విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి 'సాక్షి'కి తెలిపారు. ఈ మొత్తాన్ని మంగళవారం మంత్రి బొత్స సత్యనారాయణ, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల ద్వారా అందిస్తామని చెప్పారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..

మృతుడి తండ్రి కన్నీళ్లు తుడిచిన సీఎం జగన్

ఈ ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుశాలపురానికి చెందిన లోకో పైలట్ సువ్వారి చిరంజీవి మృతిచెందడంతో ఆయన తండ్రి సన్యాసిరావును ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఓదార్చారు. సీఎంను చూడగానే ఒక్కసారిగా సన్యాసిరావు బోరున విలపించారు. 'ఒక్కగానొక్క కొడుకు మృతిచెందాడు.. ఈ వయసులో మాకు ఎవరు దిక్కు'.. అంటూ కన్నీరుమున్నీరయ్యారు. సీఎం వెంటనే ఆయన కన్నీళ్లు తుడుస్తూ.. 'అధైర్య పడొద్దు.. కుటుంబానికి అండగా ఉంటా'మంటూ ఓదార్చారు.


లోకో పైలట్ సువ్వారి చిరంజీవి తండ్రి సన్యాసిరావును ఓదారుస్తున్న సీఎం జగన్

రైలు ప్రమాదంపై ఉన్నతస్థాయి ఆడిట్ కమిటీ వేయాలి

ప్రధాని, రైల్వే మంత్రికి సీఎం జగన్ 'ఎక్స్'లో వినతి

సాక్షి, అమరావతి: విజయనగరంలో జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం తనను తీవ్రంగా కలిచివేసిందని, ఇటువంటి దుర్ఘటనలు ఎందుకు జరుగుతున్నాయన్న దానిపై ఉన్నతస్థాయి ఆడిట్ కమిటీ వేయాలంటూ ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ప్రధాని, రైల్వేమంత్రిని ట్యాగ్‌చేస్తూ ఆయన 'ఎక్స్'(ట్విట్టర్)లో పోస్టుచేశారు. అందులో ముఖ్యమంత్రి ఏం పేర్కొన్నారంటే..

''ఆదివారం రాత్రి విజయనగరం జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం నన్ను చాలా బాధించింది. రన్నింగ్‌లో ఉన్న రైలు మరో రైలును ఢీకొట్టింది, ఈ రెండూ ఒకే దిశలో నడుస్తున్నాయి. ఈ భయంకరమైన ప్రమాదం కొన్ని స్పష్టమైన ప్రశ్నలకు దారితీస్తోంది..

- బ్రేకింగ్ సిస్టం, అలర్ట్ సిస్టం ఎందుకు పనిచేయలేదు?
- సిగ్నలింగ్ ఎందుకు విఫలమైంది?
- కమ్యూనికేషన్ వ్యవస్థ ఎలా విఫలమైంది?

ఇక భవిష్యత్తులో ఇలాంటి విధ్వంసకర ప్రమాదాలు పునరావృతం కాకుండా చూసేందుకు, ఈ లైన్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా అన్ని మార్గాల్లో ఈ అంశాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఒక ఉన్నతస్థాయి ఆడిట్ కమిటీని ఏర్పాటు చేయాలని గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గౌరవనీయ రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌లను నేను హృదయపూర్వకంగా అభ్యర్థిస్తున్నాను. నా ఆలోచనలు, ప్రార్థనలు ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలతో కలిసి ఉన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి సాధ్యమైనంత ఉత్తమమైన సంరక్షణ చర్యలను మా ప్రభుత్వం అందిస్తోంది''.

బాధితులకు అండగా ప్రభుత్వం..

అంతకుముందు.. విజయనరం జిల్లా పర్యటన అనంతరం ముఖ్యమంత్రి 'ఎక్స్'లో మరో పోస్టు ద్వారా కూడా తన బాధను పంచుకున్నారు. ''విజయనగరం జిల్లా రైలు ప్రమాద ఘటనలో పలువురు మరణించడం బాధాకరం. వారి కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. ఈ ఘటనలో గాయపడి విజయనగరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించాను. వారు కోలుకునేంత వరకూ ప్రభుత్వం తోడుగా నిలుస్తుంది. వారికి మంచి వైద్యం అందించడంతో పాటు మరణించిన వారి కుటుంబాలకు, క్షతగాత్రులకు ఎక్స్‌గ్రేషియాను సత్వరమే అందించాలని అధికారులను ఆదేశించాను''.. అంటూ పేర్కొన్నారు.

13కు చేరిన మృతులు

- 50 మంది క్షతగాత్రులు
- విజయనగరం సర్వజనాస్పత్రి, విశాఖ కేజీహెచ్ తదితర ఆస్పత్రుల్లో కోలుకుంటున్న బాధితులు

ఆరిలోవ(విశాఖ తూర్పు)/మహారాణిపేట(విశాఖ దక్షిణ)/తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర) : విజయనగరం జిల్లా భీమాలి–అలమండ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య 13కి చేరింది. మొత్తం 50 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిలో 34 మందిని విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించగా.. మిగిలిన వారిని విశాఖ కేజీహెచ్, రైల్వే, ఇతర ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. ఇదిలా ఉండగా, విశాఖ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరిన పలాస పాసింజర్‌లో స్పెషల్ గార్డుగా ఉన్న మరిపి శ్రీనివాసరావు(53) ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి.. విశాఖ ఆస్పత్రికి తరలించిన కొద్దిసేపటికే మృతిచెందాడు. రైల్వే అధికారులు కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని సోమవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అలాగే, రాయగడ ప్యాసింజరుకు లోకో పైలట్‌గా ఉన్న విశాఖ జిల్లా తంగేడు గ్రామానికి చెందిన శింగంపల్లి మధుసూదనరావు(53) ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



సీఎం ఏరియల్ సర్వే..

మరోవైపు.. రైళ్లు ఢీకొన్న ప్రమాద స్థలానికి వెళ్లి స్వయంగా పరిశీలించాలని సీఎం జగన్ తొలుత నిర్ణయించారు. అయితే, ట్రాక్ పునరుద్ధరణ పనులు, మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయని, ఈ దృష్ట్యా సందర్శనను రద్దుచేసుకోవాలని రైల్వే అధికారులు సీఎంకు విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన హెలికాప్టర్‌లో నేరుగా విజయనగరంలోని పోలీసు శిక్షణ కళాశాల మైదానానికి చేరుకున్నారు. అక్కడ నుంచి ఆసుపత్రిలో క్షతగాత్రులు, మృతుల కుటుంబీకుల పరామర్శ అనంతరం విశాఖకు తిరిగివెళ్తూ ఏరియల్ సర్వే నిర్వహించారు.

ప్రత్యేక దర్యాప్తు బృందం రంగంలోకి..

సాక్షి, విశాఖపట్నం: వాల్తేరు డివిజన్ పరిధిలో రైలు ప్రమాదం జరగడం అత్యంత బాధాకరమని వాల్తేరు డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ అన్నారు. ప్రమాద స్థలికి ఆదివారం రాత్రి చేరుకున్న డీఆర్ఎం పునరుద్ధరణ పనుల్ని నిరంతరాయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడారు. ప్రమాదానికి గల కారణాల్ని అన్వేషిస్తున్నట్లు తెలిపారు. సమగ్ర దర్యాప్తు చేసేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశించిందన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

సమగ్రంగా అధ్యయనం


జ్యుడిషియల్ పవర్స్ ఉన్న రైల్వే సేఫ్టీ కమిషనర్ నేతృత్వంలో ఉన్నతాధికారుల బృందం దర్యాప్తు ప్రారంభించింది. ప్రమాద సమయంలో రైలు ఎంత వేగంలో వెళ్తోందనేది నమోదైన స్పీడ్ రికార్డర్‌ను సీజ్ చేశాం. ప్రమాద సమయంలో సిగ్నల్ పొజిషన్ ఏ విధంగా ఉంది? మొదటి ఎక్స్‌ప్రెస్‌కు సంబంధించిన సిగ్నల్ ఎప్పుడు నమోదైంది.. రెండో రైలుకు సిగ్నల్ ఎప్పుడు ఇచ్చారు. ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తిందా మొదలైన అంశాలన్నీ డేటా లాగర్‌లో నిక్షిప్తమై ఉంటాయి. దీనికి సంబంధించిన డేటా లాగర్‌ని సీజ్ చేశాం. దీంతో పాటు రైల్లో ప్రయాణిస్తున్న వారి వద్ద నుంచి వివరాలు సేకరిస్తాం. మొత్తాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి.. దర్యాప్తు బృందం తుది నివేదికను వెల్లడించాక తదుపరి చర్యలు తీసుకుంటాం. మొత్తం ఆరు కోచ్‌లు ప్రమాదానికి గురయ్యాయి. సోమవారం రాత్రి కల్లా మూడు లైన్లనూ అందుబాటులోకి తెస్తాం.

నగర వార్తలు

పతుల కోసం సతుల ప్రచారం


మైనంపల్లికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న మైనంపల్లి వాణి

మల్కాజిగిరి: ఎన్నికల్లో విజయం కోసం అభ్యర్థుల భార్యలు ఇల్లిల్లూ తిరిగి ఓటర్లను కలిసి మద్దతు కోరుతున్నారు. రాబోయే ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి మైనంపల్లి హన్మంతరావును గెలిపించాలని ఆయన సతీమణి వాణి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ వెంకటేశ్వరనగర్ పోచమ్మ దేవాలయంలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. వాణి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలో రావడం ముఖ్యమన్నారు. బీఆర్ఎస్ మాటలకు మోసపోకుండా కాంగ్రెస్ పార్టీని ఆదరించాలన్నారు.


మర్రి రాజశేఖర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న మర్రి మమత రెడ్డి

అల్వాల్: 136 డివిజన్‌లోని యాప్రాల్‌లో కింది బస్తీ, చాకలి బస్తీ, కమ్మరి బస్తీల్లో సోమవారం గడప గడప కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి సతీమణి మర్రి మమత రెడ్డి ఇంటింటికీ వెళ్లి ఓటు వేయాలని కోరారు. మర్రి రాజశేఖర్ రెడ్డిని గెలిపిస్తే రాబోయే రోజుల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేస్తారని చెప్పారు. బస్తీవాసులు పెద్దఎత్తున తరలి వచ్చి బీఆర్ఎస్‌కే తమ మద్దతు అని తెలిపారు.

రూ.17.40 లక్షల నగదు స్వాధీనం

దుండిగల్: మేడ్చల్ జోన్ ఎస్‌ఓటీ, దుండిగల్ పోలీసులు రూ.17.40లక్షలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దుండిగల్, ఎస్‌ఓటీ పోలీసులు గండిమైసమ్మ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో డి.పోచంపల్లి ప్రాంతానికి చెందిన అరవింద్‌సింగ్ అనే వ్యక్తి బైక్‌పై బహదూర్‌పల్లి వైపు వస్తున్నాడు. అతని వద్ద రెండు బ్యాగులు ఉండడంతో పోలీసులకు అనుమానం వచ్చి బైక్‌ను ఆపి తనిఖీ చేశారు. అందులో రూ.17.40 లక్షల నగదు లభ్యమైంది. కిరాణా షాపు నిర్వహణ డబ్బు అని అరవింద్ చెప్పగా సరైన పత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని సంబంధిత అధికారులకు అందజేశారు.

ఒడిశా టు మహారాష్ట్ర వయా హైదరాబాద్

- గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు..
- 710 కేజీల గంజాయి స్వాధీనం..
- లారీ క్యాబిన్‌లో ప్రత్యేక ఏర్పాట్లు..


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయిని పరిశీలిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

నాగోలు: గంజాయి సరఫరా కోసం లారీలో ప్రత్యేకంగా క్యాబిన్ తయారు చేయించి ఒడిశా రాష్ట్రం నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని ఘట్‌కేసర్ పోలీసులు, మహేశ్వరం జోన్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 710 కేజీలు ఎండు గంజాయి, కంటైనర్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సోమవారం ఎల్‌బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ వివరాలు వెల్లడించారు.. రాజస్థాన్‌కు చెందిన సుభాష్ బీష్ణోయ్ డైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో గంజాయి రవాణా చేసి సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. దీంతో గంజాయి సరఫరాదారులతో పరిచయాలు పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో ఓ డ్రగ్ పెడ్లర్ ఒడిశా నుంచి హైదరాబాద్‌తో పాటు మహారాష్ట్రకు గంజాయిని సరఫరా చేస్తే ట్రిప్పుకు రూ. 60 వేలు ఇస్తానని చెప్పాడు. ఒప్పందం మేరకు గతంలో 500 కిలోల గంజాయి రవాణా చేసిన సుభాష్ అతడు సూచించిన చోటుకు చేర్చాడు. ఇందుకు గాను సుభాష్ బీష్ణోయ్ తన లారీ క్యాబిన్, బాడీ మధ్య ప్రత్యేకంగా రహస్య క్యాబిన్ ఏర్పాటు చేయించాడు. ఈ క్రమంలో సదరు పెడ్లర్ సూచన మేరకు ఈనెల 24న అతను ఒడిశా రాష్ట్రం, నవరంగపూర్‌కు వెళ్లి 710 కిలోల గంజాయిని లారీ రహస్య అరలో లోడ్ చేసి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు బయలుదేరాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం రాత్రి ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అవశాపూర్ చెక్ పోస్ట్ వద్ద లారీని అడ్డుకున్నారు. నిందితుడు సుభాష్ బిష్ణోయ్‌ను అరెస్టు చేసి అతడి నుంచి 710 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతనిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

రాజస్థాన్ టు హైదరాబాద్

- మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న నలుగురి అరెస్టు
- నిందితుల్లో ఇద్దరు మైనర్లు
- రూ.50 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం..



స్వాధీనం చేసుకున్న హెరాయిన్..

నాగోలు: రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్న నలుగురు వ్యక్తులను ఎల్‌బీనగర్ ఎస్ఓటీ, మీర్‌పేట్ పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరి మైనర్లను జువెనైల్ హోంకు తరలించి వారి నుంచి 80 గ్రాముల హెరాయిన్, బైక్, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఎల్‌బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో సీపీ డీఎస్ చౌహాన్ వివరాలు వెల్లడించారు..రాజస్థాన్‌కు చెందిన భన్వర్ లాల్ మీర్‌పేట్, ఎబీఆర్‌కాలనీలో మొబైల్ షాప్ నిర్వహిస్తున్నాడు. రాజస్థాన్‌కు చెందిన మరో ఇద్దరు మైనర్లు, విష్ణు బిష్ణోయ్(19)తో కలిసి ముఠాగా ఏర్పడిన వీరు మాదక ద్రవ్యాలకు అలవాడు పడ్డారు. రాజస్థాన్ నుంచి హెరాయిన్ తెప్పించుకొని వారు వినియోగిస్తూ అవసరమైన వారికి సరఫరా చేస్తున్నారు. ప్రధాన నిందితుడు భన్వర్‌లాల్ ఇద్దరు మైనర్లతో మాదకద్రవ్యాలను నగరంలో సరఫరా చేస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో మీర్‌పేట్ పోలీసులు, ఎస్ఓటీ పోలీసులు ఆదివారం సాయంత్రం మీర్‌పేట్ పరిధిలోని ఎన్‌బీఆర్ కాలనీలో డ్రగ్స్ సరఫరా చేస్తుండగా నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి 80 గ్రాముల హెరాయిన్, బైక్, మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న హెరాయిన్ విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ. 50 లక్షలు ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఎల్‌బీనగర్–మహేశ్వరం ఎస్ఓటీ డీసీపీ మురళీధర్, ఎల్‌బీనగర్, మీర్‌పేట్ పోలీసులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ ముందే సమస్త సమాచారం



బంజారాహిల్స్: మీరు గత ఎన్నికల్లో ఓటు వేశారు.. అయితే ఈ సారి ఓటరు జాబితాలో మీ పేరు కనిపించడం లేదు. ఇప్పుడిక ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పేరు లేకపోతే వెంటనే గత ఎన్నికల్లో ఓటు వేసిన పోలింగ్ బూత్‌కు వెళ్తే అక్కడ గోడలపై ఎవరిని కలవాలో, బాధ్యులెవరూ సమస్త సమాచారం వివరించే వివరాలు కనిపిస్తాయి. ఆ బోర్డులో ఉన్న బూత్‌లెవల్ అధికారికి ఫోన్ చేస్తే ఆయన క్షణాల్లో అక్కడికి చేరుకొని మీ పేరు ఉన్నది లేనిది సరిచూసి లేకపోతే అక్కడికక్కడే వివరాలు తీసుకొని నమోదు చేస్తారు. అంతేకాదు మీ ఓటు ఎక్కడ వేయాలో సందేహం ఉంటే వెంటనే సమీపంలోని పోలింగ్ బూత్‌కు వెళ్తే అక్కడ బోర్డుపై సంబంధిత బీఎల్‌వో నెంబర్‌తో పాటు బీఎల్‌వో సూపర్‌వైజర్ నెంబర్ కూడా రాసి ఉంటుంది. ఇంకోవైపు ఒక భవనంలో నాలుగైదు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తారు. అందులో తాము ఏ బూత్ పరిధిలోకి వస్తామో కూడా సమగ్ర వివరాలు ఇంటి నెంబర్ సంబంధిత అధికారి పేరు రాసి ఉంటుంది. ఇలా ఓటింగ్ శాతాన్ని పెంచడం, ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈసారి ఎన్నికల సంఘం మెరుగైన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చింది.

డేటా ప్రొటెక్షన్ అండ్ ప్రైవసీలో జడ్జి మహేశ్‌నాథ్ పీహెచ్‌డీ

సాక్షి, హైదరాబాద్: మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కోర్టు న్యాయమూర్తి జీవీ మహేశ్‌నాథ్ డేటా ప్రొటెక్షన్ అండ్ ప్రైవసీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. తెలంగాణ వర్సిటీ నుంచి ఆయన ఈ ఘనత సాధించారు. 2010లో జ్యుడిషియల్ సర్వీస్‌లోకి అడుగు పెట్టిన మహేశ్‌నాథ్ రాజ్యాంగం, సైకాలజీ, సైబర్‌లా అండ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్‌లో మాస్టర్స్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఆయన్ను సోమవారం ఘనంగా సన్మానించింది.



ప్రజా జీవితంలో టీవీ భాగమైంది

చిక్కడపల్లి: ప్రజా జీవితంలో టెలివిజన్ భాగమైందని అందువల్ల ఆ రంగంలో యాంకర్లు భాష, ఉచ్చారణ, అహార్యం పట్ల జాగ్రత్త వహించాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి సూచించారు. సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ నిర్వహణలో తెలుగు టెలివిజన్ యాంకర్లకు పురస్కార ప్రదాన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేవీ రమణాచారి పలువురికి అవార్డులు అందజేశారు. పురస్కారాలు బాధ్యతను పెంచుతాయని గ్రహించి మీ రంగంలో మరింత నైపుణ్యం పెంచుకోవాలని కోరారు. కళా పోషకుడు చిల్లరాజశేఖర రెడ్డి అధ్యక్షత వహించిన సభలో దక్షిణ మధ్యరైల్వే విశ్రాంత జనరల్ మేనేజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్



నాగోలు: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాచకొండ కమిషనరేట్ పరిధిలో వివిధ ప్రాంతాలలో 19 ప్రధాన చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తెలిపారు. సోమవారం ఎల్‌బీనగర్ సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాచకొండ పరిధిలో వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులలో పోలీసులతోపాటు కేంద్ర బలగాలు కూడా విధుల్లో ఉంటున్నారని తెలిపారు. ప్రతి చెక్ పోస్ట్‌లో షిఫ్టుల వారిగా 12 మంది విధుల్లో ఉంటారని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో మూడు ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఉన్నాయని, వీటితోపాటు స్టాటిస్టికల్ టీమ్స్ కూడా ఉన్నాయిని సీపీ తెలిపారు. రాచకొండ వ్యాప్తంగా ఇప్పటికే 12 ఫ్లాగ్ మార్చ్‌లు పూర్తి చేశామని పేర్కొన్నారు. కమిషనరేట్‌పరిధిలో 3326 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. అంతేకాక 861 డిపాజిట్ అయినట్లు తెలిపారు. అధిక మొత్తంలో నగదు తీసుకువెళ్లే పక్షంలో సరైన పత్రాలు ఉంటే సీజ్‌చేయబోమన్నారు. ఇప్పటివరకు రూ.36 కోట్లు సీజ్ చేసినట్లు సీపీ తెలిపారు.

అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు..

బీఆర్ఎస్‌లో చేరికలు


బీఆర్ఎస్‌లో చేరిన వారితో మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: మేడ్చల్ బీఆర్ఎస్‌లో వివిధ వార్డులకు చెందిన నాయకులు భారీగా చేరారు. సీనియర్ నాయకుడు శంకర్‌ముదిరాజ్ ఇంటి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి మంత్రి మల్లారెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. దాదాపు 150 మంది మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నర్సింహస్వామి యాదవ్, మహేష్, దేవ, నాయకులు నర్సింహరెడ్డి, రవీందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు


కాంగ్రెస్‌లో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ సమక్షంలో మేడ్చల్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కాంగ్రెస్‌లో చేరారు. మాజీ వార్డు సభ్యురాలు సాయిరజని, సీనియర్ నాయకులు గర్దాస్ నరేందర్, లింగం తదితరులు పార్టీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సరితా మల్లేష్‌గౌడ్, చాప రాజు, నాయకులు పోచయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రంజిత్, రేగు రాజు తదితరులు పాల్గొన్నారు.



విశ్వ గాయని రావు బాలసరస్వతీదేవి వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం అందుకోనున్న సందర్భంగా...

గాన సరస్వతి

పువ్వుకు రాగం అబ్బితే ఎలా ఉంటుంది?
ఆ పువ్వు స్వరాన్ని ఎలా సవరించుకుంటుంది?
ఆ తావి గానాన్ని ఎలా శ్రుతి చేసుకుంటుంది?
అక్షరాలను పూలరెక్కల్లా పొదివి పట్టుకుంటుంది.
సరిగమలు కందకుండా సున్నితంగా గానం చేస్తుంది.
ఆ గాన సరస్వతి... మన రావు బాలసరస్వతీదేవి.

పువ్వు పాడితే ఎలా ఉంటుందో... రావు బాల సరస్వతీదేవి పాట వింటే తెలుస్తుంది. హైదరాబాద్, మణికొండలోని గాయత్రి ప్లాజాలో ఆమె ఫ్లాట్ గోడలు ఆ గానసరస్వతి రాగాలను నిత్యం వింటుంటాయి. తొంభై ఐదేళ్ల వయసులో కూడా ఆమె స్వరంలో రాగం శ్రుతి తప్ప లేదు. తొంభై ఏళ్లుగా సాగుతున్న సాధనతో ఆ స్వరం అద్దుకున్న తియ్యదనం అది. పారిజాత పువ్వులాంటి మృదుత్వం ఆమె రాగానిది. ఆ గొంతు సన్నజాజి మొగ్గలా పరిమళం వెదజల్లుతోంది ప్పటికీ. ఆ సుమధుర గానాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. తొమ్మిది దశాబ్దాల ఆమె సంగీత సేవను గౌరవిస్తోంది. నవంబర్ ఒకటవ తేదీన (రేపు) ఆమె వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం అందుకోనున్నారు.




● పాట రికార్డింగ్ సమయంలో ఆరేళ్ల బాల సరస్వతీదేవి

గ్రామఫోన్ నుంచి సీడీల వరకు

సరస్వతి నాలుగవ ఏట నుంచి వేదికల మీద పాడుతున్నారు. ఆరవ ఏట హెచ్.ఎం.వి కంపెనీ ఆమె పాటను గ్రామఫోన్‌లో రికార్డు చేసింది. తెలుగు సినిమాలో తొలి నేపథ్య గాయనిగా రికార్డు ఆమెదే. ఆకాశవాణి కేంద్రాలు మద్రాసు, విజయవాడ స్టేషన్‌ల కోసం ప్రారంభగీతం పాడిన రికార్డు కూడా ఆమెదే. తెలుగు, తమిళ, కన్నడ భాషలతోపాటు సింహళ గీతాలనూ ఆలపించారు. బాలనటిగా, బాల గాయనిగా సినీరంగం ఆమెను గారం చేసింది. పేరు ముందు 'బాల'ను చేర్చింది. కర్ణాటక సంగీతం, హిందూస్థానీ సంగీతాలు సాధన చేసింది. సినిమా షూటింగ్‌ల కారణంగా స్కూలుకెళ్లడం కుదరకపోవడంతో ఆమె చదువు కోసం ట్యూటర్ ఇంటికి వచ్చి పాఠాలు చెప్పేవారు. ఆమెకు ఇంగ్లిష్ నవలలు చాలా ఇష్టం. ఆ అలవాటును ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. గ్రామఫోన్ రికార్డుల కాలం నుంచి క్యాసెట్ టేప్‌లో రికార్డ్ చేసే టెక్నాలజీని చూశారు. సీడీలు, ఎంపీత్రీలనూ చూశారు. టెక్నాలజీతోపాటు అప్‌డేట్ అవుతూ వచ్చారు. కానీ, సినిమా సంగీతం, సాహిత్యంలో వచ్చిన భాషాపరంగా విలోమమవుతున్న ప్రమాణాలను అంగీకరించలేకపోయారు. సినిమా అంటే శక్తిమంతమైన వినోదసాధనం. పిల్లలు, యువతకు మానసిక వికాసం, మేధో వికాసంతోపాటు వాళ్ల అభివృద్ధికి... వినోదం అనే సాధనంతో బాటలు వేసే గొప్ప కళామాధ్యమంగా ఉండాలి సినిమా. అంతే తప్ప విలువలను దిగజార్చుకునే సాధనం కాకూడదని చెబుతారామె. రెండు వేలకు పైగా పాటలు పాడిన ఈ సంగీత సరస్వతి ఈ రోజుల్లో పాటల సాహిత్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

సినిమాలకు మాత్రమే దూరం... స్వరానికి కాదు!

పెళ్లి తర్వాత పదిహేనేళ్లకు బాల సరస్వతీదేవి సినిమాల కోసం పాడడం మానేశారు. కానీ సంగీత సాధన మాత్రం ఆపలేదు. సినారె తెలుగులోకి అనువదించిన మీరాభజన్ గీతాలను ఆలపించారామె. ఎనభై ఏళ్ల వయసులో ఆమె తనకిష్టమైన కొన్ని లలిత గీతాలను ఎంచుకుని స్వీయ సంగీత దర్శకత్వం వహించి 'రాధా మాధవం' సీడీ విడుదల చేశారు. కోవిడ్‌కి ముందు 2018లో అంటే ఆమె తొంబయ్యేళ్ల వయసులో 'స్వరాభిషేకం' కార్యక్రమంలో పాడడమే ఆమె చివరి వేదిక. ఆ వేడుక తర్వాత మూడవ రోజు ఇంట్లో జరిగిన ప్రమాదం ఆమెను ఇంటికే పరిమితం చేసింది. అయితే ఆశ్చర్యంగా జారి పడడంతో విరిగిన తుంటి ఎముక దానంతట అదే సరయింది. సంగీతమే తనను స్వస్థత పరిచిందంటారామె. ఇప్పటికీ రోజూ ఆ స్వరం రాగాలను పలుకుతుంటుంది. ఆమె ఊపిరితిత్తులకు శక్తినిస్తున్నది సంగీతమేనని వైద్యులు కూడా నిర్ధారించారు.



● భర్త, పిల్లలతో బాలసరస్వతీ దేవి

పాట కలిపింది ఇద్దరినీ!

చెన్నై (మద్రాసు) లో పుట్టి పెరిగిన బాల సరస్వతి పెళ్లి తర్వాత కోడలిగా కోలంక జమీందారీలో అడుగుపెట్టారు. ప్రకృతి ఇద్దరు వ్యక్తులను దూరం చేసిన విషాదాంతాలను సినిమాల్లో చూస్తుంటాం. కానీ ప్రకృతి ఇద్దరు మనుషులను దగ్గర చేయాలనుకుంటే చాలా చమత్కారంగా దగ్గర చేస్తుంది. అందుకు ఈ గానసరస్వతి పెళ్లే గొప్ప ఉదాహరణ. "నా పాటను విన డానికి స్వయంగా కోలంక జమీందార్... శ్రీ రాజారావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావు గారు మద్రాసులో మా ఇంటికి వచ్చారు. నేనప్పుడే 'కలువ రేకుల కనులు గల నా స్వామీ' అనే పాట రికార్డింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాను. మా నాన్న పాట పాడమనగానే అదే పాట పాడాను. రాజా వారేమో తన పెద్ద కళ్లను వర్ణిస్తూ, వారి మీద ప్రేమను అలా పాట రూపంలో వ్యక్తం చేశాననుకున్నారట. అదే మా పెళ్లికి నాందీ గీతం' అంటూ ఆనాటి జ్ఞాపకాన్ని సంతోషంగా గుర్తు చేసుకున్నారామె. అందుకే తనకు ఇష్టమైన ప్రదేశం మద్రాసేనని చెబుతారామె.

ఈ బాల రెండో బాల్యమిది!

బాలసరస్వతీ దేవికి హాఫ్ వైట్ పట్టు చీరలిష్టం. క్రీమ్ కలర్‌తో అనేక రంగుల కాంబినేషన్‌లలోనే ఎక్కువగా కనిపిస్తారు. ఆమెకు మల్లెలన్నా ఇష్టమే. ఇక స్వీట్స్... ముఖ్యంగా గులాబ్ జామూన్, జాంగ్రీలను చూస్తే చిన్న పిల్లయిపోతారు. చాక్లెట్ చేతికిస్తే పసి పిల్లల ముఖం వికసించినట్లే ఆమె ముఖంలో నవ్వులు పూస్తాయి. భోజనం గుప్పెడే కానీ, ఆ వెంటనే స్వీట్ తినడం ఆమె కిష్టం, ఆ తర్వాత తియ్యగా పాడడం మరింత ఇష్టం. ఆ సరిగమల వారసత్వం ఇద్దరు కొడుకులకు రాలేదు, మనుమడు, మనుమరాలికీ రాలేదు. కానీ మనుమరాలి కూతురు నేహకు వచ్చింది. గానసరస్వతి కళ్ల ముందే ఆ ఇంట్లో సరిగమల కొత్తతరం వెల్లివిరుస్తోంది. తొంభై ఐదేళ్ల వయసులో హైదరాబాద్‌లోని పెద్ద కుమారుని ఇంటిలో ప్రశాంతంగా పసిబిడ్డలా జీవిస్తున్నారు బాల సరస్వతీదేవి. కన్నతల్లిని 'కన్నక్కా' అని పిలుస్తూ తల్లిని కన్నబిడ్డలా చూసుకుంటున్నారాయన. కోడలు అత్తగారి చిన్నప్పటి జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ గుర్తు చేసుకుంటూ ఆమెను అపురూపంగా చూసుకుంటున్నారు. సాక్షి ఇంటర్వ్యూలో ఆమె కొన్ని సంగతులు చెప్తూ మధ్యలో మర్చిపోతుంటే ఆమె పెద్ద కొడుకు, పెద్ద కోడలు అందుకుని పూర్తి చేయడమే అందుకు నిదర్శనం.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: మోహనాచారి

మల్టీ టాలెంట్



● బిజినెస్ లీడర్‌గా...

తేజో చంద్రిక



● సుమధుర గాయనిగా...

ఆరోజు...
'అలాగే' అని తల ఆడించి ఉంటే 'పవర్ ఫుల్ ఉమన్'గా ప్రపంచ వ్యాప్తంగా చంద్రిక పేరు తెచ్చుకునేది కాదు.
'ఉద్రిక్త పరిస్థితులు ఉన్న ఈ ఊళ్లో ఒక్కరోజు కూడా ఉండలేను' అని భయపడి ఉండే ఉద్యోగజీవితంలోకి వచ్చేది కాదు. తనను తాను నిరూపించుకునేది కాదు.
'లాయర్ కావాలనుకున్నాను. ఈ ఉద్యోగం ఏమిటి' అని నిట్టూర్చి ఉంటే చంద్రిక కొత్త శిఖరాలు అధిరోహించేది కాదు.
'ఉద్యోగ జీవితానికే టైమ్ లేదు. ఇక సంగీతానికి స్థానం ఎక్కడ' అని సర్దుకుపోయి ఉంటే సంగీత ప్రపంచంలో తనదైన పేరు తెచ్చుకునేది కాదు. ప్రపంచ గుర్తింపు పొందిన బిజినెస్ లీడర్, గ్రామీ–నామినేట్ ఆర్టిస్ట్‌గా, దాతగా ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తుంది చంద్రిక....

'**అ**వసరం లేదు' ఒక మాటలో తేల్చేసింది అమ్మ. మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో డిగ్రీలో చేరాలనుకుంటున్న చంద్రికకు ఆ మాట శరాఘాతం అయింది. 'ఆ కాలేజీలో తక్కువమంది మాత్రమే అమ్మాయిలు ఉన్నారు. అంతా అబ్బాయిలే' అన్నది అమ్మ. చంద్రిక చాలా సేపు అమ్మతో వాదించినా ఫలితం కనిపించలేదు.

ఇంట్లోనే నిరాహార దీక్ష చేసింది. దీంతో చంద్రిక మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో చదవడానికి తల్లి ఒప్పుకోక తప్పింది కాదు. మూడు సంవత్సరాల కాలేజీ జీవితం చంద్రిక జీవితాన్ని కీలక మలుపు తిప్పింది. సంగీతప్రపంచంతో అనుబంధానికి, సింగర్‌గా పేరు తెచ్చుకోవడానికి కారణం అయింది.

డిగ్రీలో చేరడమే కష్టం అనుకున్న చంద్రిక ఆ తరువాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ చేరడం పెద్ద విజయం. నిజానికి చంద్రికకు బిజినెస్ ప్రపంచంపై పెద్దగా ఆసక్తి లేదు. తాతలాగే లాయర్ కావాలనుకుంది. అయితే ప్రొఫెసర్ స్వామినాథన్ సూచన మేరకు బిజినెస్ స్కూల్‌లో చేరింది. మొదటి కొన్నిరోజులు చాలా కష్టంగా అనిపించింది. ఎందుకంటే సొంత ఊరు దాటి అంత దూరం రావడం అదే మొదటిసారి.

ఆ ఒంటరితనానికి దూరం కావడానికి సంగీతానికి దగ్గరైంది. చంద్రిక తొలి ఉద్యోగం సిటీబ్యాంక్‌లో. బ్యాంకర్ కావాలని కలలో కూడా అనుకోని చంద్రికకు ఇది వింతగా అనిపించింది. ట్రైనింగ్ ప్రోగ్రామ్ కోసం లెబనాన్‌లోని బీరుట్ వెళ్లింది. యుద్ధానికి సంబంధించి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో అక్కడకు వెళ్లింది. అక్కడ అయిదు నెలల పాటు ఉంది. సిటీబ్యాంక్ తరువాత వేరే సంస్థల నుంచి చంద్రికకు అవకాశాలు రావడం మొదలైంది. అలా అమెరికాలోకి అడుగు పెట్టింది. ఉద్యోగంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ తనకు ఇష్టమైన సంగీతప్రపంచాన్ని మాత్రం చంద్రిక విడిచి బయటికి రాలేదు. ఎన్నో ఆల్బమ్స్ ద్వారా సక్సెస్‌ఫుల్ మ్యూజిషియన్‌గా తనను తాను నిరూపించుకుంది. సెకండ్ ఆల్బమ్ 'సోల్ కాల్' గ్రామీ అవార్డ్–బెస్ట్ కాంటెంపరరీ వరల్డ్ మ్యూజిక్ ఆల్బమ్ విభాగంలో నామినేట్ అయింది.

గ్లోబల్ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ మకెంజీకి ఫస్ట్ ఇండియన్ ఉమెన్ పార్ట్‌నర్‌గా అరుదైన ఘనత సాధించింది. అడ్వైజరీ సంస్థ 'టాండన్ క్యాపిటల్స్ అసోసియేషన్స్' ప్రారంభించి సూపర్ సక్సెస్ అయింది.

ఈ ప్రయాణంలో చంద్రికకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. కుటుంబజీవితం, వృత్తి జీవితాన్ని సమన్వయం చేసుకోవడం కూడా అందులో ఒకటి. అయితే ప్రతి సవాలును అధిగమిస్తూ ముందుకు వెళ్లింది. సవాలు ముందుకు వచ్చినా, ఒత్తిడి తలలో దూరినా తన దగ్గర ఉన్న బ్రహ్మాస్త్రం సంగీతం. పాటలు వినడం, పాడడం తనకు ఎంతో ఇష్టం. అదే తన బలం. తాజాగా 'అమ్మూస్ ట్రెజరర్స్' ఆల్బమ్‌తో ముందుకు వచ్చింది చంద్రిక. ఇది పిల్లలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఆల్బమ్.

సాగుబడి
స్వాతి కార్తె: నవంబర్ 6 వరకు

- బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పెంపకంతో రైతులకు ఆదాయం, పర్యావరణానికి మేలు
- సేంద్రియ వ్యర్థాలను ప్రొటీన్లతో కూడిన ఆహారంగా మార్చుతున్న బ్లాక్ సోల్జర్ ఈగలు
- బిఎస్ఎఫ్ లార్వాలు (పిల్ల పురుగులు) కోళ్లకు, చేపలు, రొయ్యలకు, పెంపుడు కుక్కలకు భేషైన పౌష్టికాహారం
- 30 రోజులకో బ్యాచ్ చొప్పున బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను ఇంటిపట్టునే సులువుగా పెంచవచ్చు
- బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకంలో ఉప ఉత్పత్తిగా వెలువడే సేంద్రియ ఎరువుతో అదనపు ఆదాయం
- దేశంలోనే మొట్టమొదటిగా తెలంగాణ వ్యవసాయ వర్సిటీలో ఐసిఎఆర్ ఎన్ఎహెచ్ఇపి ప్రాజెక్టు ద్వారా పైలెట్ యూనిట్ ఏర్పాటు
- శాస్త్రవేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతులకు శిక్షణ ఇవ్వనున్న పిజెటిఎస్ఎయు

బ్లాక్ సోల్జర్ ఈగలతో ప్రొటీన్ల సేద్యం!



సేంద్రియ వ్యర్థాలను ఆహారంగా తిని పెరిగే బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పిల్ల పురుగు(లార్వా)లు కోళ్లతో పాటు చేపలు, రొయ్యలకు మంచి ప్రొటీన్లతో కూడిన మేతగా ఉపయోగపడుతున్నాయి. విదేశాల్లో విస్తారంగా జరుగుతున్న బిఎస్ఎఫ్ లార్వా సాగు ఇప్పుడిప్పుడే మన దేశంలోనూ వ్యాపిస్తోంది. కుళ్లిన పండ్లు, కూరగాయలు, వంటింట్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలతో పాటు పశువుల పేడ, కోళ్లు, మేకలు, పందుల విసర్జితాలను తిని ఈ పిల్ల పురుగులు దాదాపు నెల రోజుల్లోనే పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. బిఎస్ఎఫ్‌పై పరిశోధనలు మన దేశంలో శైశవ దశలో ఉన్నాయి. ఐసిఎఆర్ గ్రాంటుతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం(పిజెటిఎస్ఎయు) ఏడాది క్రితమే వేస్ట్2వెల్త్ ప్రాజెక్టులో భాగంగా దీనిపై పరిశోధనలు చేపట్టింది. అంతేకాదు, శాస్త్రవేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతుల శిక్షణకు ఇటీవలే శ్రీకారం చుట్టింది. ఇన్నోవేటివ్ ఇన్‌సెక్ట్ ఫార్మింగ్ వివరాలతో ఆసక్తికర కథనం...

ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తయిన శాకాహార, మాంసాహారోత్పత్తుల్లో 60% మాత్రమే వినియోగమవుతోంది. పొలంలో 8%, మార్కెట్‌కు వెళ్లే దారిలో 14%, రిటైల్ అమ్మకందారుల వద్ద 7%, ఇళ్లలో వినియోగానికి ముందు 11% మేరకు ఆహారం వృథా అవుతోంది. 2021 యుఎన్ఇపి ఫుడ్ వేస్ట్ ఇండెక్స్ ప్రకారం మన దేశంలో ఏటా 6.88 కోట్ల టన్నుల ఆహార వ్యర్థాలు వెలువడుతున్నాయి. ఈ సేంద్రియ వ్యర్థాలను చెత్తకుప్పల్లో వేసే కంటే పునర్వినియోగించి ప్రయోజనం పొందటం తెలివైన పని. ఈ పనిని ఇతర పురుగుల కన్నా బ్లాక్ సోల్జర్ ఈగలు (బిఎస్ఎఫ్) సమర్థవంతంగా చేయగలవన్నది నిపుణుల మాట.

పురుగుల సేద్యం చాలా వినూత్నమైనది, పర్యావరణ హితమైనది, ఆదాయాన్ని అందించేది కూడా. మన దేశంలో కొందరు వ్యాపారవేత్తలు, కోళ్ల రైతులు బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పిల్ల పురుగుల(లార్వా)ను సాగు చేయటం ఇటీవల ప్రారంభించారు. బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల ఉత్పత్తి కాలం వాటికి వేసే ఆహారాన్ని బట్టి మారుతుంది. ఒక బ్యాచ్ 20 రోజుల నుంచి 40 రోజుల వరకు పడుతుంది. ఆహారం మెత్తగా, త్వరగా జీర్ణించుకునే విధంగా ఉండి ప్రొటీన్లతో కూడి ఉన్నప్పుడు తక్కువ రోజుల్లోనే పురుగులు పెరుగుతాయి.

లేయర్ కోళ్ల ఫారాల్లో ఇనుప కేజీల కింద పోగుపడే కోళ్ల పెంటపై బిఎస్ఎఫ్ ఈగల 5 రోజుల పిల్లలను వదిలితే చాలు.. ఆ వ్యర్థాలనే ఆహారంగా తింటూ 25–30 రోజుల్లోనే పిల్ల పురుగులు వృద్ధి చెందుతాయి.

బిఎస్ఎఫ్ పెంపకం ద్వారా సేంద్రియ వ్యర్థాల పరిమాణాన్ని 15–25 రోజుల్లో 70–80% మేరకు కుదించవచ్చు. అందువల్లనే నగరాలు, పట్టణాల్లో పోగుపడే సేంద్రియ వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణకు ఇవి ఉపయోగపడుతున్నాయని ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఓ) చెబుతోంది. బిఎస్ఎఫ్ లార్వా(పిల్ల పురుగులు) బరువులో 40–45% వరకు ప్రొటీన్లు ఉన్నాయి. అందువల్ల కోళ్ల మేతలో, ఆక్వా మేతల తయారీలో సోయా చిక్కుళ్లు, ఫిష్ మీల్‌తో పాటుగా 10 శాతం వరకు బిఎస్ఎఫ్ పురుగుల పొడిని కలుపుతున్నారు. బతికి ఉన్న పిల్ల పురుగుల (వెట్ లార్వా)ను కోళ్లకు నేరుగా మేతగా వేస్తున్నారు. రోజువారీ మేతలో పది శాతం వరకు ఈ పిల్ల పురుగులను అందిస్తూ సత్ఫలితాలు పొందుతున్న కోళ్ల ఫారాలు తెలుగు నాట ఇప్పటికే అనేకం ఉన్నాయి.



● బ్లాక్ సోల్జర్ ఫ్లై గుడ్లు



● 5 రోజుల వయసులో పిల్ల పురుగులు



● గ్రాములో 3 వేల పిల్ల పురుగులు



● కూరగాయ వ్యర్థాలు, చద్దన్నం, గోధుమ తవుడు మిశ్రమం



● ఆ మిశ్రమమే పురుగులకు ఆహారం



● 15–25 రోజుల్లో లార్వా సిద్ధం. ప్యూపా దశకు ముందే ఈ పురుగులను వాడుకోవాలి

పిజెటిఎస్ఎయులో పైలెట్ ప్రాజెక్టు

అయితే, మన దేశంలో దీనిపై పరిశోధనలు ఇంకా శైశవ దశలోనే ఉన్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పిజెటిఎస్ఎయు) ఈ దిశగా ముందడుగు వేసింది. దేశంలోనే మొట్టమొదటిగా బిఎస్ఎఫ్ పెంపకంపై పరిశోధన చేపట్టింది. నేషనల్ అగ్రికల్చర్ హయ్యర్ ఎడ్యుకేషన్ 'వేస్ట్2వెల్త్' ప్రాజెక్టును మంజూరు పిజెటిఎస్ఎయుకు గత ఏడాది చేసింది. పిజెటిఎస్ఎయు పీజీ స్టడీస్ డీన్, కీటక శాస్త్ర ఆచార్యులు డా. వి. అనిత ఈ ప్రాజెక్టుకు నోడల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రాజేంద్రనగర్‌లోని వర్సిటీ ఆవరణలో బ్లాక్ సోల్జర్ ఫ్లైల పెంపకం కమ్ శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పారు. కూరగాయలు, పండ్ల వ్యర్థాలు, మెస్‌లో మిగిలిన అన్నం, గోధుమ తవుడు మిశ్రమంతో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులు పెంచుతున్నారు. పరిశోధక విద్యార్థులు పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

ఈ నేపథ్యంలో, కృషి విజ్ఞాన కేంద్రాల్లోని శాస్త్రవేత్తల మొదటి బ్యాచ్‌కు డా. అనిత ఇటీవలే శిక్షణ ఇచ్చారు. ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతులకు కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు డా. అనిత 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. నగరాలు, పట్టణాల్లో వెలువడే సేంద్రియ ఆహార వ్యర్థాల కాలుష్యాన్ని తగ్గించడానికి, పనిలో పనిగా మంచి ప్రొటీన్‌ను అందుబాటులోకి తెచ్చుకోవడానికి బిఎస్ఎఫ్ లార్వాల పెంపకం ఉపయోగకరం. అన్నిటికీ మించి, సేంద్రియ వ్యర్థాల పరిమాణాన్ని 15–25 రోజుల్లోనే 70–80% మేరకు తగ్గించేంత ఆబగా తినగల శక్తి బిఎస్ఎఫ్ జాతికి వుంది. బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకానికి మన దేశపు వాతావరణం చాలా అనువైనదంటున్నారు డా.అనిత.

పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్

ఎంటర్‌ప్రెన్యూర్లకు, రైతులకు శిక్షణ ఇస్తున్నాం



● బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను వర్టికల్ టవర్‌లో ట్రేలలో పెంచవచ్చని చెబుతున్న డా. వి. అనిత

బ్లాక్ సోల్జర్ ఈగలు మనకు కొత్తవి కావు. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 20వ శతాబ్దం నుంచి ఉన్నదే ఈ జాతి. కొత్త తెగుళ్లు వ్యాప్తి చెందుతాయన్న భయం లేదు. ఆహార వ్యర్థాలు, పశువుల విసర్జితాలను సాధ్యమైనంత మెత్తగా చేసి, సులభంగా జీర్ణించుకునేలా మార్చి ఈ పురుగులకు వేయాలి. అందులో ప్రొటీన్లు ఉండాలి. చిన్న పిల్లల ఆహారం లాగా ఉండాలి. కూరగాయలు, పండ్ల వ్యర్థాలను సేకరించి, మెత్తగా రుబ్బి.. దానితో పాటు మెస్‌లో మిగిలిపోయిన అన్నం, గోధుమ తవుడు కొంచెం కలిపి మా ప్రయోగశాలలో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను పెంచుతున్నాం. వాటికి వేసే ఆహారాన్ని బట్టి, దానిలో పోషక విలువలను బట్టి, వాతావరణంలో వేడి, గాలిలో తేమను బట్టి.. అవి ఎన్ని రోజుల్లో, ఎంత బరువు పెరుగుతాయన్న విషయం ఆధారపడి ఉంటుంది. సేంద్రియ వ్యర్థాలను సమర్థవంతంగా నాణ్యమైన సేంద్రియ ఎరువుగా మార్చుకునే మార్గం ఇది. పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. మంచి ఆదాయమూ సమకూరుతుంది. రైతులకు, ఎంటర్‌ప్రెన్యూర్లకు శిక్షణ ఇస్తున్నాం.

– డా. వి. అనిత, కీటక శాస్త్ర ఆచార్యులు, పీజీ స్టడీస్ డీన్, బ్లాక్ సోల్జర్ ఫ్లై ప్రాజెక్టు నోడల్ ఆఫీసర్, పిజెటిఎస్ఎయు, హైదరాబాద్. మొబైల్: 94402 58050

బిఎస్ఎఫ్ ప్రత్యేకతలు

సేంద్రియ వ్యర్థాలను తినే అనేక జీవులుండగా బ్లాక్ సోల్జర్ ఫ్లైలనే ఎందుకు ఎంపిక చేసినట్లు? ఇదే ప్రశ్న డా. అనితను అడిగితే ఇలా బదులిచ్చారు...

- రోజుకు తన బరువుకు రెట్టింపు సేంద్రియ వ్యర్థాలను తిని, సేంద్రియ ఎరువును విసర్జించగల శక్తి బిఎస్ఎఫ్ పిల్ల పురుగులకు ఉంది. దీని అర్థం ఏమిటంటే.. చెత్త కుప్పలకు తరలివెళ్లే సేంద్రియ వ్యర్థాలు తగ్గిపోతాయి. మిథేన్ ఉద్గారాలు ఆ మేరకు తగ్గుతాయి.
- కుళ్లిన పండ్లు/కూరగాయలు,హోటళ్లు/ఇళ్లలో మిగిలిపోయిన ఆహార పదార్థాలతో పాటు పశువుల పేడ, కోళ్లు, మేకలు, పందుల విసర్జితాలు వంటి సేంద్రియ వ్యర్థాలను బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకానికి వాడొచ్చు.
- బిఎస్ఎఫ్ జీవిత చక్రం మొత్తం 42–55 రోజులు. గుడ్లు పెట్టిన 4–5 రోజులకు పిగులుతాయి. అవి 15–25 రోజుల్లో పిల్ల పురుగులా(లార్వా)గా ఎదుగుతాయి. ఈ దశలోనే వాటిని సేకరించి కోళ్ల, ఆక్వా మేతల్లో వాడుతున్నారు. అలాగే ఉంచితే, ప్యూపాగా రూపాంతరం చెంది, 17 రోజుల తర్వాత బ్లాక్ సోల్జర్ ఈగలు పుడతాయి. మగ ఈగ 4 రోజుల్లో ఆడ ఈగను కలిసిన తర్వాత చనిపోతుంది. ఆడ ఈగ 5–8 రోజుల్లో గుడ్లు పెట్టి చనిపోతుంది.
- గుడ్లను సేకరించి, అతి చిన్న పురుగులను తయారు చేయుట కొంచెం క్లిష్టమైన ప్రక్రియ. 5 రోజుల పిల్లలకు తగిన సేంద్రియ ఆహారం అందిస్తే 15–25 రోజుల్లో పిల్ల పురుగులు(లార్వా)గా పెరుగుతాయి. ఆ దశలో చక్కని ప్రొటీన్లతో కూడిన ఆ పిల్ల పురుగులు కోళ్లు, చేపలు, రొయ్యలకు మేతగా వాడుకోవచ్చు.
- 5 రోజుల పిల్లలను కొనుక్కొని రైతులు 15–25 రోజుల్లో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను లార్వా దశకు పెంచి, కోళ్లకు, చేపలు, రొయ్యలకు మేతగా వేసుకోవచ్చు లేదా కొనుగోలుదారులకు అమ్ముకోవచ్చు. స్వయం ఉపాధిగా యువకులు బిఎస్ఎఫ్ లార్వా సాగు చేపట్టవచ్చు. ఈ లార్వాను దాణా తయారీ కంపెనీలు, సంస్థలు కొనుగోలు చేస్తున్నాయి. లార్వా దశ దాటి ప్యూపా దశకు పెరిగితే దాణాల్లో వాడకానికి పనికిరాదు.
- సోయా చిక్కుళ్ల సాగులో సమస్యలు, సముద్రాల్లో చేపల సంతతి తగ్గిపోతుండటం వల్ల కోళ్లు, ఆక్వా మేతలతో పాటు, పెంపకపు కుక్కల మేతల్లో కూడా బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను ప్రొటీన్ సప్లిమెంట్‌గా ప్రపంచవ్యాప్తంగా వాడుతున్నారు. దీంతో బిఎస్ఎఫ్ లార్వా సాగుకు డిమాండ్ పెరుగుతోంది.
- ఈ పిల్ల పురుగులే అధిక నాణ్యత గల ప్రొటీన్లతో కూడిన దాణాకు ముడి పదార్థం. కోళ్లు, చేపలు, రొయ్యలు, పందులు, పెంపుడు కుక్కలకు వేసే మేతలో బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పొడిని కలపవచ్చు. పిల్ల పురుగుల బరువులో 40–45% ప్రొటీన్‌తో పాటు ఎసెన్షియల్ అమినో యాసిడ్లు ఉంటాయి. సాధారణంగా మేతల్లో ప్రొటీన్లుగా వాడే సోయా చిక్కుడు గింజలు, ఫిష్‌మీల్‌ను కొంత తగ్గించి దీన్ని వాడుతున్నారు.
- కోళ్లకు రోజువారీ మేతలో పది శాతం మేరకు దీన్ని వాడుతున్నారు. పిల్ల పురుగులను బతికి ఉన్నప్పుడే ఫారం కోళ్లకు మేపవచ్చు. నాటు కోళ్లకూ ఇది మంచి ఆహారం.
- బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకం క్రమంలో వెలువడే విసర్జితాలే(ఫ్రాస్) పంటలకు అత్యంత విలువైన సేంద్రియ ఎరువుగా పనికి వస్తుంది. వర్మీకంపోస్టు, పశువుల ఎరువుల్లో కంటే అధిక పోషక విలువలు ఇందులో ఉంటాయని చెబుతున్నారు.
- విదేశాల్లో బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పొడిని బర్గర్లు, షేక్‌లలో కలుపుతున్నారు. దీని నుంచి వెలికితీసే నూనెను బయో ఇంధనంగా వాహనాలు, జనరేటర్లలో వాడుతున్నారు. బిఎస్ఎఫ్ లార్వా నుంచి వెలువడే పొలుసులు(కూటిన్) బయోడీగ్రేడబుల్ ప్యాకేజింగ్ ప్లాస్టిక్ తయారీకి వాడుతున్నారు. యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలున్నందున వైద్య అవసరాలకు కూడా వినియోగిస్తున్నారు.
- వర్షాకాలంలో దీపం చుట్టూ చేరే ఉసుళ్లను వేపుకొని శనగపప్పుతో కలుపుకొని తినే అలవాటు మన దేశంలోనూ ఉంది. బిఎస్ఎఫ్‌తో పాటు మిడతలు, మీల్ వార్మ్స్, గొల్లభామలు, వంటి 1,900 జాతుల పురుగులను 113 దేశాల్లో 200 కోట్ల మంది తింటున్నారని ఎఫ్ఎఓ చెబుతోంది.




సబలెంకా శుభారంభం

మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో గత ఏడాది రన్నరప్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్) శుభారంభం చేసింది. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి లీగ్ మ్యాచ్‌లో సబలెంకా 6–0, 6–1తో మరియా సాకరి (గ్రీస్)పై గెలిచింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ఆరు ఏస్‌లు సంధించి, తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. మరో లీగ్ మ్యాచ్‌లో జెస్సికా పెగూలా (అమెరికా) 7–5, 6–2తో రిబాకినా (కజకిస్తాన్)పై విజయం సాధించింది.

అర్జున్‌కు మూడో గెలుపు

గ్రాండ్ స్విస్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో విజయం నమోదు చేశాడు. యూకేలోని ఐల్ ఆఫ్ మ్యాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ఐదో రౌండ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన అర్జున్ 68 ఎత్తుల్లో రినాత్ జుమాబయేవ్ (కజకిస్తాన్)పై గెలుపొందాడు. ఐదో రౌండ్ తర్వాత అర్జున్ నాలుగు పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి ఉమ్మడిగా టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.





ఫారూఖీ

అఫ్గాన్ తీన్‌మార్...

- శ్రీలంకపై ఏడు వికెట్లతో సంచలన విజయం
- ఒకే టోర్నీలో మూడు ప్రపంచ చాంపియన్ జట్లను ఓడించిన హష్మతుల్లా బృందం
- బంతితో మెరిసిన ఫారూఖీ
- రహ్మత్ షా, హష్మతుల్లా, అజ్మతుల్లా అర్ధ సెంచరీలు

ఇకపై తమ జట్టును కూనగా పరిగణించాల్సిన అవసరం లేదని అఫ్గానిస్తాన్ చాటి చెప్పింది. మేటి జట్లపై తాము సాధిస్తున్న విజయాలు గాలివాటమేమీ కాదని తమ నిలకడైన ప్రదర్శనతో నిరూపించింది. మూడోసారి వన్డే ప్రపంచకప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఈసారి తమకంటే అన్ని విభాగాల్లో ఎంతో మెరుగైన జట్లను బోల్తా కొట్టిస్తూ ఔరా అనిపించింది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను కంగుతినిపించిన ఉత్సాహంతో 1992 విశ్వవిజేత పాకిస్తాన్ జట్టును కూడా మట్టికరిపించిన అఫ్గానిస్తాన్ జట్టు తాజాగా 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంకను ఓడించి అందర్నీ ఆశ్చర్యపరిచింది.

పుణే: ప్రత్యర్థి జట్టు గత రికార్డు ఎలా ఉంటేనేమి తమదైన రోజున సమష్టిగా గర్జిస్తే అద్భుత ఫలితం సాధించవచ్చని వన్డే ప్రపంచకప్ టోర్నీలో అఫ్గానిస్తాన్ జట్టు మూడోసారి నిరూపించింది. భారీ అంచనాలు పెట్టుకోకుండా ఈ మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ మూడో సంచలన విజయంతో అలరించింది. 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంక జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో హష్మతుల్లా షాహిది నాయకత్వంలోని అఫ్గానిస్తాన్ జట్టు ఏడు వికెట్ల తేడాతో గెలిచి అబ్బురపరిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. నిసాంక (60 బంతుల్లో 49; 5 ఫోర్లు), కెప్టెన్ కుశాల్ మెండిస్ (50 బంతుల్లో 39; 3 ఫోర్లు), సమరవిక్రమ (40 బంతుల్లో 36; 3 ఫోర్లు), తీక్షణ (31 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫజల్‌హక్ ఫారూఖీ (4/34) శ్రీలంక జట్టును దెబ్బ తీశాడు. ఒకదశలో 134/2తో పటిష్టస్థితిలో కనిపించిన శ్రీలంక నిసాంక అవుటయ్యాక తడబడింది. 107 పరుగుల తేడాలో ఏడు వికెట్లు కోల్పోయింది. కెరీర్‌లో 100వ వన్డే ఆడిన రషీద్ ఖాన్ ఒక వికెట్ తీయగా, మరో స్పిన్నర్ ముజీబ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం 242 పరుగుల విజయ లక్ష్యాన్ని అఫ్గానిస్తాన్ 45.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ గుర్బాజ్ (0) డకౌట్‌కాగా... రహ్మత్ షా (74 బంతుల్లో 62; 7 ఫోర్లు), హష్మతుల్లా షాహిది (74 బంతుల్లో 58 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (63 బంతుల్లో 73 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో అఫ్గానిస్తాన్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. హష్మతుల్లా, అజ్మతుల్లా నాలుగో వికెట్‌కు అజేయంగా 111 పరుగులు జోడించడం విశేషం.

ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓడిపోయిన అఫ్గానిస్తాన్... రెండో మ్యాచ్‌లో 69 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను ఓడించి బోణీ కొట్టింది. మూడో మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో 149 పరుగుల తేడాతో ఓడిపోయి... నాలుగో మ్యాచ్‌లో విజృంభించి 1992 విశ్వవిజేత పాకిస్తాన్‌పై ఏకంగా 8 వికెట్ల తేడాతో గెలిచింది. అనంతరం అదే ఉత్సాహంతో శ్రీలంకను కూడా మట్టికరిపించి అఫ్గానిస్తాన్ పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. మూడోసారి వన్డే వరల్డ్‌కప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఒకే ప్రపంచకప్‌లో మూడు విజయాలు సాధించడం ఇదే ప్రథమం. 2015 ప్రపంచకప్‌లో ఒక మ్యాచ్‌లో నెగ్గిన అఫ్గానిస్తాన్... 2019 ప్రపంచకప్‌లో ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది. ఈ ప్రపంచకప్‌లో మాత్రం అఫ్గానిస్తాన్ తమ కంటే మెరుగైన జట్లకు చెమటలు పట్టిస్తోంది. ఈ టోర్నీలో అఫ్గానిస్తాన్ మిగిలిన మూడు మ్యాచ్‌లను నెదర్లాండ్స్ (నవంబర్ 3న), ఆస్ట్రేలియా (నవంబర్ 7న), దక్షిణాఫ్రికా (నవంబర్ 10న) జట్లతో ఆడుతుంది.



అజ్మతుల్లా



రహ్మత్ షా



హష్మతుల్లా

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) గుర్బాజ్ (బి) అజ్మతుల్లా 46; దిముత్ కరుణరత్నే (ఎల్బీడబ్ల్యూ) (బి) ఫారూఖీ 15; కుశాల్ మెండిస్ (సి) నజీబుల్లా (సబ్) (బి) ముజీబ్ 39; సమరవిక్రమ (ఎల్బీడబ్ల్యూ) (బి) ముజీబ్ 36; అసలంక (సి) రషీద్ ఖాన్ (బి) ఫారూఖీ 22; ధనంజయ డిసిల్వా (బి) రషీద్ ఖాన్ 14; ఏంజెలో మాథ్యూస్ (సి) నబీ (బి) ఫారూఖీ 23; చమీర (రనౌట్) 1; తీక్షణ (బి) ఫారూఖీ 29; కసున్ రజిత (రనౌట్) 5; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 241.** వికెట్ల పతనం: 1–22, 2–84, 3–134, 4–139, 5–167, 6–180, 7–185, 8–230, 9–239, 10–241. **బౌలింగ్:** ముజీబ్ ఉర్ రెహ్మాన్ 10–0–38–2, ఫజల్లహ్ ఫారూఖీ 10–1–34–4, నవీన్ ఉల్ హక్ 6.3–0–47–0, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 7–0–37–1, రషీద్ ఖాన్ 10–0–50–1, నబీ 6–0–33–0.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: రహ్మానుల్లా గుర్బాజ్ (బి) మదుషంక 0; ఇబ్రహీమ్ జద్రాన్ (సి) కరుణరత్నే (బి) మదుషంక 39; రహ్మత్ షా (సి) కరుణరత్నే (బి) రజిత 62; హష్మతుల్లా షాహిది (నాటౌట్) 58; అజ్మతుల్లా (నాటౌట్) 73; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (45.2 ఓవర్లలో మూడు వికెట్లకు) 242.** వికెట్ల పతనం: 1–0, 2–73, 3–131. **బౌలింగ్:** మదుషంక 9–0–48–2, రజిత 10–0–48–1, మాథ్యూస్ 3–0–18–0, చమీర 9.2–0–51–0, తీక్షణ 10–0–55–0, ధనంజయ డిసిల్వా 4–0–21–0.

ప్రపంచకప్‌లో నేడు

పాకిస్తాన్ × బంగ్లాదేశ్
వేదిక: కోల్‌కతా
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	6	6	0	12	1.405
దక్షిణాఫ్రికా	6	5	1	10	2.032
న్యూజిలాండ్	6	4	2	8	1.232
ఆస్ట్రేలియా	6	4	2	8	0.970
అఫ్గానిస్తాన్	6	3	3	6	-0.718
శ్రీలంక	6	2	4	4	-0.275
పాకిస్తాన్	6	2	4	4	-0.387
నెదర్లాండ్స్	6	2	4	4	-1.277
బంగ్లాదేశ్	6	1	5	2	-1.338
ఇంగ్లండ్	6	1	5	2	-1.652

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.రే–నెట్ రన్‌రేట్

అనీశ్ డబుల్ ధమాకా

కాంస్య పతకంతోపాటు పారిస్ ఒలింపిక్ బెర్త్ సొంతం



చాంగ్వాన్ (దక్షిణ కొరియా): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల పతకాల వేట కొనసాగుతోంది. సోమవారం జరిగిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత యువ షూటర్ అనీశ్ భన్వాలా కాంస్య పతకం సాధించాడు. ఆరుగురి మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 21 ఏళ్ల అనీశ్ 28 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంతో ముగించాడు. ఈ ప్రదర్శనతో అనీశ్ వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను కూడా ఖరారు చేసుకున్నాడు. ఇప్పటి వరకు షూటింగ్‌లో భారత్‌కు 12 ఒలింపిక్ బెర్త్‌లు లభించాయి. మరోవైపు పురుషుల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో హైదరాబాద్ షూటర్ కైనన్ షెనాయ్, జొరావర్ సింగ్ సంధూ, పృథ్వీరాజ్ తొండైమన్‌లతో కూడిన భారత జట్టుకు రజత పతకం దక్కింది. కైనన్, జొరావర్, పృథ్వీరాజ్ బృందం 341 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. ఇప్పటి వరకు ఈ టోర్నీలో భారత్ 30 పతకాలు సాధించింది.

వెర్‌స్టాపెన్ రికార్డు

ఈ సీజన్‌లో 16వ విజయం

మెక్సికో సిటీ: ఇప్పటికే ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకున్నప్పటికీ... రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ మాత్రం ఫార్ములావన్–2023 సీజన్‌లో ఎదురులేకుండా దూసుకుపోతున్నాడు. మెక్సికో గ్రాండ్‌ప్రి రేసులో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును మూడో స్థానం నుంచి ప్రారంభించిన వెర్‌స్టాపెన్ తొలి మలుపు వద్ద ప్రత్యర్థి డ్రైవర్లను ఓవర్‌టేక్ చేసి ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత రేసు చివరిదాకా ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. వెర్‌స్టాపెన్ 71 ల్యాప్‌లను అందరికంటే వేగంగా 2 గంటల 2 నిమిషాల 30.814 సెకన్లలో పూర్తి చేసి విజేతగా నిలిచాడు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది 16వ గెలుపు కావడం విశేషం. తద్వారా ఒకే ఏడాది అత్యధిక ఎఫ్1 రేసుల్లో గెలిచిన డ్రైవర్‌గా తన పేరిటే ఉన్న రికార్డును వెర్‌స్టాపెన్ బద్దలు కొట్టాడు. గత ఏడాది వెర్‌స్టాపెన్ 15 రేసుల్లో గెలుపొందాడు. ఓవరాల్‌గా వెర్‌స్టాపెన్ కెరీర్‌లో ఇది 51వ విజయం. ఈ క్రమంలో కెరీర్‌లో అత్యధిక ఎఫ్1 విజయాలు సాధించిన డ్రైవర్ల జాబితాలో నాలుగో స్థానంలో ఉన్న అలైన్ ప్రాస్ట్ (ఫ్రాన్స్) సరసన నిలిచాడు.



లెక్క సరిచేసిన భారత్



రాంచీ: ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు వరుసగా మూడో విజయంతో 'హ్యాట్రిక్' సాధించింది. చైనా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2–1 గోల్స్ తేడాతో నెగ్గింది. భారత్ తరఫున దీపిక (15వ ని.లో), సలీమా టిటె (26వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. చైనా జట్టుకు జాంగ్ జియాకి (41వ ని.లో) ఒక గోల్ అందించింది. ఈ గెలుపుతో ఇటీవల హాంగ్జౌ ఆసియా క్రీడల్లో చైనా జట్టు చేతిలో సెమీఫైనల్లో ఎదురైన ఓటమికి భారత్ బదులు తీర్చుకుంది.

జ్యోతి యర్రాజీకి స్వర్ణం



పనాజీ: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు మూడో స్వర్ణ పతకం లభించింది. సోమవారం జరిగిన అథ్లెటిక్స్ ఈవెంట్‌లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి యర్రాజీ చాంపియన్‌గా అవతరించింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి 13.22 సెకన్లలో అందరికంటే వేగంగా ఫైనల్ రేసును ముగించి అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు తెలంగాణ ఖాతాలో 11వ పతకం చేరింది. మహిళల స్విమ్మింగ్ 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో వ్రితి అగర్వాల్ రజత పతకం సాధించింది.

సినిమా



● మృణాల్ ఠాకూర్, నాని

అమ్మాడీ...

మాట రూపంలో కాకుండా ఇంకాస్త ఎక్కువగా ప్రేమను వ్యక్తపరచాలనుకున్నప్పుడు హీరో హీరోయిన్ పాట పాడుకోవడం చూస్తుంటాం. మృణాల్ ఠాకూర్‌పై నాని అలాంటి ప్రేమనే వ్యక్తపరిచారు. ప్రేమను వ్యక్తపరుస్తూ 'అమ్మాడీ...' అంటూ ఆమెను ఉద్దేశించి పాడారు నాని. 'హాయ్ నాన్న' చిత్రంలోని ఈ పాటను నవంబర్ 4న రిలీజ్ చేయనున్నారు. నాని, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'హాయ్ నాన్న'. నాని కుమార్తెగా బేబీ కియారా ఖన్నా నటించింది. ఈ చిత్రం కోసం హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరచిన పాటల్లో తొలి పాట 'సమయమా..', రెండో పాట 'గాజు బొమ్మ..'ను ఇప్పటికే రిలీజ్ చేశారు. 'అమ్మాడీ...' మూడో పాట. నాని, మృణాల్ మధ్య సాగే రొమాంటిక్ సాంగ్ ఇది అని యూనిట్ పేర్కొంది. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డా. విజయేందర్ రెడ్డి తీగల ఈ చిత్రాన్ని నిర్మించారు. డిసెంబర్ 7న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్ ఐఎస్‌సీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సతీష్ ఈవీవీ.

కౌంట్ డౌన్ స్టార్ట్



● వెంకటేశ్

వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా, బేబీ సారా, జయప్రకాశ్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న 'సైంధవ్' జనవరి 13న సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. కాగా ఇది వెంకటేశ్ కెరీర్‌లో 75వ చిత్రం కావడం విశేషం. తాజాగా 'సైంధవ్' విడుదలకు కౌంట్ డౌన్ స్టార్ట్ చేస్తూ మేకర్స్ ఓ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ''పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న చిత్రం 'సైంధవ్'. సినిమా విడుదలకు ఇంకా 75 రోజులు ఉంది. సంతోష్ నారాయణన్ ఈ చిత్రం కోసం అద్భుతమైన ఆల్బమ్ సిద్ధం చేశారు. త్వరలో మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేయబోతున్నాం'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి సహనిర్మాత: కిశోర్ తాళ్లూరు, కెమెరా: యస్. మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం (వెంకట్).

మమ్మల్ని సినిమా కలిపింది – విజయ్ దేవరకొండ



● బ్రహ్మానందం, విజయ్ దేవరకొండ, తరుణ్ భాస్కర్, సాయికృష్ణ

''నేను, దర్శకులు నాగ్ అశ్విన్, తరుణ్ భాస్కర్, సందీప్ రెడ్డి వంగా వేర్వేరు చోట్ల పెరిగాం. మా నేపథ్యాలు వేరు.. మమ్మల్ని సినిమా కలిపింది. 'పెళ్ళి చూపులు'తో నన్ను హీరోగా పరిచయం చేశాడు తరుణ్ భాస్కర్. ఆ తర్వాత 'ఈ నగరానికి ఏమైంది'తో కొందరు కొత్తవాళ్లకు కెరీర్ ఇచ్చాడు. ఇప్పుడు 'కీడా కోలా'లోనూ ప్రతిభ ఉన్న కొత్తవాళ్లు కనిపిస్తున్నారు. తరుణ్‌కి తనపై, తన కథలపై చాలా నమ్మకం. ఈ విషయంలో అతన్ని గౌరవిస్తాను. ఇండస్ట్రీకి దొరికిన అదృష్టం తను'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కీడా కోలా'. రానా సమర్పణలో కె. వివేక్ సుధాంశు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ''తరుణ్ భాస్కర్‌పై ఉన్న నమ్మకంతో చెబుతున్నా.. 'కీడా కోలా' మజా ఇస్తుంది. తర్వలో మా ఇద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుంది'' అన్నారు. సీనియర్ నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ–''డైరెక్టర్ జంధ్యాలగారి సినిమాలు చేస్తున్నప్పుడు వినోదం ఎంత హాయిగా పండిందో మళ్లీ 'కీడా కోలా'కి అలాంటి అనుభూతి కలిగింది'' అన్నారు. ''నా 'పెళ్ళి చూపులు, ఈ నగరానికి ఏమైంది' చిత్రాల విడుదలప్పుడు చిన్న భయం ఉండేది. ప్రేక్షకుల స్పందన తెలుసుకునేందుకు థియేటర్ బయటే తిరిగేవాడిని. 'కీడా కోలా' విషయంలో ఆ భయం లేదు'' అన్నారు తరుణ్ భాస్కర్. ''రెండు గంటల పాటు ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు'' అన్నారు నిర్మాతలు సాయికృష్ణ గద్వాల్, శ్రీపాద్.



ప్రేక్షకులకు పది రెట్ల థ్రిల్ గ్యారంటీ – అనిల్ విశ్వనాథ్

''మా ఊరి పొలిమేర' తొలి భాగం ఓటీటీలో రిలీజ్ కావడంతో ప్రేక్షకుల స్పందన పెద్దగా తెలియలేదు. సినిమా చూసి, చాలామంది బాగుందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. శుభలేఖ సుధాకర్‌గారు ఫోన్ చేసి, 'దర్శకుడిగా నీకు మంచి భవిష్యత్ ఉంటుంది' అని చెప్పడంతో నాపై నాకు మరింత నమ్మకం పెరిగింది'' అని డైరెక్టర్ డా. అనిల్ విశ్వనాథ్ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల, బాలాదిత్య, రాకేందు మౌళి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర–2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 3న రిలీజవుతోంది. ఈ సందర్భంగా అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర' ఎక్కడ ముగిసిందో అక్కడి నుంచే రెండో భాగం మొదలవుతుంది. తొలి భాగం హిట్టవ్వడంతో సీక్వెల్‌పై అంచనాలు పెరిగాయి. అందుకే పార్ట్ 2 స్క్రీన్‌ప్లేను మరింత బలంగా తయారు చేశాను. తొలి భాగంతో పోల్చితే ప్రేక్షకులు దాదాపు పది రెట్ల థ్రిల్ ఫీలవుతారు. వంశీ నందిపాటిగారి సహకారంతో మా చిత్రాన్ని ఘనంగా రిలీజ్ చేస్తున్నాం. 'బన్నీ' వాసుగారికి నచ్చడంతో మా సినిమా పెద్ద రేంజ్‌కు వెళ్లింది. 'మా ఊరి పొలిమేర 3' కూడా ఉంటుంది. అంతకన్నా ముందు వేరే జానర్‌లో ఓ సినిమా చేస్తా'' అన్నారు.

ప్రేమకథ షురూ



● నాగచైతన్య, అలేఖ్య హారిక, సంతోష్ శోభన్

సంతోష్ శోభన్, అలేఖ్య హారిక జంటగా కొత్త సినిమా షురూ అయింది. సుమన్ పాతూరి దర్శకత్వంలో అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్‌పై ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి డైరెక్టర్ చందూ మొండేటి కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో నాగచైతన్య క్లాప్ కొట్టగా, డైరెక్టర్ వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహించారు. డైరెక్టర్ హరీష్ శంకర్, నిర్మాత రవిశంకర్ యూనిట్‌కి స్క్రిప్ట్ అందించగా, హీరో సుశాంత్, దర్శకులు హను రాఘవపూడి, రాహుల్ సంకృత్యాన్ యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో మంచి ప్రేమకథ ఉంటుంది'' అన్నారు. ''నా మనసుకు దగ్గరైన కథ ఇది. నేను, ఎస్‌కేఎన్, సందీప్ రాజ్, అలేఖ్య.. మేమంతా ఫ్రెండ్స్. ఈ సినిమా వారితో కలిసి చేస్తుండటంతో మరింత బాధ్యతగా భావిస్తున్నా'' అన్నారు సాయి రాజేశ్. ''ఈ సినిమాకు దర్శకత్వం వహించే చాన్స్ ఇచ్చిన నా ఫ్రెండ్ సాయి రాజేశ్‌కు థ్యాంక్స్'' అన్నారు సుమన్ పాతూరి. ''హీరోయిన్‌గా చేయాలనే నా కల ఈ చిత్రంతో నెరవేరుతోంది'' అన్నారు అలేఖ్య హారిక. ''తెలుగు అమ్మాయిలను ప్రోత్సహించాలనే నా సినిమాల్లో తెలుగు అమ్మాయిలనే హీరోయిన్‌గా తీసుకుంటున్నాను'' అన్నారు ఎస్‌కేఎన్. ఈ చిత్రానికి కెమెరా: అస్కర్, సంగీతం: విజయ్ బుల్గానిన్, సహనిర్మాతలు: ధీరజ్ మొగిలినేని, రమేశ్ పెద్దింటి.



● అచ్యుతరావు, బ్రహ్మానందం, ఉపేంద్ర

ఒకేసారి ఐదు సినిమాలు ఒక సంచలనం – బ్రహ్మానందం

''ఒక సినిమా తీయడానికే ఇబ్బంది పడుతున్న ఈ రోజుల్లో ఒకేసారి ఐదు సినిమాలు తీస్తుండటం ఓ సంచలనం. తన కుమారుడు ఉపేంద్రని హీరోగా పరిచయం చేయడంతో పాటు ఒకేసారి అతనితో ఐదు సినిమాలు తీస్తున్న అచ్యుతరావుకి అభినందనలు. దీనివల్ల పరిశ్రమను నమ్ముకున్నవారికి అవకాశాలు ఇచ్చి, భోజనం పెట్టినట్లవుతుంది. 'ఉపేంద్రగాడి అడ్డా' మంచి హిట్టవ్వాలి'' అని సీనియర్ నటుడు బ్రహ్మానందం అన్నారు. కంచర్ల ఉపేంద్ర, సావిత్రీ కృష్ణ జంటగా ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వం వహించిన చిత్రం 'ఉపేంద్రగాడి అడ్డా'. ఎస్ ఎస్‌ఎల్‌ఎస్ క్రియేషన్స్‌పై కంచర్ల అచ్యుతరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరై, 'ఉపేంద్రగాడి అడ్డా' ట్రైలర్‌ను, '1920 భీమునిపట్నం' పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే ఉపేంద్ర హీరోగా ఇదే బ్యానర్‌లో తీస్తున్న ఐదు సినిమాల టీజర్లను విడుదల చేశారు. కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో నవంబర్ నుంచి ప్రతీ నెల ఒక సినిమాను విడుదల చేయబోతున్నాం'' అన్నారు. ''నా పుట్టిన రోజుకి ఇది వెలకట్టలేని పెద్ద బహుమతి'' అన్నారు కంచర్ల ఉపేంద్ర. ''సోషల్ మీడియా నేటి సమాజాన్ని ఎంతగా ప్రభావితం చేస్తోందో మా చిత్రం ద్వారా చూపిస్తున్నాం'' అన్నారు ఆర్యన్ సుభాన్ ఎస్‌కే. హీరోయిన్ సావిత్రీ కృష్ణ, సహనిర్మాతలు కంచర్ల సుబ్బలక్ష్మి, కంచర్ల సునీత పాల్గొన్నారు.

కథని నమ్మి చేశాం – శ్రీరామ్



● అవసరాల, ఖుషీ, శ్రీరామ్, సాయికిరణ్, కోన వెంకట్

''పిండం అనేది జననానికి, మరణానికి సంబంధించినది. ఈ 'పిండం' సాయి కిరణ్ లాంటి ప్రతిభగల దర్శకుడి పుట్టుకకు (ఇండస్ట్రీలో) కారణం కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు రచయిత, నిర్మాత కోన వెంకట్. సాయికిరణ్ దైదా దర్శకత్వంలో శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' ఉపశీర్షిక. కళాహి మీడియాపై యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్నారు కోన వెంకట్. మరో అతిథి బీవీఎస్ రవి (రచయిత, దర్శకుడు) మాట్లాడుతూ– ''ఈ సినిమా టీజర్, నిర్మాణ విలువలు బాగున్నాయి. తప్పకుండా విజయం సాధిస్తుంది'' అన్నారు. శ్రీరామ్ మాట్లాడుతూ– ''కథని నమ్ముకొని చేసిన చిత్రం 'పిండం'. ఈ సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో నటించిన ఇద్దరు పిల్లల నటన చూసి నేనే ఆశ్చర్యపోయాను. ఇలాంటి మంచి సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ''కళాహి మీడియా బ్యానర్‌పై 'పిండం'లాంటి మంచి సినిమాలు మరిన్ని చేస్తాం'' అన్నారు యశ్వంత్ దగ్గుమాటి. ''ఇదొక ఇంటెన్స్ హారర్ ఫిల్మ్'' అన్నారు సాయి కిరణ్ దైదా. సంగీత దర్శకుడు కృష్ణ సౌరభ్ సూరంపల్లి, కెమెరామేన్ సతీష్ మనోహర్ తదితరులు మాట్లాడారు.

అంబాజీపేట సంతృప్తి ఇచ్చింది – సుహాస్



● సుహాస్, శివానీ నాగరం

''అంబాజీపేట మ్యారేజి బ్యాండు' ఫ్రెష్ సబ్జెక్ట్. సినిమా కొత్తగా ఉంటుంది. నటుడిగా నాకు సంతృప్తినిచ్చింది. ఒక మంచి సినిమా చూశామనే అనుభూతితో ప్రేక్షకులు థియేటర్స్ నుంచి బయటకు వస్తారు'' అని సుహాస్ అన్నారు. దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో సుహాస్, శివానీ నాగరం జంటగా నటించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. జీఏ2 పిక్చర్స్, మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ నిర్మించాయి. ఈ చిత్ర సంగీతదర్శకుడు శేఖర్ చంద్ర స్వరపరచిన 'గుమ్మా....' అంటూ సాగే తొలి పాటను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దుశ్యంత్ కటికినేని మాట్లాడుతూ– ''ఈ పాటకి రెహ్మాన్ మంచి లిరిక్స్ ఇచ్చారు. ఈ సినిమాలోని పాటలన్నీ బాగుంటాయి'' అన్నారు. ''జనవరి నెలాఖరులో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు ధీరజ్ మొగిలినేని. ''మంచి సినిమాలు ఎప్పుడొచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తారు. 'అంబాజీపేట..' హిట్ కావాలి'' అన్నారు నిర్మాత ఎస్‌కేఎన్. నటులు జగదీశ్, నితిన్, డ్యాన్స్ మాస్టర్ మోయిన్ తదితరులు మాట్లాడారు.

సాక్షి బిజినెస్

మంగళవారం
31-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	330	64,113
నిఫ్టీ ▲	94	19,141

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	12,736	▲ 95
డోజోన్స్	32,817	▲ 400
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,327	▲ 36
డాక్స్	14,717	▲ 29
షాంఘై	3,022	▲ 4
నికాయ్	30,697	▽ 295

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో – ముంబై

బంగారం (24 క్యారట్)	60,980
బంగారం (22 క్యారట్)	58,080
వెండి (కేజీ)	78,500

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.50	84.17
£	బ్రిటన్ పౌండ్		99.32	102.67
€	యూరో		86.49	89.54
¥	జపాన్ ఎన్ (100)		54.85	56.54
AUS	ఆస్ట్రేలియా డాలర్		51.93	54.22
S$	సింగపూర్ డాలర్		59.93	61.86
SAR	సౌదీ రియాల్		21.24	22.87
UAE D	యూఏఈ దిర్హామ్		21.77	23.56
¥	చైనా యువాన్		10.26	12.33

అన్ని ప్రైవేట్ కంపెనీల షేర్లు డీమ్యాట్‌లోనే..

- 2024 సెప్టెంబర్ నుంచి అమలు
- చిన్న సంస్థలు, ప్రభుత్వ కంపెనీలకు మినహాయింపు



న్యూఢిల్లీ: ప్రైవేట్ కంపెనీల సెక్యూరిటీల విషయంలో పారదర్శకతను పెంచే దిశగా కార్పొరేట్ వ్యవహారాల శాఖ (ఎంసీఏ) కీలక ఆదేశాలిచ్చింది. 2024 సెప్టెంబర్ నుంచి ప్రైవేట్ కంపెనీలన్నీ డీమ్యాట్ (డిజిటల్) రూపంలోనే సెక్యూరిటీలను జారీ చేయాలని ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. చిన్న సంస్థలు, ప్రభుత్వ రంగ కంపెనీలకు దీన్నుంచి మినహాయింపునిచ్చింది. కొన్ని సంస్థలు భౌతిక ఫార్మాట్‌లో జారీ చేసే షేర్లకు సంబంధించి అవకతవకలు చోటుచేసుకునే అవకాశాలను కట్టడి చేసేందుకు ఈ ఆదేశాలు ఉపయోగపడనున్నాయి. కంపెనీల చట్టం కింద ప్రస్తుతం రిజిస్టరయిన 14 లక్షల పైచిలుకు ప్రైవేట్ సంస్థలపై దీని ప్రభావం పడవచ్చని న్యాయ సేవల సంస్థ సిరిల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ పార్ట్‌నర్ ఆనంద్ జయచంద్రన్ తెలిపారు.

సాధారణంగా షేర్ల జారీకి సంబంధించి కంపెనీల చట్టం 2013 కింద ప్రైవేట్ కంపెనీలకు కొన్ని పరిమితులు ఉంటాయి. వాటిలో షేర్‌హోల్డర్ల సంఖ్య 200కు మించి ఉండకూడదు. నోటిఫికేషన్ ప్రకారం 2024 సెప్టెంబర్ తర్వాత నుంచి ప్రైవేట్ సంస్థలు షేర్ల జారీ, బైబ్యాక్, బోనస్ ఇష్యూ లేదా రైట్స్ ఆఫర్ మొదలైనవన్నీ డీమ్యాట్ రూపంలోనే జరగాలి. రూ. 4 కోట్ల వరకు పెయిడప్ షేర్ క్యాపిటల్, రూ. 40 కోట్ల వరకు టర్నోవరు ఉన్న చిన్న సంస్థలకు, కొన్ని పరిమితులకు లోబడి, మినహాయింపు ఉంటుంది. మరోవైపు, లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్స్ (ఎల్‌ఎల్‌పీ)ల నిబంధనలను కూడా ఎంసీఏ సవరించింది. వీటి ప్రకారం .. ఏర్పాటైన తేదీ నుంచి ప్రతి ఎల్‌ఎల్‌పీ తమ భాగస్వాముల చిరునామా, పాన్ నంబరు మొదలైన వివరాలతో ఒక రిజిస్టర్‌ను నిర్వహించాలి.

టాటా మోటార్స్‌కు.. రూ. 766 కోట్ల 'నానో' పరిహారం

- పశ్చిమ బెంగాల్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థకు ఎదురుదెబ్బ
- సింగూర్ ప్లాంట్ వ్యవహారంలో ఆర్బిట్రాల్ ట్రిబ్యునల్ కీలక రూలింగ్




న్యూఢిల్లీ: సింగూర్‌లోని తమ తయారీ కర్మాగారానికి సంబంధించి జరిగిన నష్టానికిగాను రూ.765.78 కోట్ల పరిహారం చెల్లించాలని పశ్చిమ బెంగాల్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు (డబ్ల్యూబీఐడీసీ) ముగ్గురు సభ్యుల ఆర్బిట్రాల్ ట్రిబ్యునల్ ఆదేశించినట్లు టాటా మోటార్స్ ఒక రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ప్రకటన వివరాల్లోకి వెళితే, టాటా మోటార్స్ 2008 అక్టోబర్‌లో భూ వివాదం కారణంగా తన చిన్న కారు నానో ఉత్పత్తి ప్లాంట్‌ను పశ్చిమ బెంగాల్‌లోని సింగూర్ నుండి గుజరాత్‌లోని సనంద్‌కు మార్చవలసి వచ్చింది. టాటాలు అప్పటికే సింగూరులో రూ.1,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టారు. ఈ అంశంపై ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ తాజాగా రూలింగ్ ఇస్తూ ప్రతివాది డబ్ల్యూబీఐడీసీ నుంచి 2016 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 11 శాతం వార్షిక వడ్డీసహా రూ.765.78 కోట్లను టాటా మోటార్స్ రికవరీ చేసుకోవచ్చని రూలింగ్ ఇచ్చింది. ఈ న్యాయ వివాదం విషయంలో రూ. కోటి వ్యయాలను సైతం టాటా మోటార్స్‌కు చెల్లించాలని డబ్ల్యూబీఐడీసీకు ట్రిబ్యునల్ ఆదేశించింది.

వివాదం ఇదీ...

నానో కారును ఉత్పత్తి చేయడానికి జూన్ 2010లో సనంద్‌లో టాటా మోటార్స్ కొత్త ప్లాంట్‌ను ప్రారంభించింది. భూ వివాదాలు, తృణమూల్ కాంగ్రెస్ నుండి వ్యతిరేకత కారణంగా ప్లాంట్‌ను అంతక్రితం పశ్చిమ బెంగాల్, సింగూర్ నుండి గుజరాత్‌లోని సనంద్‌కు తరలించవలసి వచ్చింది. ఈ కారణంగా రెండేళ్ల ఆలస్యంగా ఈ ప్లాంట్ ప్రారంభమైంది. కేవలం రూ. లక్షతో కారును తయారు చేయాలనే రతన్ టాటా కల సాకారమైనప్పటికీ, సాంకేతికంగా, రాజకీయంగా ఈ ప్రాజెక్ట్ అనేక సవాళ్లను ఎదుర్కొంది. పలు ప్రతికూలతలతో టాటా మోటార్స్ 2020లో నానో విక్రయాలను నిలిపివేసింది.

రెండో రోజూ లాభాల జోరు

- రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ల అండ
- బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లకు డిమాండ్
- సెన్సెక్స్ 330 పాయింట్లు ప్లస్
- 19,100 పాయింట్ల పైకి నిఫ్టీ



ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులతో పాటు బ్యాంకింగ్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు సోమవారం అరశాతం లాభపడ్డాయి. ప్రోత్సాహకర కార్పొరేట్ ఆర్థిక ఫలితాలు వెల్లడి సెంటిమెంట్‌ను బలపరిచింది. అంతర్జాతీయ మార్కెట్ల రికవరీ, బ్రెంట్ క్రూడాయిల్ కనిష్టాల నుంచి దిగిరావడం ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని పెంచాయి. ఫలితంగా సూచీలు ఇంట్రాడే కనిష్టాల నుంచి కోలుకుని రెండో రోజూ లాభాలు ఆర్జించాయి. సెన్సెక్స్ 330 పాయింట్ల లాభంతో 64,113 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 94 పాయింట్లు పెరిగి 19,141 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో ఉదయం సూచీలు లాభాలతో మొదలైనప్పటికీ.. ప్రారంభంలో నెలకొన్న అమ్మకాలతో నష్టాల్లోకి జారుకున్నాయి. అయితే ఇన్వెస్టర్లు తిరిగి కొనుగోళ్లకు మొగ్గు చూపడంతో సూచీలు క్రమంలో నష్టాలను భర్తీ చేసుకుంటూ లాభాల్లోకి మళ్లాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 754 పాయింట్ల పరిధిలో కదలాడి 64,185 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది. నిఫ్టీ 19,159 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాలతో పాటు ఇంధన, ఆయిల్‌అండ్‌గ్యాస్, టెలికం, రియల్టీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆటో, ఎఫ్‌ఎంసీజీ, ఆటో, మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. కీలక స్థూల ఆర్థిక డేటా వెల్లడి, బ్యాంక్ ఆఫ్ జపాన్ ద్రవ్య పాలసీ ప్రకటనకు ముందు ఆసియా, యూరప్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. అమెరికా మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

బీమాలో కనీస సదుపాయాలు వెల్లడించాల్సిందే

జనవరి 1 నుంచి నూతన నిబంధనలు



న్యూఢిల్లీ: బీమా సంస్థలు పాలసీలోని కనీస సదుపాయాల గురించి పాలసీదారులకు తప్పకుండా తెలియజేయాలి. ఈ నూతన నిబంధన 2024, జనవరి 1 నుంచి అమల్లోకి రానుంది. సమ్ అష్యూర్డ్ (బీమా కవరేజీ), పాలసీలో వేటికి కవరేజీ ఉంటుంది, మినహాయింపులు, వెయిటింగ్ పీరియడ్, క్లెయిమ్ ఎలా చేయాలి తదితర వివరాలను తప్పకుండా వెల్లడించాలి. అలాగే, ఫిర్యాదుల ప్రక్రియ గురించీ చెప్పాలి. ఈ మేరకు కస్టమర్ సమాచార పత్రాన్ని (సీఐసీ) బీమా రంగ అభివృద్ధి, నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ) సవరించింది. దీనివల్ల పాలసీదారులు నియమ నిబంధనలు, షరతుల గురించి సులభంగా అర్థం చేసుకోగలుగుతారు. సవరించిన సీఐసీ జనవరి 1 నుంచి అమల్లోకి వస్తుందని ఐఆర్‌డీఏఐ ప్రకటించింది.

బ్లాక్‌స్టోన్ చేతికి కేర్ హాస్పిటల్స్

- 72.5 శాతం వాటాకు రూ. 5,827 కోట్లు
- కిమ్స్‌హెల్త్‌లోనూ వాటాలు



న్యూఢిల్లీ: ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్ తాజాగా హైదరాబాద్‌కు చెందిన కేర్ హాస్పిటల్స్‌లో మెజారిటీ వాటాల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. టీపీజీ రైజ్‌ఫండ్స్‌లో భాగమైన ఎవర్‌కేర్ హెల్త్ ఫండ్ నుంచి 72.5 శాతం వాటాలను కొనుగోలు చేసేందుకు మొత్తం మీద 700 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 5,827 కోట్లు) వెచ్చిస్తున్నట్లు వివరించింది. ఈ లావాదేవీ కోసం కేర్ హాస్పిటల్స్ సంస్థ విలువను రూ. 6,600 కోట్లుగా లెక్కగట్టారు. మరోవైపు, కేరళకు చెందిన కిమ్స్‌హెల్త్ సంస్థలో కేర్ హాస్పిటల్స్, టీపీజీ 80 శాతం వాటాలు కొనుగోలు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ డీల్ కింద బ్లాక్‌స్టోన్ 300 మిలియన్ డాలర్లు, టీపీజీ 100 మిలియన్ డాలర్లు వెచ్చించనున్నట్లు వివరించాయి. దీంతో బ్లాక్‌స్టోన్ దేశీయంగా ఆరోగ్య సేవల విభాగంలోకి ప్రవేశించినట్లవుతుంది. ఈ రెండు డీల్స్ ద్వారా మొత్తం 1 బిలియన్ డాలర్ల పైచిలుకు ఇన్వెస్ట్ చేసినట్లవుతుంది. సంయుక్త నెట్‌వర్క్‌లో టీపీజీ చెప్పుకోతగ్గ స్థాయిలో వాటాలున్న మైనారిటీ షేర్‌హోల్డరుగా ఉంటుంది. భారత హెల్త్‌కేర్ సర్వీసుల రంగంలో తొలిసారిగా పెట్టుబడులు పెట్టడం, దేశీయంగా అతి పెద్ద హెల్త్‌కేర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు టీపీజీతో జట్టు కట్టడం తమకు సంతోషకరమైన అంశాలని బ్లాక్‌స్టోన్ ఎండీ గణేష్ మణి తెలిపారు.

భారీ హాస్పిటల్స్ నెట్‌వర్క్‌లో ఒకటిగా..

కేర్ హాస్పిటల్స్‌కు హైదరాబాద్, వైజాగ్‌తో పాటు ఔరంగాబాద్, నాగ్‌పూర్ తదితర నగరాల్లో ఆస్పత్రులు ఉన్నాయి. కిమ్స్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ సంస్థ .. కేరళలోనే అతి పెద్ద ప్రైవేట్ హెల్త్‌కేర్ ప్రొవైడర్‌గా ఉంది. కిమ్స్‌హెల్త్ చేరికతో దేశీయంగా భారీ హాస్పిటల్స్ చెయిన్‌లో ఒకటిగా కేర్ హాస్పిటల్స్ నెట్‌వర్క్ ఆవిర్భవించనుంది. ఈ సంయుక్త నెట్‌వర్క్‌కు 11 నగరాల్లో 23 ఆస్పత్రులు, 4,000 పైచిలుకు పడకలు ఉంటాయి. ప్రస్తుతం కిమ్స్‌హెల్త్‌కు నేతృత్వం వహిస్తున్న ఎంఐ సహదుల్లా ఇకపైనా దాని సారథ్య బాధ్యతల్లో కొనసాగుతారు.

టీవీఎస్ మోటార్ లాభం ఫ్లాట్

క్యూ2లో రూ. 386 కోట్లు



న్యూఢిల్లీ: ద్విచక్ర, త్రిచక్ర వాహన రంగ దిగ్గజం టీవీఎస్ మోటార్ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్‌లో కన్సాలిడేటెడ్ నికర లాభం యథాతథంగా రూ. 386 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 386 కోట్లే ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 8,591 కోట్ల నుంచి రూ. 9,984 కోట్లకు ఎగసింది. కాగా.. స్టాండెలోన్ నికర లాభం రూ. 407 కోట్ల నుంచి రూ. 537 కోట్లకు జంప్‌చేసింది. ఈ కాలంలో మొత్తం ద్విచక్ర, త్రిచక్ర వాహన విక్రయాలు 5 శాతం పుంజుకుని 10.74 లక్షల యూనిట్లకు చేరాయి. మోటార్ సైకిళ్ల అమ్మకాలు 3 శాతం వృద్ధితో 4.93 లక్షల యూనిట్లను తాకగా.. స్కూటర్ విక్రయాలు 10 శాతం ఎగసి 4.2 లక్షల యూనిట్లకు చేరాయి. అయితే త్రిచక్ర వాహన అమ్మకాలు 51,000 యూనిట్ల నుంచి తగ్గి 43,000 యూనిట్లకు పరిమితమయ్యాయి. ద్విచక్ర వాహన ఎగుమతులు 2.52 లక్షల యూనిట్ల నుంచి 2.39 లక్షల యూనిట్లకు తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో టీవీఎస్ షేరు బీఎస్‌ఈలో 1 శాతం బలపడి రూ. 1,610 వద్ద ముగిసింది.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌కు రూ.190 కోట్ల నష్టం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో రూ.190 కోట్ల నష్టం చవిచూసింది. అంత క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.197 కోట్ల నష్టం నమోదు చేసింది. టర్నోవర్ రూ.1,747 కోట్ల నుంచి రూ.2,185 కోట్లకు ఎగసింది. ఎబిటా రూ.632 కోట్ల నుంచి రూ.848 కోట్లకు చేరింది. ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో సోమవారం 0.16 శాతం క్షీణించి రూ.54.75 వద్ద స్థిరపడింది.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్స్‌కు ఆహ్వానం

స్కాలర్‌షిప్స్

ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులకు కోసం ఉద్దేశించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ (ఎన్‌ఎంఎంఎస్) 2023-24 ప్రకటన వెలువడింది. ఈ స్కీమ్‌కు ఎంపికైన వారికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు వరుసగా నాలుగేళ్లపాటు ప్రతి నెల రూ.వెయ్యి స్కాలర్‌షిప్‌గా అందుతుంది. అర్హత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇందుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్స్ పూర్తి వివరాలు..

ఎన్‌ఎంఎంఎస్

ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతనందించి.. ఉన్నత విద్య దిశగా ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్‌ను ప్రారంభించింది. కేంద్ర విద్యాశాఖకు సంబంధించిన స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ విభాగం ఈ స్కాలర్‌షిప్‌లను అందిస్తోంది. ఈ స్కీమ్‌కు ఎంపికైన విద్యార్థులు నాలుగేళ్లపాటు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12వేల ఆర్థిక ప్రయోజనాన్ని పొందవచ్చు.

అర్హతలు

» ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు.
» ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. వీరు ఏడో తరగతి పరీక్షల్లో 55 (ఎస్సీ, ఎస్టీలైతే 50) శాతం మార్కులు సాధించాలి.
» తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.3.5 లక్షలకు మించకూడదు.
» ప్రైవేటు పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాలు, ప్రభుత్వ గురుకులాలు, వసతితో కూడిన సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్నవారు ఈ స్కాలర్‌షిప్ స్కీమ్‌కు అనర్హులు.
» రాష్ట్రాల వారీగా విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఇందుకోసం రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు ప్రత్యేకంగా పరీక్ష నిర్వహిస్తాయి. ఇలా ఎంపికైన విద్యార్థుల జాబితాను కేంద్రానికి పంపుతాయి.

రాత పరీక్ష ఇలా

» ఈ స్కాలర్‌షిప్‌ల ఎంపిక కోసం రాష్ట్రస్థాయిలో రెండు పేపర్ల (మ్యాట్, సాట్) రాత పరీక్షను నిర్వహిస్తారు.
» రెండు పేపర్ల పరీక్ష 180 మార్కులకు ఉంటుంది. ఇందులో పేపర్–1లో 90 ప్రశ్నలు, పేపర్–2లో 90 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు మార్కు 1 చొప్పున 180 ప్రశ్నలుంటాయి.
» ఒక్కో పేపర్ పరీక్ష వ్యవధి 90 నిమిషాలు ఉంటుంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో అడుగుతారు. ప్రతి ప్రశ్నకు 4 చొప్పున ఆప్షన్లు ఇస్తారు. నెగిటివ్ మార్కుల నిబంధన లేదు.
» **పేపర్–1(మెంటల్ ఎబిలిటీ–మ్యాట్):** ఈ విభాగంలో మెంటల్ ఎబిలిటీ–45, ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ–20, హిందీ ప్రొఫిషియన్సీ నుంచి 25 మార్కులకు ప్రశ్నలు వస్తాయి.
» **పేపర్–2(స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్–సాట్):** ఈ దశలో నిర్వహించే పరీక్షలో సైన్స్–35, సోషల్ స్టడీస్–35, మ్యాథమేటిక్స్ విభాగాల నుంచి 20 మార్కులకు చొప్పున ప్రశ్నలుంటాయి.

తుది ఎంపిక ఇలా

ఇలా రాత పరీక్షలో ఎంపికైన విద్యార్థుల జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం స్కాలర్‌షిప్‌లకు ఎంపిక చేస్తారు. వీరికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ రెండో సంవత్సరం దాకా ప్రతి నెల రూ.1000 చొప్పున విద్యార్థి బ్యాంక్ ఖాతాలో జమచేస్తారు. అలాగే తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఈ స్కాలర్‌షిప్ కొనసాగాలంటే.. ప్రతి తరగతిలోనూ నిర్దేశిత మార్కులు సాధించడం తప్పనిసరి. పదోతరగతిలో 60శాతం మార్కులు పొందితేనే స్కాలర్‌షిప్ కొనసాగుతుంది. ఎస్సీ, ఎస్టీలు 55 శాతం మార్కులు పొందాలి.

దరఖాస్తు విధానం

» అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ప్రింటెడ్ నామినల్ రోల్స్, సంబంధిత ధృవపత్రాలను సంబంధిత జిల్లా డీఈఓ కార్యాలయాల్లో 04.11.2023 లోపు అందజేయాలి.
» ఈ పరీక్షలను తెలంగాణలోని 33జిల్లాలకు రెవెన్యూ డివిజనల్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహిస్తారు.

ముఖ్యసమాచారం

» దరఖాస్తులకు చివరి తేదీ: 31.10.2023
» పరీక్ష తేదీ: 10.12.2023
» వెబ్‌సైట్: www.bse.telangana.gov.in

పదితోనే కేంద్ర కొలువు

» ఐబీలో 677 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» పదో తరగతి ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు
» రాత పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా ఎంపిక
» గ్రూప్–సి హోదాలో కొలువు

కేంద్ర ప్రభుత్వ కొలువు కోరుకునే అభ్యర్థులకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! కేంద్ర హోంమంత్రిత్వ శాఖలో కీలకమైన ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ)లో 677 పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది. నిఘా విభాగంలో.. సెక్యూరిటీ అసిస్టెంట్/ మోటర్ ట్రాన్స్‌పోర్ట్, మల్టీ టాస్కింగ్ స్టాఫ్(జనరల్) పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో.. ఐబీ ఉద్యోగాలకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ తదితర వివరాలు..



జాబ్స్ ఇన్ఫో

మొత్తం 677 పోస్టులు

తాజా నోటిఫికేషన్ ద్వారా ఐబీలో సెక్యూరిటీ అసిస్టెంట్/మోటర్ ట్రాన్స్‌పోర్ట్–362 పోస్టులు, ఎంటీఎస్ (జనరల్)–315 పోస్టులు ఉన్నాయి. వీటిలో తెలంగాణకు సంబంధించి హైదరాబాద్ కేంద్రంగా ఎస్‌ఏ/ఎంటీ ఏడు పోస్టులు, ఎంటీఎస్ (జనరల్) పది పోస్టులు భర్తీ చేయనున్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ కేంద్రంగా.. ఎస్‌ఏ / ఎంటీ అయిదు పోస్టులు, ఎంటీఎస్ (జనరల్) 10 పోస్టులు ఉన్నాయి. అభ్యర్థులు తమ స్వరాష్ట్రానికి సంబంధించిన యూనిట్‌లోని పోస్టులకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలనే నిబంధన ఉంది.

అర్హతలు

- ఇంటెలిజెన్స్ బ్యూరోలోని సెక్యూరిటీ అసిస్టెంట్ /మోటార్ ట్రాన్స్‌పోర్ట్,ఎంటీఎస్ (జనరల్) పోస్టులకు పదో తరగతి అర్హతతోనే పోటీ పడొచ్చు.
- సెక్యూరిటీ అసిస్టెంట్/మోటార్‌ట్రాన్స్‌పోర్ట్ పోస్టులకు మాత్రం తప్పనిసరిగా లైట్ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగుండాలి. అదే విధంగా.. మోటార్ మెకానిజంపై అవగాహన ఉండాలి.

వయసు

గరిష్ట వయోపరిమితి సెక్యూరిటీ అసిస్టెంట్/మోటర్ ట్రాన్స్‌పోర్ట్ పోస్టులకు 27 ఏళ్లు, ఎంటీఎస్ జనరల్ పోస్టులకు 25 ఏళ్లు. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనం

ఎంపికైన వారికి లెవల్–1, లెవల్–3లతో వేతన శ్రేణి నిర్ణయిస్తారు. సెక్యూరిటీ అసిస్టెంట్/మోటర్ ట్రాన్స్‌పోర్ట్ పోస్టులకు లెవల్–3తో రూ.21,700 –రూ.69,100 వేతన శ్రేణి ఉంటుంది. ఎంటీఎస్(జనరల్) పోస్టులకు లెవల్–1లో రూ.18,000–రూ.56,900 వేతన శ్రేణి అందుతుంది.

ఎంపిక ప్రక్రియ

రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. తొలి దశలో రెండు పోస్టులకు కూడా రాత పరీక్ష ఉంటుంది. ఆ తర్వాత వేర్వేరుగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

తొలిదశ రాత పరీక్ష

- ఇంటెలిజెన్స్ బ్యూరోలో సెక్యూరిటీ అసిస్టెంట్/మోటర్ ట్రాన్స్‌పోర్ట్; ఎంటీఎస్(జనరల్) పోస్టుల అభ్యర్థులకు తొలి దశలో రాత పరీక్ష ఉంటుంది. రాత పరీక్షలో నాలుగు విభాగాలు ఉంటాయి. జనరల్ అవేర్‌నెస్–40 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్–20 ప్రశ్నలు, న్యూమరికల్/అనలిటికల్/లాజికల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్–20 ప్రశ్నలు, ఇంగ్లిష్ లాంగ్వేజ్–20 ప్రశ్నలు చొప్పున మొత్తం వంద ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. పరీక్షకు లభించే సమయం ఒక గంట. పరీక్ష పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా ఉంటుంది. నెగిటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4 మార్కులను తగ్గిస్తారు.

రెండో దశ.. ఎస్‌ఏ/ఎంటీలకు క్షేత్ర పరీక్ష

- తొలి దశ రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశ ఎంపిక ప్రక్రియను రెండురకాల పోస్టులకు వేర్వేరు విధానాల్లో నిర్వహిస్తారు.
- సెక్యూరిటీ అసిస్టెంట్/మోటర్ ట్రాన్స్‌పోర్ట్ అభ్యర్థులకు మోటర్ మెకానిజం, డ్రైవింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఉంటాయి. వాహన మరమ్మతులు చేసే పరీక్షలు, నిర్వహణ వంటి అంశాలను ప్రాక్టికల్‌గా నిర్వహించాల్సి ఉంటుంది. ఈ విభాగానికి 50 మార్కులు కేటాయించారు.
- ఎంటీఎస్(జనరల్) అభ్యర్థులకు రెండో దశలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్‌లో డిస్క్రిప్టివ్ టెస్ట్ నిర్వహిస్తారు. 50 మార్కులకు జరిగే ఈ పరీక్షలో ప్యాసేజ్ రైటింగ్ ఉంటుంది.

రాత పరీక్షలో విజయానికి ఇలా

జనరల్ అవేర్‌నెస్

అభ్యర్థుల్లోని సామాజిక అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడిగే విభాగం ఇది. ఇందులో రాణించాలంటే..భారతదేశ చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ,రాజ్యాంగం,శాస్త్రీయ పరిశోధనలు వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న సమకాలీన పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.

న్యూమరికల్/అనలిటికల్/ లాజికల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్

ఇందులో రాణించేందుకు వెర్బల్, నాన్–వెర్బల్ రీజనింగ్ అంశాలపై పట్టు సాధించాలి. స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్, విజువల్ మెమొరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్, నంబర్ సిరీస్, కోడింగ్–డీకోడింగ్, నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో టాప్ స్కోర్ కోసం.. ప్యూర్ మ్యాథ్స్‌తోపాటు అర్థ గణిత అంశాలపై దృష్టి పెట్టాలి. డెసిమల్స్, ఫ్రాక్షన్స్, నంబర్స్, పర్సంటేజెస్, రేషియోస్, ప్రపోర్షన్స్, స్క్వేర్ రూట్స్, యావరేజెస్, ప్రాఫిట్ అండ్ లాస్, అల్జీబ్రా, లీనియర్ ఈక్వేషన్స్, ట్రయాంగిల్స్, సర్కిల్స్, టాంజెంట్స్, ట్రిగ్నోమెట్రీలపై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఇంగ్లిష్ విభాగంలో రాణించడానికి బేసిక్ గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా యాంటానిమ్స్,సినానిమ్స్, మిస్–స్పెల్ట్ వర్డ్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్ డైరెక్ట్ స్పీచ్, వన్‌వర్డ్ సబ్‌స్టిట్యూటషన్స్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్‌లను ప్రాక్టీస్ చేయాలి.

డిస్క్రిప్టివ్ టెస్ట్

మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (జనరల్) పోస్టులకు రెండో దశలో నిర్వహించే ఇంగ్లిష్ డిస్క్రిప్టివ్ టెస్ట్ కోసం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. వొకాబ్యులరీ పెంచుకునేలా కృషి చేయాలి. అదే విధంగా సెంటెన్స్ ఫార్మేషన్, సెంటెన్స్ కరెక్షన్‌లను ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.

ఇందుకోసం దినపత్రికల్లోని ఎడిటోరియల్స్, అదే విధంగా ఆయా పోటీ పరీక్షలకు సంబంధించి డిస్క్రిప్టివ్ ఆన్సర్స్‌ను ప్రాక్టీస్ చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

తుది జాబితా ఇలా

- సెక్యూరిటీ అసిస్టెంట్/మోటర్ ట్రాన్స్‌పోర్ట్ పోస్టులకు రెండు దశల పరీక్షల్లో చూపిన ప్రతిభను పరిగణనలోకి తీసుకుంటారు.
- ఎంటీఎస్(జనరల్) పోస్టులకు మాత్రం టైర్–1 రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు. వీరు టైర్–2లో నిర్వహించే ఇంగ్లిష్ డిస్క్రిప్టివ్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.
- ఈ రెండు దశల్లోనూ చూపిన ప్రతిభ ఆధారంగా కేటగిరీల వారీగా కటాఫ్‌లను నిర్ణయించి తుది జాబితా రూపొందిస్తారు. అందులోనూ చోటు సాధించిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు.

పదోన్నతులు ఇలా

- సెక్యూరిటీ అసిస్టెంట్ తర్వాత స్థాయిలో జూనియర్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ (2), ఆ తర్వాత జూనియర్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ (1), అనంతరం అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్, ఆ తర్వాత సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ హోదాలు ఉంటాయి.
- ఎంటీఎస్ (జనరల్)గా నియమితులైన వారు విద్యార్హతలు పెంచుకుని.. డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే.. ఆఫీస్ సూపరింటెండెంట్ స్థాయి వరకు చేరుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** నవంబర్ 13, 2023.
- **రాత పరీక్ష తేదీ:** డిసెంబర్‌లో నిర్వహించే అవకాశం.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, చీరాల, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్ నగర్, వరంగల్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://www.mha.gov.in/en

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.